First Edition 1929
Second Edition 1948

అంకితము



ఆయుర్దేహముల నిచ్చి బాల్యముననే నన్ను బాసి - దివి కేగియు
అప్పటికే నా యెదలో నిస్వార్థభక్త్యేచ్ఛకు - సంస్కార
బీజారోపణము చేసిన పూజ్యపాదులు - నా పితృ
దేవులు నేలటూరు శ్రీనివాసాచార్యుల వారి
దివ్య పాదాబ్జములకడ నా యీ
గ్రంథరచనను భక్తిప్రార్థకముగ
సమర్పించుచున్నాను.

ఇట్లు
నేలటూరు అనంతాచార్యులు
గ్రంథకర్త

Saraswathi Power Press, Rajahmundry
Printed and Published by
A. Lakshmanaswamy Naidu
For Addepally & Co., Educational Publishers
Order No. 4826/1948

ఉపోద్ఘాతము

'కంకణరహస్య' మను నీనవలను నేను వ్రాసి 25 యేండ్లయినది. 1929 లో దీనిని సరస్వతీ గ్రంథమండలివారు తమ గ్రంథమాలయందొక పుష్పముగాఁ బ్రకటించిరి. తొలికూర్పు ప్రతులన్నియు నయిపోవుటచే నిప్పుడీ రెండవకూర్పు ముద్రించుట కేర్పాటు చేసి సరస్వతీ గ్రంథమండలి యజమానులు శ్రీ అద్దేపల్లి లక్ష్మణస్వామి నాయుఁడు గారు ఈ గ్రంథమున కొక ఉపోద్ఘాతము వ్రాసి పంపుమని నన్ను గోరినారు.

1929 లో తొలుత నీనవల ప్రకటింపఁబడినపుడు—నేనొక యుపోద్ఘాతమును వ్రాసి—అప్పుడీ గ్రంథమాలాసంపాదకులుగ నుండిన రాఘవరావుగారికి పంపితిని. సమయమునకు వారికందని కారణముననో—యేమో—ఆ యుపోద్ఘాతము—పుస్తకమునఁ గనఁబడలేదు. సుమారిరువదేండ్ల నాఁటి విషయము. ఇపుడందులకుఁ గారణమిదమిత్థమని నిశ్చయించుటకు సాధ్యమగునది కాదు. ఈలోపమును శ్రీ నాయుఁడుగారుగూడ గుర్తించియే యాకూర్పునందైన నుపోద్ఘాతమును జేర్పఁదలంచి—వ్రాసిపంపుమని కోరియున్నారు.

ఆంధ్రసాహిత్యప్రపంచమున నవల యావిర్భవించి యిప్పటికిఁ బెక్కేండ్లు గాలేదు. కాని పెక్కు వైపుల గ్రంథమాలలు స్థాపింపఁబడి యిప్పటికే—నవలలు—వందల కొలఁది ప్రకటింపఁబడసాగినవి, నవలావాఙ్మయమున నొకప్రధానశాఖయగు నపరాధపరిశోధకనవలకూడ నొక్కటొక్కటిగ రాఁదొడఁగినవి. పాశ్చాత్యసాహిత్యపరిచయమున మన దేశభాషలలో—వంగభాషయందే—ఉత్తమములగు నపరాధపరిశోధక నవలలు తొల్త రచియింపఁబడినవి. ఆంధ్రనవలాకారులును—అపరాధపరిశోధకనవలలు లేనిలోపమును దీర్పఁబూనుకొంచిరి కాని, వంగభాషానువాదములతోడనే వారి రచనాశక్తి తృప్తిగొన్నది. సాంఘిక చారిత్రక నవలలందైన నొకటిరెండు ఉత్తమస్వతంత్ర రచనలు వెలువడినవి కాని పరిశోధకనవలలన్నియు ననువాదములే. ఒకేనవలయొక్క అనువాదములు—రెండుగ్రంథమాలలు ప్రకటించిన సమయముకూడఁ జూచితిము, ఇంతయెందులకు—ఆంధ్రనవలావాఙ్మయమున వంగభాషానువాదములదే ప్రాబల్యముగనుండెనన్న నతిశయోక్తి కానేరదు. అప్పటి యీయనువాదపరంపరఁ గాంచినపుడు. "తెనుఁగున మంచి యపరాధ పరిశోధకనవలను స్వతంత్రముగ రచియించుటయే యసాధ్యమా? తెనుఁగుతల్లికీ పారతంత్ర్యము — పరభాషోపజీవనము తప్పదా? అట్లు గానిచో—నవలారచనమున సిద్ధహస్తులయిన రచయితలుగూడ నీ యనువాదవ్యామోహమునకు లోనగు టెట్లు సంభవించును?" అనుకొని యక్కజపడువాఁడను.

మన యింటలేని వస్తువును బొరుగింటినుండి యరువుతెచ్చుకొనుట దోసము కాదుగాని, కడవఱకును—దానిపైననే యాధారపడుట మెప్పు ననిపించుకొనదు. మన

సాహిత్యమున ననువాదములుండవలసినవే కాని వానితోఁబాటు స్వతంత్రరచనలు వెలువడవలయును. అన్యభాషావాఙ్మయముల సారము గ్రహింపఁదగునే కాని-వానిలోని గ్రంథముల యనువాదములతోడనే మన వాఙ్మయలక్ష్మి నలంకరింపఁబూనుట తగవు గాదు. అరువుసొమ్ము బరువుచేటే గాని గరువతనమునకు గుఱుతు కాఁజాలదు.

ఈ యాశయములే- యీయావేశమే- యీస్వాతంత్ర్యేచ్ఛయే- నన్నీనవలను రచియింపఁ బ్రోత్సహించినవి. నవలారచన యొక కళ. నేనొక కళాదక్షుఁడను కాను. ఉత్తమమగు నపరాధపరిశోధకనవల రచియించుట-నా సామర్థ్యమున కతీతమను టెఱింగియు- స్వతంత్రరచన చేయవలయునన్న నుత్సాహము పెంపున వ్రాసితిని. దీనియందే గుణము లేకున్న-శతగుణముల నిదినేను కల్పించినదనుటే నాకు హార్దికమగు తృప్తి గూర్చినది.

దీనియందు భాషాదైన్యము కన్నఁ గథాసంవిధానమునకే ప్రాధాన్య మీయఁబడినది. ఇందేవేని దోషములున్న-గుణగ్రహణపారీణులగు చదువరులు నన్ను మన్నింతురని యాశించుచున్నాను.

ఈనవలను-తమగ్రంథమాలలోఁ బ్రకటింప నంగీకరించి- నాకెనలేని ప్రోత్సాహము గలిగించిన శ్రీ అద్దేపల్లి లక్ష్మణస్వామి నాయుఁడుగారు - నావంటివారికి చిరస్మరణీయులు. వారిభాషాసేవ ఆంధ్రలోకమునకు విదితమే. వారికి ఇలధక భోగభాగ్యాయురారోగ్యములఁ బ్రసాదించి - వారి యీసేవ యవిచ్ఛిన్నముగ సాగునట్లనుగ్రహింపఁ బరమేశ్వరుఁ బ్రార్థించుచున్నాను.

రెండవకూర్పునుగూర్చి యుగ్గడఁదగు విశేష ప్రోత్సాహమేమియు లేకున్నను, గ్రంథప్రకటనకుఁ గటకము సంఘటిల్లియున్న యీదినములలో వ్యయప్రయాసల బాహుళ్యమును లెక్క సేయక తమ గ్రంథముండవలెనని సాగించుచున్న శ్రీ నాయుఁడుగారి భాషాభిమానము-మరియొకమారు కొనియాడవలసినది నావిధి. అట్టివారు ఆంధ్రధాత్రి నోచిననోముపంట. ఆంధ్రవాణియొక్క యదృష్టదీపజ్యోతి.

తెలుఁగునాఁట నిరువదేండ్లకయిన నొకనవల పునర్ముద్రణమునకు వచ్చుట దానియుత్తమత్వమునకు నిదర్శనమేయయిన-నా 'కంకణరహస్యము' ఆంధ్రపాఠకుల యాదరణమునకుఁ బాత్రమయినదనియే నాతలఁపు. ఈయాదరణమునకై తెనుఁగు సోదరులకు నానమస్కృతులు. ఈ రెండవకూర్పును-వారి యాదరము చూరగొనఁగలదని విశ్వసించుచున్నాను.

నెల్లూరు
7 – 3 – 1948

ఇట్లు
నేలటూరు అనంతాచార్యులు

మణిపురమునందలి భవనము లన్నింటియందును విజయచంద్రుని సౌధము మిన్నయైనది. దానికి సమానమైన దానగరమునందే లేదనవచ్చును.

శ్రీమంతులగువారి కెట్టి సౌధముల నిర్మింప వీలు గాకుండునా? మణిపురి శ్రీమంతులలో నెల్ల విజయచంద్రుఁ డెట్లు శ్రేష్ఠుఁడో, అతని భవంతి కూడ తన్నగరహర్మ్యములలో నుత్తమమైనది. అందుచే వత్సరమున కిరువదివే లాదాయముగల భాగ్యశాలి నిర్మింపఁదగిన - నివసింపఁదగిన భవనమని చెప్పిన నింక దద్వర్ణనమునకుఁ బూనుకొన నవసరముండదు.

ఒకనాటి యుదయమున విజయచంద్రుని గృహ బహిఃప్రదేశమున నా గృహమునపై చూచుచు నొక యువకుఁడు నిలువఁబడియుండెను. అతని వయస్సు సుమా రిరువదిరెండు వత్సరము లుండవచ్చును. సుందరుఁడు. రూపమునకుఁ దగిన యవయవసౌష్ఠవము గలవాఁడు. కాని అతని సుకుమారమగు గౌరవర్ణమగు తనువు ధూళిధూసరితములైన వస్త్రములచే నాచ్ఛాదింపఁబడి యుండెను.

అతఁడట్లు కొంతసేపు యెద్దియో చింతించుచు నిలువఁబడియుండ గృహావరణమునుండి యొక సేవకుఁ డేదో కార్యార్థము వెలి కరుదెంచెను. ఆ యువకుఁ డాతనిఁ గని "నాగేంద్రా! ఇటు రా" మ్మని పిలిచెను.

ఆసేవకుఁడు మలినవస్త్రధారియగు నీతనిఁ జూచుచు నిలువఁబడెను. రెండు నిమిషము లట్లు చూచి క్రమముగ ముఖమున సంతోషరేఖ తోఁప బిరబిర ఆ వ్యక్తిని డాసి "జగచ్చంద్రబాబూ! మీరా నన్ను బిలచినవారు! కలకత్తా కరిగియుంటిరని వింటినే! ఎప్పుడు వచ్చితి రటనుండి? బాబుగారూ! మీ రిచ్చటినుండి చనినతర్వాత మీ యన్నగారిచేత మాపడ్డ యవస్థలు తెలుపఁ దరముగాదు —"

జగచ్చంద్రునిఁ గనినపు డా సేవకుని మొగమునందుఁ దోఁచిన

సంతోషము మాయమయ్యెను. ఆతని వదనము దుఃఖమును సూచించుచు నల్లబడియెను.

"బాబుగారూ! మా చంద్రశేఖరు క్రమక్రమముగ క్షీణించి మంచ మెక్కె. ఏయే వ్యవహారములను జూచుకోజాలకుండెను. అన్ని వ్యవహారములను జూచుట మహేంద్రబాబుగారి పని యయ్యెను. ఏవిషయమునం దైనను నాయజమానుకు స్వతంత్రముగ నుండినచో నానాఁడు గృహసేవకుల కెల్ల మిక్కిలి కష్టకాలమే! విజయచంద్రబాబుగారు జీవించి యున్నంతవఱకు నిచ్చటనుండి తొలఁగుట కిష్టపడని సహించి యూరకుంటిమి! ఆ మహాప్రభువు గతించి వారమైనది. ఇఁక నిచ్చట నుండఁజాలము. సెలవు" అనుచు నాగేంద్రుఁడు కంట నీరు పెట్టుకొనెను.

జగచ్చంద్రుఁ డాతనిమాట లన్నియు వినెను. నిరుత్సాహపూర్ణములగు చల్లని చూపులు ఆత్యాశ్చర్యముల యొక్క తాపమును బాపఁగలిగి యున్న యాతని దృష్టి చూపులచేతనే నాగేంద్రుని కష్టసంతప్తచిత్తము ననునయింపఁగలిగియుండెను. సహృదయములగు పల్కులు పలుకఁగలిగి యుండెను. అంతకు మించి యేమియుఁ జేయఁజాలి యుండలేదు.

"నాగేంద్రా? మిమ్ముల నుమహేంద్రుఁ డంతగా బాధించుచుండెనా? ఆవిషయము నాయనగారికి తెలిసి యాతని నాయన మందలింపలేదా? మహేంద్రుని దురాగ్రహము నిరంతరమై చెలఁగుచునే యుండెనా?"

"బాబుగారూ! విజయచంద్రబాబుగారు అస్వస్థతచేత మంచము పట్టిన నాటినుండియు నాయనను జూచినవారు సేవకులలో నొక్కఁడైనను లేఁడు. ఆయన గదిలోనికి మహేంద్రుఁడును పాచకుఁడును వైద్యుఁడును నీముగ్గురే ప్రవేశింప నధికారము బొందియుండిరి. మహేంద్రుఁడో వైద్యుఁడో లేక పాచకుఁడో యెప్పుడు నాయనగదిని గాచియుండెడి వారు. అప్పుడు ప్రమాదవశమున నెవఁడైన సేవకుఁ డాగదివద్ద కరిగి నచో నాతనికిఁ జీవాట్లు తప్పకుండెను. ప్రతిదినము వైద్యుని బాబు

గారి కెట్లున్న కనిపెట్టుకొనుచు వచ్చితిని. దినదిన నాయనగారి ఆరోగ్యము క్షీణించు చుండెను. వింతే యేమియును చెప్పుచుండెను. వ్యాధి నానాటికి ముదిరి యు మున నన్ను పిలిచి శ్రీఘ్రముగ వైద్యుఁడుగారిని బాబు పిలిచుకొని రమ్మని బోయెను. అందేలనో తన్నుజూచి గిన్ని ... ఆ దినమున మహేంద్రుని బిలిపించెను. వారిద్దరు చిరకాల మొకగంట కలిసిరి. అట రహస్యముగ వారల కేదో సంభాషణము జరిగెను. ఆ సమయమున నే నావైపు పోకుండ తటస్థించెను. వారిసంభాషణ యేమిటో తెలిసికొనుటకు, నేనక్కడికి బోయిన సమయమునకు మహేంద్రబాబుగారు 'రెండువేలరూప్యములు బహుమానమ మిచ్చెదను' అనియెను. అందులకు వైద్యుఁడు 'వీలు గాదు. అయిదువేలకు దమ్మిడీ తగ్గించుటకు వీలులేదు' అనెను. నేను వారిసంభాషణ మెట్టిదో తెలియ వలెనని పోయితిని. కాని నా యనుమానములన్నియు మహేంద్రుఁ డప్పుడే తెలిసికొనెను. అప్పుడు బిగ్గరగా 'నాయనగారి ప్రాణములు మీచేతనున్నవి. రక్షించుభారము మీపైనున్నది. మీ యిష్టానుసారమే యొసంగెదను' అని యెను. అవల వైద్యుఁడు నాకడకు వచ్చి 'బాబుగారి కెట్లున్న' దని యడిగి తిని. ఆయన 'నానాటికి బాధ వృద్ధియగుచున్నది. నా వ్యాధికి మూలము నేటికి గ్రహింపఁ గలిగితిని. ఆ వ్యాధి యిప్పటికే యాయన జీవిత మును చాలవరకుఁ గోసివైచినది. ఇంతవరకు నే నుపయోగించిన మందులన్నియు నుపయోగరహితము లయినవి. ఇంక నిరువది దినము లాయన జీవించియుండిన నీవ్యాధిఁ నుపశమింపఁగలను' అని చెప్పెను. అట్టి స్థితిలో నాయనకు మూడుచున్న నెట్లు తెలియఁగలవు? ఈవిష యము జరిగిన మరునాఁడే ఆవైద్యుఁడు వచ్చుట మానెను. అనంతర మాయనను నేఁ జూడనే లేను. ఆవల నింకొకవైద్యుఁడు మందీయఁ బ్రారంభించెను. ప్రారంభించిన పదునేను దినములకే బాబుగారు మరణించిరి.”

"మరణించునప్పుడైన మీచెప్పుడు నాయనగారిలోని కరుగలేదా?"

"లేదు. ఆయన మరణించిన సంగతి మాకు మహేంద్రబాబుగారే తెలిపిరి. బాబుగారు! ఇంక మీరువచ్చితిరి. మాకష్టములు గట్టెక్కినట్లే. మీ నీడం గాచుకొని యుండగల్గుదుమేగాని, మీయన్నగారి క్రౌర్యమునకు మే మాగంజాలము."

"మహేంద్రుండు గృహంబునం దున్నాండా?"

"ఉన్నారు."

"నేను వచ్చియున్నా ననియు, తనతో మాటలాడం గోరుచున్నా ననియుం దెలుపుము."

నాగేంద్రుండు వెడలిపోయెను.

నాగేంద్రుని పలుకులు విన్న దాదిగ జగచ్చంద్రుని హృదయంబున నొక సంక్షోభము ప్రారంభమయ్యెను. అసహ్యమగు సంశయాందోళనము లద్దానిని గలంచివేయం జొచ్చెను.

నాగేంద్రుండు మరలవచ్చి "జగచ్చంద్రబాబుగారు! మీయన్నగారు మీకొఱకై యాఫీసుగదియందు వేచియున్నారు" అని తెలిపెను.

జగచ్చంద్రుం డంత నా భవనమునం బ్రవేశించి, లోని కరిగెను. ఒకవైపున నున్న మేడమెట్ల నధిరోహించి పైనున్న ఆఫీసుగదిం బ్రవేశించెను.

ఆ గదియం దొక యాసనముపై నొక తరుణుం డాసీనుడై యుండెను. ఆతనివయస్సు సుమారు ముప్పదేండు లుండవచ్చును. ఆతని యందు జగచ్చంద్రుని పోలిక లగపడుచుండెను. ఆతండు జగచంద్రుని గాంచి లేవకయే "జగచ్చంద్రా! ఇటం గూర్చుండుము" అని యొక యాసనముం జూపెను. ఆయాసనమునందుం గూర్చుండి జగచ్చంద్రుండు నిశ్చలదృష్టిని దన యన్న మొగము జూడందొడగెను. అతండును గొన్ని నిముషములకాల మాచూపును బ్రత్యవలోకించెను

గాని తల వంచుకొనియెను. కొంతవడి నిర్విధమునవే నిశ్శబ్దముగ నిస్సంభాషణముగా గడచిపోయెను. తుదకు భూపేంద్రుడు తమ్మునితో నిట్లు పలికెను:

"జగచ్చంద్రా! కలకత్తానుండి యెప్పుడు వచ్చితివి?"

"ఈదిన ముదయముననే?"

"భూపేంద్రుఁడు సౌఖ్యముగ నున్నాఁడా?"

"సుఖముగనే యున్నాఁడు."

"నీవొకవారము ముందు వచ్చియుండిన బాగుండెడిది. నాన్న గారు నీకొఱ కెంతయో నిరీక్షించినారు. ఆయన మరణశాసనము జరుపునాఁటికైన రావైతివి. నాన్నగారి జబ్బు నీకుఁ దెలియనే తెలియదా?"

"నాకేమియుఁ దెలియదు. నాకెవరు తెలుపువారు? ఎవరైన సందేశ మంపినగదా నేనేమైన తెలిసికొనుట? మొన్న సురేశబాబు గారు వ్రాసిన యుత్తరము జూచినతరువాత నీవిషయము నెఱింగితిని. అంతట నే బయలుదేరి వచ్చితిని. నాన్నగా రేమి చెప్పిరి. నాకీ యంత్యాజ్ఞ యేమి!".

"ఏమియుఁ జెప్పలేదు. ఆయన మరణశాసనము తత్సంబంధమైన కాగితములు సురేశునివద్ద నున్నవి. అతనికడకు బోయితివేని విషయ మంతయు నాతఁ డెఱింగింపఁగలఁడు."

"అన్నా! సురేశునివద్దకుఁబోయి కాగితములు చూడనేల? ఆవిష యము నీవే తెలుపఁగూడదా?"

"నేనుదెలిపిన, నీకు నమ్మకముండవలదా? నేనై చెప్పి తీరని మన స్తాపము దెచ్చుకొను టెందులకు?"

ఇందు మనస్తాపకారణ మేమున్నది? నాయనగారి మరణశాసన విషయము లేమో యెఱింగింపుము. ఎందేవిధముగ శాసించియున్నను తండ్రియాజ్ఞ శిరసావహింతును."

"ఆయన యాత్రికులను నీకు భేతాళగిరిప్రాంతమునం దున్న నాఁడు బది యెకరముల భూమి నొసఁగెను. తక్కుంగల స్థిరచరాస్తి యంతయు నాకుఁ జెందునట్లు వ్రాసెను. అది చాల నన్యాయమని నేనెంతయో దూరము చెప్పి చూచితిని. చౌర్యనేరమున నిందితుఁ డైన వానికి నది చాలునని యాయన కోపపడియెను. ఐన నేను చెప్పుట కను వెలియ కూడకుంటిని."

జగచ్చంద్రుని వదనమం దొకింత మార్పు కలిగెను. అతని హృద యమున సందేహమున్నే నాటుకొనిన అనుమానబీజము చిగ్గి మొలక చూపట్టెను. అప్పు డాతఁడు గొంతు సవరించుకొనుచుఁ బ్రశ్నించెను:

"అట్లా? ఆమరణశాసన మెప్పుడు వ్రాయబడినది? మహేం ద్రుని దృష్టి జగచ్చంద్రుని మొగమునందలి పరివర్తనమును గమనిం చెను. ఈ ప్రశ్నము గూడ జగచ్చంద్రుని మనమునందలి యనుమాన మును వ్యక్తము చేయుచుండెను. మరణశాసన విషయ మాతఁ డను మానించుచున్నాఁడని మహేంద్రుఁ డెఱిఁగెను. ఆప్రశ్నమును నొక్క మాటలో సమాప్తము చేయ నెంచి యిట్లు పలికెను:

నా మామగారి మరణమునకు రెండు దినములకుముందే! వైద్యుఁడగు దేవదాసుబాబే దానిని వ్రాసెను."

"నేటనుండి వెడలిపోయినప్పుడు రామనాథుఁడు కదా మం దిచ్చు చుండినది. ఈ దేవదాసుఁ డెవరు?"

"అకస్మాత్తుగా రామనాథుఁడు మందిచ్చుటాపివేసెను. ఇక్కడకు వచ్చుటగూడ మానెను. అందుచేత దేవదాసను నింకొక్క వైద్యుని పిలిపించితిని."

"అట్లులా? సరియే! నేను సురేశబాబువద్దకుఁ బోయెదను. నీవును వచ్చెదవా?"

"నేను రాను. నా కిప్పు డవసరకార్యము లున్నవి. నీవే పొమ్ము.

శ్రీ తాళగిరివద్ద నున్న భూమికి సంబంధించిన పత్రము వెళ్ళి సుచేపని కిచ్చియున్నాను. పోయి వానిని చేసికొని పరీక్షించుకొనుము."

"నేనా కాగితములను బరీక్షించుటకే యక్కడికిఁ బోవుదునని చెప్ప లేను. వానిని నేను బరీక్షింపవలసిన యవసరములేదు."

"నీ యాస్తికి సంబంధించిన పత్రములను బరీక్షింపవలసిన యవసరము నీకు లేకున్న నిం కెవరి కుండును?"

"మహేంద్రా! వానిని పరీక్షింపవలసిన పనిలేకుండగనే యిన్నటి విషయముల నెల్లను గ్రహించితిని. ఇంక గొన్ని విషయము లనుమాన మాత్రము లయియున్నవి గాని, వానిని గూడ బహిరంగ పఱుప నిశ్చయించితిని. ప్రస్తుత మేమియు సిద్ధమైనదని చెప్పజాలను. కాని యీామరణశాసనరహస్యమును వెలికిఁ దేఁగల పనిమాత్రము తలఁచు చున్నాను."

"జగచ్చంద్రా! జరిగిన విషయము — నీవై నాయింటికి వచ్చి యన్నడుగఁ జెప్పితిని. కాని నేనుగా నీకడకువచ్చి వాఙ్మూలమిచ్చుకొన లేదు. కావున నిట్టి వ్యర్థానుమానముల నాయింటియందుఁ బం కి నాకుఁ గ్లేశము కలిగించుటకన్న నీబ్రతిన మెటుఁ దీర్చుకొనఁగలవో యటు దీర్చుకొనుట యుత్తమము."

"అట్లే, నిన్నుఁ గూర్చిన విషయమైనందున నీకుఁ దెలియచెప్పి ముందు జాగ్రత్త పడుటకు వీలుగలిగుంచుటకే యిచ్చట చెప్పితిని గాని వేరుగాదు. ఈప్రయత్నము నే నెక్కడచేసినను నీకు దానివలన సుఖము గలుగఁగలదు."

"మనప్రసంగము ముదురుచున్నది. కావున నిక దాని నాపుట యిరువురకు మేలు."

"ఆహా! ఆపుదము. ఎప్పటికి నిటువంటి ప్రసంగములు వచ్చి నప్పుడు జాగ్రత్తగ ముందువెనుక లారసి మాటలాడితివేని యితరుల

చిత్తములో సందేహములు గల్గింపకుండఁగలవు. అసంబద్ధముగఁ బ్రసంగముచేసిన నది యనుమానాస్పదముగ నుండును.”

“ఓరీ! నాయింటికివచ్చి నాకు నీతిఁగరప నీకుఁ గల యధికార మెట్టిది? చనుమిటనుండి! సమయమువచ్చినపు డెవ రెవరి ప్రజ్ఞలును వెలికిఁ రాఁగలవు. పొమ్ము!”

“మహేంద్రా! అధికారమునే చూపవలయునని నేను తలంచి యుండినచో, దుర్మార్గముతోనే నాయాశయముఁ దీర్చుకొన నేనెంచి యున్నచో, నిన్నుఈ నిముసమున నీయింటినుండి తఱుమఁగలనని యెంచుము. కాని నావంటివానికట్టి నీచవర్తనము కూడదని, యూరకయే పోవుచున్నాను. తెలిసినదా?”

“తెలియును, తెలియును. ఇక చాలు నీప్రతాపములు పొమ్ము.”

జగచ్చంద్రుఁ డింకేమియు మాటాడక వెడలిపోయెను. ఆతని హృదయమునందలి యాందోళనము ఏదోరూపమున నుప్పొంగి వెల్వడెను. ఆతని కప్పుడు తనయూహానుమానములు సమూలములా కావా యను చర్చ తోఁచియుండలేదు. తన్ను పరాభవించెననియు, న్యాయముగఁ దనకు రావలసియున్న సగము భాగముమాస్తి తననుండి యన్యాయముగ లాగుకొనఁబడినదనియు నెఱిఁగి యంతులేని గోపము కలుగుటచే నదియే యప్పు డాతని మానసమును నిండియుండినది. వెలుపలికి వచ్చిన వెనుక జగచ్చంద్రుఁడు తా ననుమానించినది తప్పై యుండునా? నిజముగ మహేంద్రుఁ డేమియుఁ దంత్రము పన్ని యుండలేదా? అను సంశయములు తోఁచినవి.

ఆతఁ డింకను వానికి సమాధానముగూర్చుకొనలేదు. ఇంతలోన నేయాభవనము వెలుపల నాగేంద్రుఁ డాతనిఁ గలిసికొనియెను. ఆతనిఁజూడఁగనే జగచ్చంద్రునకొక యాలోచన తట్టినది. దేవదాసునుగూర్చి నాగేంద్రునకేమైనఁ దెలియునేమో? ఆతఁడు నాగేంద్రు నిట్లు ప్రశ్నించెను.

"నాగేంద్రా! రామనాథుని యనంతరము నాయనగారికి మం దిచ్చుచుండిన దెవరు?"

"బాబూ! దేవదాసుబాబుగారు."

"ఆతఁ డెవరు? నివాసమెక్కడ? నీకుఁ దెలియునా?"

"ఆతని నెప్పుడును నేను చూచియుండలేదు. కాని మహేంద్ర బాబును దేవదాసుఁడును మాటలాడుచుండ మహేంద్రుఁ డాతనిని 'బదరపురమునుండి యెప్పుడు వచ్చితివి? నేను వ్రాసిన జాబు చేరినదా?' అని యడుగుచుండ వింటిని. అందుచేత నాతఁడు బదరపురవాసి యని తోఁచుచున్నది."

"నాగేంద్రా! నాయనగారు మరణశాసనమును వ్రాసిరా? ఆవిష యము నీ కేమయినఁ దెలియునా?"

"లేదు బాబు! నాకే కాదు, గృహసేవకుల కెవ్వరికిని మరణ శాసనము వ్రాసిరని తెలియదు. మీ కెవరు చెప్పిరి? ఏమని వ్రాసిరఁట?"

"మహేంద్రుఁడే యిప్పుడు చెప్పెను. నాయనగారు చనిపోవుటకు రెండుదినములకు ముందు దేవదాసునిచేత నే వ్రాయించిరఁట."

అట్లు జరిగియుండుటకు వీలులేదు. విజయేంద్రబాబుగారి మరణ మునకు రెండుదినములకు ముందు మహేంద్రబాబుగా రూరలేరు. ఎటకోపోయి నాయనగారు మరణించుటకు ముందటి దినమే వచ్చిరి."

"నాగేంద్రా! మొదట నీవు చెప్పిన విషయములే నామనమున నొకవిధమైన యనుమానము కలిగించెను. ఇప్పుడు నీవు చెప్పిన మాట లతో మహేంద్రుని పల్కులు పోల్చి చూడ నాయనుమానము వృద్ధి యగుచున్నది. మరణశాసనమునందు మాతండ్రి యుపయుక్తమగు నాస్తినంతయు మహేంద్రుని కిచ్చి, నాగపర్వతము కడనున్న నిస్సార మగు బీడునేలనుమాత్రము నా కొసఁగునట్లు వ్రాసినారట. దానినే చేయూఁతగాఁ గొని యీవిషయమునంతయు విచారింపవలయును.

ఇందేదో రహస్యమున్నది. దానిని బైటికిఁ దీవలయును. అందుకుఁ దగిన సాయము చేయుదువా?"

"బాబుగారు! నిస్సందేహముగఁ జేయుదును; మీరిక్కడనుండి పోయిన తరువాత నిట జరిగిన సంగతులన్నియు ననుభూతానావ్వ ములే! ఈదినమే మహేంద్రుని కొలువునుండి విడి వచ్చెదను. మీ కేపని చేయుమన్న దానిని జేయుచుందును."

"నీవు నాలుగేండ్లయు నిచ్చట బాబుగారితో మాట్లాడెదను. ఇప్పుడు నే నచ్చటికే పోవుచున్నాను. మధ్యాహ్నమున్నటఁ గలసికొమ్ము. మహేంద్రుని నీవు విడిచి వచ్చుటకుఁ గారణ మిదియని యెవరికిఁ దెలుపకుము."

నాగేంద్రుఁ డంగీకరించెను. జగచ్చంద్రుఁడు వెడలిపోయెను. నాగేంద్రుఁడు లోనికరిగెను.

౨

విజయచంద్రుఁడు మణిపురమునందొక సుప్రసిద్ధ శ్రీమంతుఁడు. ఆతనికి మహేంద్రుఁడు, జగచ్చంద్రుఁడు ననువార లిరువురు కుమారులు, మహేంద్రుఁడు జగచ్చంద్రునికన్న పెద్దవాఁడు. జగచ్చంద్రుని పదియవ యేట వానితల్లి గతించెను, అది మొదలు మహేంద్ర జగచ్చంద్రులకు విజయచంద్రుఁడే తల్లియుఁ దండ్రియు నై యుండెను.

జగచ్చంద్రునకుఁ బదునేడు వత్సరములు వచ్చువప్పటికి మణిపురమునఁ బ్రసిద్ధవర్తకుఁడగు రమేశచంద్రదాసు యొక్క ఆఫీసునందాతని కొక యధికారపదవి లభించెను. వయసుఁ జిన్నదయ్యుఁ జూచువారల కాశ్చర్యము కలిగించు ప్రజ్ఞావిశేషములతో జగచ్చంద్రుఁ డుద్యోగము నిర్వహించుచుండెను.

జగచ్చంద్రమహేంద్రులకుఁ బ్రవర్తనమునందును, గుణమునందును జాల భేదమున్నది. జగచ్చంద్రుఁడు స్వాతంత్ర్యాభిలాషి. తనతండ్రి

ప్రసంగములైనను దాచియుంచుకొనుచును దేశ సమాచారములెల్లం యన్నిటిని సౌఖ్యము లనుభవించెదమని స్థిరపడిన సామ్రాజ్య ముగు ధనము కూడబెట్టి జీవితము గడుపుట శ్రేష్ఠమని జగచ్చంద్రుని యాశయము. వ్యవహారవిదుడగుట, లోకజ్ఞుడగుట నగు న్నను నతీతమునకు సమ్యక్కైన నిర్వహించుటయే ధారణాప్రజ్ఞానిశేషమే కారణమై యుండవచ్చును.

మహేంద్రుడును తెలివిగలవాడే. చురుకైనవాడే. కాని యాతని తెలివితేటలు సన్మార్గమునందు పోవుటలేదు: అతడు నుద్యోగము చేయుటయన్న బానిసత్వము నంగీకరించుటయని యెంచియు, సకలసుఖములు పొందగలిగినంత ధనముండగా, నాయాసక్లేశములకు లోనై యుద్యోగముచేయుట పొరపాటని యెంచును. అందువలన యథార్థముగ గాని మైన నితరుల కీడునొనర్చియుగాని, యుక్తులవలన నైనను బుచ్చుకొనవచ్చు ననుట ముఖ్యమైన యాశయముగలవాడు. ధనమును గడించుట కుద్యోగముచేయుట కంగీకరించనివాడు. ఇతరులను ద్రోహముచేసి డబ్బులాగుకొనుట కంగీకరించును.

జగచ్చంద్రమహేంద్రుల కొండొకరికొకరి కిట్టదు వారి ప్రవర్తన నిశ్చయములు, ఆశయములు, ప్రవృత్తులు అన్నియు వేఱు. ఇద్దఱి గుణములకు నెంతమాత్ర సంబంధము లేదు. విజయచంద్రుడు దీనిని చేయుట గనిపెట్టెను. కాని, అతనికి మహేంద్రునిపైనున్న యభిమానము వాని ప్రవర్తనయందలి లోపమును దర్శింపనీయదాయెను. అతడును మహేంద్రుని ఇష్టము ననుసరించి గృహకార్యనిర్వాహ మంతయు మహేంద్రునిచేత నుంచి తాను విశ్రాంతి గైకొనెను.

ఇట్లు నాలుగు సంవత్సరములు గడచిపోయినవి. జగచ్చంద్రుడు నుద్యోగమునందు క్రమక్రమాభివృద్ధి బొందుచుండెను. రమేశున కతని యందు మంచి నమ్మకము కుదిరెను. అతడు వ్యాపారమునందు ధన

మును వసూలు చేయుట, దానిని వ్యాపారమునకు వలయునట్లు కర్చుచేయుట మున్నగుపను లొనర్చు ప్రధానోద్యోగపదవియందు జగచ్చంద్రుని నియమించెను. ఒకనాఁడు జగచ్చంద్రుఁడు దగ్గఱనున్న యూర్లనుండి, కంపెనీకి రావలసిన పదునాలుగు వేల రూప్యములు వసూలు చేసికొనివచ్చి యింట నుంచెను. ఆ రాత్రియే విజయచంద్రు నింట దొంగలు పడి, జగచ్చంద్రుఁడు దాచియున్న కంపెనీధనమును మాత్ర మపహరించుకొనిపోయిరి. ఉద్యోగపర్వతము నెక్కుచుఁ గడకు శిఖరమువఱకుఁ బోఁగలుగు జగచ్చంద్రుఁ డింతటితో నధఃపతితుఁ డయ్యెను.

రమేశుఁ డాతనిమీఁద నా ధనమునకై యభియోగము దెచ్చెను. గాని విజయచంద్రుఁ డా ధనమును చెల్లించునటుల నంగీకరించి, యా యభియోగమును రద్దుచేయించెను. జగచ్చంద్రుఁ డప్పటినుండి నలుగురిలో తలయెత్తికొని తిరుగఁజాలకుండెను. ఎచ్చటికిని బోవక, యింటిలోనైనను ఇతరులతో మాటాడక ఒకనెల మణిపురమునందే గడపెను. కాని స్వేచ్ఛాప్రియుండగు నాతని కచట నట్లస్వతంత్రుఁడై యుండుటకు మనసొప్పలేదు. అదియుఁగాక నయ్యభియోగకారణమున విజయచంద్రుఁడు కుమారునెడల విముఖతఁజూపుచుండెను. మహేంద్రుఁ డెల్లరతోడను ఆధనమంతయు జగచ్చంద్రుఁడే యపహరించి యితరు లెవరో తీసినట్లు కల్పించెనని చెప్పుచు నింతవఱకు నాతనియెడఁ దనకుఁగల యసూయ వెడలఁగ్రక్కుచుండెను. ఇట్టివన్నియు జగచ్చంద్రుని మణిపురవాసమును మఱింత నసహ్యాకర మొనరించె ననుటలో నక్కఱ యేమున్నది ? ఇంటివాఁడు వ్రేలుజూపిన నితరుఁడు కాలుజూపును గదా! మహేంద్రుని వాక్యములచే మణిపురమంతయు జగచ్చంద్రు నతిదుర్మార్గునిగా, పరధనాపహారిగాఁ నెన్నఁదొడఁగెను. కర్ణాకర్ణిగ నివ్విషయమువిన్న విజయచంద్రుఁడుగూడ నిది నిజమని యనుమానించెను. దానితోడ నాతనివైముఖ్య మధికమయ్యెను. ఇఁక జగ

చ్చంద్రుఁ డచ్చట నెట్లుండఁగలఁడు? అప్పుడతఁడు మణిపురమున నుండ నొల్లక కలకత్తాయం దొక దూరసంబంధు వుండ నాతనికడకుఁ జనియెను.

తన బంధువుఁడగు భూపేంద్రుని సహాయముచేత కలకత్తాయం దొక్క యుద్యోగమును సంపాదించి జగచ్చంద్రుఁ డొక వత్సరము గడపెను. అప్పుడాతని తండ్రి మరణవార్త నాతనికిఁ దెలిపెను. అంతట నాతఁడు తనయధికారి కడ సెలవుదీసికొని మణిపురమున కరుదెంచెను. తా నుద్యోగము జేయుచున్నట్లు మహేంద్రాదులకుఁ దెలుపకుండవలయునని యాతఁడు, మలినవస్త్రములను ధరించి మహేంద్రుని కడ కరిగెను. అట జరిగిన సంభాషణము వినినదే.

అతఁ డచ్చటనుండి బయలువెడలి సురేశునికడకుఁ జనెను.

సురేశుఁడు విజయచంద్రుని స్నేహితుఁడగు నొక శ్రీమంతుఁడు. అతఁడు కలకత్తాయందు న్యాయవాదిగఁ బనిచేసి వయఃపరిణామంబున స్వస్థానమగు మణిపురంబునకు వచ్చి, న్యాయముగఁ దానార్జించిన యనల్పమగు నాస్తి ననుభవించుచు విశ్రాంతి జీవిత మొనర్చుచుండెను.

సురేశునకు జగచ్చంద్రునిపై నభిమాన మధికము. జగచ్చంద్రుని, కాతనికడ జనవు మెండు. అందుచే విజయచంద్రుఁడు మహేంద్రునెడఁ గల ప్రేమాధిక్యతవలనఁ దన్ను మన్నింపకున్నను, సురేశుఁడు తండ్రిఁ బోలె ప్రేమించుచుండుటచే జగచ్చంద్రుఁ డెల్లప్పు డాతనివద్దనే యుండుచుండెడివాఁడు. ఏ పని తాను జేయవెంచినను జగచ్చంద్రుఁడు సురేశునితోడఁ జెప్పనిది చేయఁడు. జగచ్చంద్రుఁడు ధనము నపహరించెనని, మణిపురము నందందఱు నమ్మిరి కాని సురేశుఁడు మాత్రము నమ్మలేదు. ఇంటను వెలుపలనుగూడ ప్రబలదూషణముల కగ్గమై, తల యెత్తలేకున్న జగచ్చంద్రుని కష్టము సురేశుని యనునయవాక్యములే కొంతకుఁగొంత శాంతిఁ గూర్చుచుండెడివి.

ఆనాటి యుదయమున సురేశుఁడొక గదియందుఁ గూర్చుండి,

యొక బంగాలీ గ్రంథమును జదువుచుండెను. ఆతని ప్రక్కన నున్న బల్లపై నొక వెండిపాత్రముఁ దేనీ రుండెను. దానిని నాతఁ డొక లోటాయందుఁ బోసికొని త్రావుచుఁ జదువుసాగించుచుండెను.

అప్పుడొక సేవకుఁడు లోనికివచ్చి "బాబుగారు! జగచ్చంద్రబాబు గారు వచ్చియున్నారు." అనియెను. సురేశుఁడు, జగచ్చంద్రుని లోనికి బంపుమని, చేతనున్న గ్రంథమును మూసియుంచెను.

జగచ్చంద్రుఁడు లోనికివచ్చి, మరల బదిలముగఁ దలుపుమూసి, సురేశునకు వందన మొనరించెను. సురేశుఁ డాతనిఁ గూర్చుండుమని, జగచ్చంద్రుఁ డాసీనుఁడైన పిదప, "జగచ్చంద్రా! కలకత్తానుండి యెప్పుడు వచ్చితివి?" అని ప్రశ్నించెను.

"ఈయుదయముననే వచ్చితిని."

"నీకు విజయచంద్రుని మరణవృత్తాంతము తెలిసిన వెనుకనే బయలు దేఱితివి కాఁబోలు" ననుచు, నొక పాత్రమునఁ దేనీరుపోసి జగచ్చంద్రున కందిచ్చెను.

జగచ్చంద్రుఁడు దానినిఁ గొని త్రాగి యటనుంచెను. మరల సురేశుఁ డిట్లు ప్రశ్నించెను.

"మహేంద్రుని కడకుఁ బోయితివా?"

"గృహమున కరిగితిని. తొలుదొల్త నారాకకై యెదురుచూచిన వానివలె, సంతసించినవాని వలెఁ గాన్పించెను. మాతండ్రిగారి మరణ శాసనము ప్రస్తావనమునందు మాత్రము తన నిజవర్ణమును వెలువఱచెను. సురేశబాబుగారూ! మాతండ్రి వ్యాధిగ్రస్తుఁడైన పిమ్మట మీరాతనిఁ జూచితిరా?"

"జబ్బుపడిన క్రొత్తలోఁ జూచితిని. ఆవలఁ జూడనేలేదు. మహేంద్రుఁడాతని కొఱకు చాలధనము వ్యయమొనర్చి మందిప్పించెను. కాని ఫలమ్ము లేకపోయినది."

“మార్తాండ్రి మరణశాసనవిషయము మీకేమయినఁ దెలియునా?”

“విజయుఁడు వ్రాయించినదని మహేంద్రుఁ డొక మరణశాసనము దెచ్చి నన్ను సాక్షిగా సంతకము నఱ్వఁ గోరెను. కాని నాయెదుట జరుగనిదానికి నా చేవ్రాలుచేయుటకు వీలులేదని పలికితిని. మఱియొకడు, ఆమరణశాసనమున విజయుఁడు — నీకు భేతాళగిరి ప్రాంతమందలి యెనుబది యెకరముల భూమిమాత్ర మిచ్చునట్లు వ్రాయించెననియు, నా భూమికి సంబంధించిన పత్రములన్నియును, నాస్వాధీనము చేయుమని యెనిని యనియు మహేంద్రుఁడు చెప్పి కొన్ని కాగితములను నాకొసఁగెను. అప్పు డాయన్యాయమునకుఁ జింతించి యాతని నడిగితిని. అట్లు వ్రాయుటతగదని వాదించితిని. అందులకు గారణము నీవు చమేనుని వ్యాజ్యమున గృహమునకుఁ గళంకము తెచ్చి పెట్టితివని విజయుఁడట్లు చేసెనని మహేంద్రుఁడు పలికెను. అదినమే నేను విజయునితో మాట లాడవలయునని తలంచితిని. కాని యాతఁ డుదయమే మరణించెనని తెలిసినందున నేమియుఁ జేయఁజాలక పోతిని.”

“బాబు! మీరు నాకై యింతగ శ్రమపడికొనుట నాభాగ్యవిశేషమే కాని వేఱుగాదు. మార్తాండ్రిగారి యింట జరిగినవన్నియు విచిత్రములే! అనుమానాస్పదములే! నాగేంద్రుఁడు నాతోడఁ జెప్పిన విషయమంతయు ననుమానింపదగియే యున్నది. తొలుత రామనాథబాబుగారు మందిచ్చుచుండిరట! తండ్రిగారి మరణమునకుఁ బది దినములు ముందాయన హఠాత్తుగా నిలిచిపోయెను. పిమ్మట, దేవదాసుబాబనునాతఁడు మందిచ్చుచుండెనట. ఆతఁడు పురవాసికాడు. ఆతఁడేనట మరణశాసనము మార్తాండ్రిగారు చెప్పుచుండ వ్రాసినవాఁడు. ఇప్పు డాతఁ డెటనుండెనో యెవరునెఱుఁగరు. మార్తాండ్రిగా రుండిన గది లోనికి సేవకులెవ్వరునుబోఁగూడదని మహేంద్రుఁడు శాసించియుండెనట. ఏల? దేవళొలు కీకట్టుబాట్లు? ఇవన్నియు ననుమానింపదగియుండలేదా?”

"జగచ్చంద్రా! అనుమానదృష్టి కన్నియు ననుమానాస్పదములు గానే తోఁచుచుండును. ఇప్పుడు నీవు తెలిపినదంతయు నేనెఱుంగుదునుగాని అందునేను దేనిని ననుమానింపలేను. అయినను ఒక వత్సరముగా మహేంద్రుని ప్రవర్తనమంతయు మాఱిపోయినది. అతఁడు మునుపటివాఁడు కాఁడు. అందుచే నీవనుమానించువిధమున నేయన్యాయకార్యమైన జరిగిన జరిగియుండవచ్చును. అందుల కిప్పు డేమి చేయనెంచితివి?"

"నాగేంద్రుఁడు మహేంద్రునికడ నుండజాలననియు, నింక నెచ్చటికైనఁ బోయెదననియుఁ జెప్పినాఁడు. ఆతనిని నాకడ సేవకునిగాఁ గైకొని నానిని బదరపురమునకుఁ బంపి యీదేవదాసుఁ డెవ్వఁడో తెలిసికొనవలయును. ఆతఁ డచ్చటికిఁబోయి వచ్చు లోపల నేను నాగపర్వతప్రాంతముల కరిగి యచ్చట నీభూస్థితి విషయమంతయుఁ జూచుకొని తిరిగి వచ్చెదను. నాగేంద్రుఁడు తెచ్చుసమాచారమును బట్టి యావలఁ జేయవలసిన దాని నాలోచింపవచ్చును."

"మంచిది. ఆమార్గమునఁ బోయిన నేనిపత్తును రాఁజాలను. మనల నెవ్వరు ననుమానింపరు. ముఖ్యముగ నీవిషయము మహేంద్రునికి దెలియఁగూడదు."

"మీరు నాగేంద్రుని మీవద్ద సేవకునిగా నియమింపుఁడు. ఆవల నాతని బదరపురమున కంపవచ్చును." "సరియే! నాగపర్వతము కడ కెప్పుడు పోవనెంచియున్నావు?"

"ఈదినము మధ్యాహ్నమే పోవనిశ్చయించితిని. నాకొక యశ్వము కావలెను. నేనిప్పుడేచని నాగేంద్రునితో సంగతులన్నియు మాటలాడి యీదినమే యాతని బదరపురమునకుఁ బొమ్మని వచ్చెదను. మీరశ్వమును సిద్ధము చేయింపుఁడు" అనుచు జగచ్చంద్రుఁడు లేచెను.

సురేశుఁ డొక భటునితో నశ్వము నాయత్తముచేయ నాజ్ఞ

యొసంగి నేనుచును, గవిద్వారమునకు వచ్చుచుండ ద్వారపాలుడు దెలుపుకొని యొక భటుఁడు లోనికివచ్చి "జగచ్చంద్ర బాబుగారు! ఎవరో యొక క్రొత్తమనిషి మీకీజాబు నొసంగుమని నాచేతి కిచ్చెను. ఆతఁ డెవరో తెలిసికొన నేను వేసిన ప్రశ్నములకు వేఁకవ బదు లొసంగక కాతఁడు వెడలిపోయెను. ఇదిగో జాబు" అనుచు నొక జాబును జగచ్చంద్రుని చేత నిడెను.

జగచ్చంద్రుఁ డాయుత్తరమును విప్పుచుండ, సురేశుఁ డా భటుని కిట్లాజ్ఞాపించెను. "వాగీశా! మధ్యాహ్నమునకు నాగుఱ్ఱము ప్రయాణమునకు సిద్ధ మొనర్పుము."

"చిత్త" మనుచు భటుఁడు వెడలిపోయెను.

జగచ్చంద్రుఁ డాలేఖను విచ్చి యామూలాగ్రము చదివెను. మొదటియక్షరముతోఁ బ్రారంభించిన యాశ్చర్యభావము లేఖ యందలి ప్రత్యక్షరపఠనముతోడను బ్రవృద్ధమై తుదకు బ్రపూర్ణమై యాతని మోమంతటి నావరించుకొనియెను. మరల నొకమారాతఁడు లేఖను జదివెను. అప్పుడాతని మోమున నాశ్చర్యమునకుఁ దోడు మందహాసముకూడ నంకురించెను. తన్నుఁ గని యాశ్చర్య మందుచున్న సురేశ బాబున కాయుత్తరమిచ్చి "బాబుగారూ! ఈలేఖఁ జదువుఁడు" అనియెను.

సురేశుఁ డాయుత్తరమును జదువఁ బ్రారంభించెను.

"జగచ్చంద్రా!

నీతండ్రి నీకు నాగపర్వతముకడ నున్న భూమిసంతయు నొసంగె నని నీవిప్పుడే తెలిసికొని, ఆభూస్థితిని స్వాధీన మొనరించుకొనుట కచ్చటికి బ్రయాణము కానుంటివని యెఱింగి నీ కలేఖ వ్రాయు చున్నాను. కొన్ని కారణాంతరములచే నీ విప్పుడచ్చటికి రాఁగూడదని శాసించుచున్నాను. ఆశాసనమునకు బద్ధుఁడవై కొంతకాలముండి

నచో నా భూమి నీ స్వాధీనము కాఁగలదు. నా యాజ్ఞ నుల్లంఘించి యిప్పటి కెవరు నిల్చియుండలేదు, నీవు జీవించుట దుర్లభము! నా యాజ్ఞ యుల్లంఘించిన నీ ఆయుష్కాలములోపల నాగసర్పములదేవ నీమూలమున ప్రాణములు గోల్పోవుదురు. భూమియొక్క నివృత్తికి నీమార్గము నగలును. పరలోకమునందు నా చేతితప్పు. జాగ్రత్త! నీ శ్రేయోభిలాషి”

అని సురేశుఁడా జాబు నా సమాగ్రమున చదివి -

“జగచ్చంద్రా! ఇది చాల విచిత్రముగ లేఖగనున్నది! నీ రాక నప్పటికే మా లేఖాకర్త యెట్లు తెలిసికొనియుండెను? నీకుఁ బితృదత్తమయిన యా భూమికి, నీకనికిఁ గల సంబంధ మేమైయుండును?”

“సురేశబాబుగారూ! ఇం దేదో కుట్రయున్నది. ఈ లేఖను వ్రాసినవాఁ డీపుర వాస్తవ్యుఁడై యుండవలయు. లేకున్న నాగపుర వాస్తవ్యుఁడయి ప్రస్తుత మిచ్చటనుండువాఁడైన గావలయును. లేనియెడల నారాక వీరికెట్లు తెలియఁగలదు? తెలిసినను, నాభూమి విషయమున ననవసరముగ జోక్యము కలిగించుకొనుటకితఁ డెవ్వఁడు? అన్యుఁడెవఁడు దీనికిఁ బాల్పడియుండఁడు గదా?”

“అయిన, నీ లేఖాకర్తృత్వము గూడ మహేంద్రునిదే యనియా నీ యనుమానము?”

“అవును. అతఁడైన వ్రాసియుండవలెను. లేదా వేరొకరిచేతనైన వ్రాయించి యుండవలయును.”

జగచ్చంద్రుఁడు సమాధానము చెప్పుచుండఁగ సురేశుఁడా పత్రికపై నేదో చూచి భయవిహ్వలుఁడై వణఁకఁజొచ్చెను. ఏదియో మాటలాడ నుంకించి, నోట మాటరాక తత్తరపడుచుండెను. జగచ్చంద్రుఁ డాతని భయముగని యుక్కజపడుచు -

“సురేశబాబుగారూ! ఏమి? మీకింతలో గలుగవలసిన భయకారణ మేమియును లేదే! ఏల నట్లు భీతిల్లుచున్నారు?” అనియడిగెను.

సురేశుఁడు తత్తరమున "జగచ్చంద్రా! ఈజాబు వెనుకఁ జూచితివా?" అనుచు, నాకాగితపు వెనుకభాగముఁ జూపెను.

అచ్చట నొక సుందరి ముద్రయుండెను. అందేమియు లేదు. ముద్రయంతయు నల్లగ మసిపూయఁబడి యుండెను. జగచ్చంద్రుఁడు దానిని చూచి, "భాగ్యవాఁడ! అందేమియు లేదే!" అనియెను. సురేశుఁడు ప్రత్యుత్తరముఁ జెప్పక నా దిక్కుఁ జూడక వెడలిపోయెను.

3

జగచ్చంద్రున కేమియు బోధపడలేదు. "సురేశుఁ డంతగా భయము పడఁగారణమేమి? అతఁడంత భయవిహ్వలుఁడగుట కాముద్రయందేమున్నది? నిజముగా నాముద్రయందంత భయంకరరహస్య మున్నదేమో?" అని జగచ్చంద్రుఁ డాలోచించుచుఁ గూర్చుండియుండ నాగదికిఁ బ్రక్కగోడయందున్న కిటికీకడ, నెవరో నిలిచియున్నట్లును, దమచర్య నంతయుఁ గని నవ్వుచున్నట్లు నాతనికి సడిసన్నయాయెను. ఉన్నట్లుండి యొకసారిగా నావైపుఁదిరిగి జగచ్చంద్రుఁడు చూచెను. ఆ కిటికీవద్ద వికృతహాసకలితమగు నొకముఖాకృతి యొకనిమిషము కనఁబడెను. ఆముఖము మనుజుల నొకనవ్వు నవ్వి, మాయమయ్యెను. జగచ్చంద్రుఁ డొక్కపరుగున బోయి, గవాక్షమున్నచోటనుండి ఆ వ్యక్తి పరువిడి పోయినవైపు చూచెను. ఎవ్వరును గోచరింపలేదు.

జగచ్చంద్రుఁ డక్కడ నిలువఁబడిపోయెను. "ఏమది? ఆ కనఁబడిన హాసవికృతవదన మెవ్వనిది? అతఁడెవ్వఁడైయుండును? అతని కంత నవ్వుగలిగించిన దేమైయుండును? ఇదంతయు మాయమై నాలో భ్రాంతిమాత్ర కల్పితమైయుండునా? స్పష్టముగఁ జూచితినిగదా యాముఖమును? అది యింకను నాకన్నులయెదుట నున్నట్లే యున్నదే!"

"జగచ్చంద్రా! ఏ మచ్చట నిలిచియున్నావు!"

తనమనంబునం దోఁచుచున్న యాలోచనాతరంగముల యురవడిని సమాధానపఱుప యత్నించుచున్న జగచ్చంద్రుఁడు, సురేశుని రాకను గమనించియుండలేదు. సురేశుఁడా గదినుండి వెడలిపోయిన వాఁడు చిన్నసీసా నొకదానిని జేతబట్టుకొని మరల నా గదిలోని కరుదెంచెను. ఆతఁడు జగచ్చంద్రుఁడు గవాక్షమునుండి ఎవరినో చూచుచున్నట్లు కనిపెట్టి, యీప్రశ్నము వైచెను.

“ఏమియు లేదండి. ఈ కిటికీవద్ద నెవ్వఁడో, యొకఁడు నిలువఁబడి మన మా యుత్తరముగుఱించి విషయములకై పొందుచున్న యాశ్చర్యమునకు పరిహాసహాసమొనరింప, విని నే నటు తిరిగితిని. నా కాతని మోముమాత్ర మగపడియెను. ఇంతలో నాతఁ డటనుండి మాయమయ్యెను. ఆతఁ డెవరో చూచెదనని, యీ గవాక్షమునకడకు వచ్చి చూచితిని. ఎవఁడుఁ గాన్పింపలేదు.”

“ఆతఁడా! వాఁ డీయూరఁ దిరుగాడుచుండు నొక యున్మాదుఁడు. ఆతనిచర్య లతి విచిత్రముగా నుండును. ప్రతియింటికడకు వచ్చి, యెవరైన మాటలాడుచున్న వారియెదుట నిలిచియుండి వారలాశ్చర్యమందునట్లు నవ్వి, యంతలోఁ గనఁబడకుండఁ బరువెత్తుచుండును. ఇప్పు డాతనిఁగూర్చిన ప్రసంగ మేల? రమ్ము. ఆలేఖయందున్న ముద్రయొక్క రహస్యముఁ జూపుదును.”

అనుచు సురేశుఁడు తన చేతనున్న సీసాలోని ద్రావకము నా ముద్ర మీఁద రెండుమూడు బిందువులు వైచి మెల్లగఁ దోమెను. రెండు నిముసములలో, నా శ్యామలాంకమంతయు మాఱిపోయినది. అచటనే, ఆముద్ర యంత పెద్దదైన యొక మానవచిత్రము ప్రత్యక్షమయ్యెను. ఆ చిత్రమున వదనము మొదలు పైభాగ మంతయు నుండెను. సురేశుఁ డిప్పు డాకాగితముఁ గొని జగచ్చంద్రుని చేతి కిచ్చి “చూడుము” అనియెను.

జగచ్చంద్రుఁడు దానిఁ గొని పరీక్షించెను. అందు చిత్రింపఁబడి మానవప్రతిమ, [illegible] గాంభీర్యమందును, [illegible], పెద్ద పెద్ద చిత్రములకన్న సుందరమై యుండెనుగాని యందుఁ జిత్రితుఁడై యున్న వ్యక్తి వీక్షకుల హృదయమున భీతిఁ గలిగించునంత భయంకరముగ నుండెను. అతఁ డెవరో! ఆ చిత్రము గనినంతనే సురేశునివలె జగచ్చంద్రుఁడుకూడ నాశ్చర్య భయాన్వితమానసుఁడయిపోయెను. కాని యీ భయ మెంతయో కాలము నిలువలేదు. అతఁడు మరల నా చిత్రమును బరీక్షించుచు-

"సురేశబాబుగారూ! ఇతఁడేనా ప్రసిద్ధదస్యుఁడగు గగూలియా? వృత్తికిఁ దగిన రూపమే! ఇంతటి భయంకరాకారమునకు, దినము కెన్నియో హత్యలొనరించునట్టి క్రూరచిత్తమునకు నాలయ మగుటయం దద్భుతమే మున్నది?"

ఆ ప్రతిమ వక్షముపై నొక చిన్న పతకమువంటి చిహ్నము గనుపడెను. జగచ్చంద్రుఁడు దానిఁ బరీక్షించిచూడ ఆ పతకము కానిపించెను. ఆ పతకముపై మూఁడు తలల నాగ మొకటి చెక్కఁబడియుండెను.

"సురేశబాబుగారు! ఇతని వక్షముపై నీ పతక మేమి?"

"అది యీ చోరసంఘముయొక్క గుర్తు. ఆ గుర్తు నా సంఘసభ్యులెల్లరు ధరింతురు."

"ఇతఁడేనా నాకీ జాబు లిఖించినది? ఇట్టి యాజ్ఞ నిచ్చుటకు గగూలియాకుఁ గారణ మేమయి యుండును?"

"గగూలియాకుఁ గారణ మక్కరలేదు. ఎవరి యర్థమైన నపహరించు చోటుకుఁ గాని కారణములతోఁ బని యేమున్నది? నాగపర్వతములవద్ద నున్న యీ భూస్థితిని దన వశ మొనరించుకొన నిశ్చయించెను. లేకున్న నట్టి భయంకరమగు నుత్తర మేల వ్రాయును! అతఁడు తలపెట్టిన కార్య మెంత యధర్మమైనను, జేయుటకు వెనుదీయఁడు."

"సురేశబాబుగారూ! మీ రనునదంత నిక్కమే కావచ్చును. అయిన నేనాతనికి భయపడవలసిన యవసర మేమున్నది! నా భూమికిఁ బోఁగూడదని శాసించుట కాతని కధికార మేమున్నది?"

సురేశున కేమి చెప్పుటకును దోఁచుటలేదు. న్యాయముగ జగచ్చంద్రు నాతని భూమికిఁ బోకుండఁజేయ గగూలియా కధికారము లేదు. కాని శక్తియున్నది. అట్టి రాక్షసుని చేఁజిక్కుట యన్న ఆతని యాజ్ఞ మీఱుటయన్న జీవములపై నాశ వీడుటయే! కొంత వడి మౌనముగనుండి సురేశుఁ డిట్లనియెను.

"జగచ్చంద్రా! నీవు నాగపర్వతములవైపు చూడనైన వలదు. నీవు గగూలియావంటి క్రూరుఁడు, నుద్దండుఁడునగు దొంగల మున్న మాట కెదురాడి నిలువఁజాలవు. నీ కాభూమి లేకున్నమానె. దాని కొఱకై, సిలుగులపాలు గాకుము."

జగచ్చంద్రుఁడు సురేశుని మాటలను వినలేదు. ఆతని మానసమున నాలోచనాతరంగములు రేగెను. దానికిఁ జిక్కి, యాతఁడు సర్వమును మఱచెను.

'గగూలియా — వీనిఁ బట్టఁ బ్రయత్నించి — పోలీసు కర్మచారు లెందఱో నిష్ఫలులైరి. దొరతనమువా రాతనిని బట్టినవారికిఁ బది వేలరూప్యములు బహుమాన మిత్తుమని ప్రకటించియున్నారు! రక్షక భటాధికారులకుఁ జిక్కక తప్పించుకొన్న యీ దస్యునిఁ దాను బట్టఁ బ్రయత్నించిన — జయింపవచ్చునేమో! ధర్మశిక్షనుండి తప్పించుకొని తిరుగుచున్న యీ నరహత్యాచారిని-శిక్షణీయుని-బట్టవచ్చునేమో! ఏల ప్రయత్నింపఁగూడదు! ప్రభుత్వ నిర్ణీతబహుమాన మందుట కేల యత్నింపఁగూడదు' మొదలగు నాలోచనములకుఁ జిక్కి జగచ్చంద్రుఁడు కొంతసేపు మౌనముగ నుండెను. సురేశుఁడు దీనిని గనిపెట్ట లేదు. ఉన్నట్టుండి జగచ్చంద్రుఁడు —

"బాబుగారు! ఆతఁడిట్లు నాకు వ్రాయ నవసరములేదు. గొప్ప చోరసంఘమున కధికారి యగు నాతఁడు, నా కిట్టి జాబు వ్రాసి నాగపర్వతములకడకు నేను చనకుండఁ జేయ నేల తలంచును. పోయినను, నాతని బలమును బ్రతిఘటింపఁగలిగినంత శక్తిఁ గలవాఁడనా నేను? గగూలియా, యీ యుత్తరము నాకు వ్రాయకుండనే తన శక్తి నుపయోగించి నా భూమిని లాగుకొనఁగాలఁడా? కావున, నీయుత్తర మాతఁడు వ్రాసినదికాదు. ఆతని పేరు బెట్టి నన్ను భయపెట్టుట కెంచి వే రెవరో వ్రాసినది. జాబుక్రిందఁ జేవ్రాలు చూడుఁడు. "నీ శ్రేయోభిలాషి." గగూలియాయైన నిశ్చయముగఁ దన పేరు క్రింద వ్రాయకుండునా? అదియునుగా కెటనో నాగపర్వతములకడనున్న గగూలియాకీ యుదయమే నా రాకయు, నా భూమి బరీక్షింపవలయునను నా నిశ్చయమును నెట్టులఁ దెలిసియుండును? తెలియుటకు వీలులేదు. ఎట్లయినను నా భూమిని విడువఁజాలను. ఈ దినము మధ్యాహ్నమే యచ్చటి కరుగ నెంచియున్నాను.

సురేశుఁడు జగచ్చంద్రుని యనిమిషవీక్షణములఁ జూచుచుండెను. జాబునందలి యా ముద్రను గన్నప్పుడే, సురేశుని వదనము వివర్ణమై పోయెను. ఇప్పుడు జగచ్చంద్రుఁడు పలుకుచున్న మాటలు విని నప్పుడతని యొడలు వణఁకఁ బ్రారంభించెను. స్వేదము గ్రమ్మెను. సురేశుని కేయన నేల? మణిపుర వాసులందఱు, నాగపర్వతపరిసరములఁజుట్టును నేఁబదిమైళ్ళవఱకు నున్న గ్రామములందు నగరములందు వసించు జనులందఱు, గగూలియా పేరన్న వివర్ణులై, ప్రబలభయాకంపితులై, నిశ్చేష్టులౌదురనుట నిక్కువము! ఒకరితో నొకరుప్రసంగించు టటుండ దమలోఁ దామేని, గగూలియా నామ ముచ్చరింతురనుట, సంశయమే! గగూలియా యొనర్చిన ఘోరములు, బాపరక్తి పరిచ్ఛన్నములగు నరహత్యలకు మితిలేదు! ఎంతటి దారుణకృత్యమైనను నాతఁ

దాపరించుటకు వెనుదీయఁడను నెల్లరకుఁ దెలిసిన యంశమే! వాని సాహసము, మనఃకాఠిన్యము, క్రౌర్యము, కథలుగాఁ బురాణములుగా వినుచున్నామే కాని, కని యెఱుంగము, ఈ దేశ ప్రజలు కంపించుచుందురు:

“జగచ్చంద్రా! నీవు గజూలియసా చరిత్ర మెఱుంగనివాఁడవు గావున నిట్లు మాటలాడుచున్నావు! ఇట్టి జాబుల ననేకములనాతఁడు వ్రాయుచుండెను. పలువురు ధనికుల ననుసరించి, వాని నాతఁడు వ్రాయు తీరున నే నిశ్చయించితి. ఆజాబుల యందలి వచనములకు వ్యతిరేకముగ నడచి, తమ కానివచ్చే చిక్కులఁ బడి యనేకు లప్పుడు తమ పూర్వ బుద్ధిమాంద్యమునకుఁ బశ్చాత్తాపించుచుఁ బ్రాణములఁ బాసిరి. ఇట్టి లేఖలు వ్రాయుటయందు దానికి దృష్టాంతమగు కొన్ని గుఱుతులు గలిగియున్నాఁడు. ఈలేఖయు నాతఁడు వ్రాసినదే! ఇఁక నాతని పేరు పెట్టి భయపెట్టుట కెవ్వరైన నిట్లు వ్రాసియుందు రనెడి యనుమానము దృఢమైనది కాదు. ఏలయన నాతని ముద్రఁగల కాగితము లింకొకరికి లభించుట దుర్లభము. ఇంతవఱకు నట్టి లేఖ లెవ్వరు వ్రాసియుండలేదు. దీని యందలి సంతకము, నీవిధమున నాతఁడు చేయుఁడని కదా నీనిశ్చయము. ఇట్టి యుత్తరములం దెన్నిఁటియందో, “నీవిరోధి” యనియు “నీపాలిటి మృత్యువు” అనియు చేవ్రాలు లాతఁడు చేసియున్నాఁడని వింటిని. అట్టి చేవ్రాళ్ళు చేసినవానికి నీనిని చేయుటయందు సందేహ మేమున్నది? ఆతఁడు నాగపర్వతముల కడనున్నను, నాతని సంఘస్థులు చుట్టుప్రక్కల గ్రామములలో నెల్లప్పుడు దిరుగుచునే యుందురు. ఆతని యనుజ్ఞమీఁద వారియం దెవ్వరైన వ్రాసియుండ వచ్చును. ఇన్ని విధముల నీయుత్తర మాతఁడు వ్రాసినదే యని, స్వప్రమాణముగఁ దెలియుచుండ, నంతటి బలవంతుఁడగు చోరసంఘాధి కారి, నీవంటి బలహీనునకు వ్రాయుటకుఁ జింతింపఁబోఁడను నొక

నీవనుకొనుచుంటివిగదా గఘూలియా యాతని ప్రాణస్నేహితుని స్మరియింతువు! అతని విచిత్రచర్యలును, భయంకరములగు హత్యలును నీ వంగదేశము నంతను ప్రచలితము జేసినవి. ఆహా, పేరువిన్నంతనే పత్తేదారులు, సింహములవంటివారును, పిల్లులవలె నణగిపోవుదురు. రక్షకభట కర్మచారులలో సుప్రసిద్ధులగు వా రెందరో వాని క్రౌర్యానలమున దగ్ధులైపోయిరి. నామాట వినుము. కలకత్తకు బోవలదు.” అని బోధించెను.

“నిశ్చయముగ, నా యజమానుని పురోహితుడు చెప్పినంతయు వినియెను. వానివలన దొకట్టికైనను నాతని మనోనిశ్చయమును చలింపజేయ లేకపోయెను.

“సురేశబాబుగారూ! చిన్ననాటనుండియు, నాకు మీరు తండ్రిం బోలియుంటిరి. ఇంతవఱకు మీయనుమతిం బొందకయే నే నొక్కపనియైనం జేసియుండలేదు. ఇంకమీదను జేయంబోను. నేను జెప్పిన దంతయుం బ్రసన్నభావమున వినుడు. నా యీ ప్రయత్నమునకేమియు నడ్డు పలుకకుడు.

“నే నిటనుండి కలకత్తాకుం బోయిన వెనుక, నట నొక పత్తేదారుని కడ నుపాధికారి (assistant)గా పనిచేసితిని. ఆతని కడ యీసంవత్సరములోపలం జాలవఱకు నా పనియం దారితేఱితినని చెప్పంగలను. నా కపరాధపరిశోధనము తెలియు నప్పటినుండియే, నేను దాని సహాయమున గఘూలియాను బట్టుటకు బోవుచున్నానని మీరనుకొనవలయు. నాకేదే నపాయము రానున్న దానిని గ్రహించి తప్పించుకొనంగలను. అదియుంగాక మీ రెంతగ వాదించినను, నా యుత్తరము గఘూలియా వ్రాసినది కాదనియే నేననుమానించుచున్నాను. మఱియు నాతండ్రిగారి యనల్పమగు నాస్తియంతయు, మధ్యస్థుల కుట్రవలన, నాభూమి మాత్రమే నాకు దక్కినది. దానినిగూడ నే నేల పోగొట్టుకొనవలయును? దానికై, యెందఱడ్డము వచ్చినను మేనం బ్రాణము లున్నంత

కాలము గడపెదను. కాని సింహాసనమునకు ఎగబ్రాకలేను. ఒకవేళ గర్వా తిరస్కారంబొనర్చుటచే దౌర్బల్యమేనని యనుకొందువా. ఆతఁడు భయంకరుఁడు కావచ్చును నా కేమాత్రము భయములేదు. స్వార్థము నకై పోరాడు నంతవరకు శక్తి కలవాఁడను. మరణమే సంభవించునా? మంచిదే! తెలుగు నిలకత్తాగుంపి యిచ్చుటకేవచ్చినవాఁడను గాను, ఏమేమి దాగ్రహముతో నెలను నాసర్దనముగా నుపహసించిన దేవరో, పట్టుకొన వలయును సిగ్గు! అందులకే నాలుగు నెలలు నెలుప్పెట్టి వచ్చితిని. ఇమ్ముల మహా[illegible], నా నిజమైన బలిగర్తుండను కాగించెదఁ దప్పించు కొనవలెను. ఏపనికిగాని, గురాభూమిని ముందు నాస్వాధీనము చేయుచుకొన వలయును! స్వధారుడనగు నావంటివాని కెన్నఁడు నాయ మొనర్తురా? నాకు ఘనమగు దేశగౌరవ భూమి యదే! జయాపజయ ములు తెలియని యీ ప్రయత్నమున క్లేశములనన్నిటి ధనసహా యము బడయవలెను. బాబుగారు! ఈకారణములచే, నాభూమిని స్వాధీన మొనర్చుకొనఁ బ్రయత్నించెదను. అందులకు మీరేమియుఁ దలంపకుఁడు. నన్నీయత్నమునుండి విముఖుని జేయఁ గడంగకుఁడు.”

అని జగచ్చంద్రుఁడు సురేశబాబుగారి రెండుహస్తములు బట్టు కొని వేఁడుకొనియెను.

సురేశుఁ డాశ్చర్యచకితుఁడై పోయెను. జగచ్చంద్రుని వినయము, సూక్ష్మబుద్ధి, శౌర్యము, సత్ప్రవర్తన మొదలగు నుత్కృష్ట గుణము లకు వన్నె వెట్టఁదగిన శౌర్యసాహస మాతనికడఁ గనఁబడుట, సురే శునివంటి శ్రేయోభిలాషి కానంద మెట్లుగల్గింపకుండును? ధైర్య మొకవైపు, నమ్రతయొకవైపు, శతసహస్రజ్యోతిః కళలఁ బఱపుచుండ, మధ్యనున్న జగచ్చంద్రుఁ డెట్లు ప్రకాశింపకుండును? కాని — జగ చ్చంద్రుని యీమనోధైర్యము సురేశునకు సంతసముగలిగించుటకు మాఱు చింత నాదరించెను. జగచ్చంద్రుఁడు గఫూరిఖాఁ బ్రతిఘటించుట

యందుఁ దనకుఁ గల సాహసము పట్టుదల ధైర్యమును జూచి దలఁచి కింక దేనియందైనఁ గనఁబడియుండెను, సురేశుఁ డానంద మందియుండెను. గగూలియా యెక్కడ? జగచ్చంద్రుఁ డెక్కడ? ఆ నర రూపరాక్షసుఁ డెక్కడ! ఈలోకజ్ఞానము చక్కఁగ లేనివాఁ డెక్కడ! సురేశున కింకను జగచ్చంద్రుని ప్రయత్నమునుండి తప్పించుకొనగలనను ధైర్యము కొంచెము నిలిచియుండెను. నవ్వుచు నాతఁ డిట్లు పలుకఁ దొడఁగెను.

"జగచ్చంద్రా! నీ మొండిపట్టు విడుము! ఈ లేఖ వ్రాసినది గగూలియా కాదని నీ వెంచుట నిముషమాత్రకే! ఆతని చర్యలు నీ వెఱుఁగవు! తెలిసియున్న నిట్లు పలుకవు. నీ మొండిపట్టు విడుము. ఆ క్రూరరాక్షసుని చేఁబడి, నీకన్న గట్టివారెందఱో చెడిపోయిరి. నీ సాహసమాత్రముచేఁ బ్రతిఘటింపలేవు. గగూలియా సామాన్యుఁడు కాఁడు సుమా! రక్షక భటులకుఁ బ్రత్యక్షమృత్యువు. పత్తేదారులకుఁ బ్రక్కలో బల్లెము. వంగదేశవాసుల కందఱకుఁ గాలయముఁడు! అనేకరక్షకభటుల సహాయముతో నాతనిఁ బట్టనెంచి, యెందఱో పత్తేదారులు ప్రయత్నించి, విఫలులైరను నీ వెఱుంగవా? అట్టియెడ నసమర్థసహాయుఁడవు, నసహాయుఁడవు నీ వెక్కడ, నామాటలు వినుము! నీ ప్రయత్నములు మానుము."

అని సురేశుఁ డెంతదూరమో చెప్పెను. జగచ్చంద్రుఁడు చలింపలేదు. సురేశుఁడు పలుకుకొలఁది, నాతని కుత్సాహము మిక్కుట మగుచుండెను. గగూలియాయొక్క భయంకరకృత్యములను సురేశుఁ డొక్కొక్కపరి యొక్కొక్కవిధముగ వర్ణించి చెప్పుచున్నకొలఁది నాతనిఁ బట్టవలయునను పట్టుదల హెచ్చుచుండెను. ధైర్య మినుమడించుచుండెను.

"సురేశబాబుగారు! ప్రఖ్యాతివహింపవలయు ననుకొన్న, జగమున నందఱకు నుండుట సహజముగదా! కీర్తిసంపాదింపవలయునని నేను

చూపిన యాత్మహాత్మ్యమునకే, మీరేల ప్రతిఘటింపనెంచెదరు? నాకీయత్నమై, మీరేమియు భయమునుజెందనలదు. నామీద మీకున్న యనూనాభిమానము మీచే నట్లు పలికించుచున్నదిగాని, యిందు మీ రనునంత భయంకరమగు నాపద నాకేమియుఁ గనఁబడుటలేదు. ఎట్లైనను, నాగపర్వతములకుఁ బోయెదను. జగచ్చంద్రుఁ డింతసాహసమునకుఁ బాల్పడి యిప్పుడు మీకాఁచుచున్నను, కొంతకాలమునకే మీయభిప్రాయమును సార్థకమొందురని చెప్పఁగలను: మీ యనుజ్ఞఁగోరి యింతవాద మొనర్చితినైన, మిము నన్ను త్రిపట్టుప నిశ్చయించితిని. నావాదమును మూర్ఖవాదముగాఁ దలంపక, నాగపర్వతములకడ కరుగ ననుజ్ఞయిండు."

అని వేడుకొను జగచ్చంద్రునకు సురేశుఁడేమి ప్రత్యుత్తర మీయఁగలడు? ఏయాపదయు రాదని జగచ్చంద్రుఁ డింత వాదించినను, సురేశునకు జగచ్చంద్రుని భావిపథమంతయు, విపత్కంటకకరముగనే తోఁచుచుండెను. గగూలియాయొక్క విపణపాత్రము చాలదా! జగచ్చంద్రుని రూపుమాపుటకు?

"జగచ్చంద్రా! నీయిష్టానుసారమే పొమ్ము. కాని, యనిలంఘ్యమానములగు నాపదలను మాత్రము తొలగ్గొనకుము. నీకార్యమేమగునో దానిఁ జూచుకొని తిరిగి వచ్చివేయుము."

"బాబుగారు! ధన్యుఁడను. ఇంతదూరము చెప్పినను మీరంగీకరింపరేమోయని చింతించుచుంటిని. మీయనుజ్ఞావాక్యమే, శుభశకునమైన నాభావిపథమును, కళాప్రకాశితము చేయునుగాక!"

అప్పుడొకభటుఁ డరుదెంచి, నాగేంద్రుఁడు వచ్చియుండెనని తెలిపెను. జగచ్చంద్రుఁ డాతనిని, లోనికిఁ బంపుమనియెను. సేవకుఁడు వెడలిపోయెను.

"సురేశబాబుగారు! ఆభూమివిషయము మీకేమయినఁ దెలియునా?

దానిని సాగుబడిచేయువారెవ్వరు! వారిచ్చట నివసింతురా?"

"జగచ్చంద్రా! దానివిషయము నాకుఁ గొంతవఱకు తెలియును."

నాగేంద్రుఁడు లోనికరుదెంచెను. సురేశజగచ్చంద్రులకు వందన మొనరించి యొక్కెడ నిలుచఁబడెను. సురేశుఁ డిట్లు చెప్పఁదొడఁగెను.

"మీ పితామహునివద్ద నొకఁడు పిలేఖరిగ నుండెడువాఁడు. అతని పేరు మఱచితిని."

నాగేం — బాబుగారు! గోవిందశాబా మీరనునది!

సురే — అవును. అతఁడే! మీ తాత యాభూమి నొక ఋణస్థుని వద్దనుండి కొనియెను. అతఁడు స్వలాభముకై దీనినిఁ గొనలేదు. అప్పులవలన పెనువెతలపాలగుచున్న యాతనిని రక్షింప నుద్దేశించి కొనియెను. కొన్నితరువాత గోవిందు నచ్చటికిఁబంపి, సాగుబడి చేయింపఁ బ్రారంభించెను. ఆభూమి మెట్టయేయయినను, నాప్రదేశమందు అనుకూలవర్షము గురియుటచేత, గోవిందుఁడచట గొప్ప తోటలు వేయించి, తాను, కుటుంబముతో నచ్చటనే కాపురముండుచువచ్చెను. గోవిందుఁడు గతించి పదేండ్లయినవి. అతని కిద్దఱు పుత్రులుండిరి. ఆనందచంద్, కేశవచంద్. వారే యిప్పుడచ్చటి వ్యవహారములెల్ల జూచుకొనువారు.

జగ — దానివలని రాఁబడి యెంతయుండును?

సురే — సంవత్సరమునకు మూఁడువేల రూప్యములని విజయుఁడు చెప్పఁగా వినియుంటిని.

"మూఁడువేలరూప్యములతో, సామర్థ్యముండిన నాకసమునకు సోపానములు కట్టఁగూడదా! దానిని విడవఁగూడదు." అని జగచ్చంద్రుఁడు తనలో ననుకొనినట్లును, నితరులతోఁడఁ బలికినట్లుఁగాక, ననుకొనియెను.

అంత నాప్రసంగ మాపివైచి వారిరువురు, "నాగేంద్రునితోడ,

నేమిటో సంభాషించుచుఁ గూర్చుండి యుండిరి.

*   *   *   *   *

కొంతవడికి నాగేంద్రుఁడు నిద్రపోయెను. సురేశజగచ్చంద్రులు భోజనమునకు లేచిరి.

౬

సురేశ జగచ్చంద్రులు భోజనము మొనర్చి వెలికివచ్చిరి. వీరు బయటకు విచ్చేయు సరికి సురేశుని భటులం దొకఁడు, ప్రయాణమున కశ్వమును సిద్ధ మొనర్చియుంచెను. జగచ్చంద్రుఁ డాయశ్వము కడకుఁ బోయి యధిరోహింపఁబోవుచుండ, సురేశుఁడు, "జగచ్చంద్రా! కొంచెమాగుము. ముఖ్యమగు వస్తువును మఱచి వచ్చితిని — లోనికరిగి యిప్పుడే వచ్చెదను." అని లోనికిఁ జనియెను. కొన్ని నిముసములకు రివాల్వరు రెండు నాళీకాయుధములను దీసికొని వచ్చి జగచ్చంద్రున కీయఁబోవ, నాతఁడు వలదని వారింపఁ బ్రయత్నించెను.

సురే — జగచ్చంద్రా! నీవిప్పుడు పోవుచున్న స్థలము భయంకర మైనది. ఆత్మరక్షణార్థ మాయుధము లేకుండ నట్టి చోటికిఁ బోవ నెంచుట, మంచిది కాదు. ఈ రెండు నాళీకాయుధములను గొనిపొమ్ము. ఆపత్సమయమున నవి నీకుపకరించును.

మారుమాటాడక జగచ్చంద్రుఁడు వానినిఁ దీసికొనియెను. మఱల నాతఁ డశ్వము నధిరోహింపఁ బోవుచుండ, నెచ్చటనుండియో యొక నారసము విద్యుద్వేగమున జగచ్చంద్రుని కుడిచెవికిఁ బ్రక్కగాఁ బఱతెంచి, సురేశుని గృహ కవాటకమునకు గ్రుచ్చుకొనియెను. దాని తీవ్రవేగమునఁ గలిగిన "బున్ను" మను శబ్దమున కశ్వ ములికిపడియెను. జగచ్చంద్రుఁడు గుఱ్ఱమును భటుని యధీన మొనర్చి, చని యాయమ్ముఁ దీసిచూడ, దాని కొనకొక కాగితము చుట్టగాఁ గట్టఁబడియుండెను,

జగచ్చంద్రుఁడు దానిని విప్పిచూడ నీక్రింది విధమున నందు లిఖింపఁబడియుండెను.

"జగచ్చంద్రా! ఇది రెండవ జాబు! మొదటి దానియందలి విషయములను జదివియు, నాయాజ్ఞ నుల్లంఘింప నిశ్చయించితివా! నాబోధనము సరకు సేయనైతివి! రెండవ మాఱు చెప్పుచున్నాను. నీవు నాగపర్వతముల కడకు వచ్చితివా చచ్చినవాఁడవే యని నమ్ముము. ఈపలుకులు నీకు భయము కలిగించుటకు మాత్రమే వ్రాసినవి కావు. నామాట వినకవచ్చితివా, అందలి ప్రత్యక్షరము యథార్థము కాఁగలదు. మహాభయంకరమగు విపత్ప్రవాహమునఁ బడి పోదువు. నీవచ్చటికిఁ బోఁగూడదు. దానికి ముఖ్యకారణము లున్నవి. చావవలయునని వేఱుమార్గముఁ గానక, వచ్చెదవా? రమ్ము. వచ్చి, భేతాళగిరియందలి శైలభైరవునికి బలిపశువవుగమ్ము. ఓరీ! మూఢమతీ! నామాట వినుము: అచ్చటికిఁ బోకుము. లేదా! చెడెదవు. దారుణమరణమునకు లోనయ్యెదవు.

నీక్షేమాభిలాషి"

జగచ్చంద్రుఁ డామూలాగ్రము నాలేఖను జదివెను. అతని వదనమున మఱల మందహాసరుచి మెఱుఁగుఁదీవవలెఁ బ్రత్యక్షమయినది. అతఁ డాలేఖను ద్రిప్పి చూచెను. అట, మొదటిదానియందు గనుపడిన విచిత్రముద్ర యగుపడలేదు. దానిని సురేశున కొసంగెను.

సురేశుఁ డింతవఱకు నాశ్చర్యభ్రాంతుఁడై, జగచ్చంద్రుఁ డదేక దీక్షగా జూచుచు నిలువబడి యుండెను. ఈలేఖలు రెండును జగచ్చంద్రునకేదో యాపద రానుండుట సూచించుచున్నవని మాత్ర మెంచుకొనియెను. రెండవజాబుఁ జూచిన వెనుకనైనఁ జగచ్చంద్రుఁడు నాగపర్వతములకడకుఁ బోవలదనిన నూరకుండునేమో యని యిట్లు వచియించెను.

"జగచ్చంద్రా! ఇప్పుడైన ప్రయత్నము మానుము. చూడు మీ జాబునం దెంత భయంకరముగ వ్రాయఁబడియున్నదో!"

జగచ్చంద్రుఁడు సురేశునిమాట కేమియుఁ బ్రత్యుత్తర మీయక "బాబుగారూ! ఈజాబుపై నే ముద్రయును లే దేలనో!"

"తొందరలో దగ్గఱ మా ముద్రాంకితపత్రము లేకుండుటచే, గగూలియా వేఱొక కాగితముమీఁద వ్రాసియుండును."

"గగూలి కట్లు చేయుచుటలేదు. ఈ రెండులేఖలుగూడ గగూలియా వ్రాయలేదు. అదెం దేశమునకు పోలుసు గానియుండలేదు."

"అట్లైనన్నటికిఁ గాదు. ఇదంతయు గగూలియా చర్యయే! ఇట్టి కార్యములు, ఇట్టి విచిత్రములు నాతఁడుగా కింకెవ్వఁడుఁ జేయఁజాలఁడు. అతఁడే మొదట నీకుఁ దా నెవ్వఁడైనది యెఱుకఁ దెలుపవలయునని ముద్ర గల కాగితముపై వ్రాసినాఁడు. నిన్నచ్చటికి రప్పించనో, లేక మఱియే కారణమునకో నీ కాగితముపై నీ లేఖను వ్రాసి పంపినాఁడు. అంతియ కాని, యీ చర్య యంతయు నాతఁ డొనర్చినదే!"

అప్పుడు వారలకు వెనుకనుండి యొక వికటహాసధ్వని వినఁబడి వారి నందఱఁ జలితులఁ జేసెను. వారావైపుఁ దిరిగి చూచిరి. వారికి వెనుకవైపు శతచ్ఛిద్రములయిపోయిన వసనమును ధరించి, యట్టిదే యొక చొక్కాయచేఁ బైభాగము గప్పికొనియున్న యొక వికృతాకారి నిలువఁబడియుండెను. అతఁడే పకపక నవ్వుచున్నవాఁడు. అయిదునిముసములట్లే నిలువఁబడి నవ్వుచుండి యొక్క పరుగున, నాతఁ డచ్చటనుండి పాఱిపోయెను. ఇంతలో జగచ్చంద్రుఁ డొక విశేషము గనిపెట్టెను. నాఁడు మధ్యాహ్నము తాను గవాక్షమునొద్ద జూచిన హేన వికృతవదనమునకును, నీతని వదనమునకును జాల భేదమున్నది! జగచ్చంద్రుఁడు మఱల నొక సంశయమునకుఁ జిక్కెను.

"బాబుగారు! ఇతఁ డేనా యుదయము మీరు చెప్పిన పిచ్చివాఁడు?"

"అవును, ఇతఁడే యెవ్వరైన సంభాషించునప్పుడు వచ్చుటకుఁ దార సిల్లి యున్నట్లుండి యిట్లు చెప్పి పరుగెత్తువాఁడు. ఉదయము నీవు చూచినవాఁడు గూడ నితఁడే కదా?"

జగచ్చంద్రుఁడు తన యనుమానమును సురేంద్రునకుఁ దెలిపి యాతని సాక్షిగాఁ ఖండించఁజాలని నిశ్చయముతో - 'అవు' ననియెను. కాని మనంబున నుత్పన్నములగుచున్న సంశయముల వాఁ డాపలేకపోయెను.

"ఆఁ! ఎవ్వరు! ఈతని ముఖమునకును నాతని మోమునకును నీషన్మాత్రమైనను భేదము లేదే! ఇతఁ డెవ్వరు!! ఏకార్యముకై యచటికి వచ్చినాఁడు!! అతని కంతయుఁ దెలిసినదేమి? ఈ పిచ్చివానిఁ జూచినప్పుడే, పిడుగుదాఁకునట్లై నా యొడలు ఝల్లలచి నాకు దట్టి నదే! అతఁ డెవరు!!! ఇంకేమేమో కుట్ర యున్నది. నేను వచ్చువఱకు వేచియుండి వచ్చినంతనే తన వలయమున నన్ను జిక్కించుకొన నెంచి యెవరో యీ ప్రయత్నము జరుపుచున్నారు. వా రెవరు? మహేంద్రుఁడా! ఆతఁడు కోరినది నిచ్చెనుగదా! నన్ను విపత్తుల పాలొనర్చిన వారికి మఱి లాభ మేమున్నది! ఇట మణిపురమున, నా కిష్టమును గోరు విరోధు లెవ్వరు? ఎవ్వరును లేరే!"

ప్రవహించుచునే యున్నది, యీ సంశయప్రవాహము. దానికిఁ దుదలేదు. ఎంత దూరమని వానిలోఁ బోఁగలఁడు. కొంతవడికి దాని నప్పటి కాపెను. సురేంద్రుఁడు దీర్ఘాలోచనలో మునిఁగియున్న జగచ్చంద్రుఁ గాంచి —

"జగచ్చంద్రా! ఏమిటి నీ వాలోచించుచున్నది?" అని యడిగెను.

"ఏమియును లేదు. ఈ విచిత్రరేఖలయందలి బెదురింపులఁగూర్చి యాలోచించుచుంటిని!......బాబుగారు! ఈయున్నాఁ డెవ్వరు? మీ కీతని చరిత్ర మేమైనఁ దెలియునా?"

"కొంతవఱకుఁ దెలియును. ఇతఁ డీయూరికి వత్సరముక్రిందటనే

వచ్చెను. అంతకుమున్నెచ్చటనుండెనో యెవరికిని దెలియదు. ఎవ రేమి యడిగినను నీ కిచ్చు ప్రత్యుత్తర మా విస్మితహాసమే! రెండు నెలల క్రింద బదరపురమునుండి యొకఁడు డిచ్చుటకై వచ్చియుండెనఁట. ఆతఁడు వీనిని బదరపురవాసిఁ గా గుర్తించెనఁట. ఆతఁడు చెప్పిన దని, వీని చరిత్ర మీ యూరియందుఁ గొందఱు చెప్పుచుండఁగ విని యుంటిని. బదరపురమున వాణీనాథుఁడను నొక వర్తకుఁ డుండెను. ఆతఁడు కలకత్తానుండి వస్త్రములు కొనితెచ్చి బదరపురి పరిసర గ్రామాదులయందు వాని నమ్ముకొనుచుండును. రెండు సంవత్సరముల క్రిందట వాణీదాసుఁ డొక గ్రామమునకుఁ జని తిరిగి వచ్చుచుండ మార్గమధ్యమున నొకఁడు నిస్పృహుఁడై పడియుండెను. తొలుత వానిఁ జూచినప్పుడు వాణీనాథుఁడు వాఁడు మృతినందె ననియే తలం చెను. కాని దగ్గఱకుఁ బోయి పరీక్షించిచూడఁ గొంచె ము నూపిరియున్నట్లు తెలిసికొని యసహాయుఁడై పడియున్న వాని నట విడిచిపోవ మనస్సురాక కొందఱ సహాయమునఁ దన యింటికిఁ గొనిపోయెను. తగు పరిచర్య లొనర్చెను. కొంతవడికి వానికిఁ దెలివి వచ్చినది గాని తోడనే ప్రబలమైన జ్వరము వచ్చుటచేత నా యూర వాసియైన దేవదాసుఁడను వైద్యునిచే మందిప్పించవలసి వచ్చినది. చాల శ్రద్ధతో సకలోపచారము లొనర్చి యా జ్వరము తగ్గునట్లు చేసిరి కాని యాతఁడు పిచ్చివాఁడై పోయెను. జబ్బు నెమ్మదించినతరు వాత నట నిలువక పాఱిపోయెను. ఆతఁడే యీ యున్మాదుఁడు. వాణీదాసునకుఁ జిక్కుటకు పూర్వ మీతఁ డెవ్వరో, యేల మార్గ మధ్యమున జ్ఞానము దప్పి పడియుండెనో యెవ్వరికిఁ దెలియదు. "ఇదియే యా బదరపురవాసి యీ యున్మాదుఁగూర్చి చెప్పిన దాని సారాంశము."

జగ — 'ఈతని కిప్పుడు మందిచ్చిన దేవదాసుఁడు నా తండ్రి గారికి రఘునాథుఁడు రానప్పుడు మం దొసగిన యాతఁడేనా?

సురే — ఏమో! అంత నిశ్చయముగఁ దెలియదు. ఒకవేళ సంభ
యుండవచ్చును.

జగ — సురేశబాబుగారూ! ఇంక నేను సెలవుఁ గైకొనెదను. కొన్ని దినములలోనే మిమ్ముఁ గలిసికొందునని యెంచెద.

సురే — సరియే! పోయినచోట ముందువెనుక లారసి ప్రవర్తింపుము.

జగచ్చంద్రుఁడు వీడ్కొని యశ్వము నధిరోహించి వెడలిపోయెను.

... ...

జగచ్చంద్రుఁ డింకను మణిపురమును దాఁటలేదు. సుమారాతఁ డొక మైలు వచ్చియుండును. ఇంకను నశ్వము పరుగిడుచునే యున్నది. అప్పు డాతనికి వెనుక నెవ్వరో పరువిడి వచ్చుచున్నట్లు జగచ్చంద్రుఁ డనుమానించి వెనుదిరిగి చూచెను. ఇంతకుమున్ను తాను చూచిన యున్మాదుఁడే రోజుచు, పరుగున వచ్చుచుండుటఁ గాంచి యాతఁ డశ్వము నాపెను. పిచ్చివాఁడు పరుగిడుచు వచ్చి "అయ్యా! నీ వెవ్వరు?" అని జగచ్చంద్రుని యడిగెను.

జగ — "నా పేరు జగచ్చంద్రుఁడు. నేను విజయచంద్రబాబుగారి కుమారుఁడను."

పిచ్చి — జగచ్చంద్రుఁడా! బలే! బలే! బాగుగాయున్నది పేరు! ఏం చంద్రుఁడు ... జ ... జచ్చంద్రుఁడా!... కాదు కాదు. గచ్చంద్రుఁడు. ఔను. గచ్చంద్రుఁడే. నా పేరుగూడ నటువంటిదే యుండిన నట! ఏదో ఋంద్రుఁడు - సరిగ జ్ఞాపకమునకు రాలేదు! ఏంబంద్రుఁడు ......మా......ఆఁ అవు నవును. హేంద్రుఁడు! నీ వెక్కడికి పోవుచున్నావు?

జగ — అది యట్లుండనిమ్ము! నీ వెవ్వరు? చెప్పుము.

పిచ్చి — నేనా! చెప్పితినిగా నాపేరు హేంద్రుఁడు అని. నేను పుట్టినది యేయూరో సరిగ తెలియదుకాని, యీయూరని చిన్నప్పు డెప్పుడో చూచినట్లున్నది!

జగ — నీవు నావెనుక నిట్లు పరుగెత్తుకొనివచ్చితివేల !

పిచ్చి — నిన్ను చూడగనే, నీ వెవరో యడుగవలెనని యొక యోచన తోఁచినది. అడిగి తెలిసికొన్నగాని మనసు నిలుపలేదు ....

సరే — నిన్నుగూడ చూచినట్లున్నది. ఎప్పుడో! ఎక్కడనో!... తెలియలేదు. నీ వెప్పుడైన నన్నుఁ జూచితివా?

జగ — చూచినట్లు జ్ఞాపకములేదు. నే నెవరినో తెలిసికొనుటకా నీవు పరుగెత్తుకొని వచ్చితివి.

పిచ్చి — హో హో ! నన్నెక్కడఁ జూచావో చెప్పలేనివాఁడవు మాటలాడుట యెందుకు ?

జగచ్చంద్రుఁడాతని నీసంభాషణము జరుగుచున్నంతకాలము తదేకదృష్టిఁ జూచెను. ఏమనుకొనియెనో తెలియదుకాని యాశ్చర్యమునుండి యపతరించెను. పిచ్చివానికడ కరిగి దగ్గఱ నిలిచెను. ఆతని కుడిచేయిఁ బట్టుకొని, దానిపైఁ బేరుసగమాత్ర మున్న కంచుకమును బైకెగఁద్రోయబోవ నాయున్మాది యొక వికటహాస మొనరించి "నన్నుఁ దాకకుము! నీవెవ్వరు-నేనెవ్వరు, నన్నంటుటకు తాఁకెవవు. హోహో - చంద్రుఁడా — గింద్రుఁడా అనుచు, మఱల నొకవ్యగ్రదృష్టి జగచ్చంద్రుని పట్టునుండి యొక యూపునఁ జేయి విడిపించుకొని పాఱిపోయెను. జగచ్చంద్రుఁ డచ్చటనే నిలువఁబడి యాతనిఁ జూచుచుండెను.

"ఎంతపిచ్చియూహ! లోకమున నొకనిఁ బోలినవారు వేరొకరుండరా? ఈతఁడెవరో! — హేంద్రుఁడా యాతని పేరు? పిచ్చివాని పలుకుల కర్థమేమున్నది? ఎంతపిచ్చిగానున్న దా వేషముగూడ" అనుకొనుచు, జగచ్చంద్రుఁడు మఱల నశ్వము నధిరోహింపఁ బోవుచుండఁ బ్రక్కన నెక్కడనుండియో యొక హాసధ్వని వినఁబడెను. జగచ్చంద్రుఁడావైపు తిరిగి చూచెను. అచటఁ గనఁబడిన దేమి? సురేశునింటియందు గవాక్షముకడఁ గనఁబడిన వికారవదనమే. జగచ్చంద్రుఁ డులికిపడి — యూ

[illegible] గాంచి [illegible] [illegible] [illegible]. [illegible] ముఖమును [illegible].

కొంతవడి [illegible] [illegible] [illegible] [illegible] [illegible] వాయు [illegible] నాయొక్క [illegible] [illegible] [illegible].

౫

అస్తంగతుండగు [illegible] [illegible] [illegible] [illegible] ఛాయలు [illegible] [illegible] [illegible] [illegible] గతుండై [illegible] [illegible] [illegible] [illegible] [illegible] టకొం [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] కొంతసేపటికి [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] తమ [illegible] [illegible] [illegible] [illegible] [illegible].

[illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] కొనుచుం [illegible] [illegible] [illegible] [illegible] త్రిమూర్తులు [illegible] చుండిరి. [illegible] [illegible] [illegible] [illegible] [illegible] వచ్చిన [illegible] నకు [illegible] [illegible] [illegible] [illegible] నిచ్చుచు [illegible] [illegible] [illegible].

నాంటి [illegible] [illegible] [illegible] [illegible] విద్యుత్కాంతి ప్రసరణము [illegible] [illegible]. అపరరక్తగుణిలోకనంబుల బ్రహ్మాంతర్జ్యోతిస్సమును [illegible] [illegible] చంద్రకరుని [illegible]

నముందును నానందమే. అహస్పతిగగన పశ్చిమాశాకాంతప్రణయ ముద్రిత వదనమునందును నానందమే. ప్రసన్నమై యున్న వనానిలుని సుసంచారకేళియందును నానందమే! సురభిళోత్ఫుల్లప్రసూనముల వైశద్యమునందును నానందమే. లతాకాంతల గ్రీవాభంగములందును నానందమే. శకుంతముల కాకలీరుతంబులందును గర్వితుల స్వీయనివేశ వీధి జనితాహ్లాదనవ ములందును సకలదిశలందును యచ్చటచ్చట నరుణవర్ణాంకితజలధరఖండములు ల్లొబడిన వినీలవస్త్రధారిణి యగు సం యాంకాలలక్ష్మియందును గూడ నానందమే నటించుచుండెను. ఇంత యేల నాటి సాయంకాలమునందు ప్రతిస్థలమును ప్రతివస్తువును నానందముద్రితమైయుండెను: కాని,—

కీచకాటవికి దక్షిణమున గ్రోశముదూరములో నొక తోట యున్నది. దానియం దొక గృహముగలదు. ఆతోటకు వెనుకభాగ మున నాలు పూరిండ్లు గలవు. ప్రస్తుత మా తోటయందలి యింటి వాకిట నొక తరుణి నిలువబడియుండెను. ఆమెమాత్ర మేలనో నాటి సంధ్యాకాలమున నిస్సంకితమైయున్న యానందమున కన్యాసక్త శోకవివశయైయున్నట్లు గోచరించుచుండెను.

ఆతరుణి వయస్సు పదునెనిమి దేడులుండును. అప్పుడే యౌవన ప్రాదుర్భావమై సొంపుదనర నామెయంగకములన్నియు నాకృతిగొన్న సౌందర్యవిభవములై యొప్పారుచుండెను. పున్నమనాటి నిండు చందురుని హసించు సుందరవదనారవిందమున కామె వాలుంగనుదోయి యొకవింతయందము గలిగింప మొగముపై ముసరి యాడు వినీలకుటి లాలకములు ఆ యందమును బరిపూర్ణ మొనరించుచున్నవి. ఆ కన్నుల నుండి వెడలుచున్న చూపులయందొకతీరైన శాంతభావము గర్భితమై యుండెను. ఆమె నిబిడకేశదామము శ్యామలజలధరమును దలపించు చుండ నందుత్పన్నమయిన మెఱపుతీగవోలె నామె మెఱయు చుండెను.

ఇప్పుడామె చూపులు కీచకాటవినుండి వచ్చు మార్గముమీఁద నిలిచియున్నవి! అప్పుడప్పుడు వదలుచున్న నిట్టూర్పు లామె నిరీక్షించుచున్న వస్తువామార్గమున గనఁబడలేదని తెలియఁజేయుచుండెను. ఆమెచూపు లామార్గముననే కొంతదూర మరిగి విఫలములై మఱలుచుండెను.

ఇంతలో దూరమున గుఱ్ఱపుడెక్కల ధ్వని వినవచ్చెను. ఆయువిద యాధ్వని వినవచ్చుచున్న దిక్కునకు చంచలవీక్షణములఁ జూడఁ దొడఁగెను. ఆవచ్చునతఁ డెవ్వరు? మనమున నాశ్చర్యము తాను నిరీక్షించు నాతని యాతఁడెక్కి వచ్చు హయరింఖాధ్వని యేమో యని యొకయాశ యంకురింప నామె వదనమున గొంచెముగ సంతోష చిహ్నము లగుపడియెను.

ఆమె యట్లు చూచుచుండ గొంతదూరమున నొక యశ్వారోహి తమ మందిరాభిముఖుఁడై వచ్చుచుండుట దెలిసికొనియెను. కొంతవడి కానూతనాగంతుఁ డుద్యానవనముఁ బ్రవేశించి యట నాయశ్వమునుండి దిగి దానిని బ్రక్కనే మేయనిడిచి యామెకడ కరుదెంచి యించుక దూరమున నిలుపబడి "ఆనందచంద్రు గృహంబున నున్నాఁడా?" యని యడిగెను.

ఆయువతి "లేదు. మాతండ్రియుఁ బినతండ్రియు నిరువురు నాగపురమున కరిగిరి. ఇంతవఱకును రాలేదు."

"ఎప్పు డేఁగిరి?"

"నిన్న యుదయమున మాతండ్రి యరిగెను. మాపినతండ్రి మణిపురమునుండి వచ్చుచు మార్గముననే మాతండ్రిని గలిసికొని యటనుండి యిరువురు నాగపురికిఁ జనిరట."

"వారు మఱల వచ్చున దెప్పుడైనదియుఁ దెలియునా?"

"నేటియుదయముననే వచ్చెదమని చెప్పిపోయిరి: కాని యింత

పట్టణమునకు రాలేదు. ఎప్పుడువచ్చెదరో!”

“నీ వానందచంద్రుని పుత్రికవా”

“అవును.”

ఆ మాటాలించుచుండె జగచ్చంద్రుండే! జగచ్చంద్రుని మానసంబును, నాసుందరిని వీక్షించినతోడనే యొక విచిత్రమైన [illegible] ముదయమయ్యెను! ఆయువతిశిరోమణి సౌందర్య[illegible] [illegible]లు తనివి తీరఁ గ్రోలుచుండెను. [illegible] [illegible] [illegible], ద్రావిళ్లో [illegible]చుండెను. [illegible] [illegible]. [illegible] నాతరుణి యందమున నొక్కొక్క[illegible] [illegible]చుండెను.

ఆయువతియు నాతనిదెస యొకసారి చూచెను. వారిరువురి వీక్షణములును మధ్యమున [illegible] మైత్రిఁ గల్పించుకొనఁ గాంతనే ప్రాక్కడనే యుండి కలిసెను. ఆమె [illegible] గలపించుకొనియెను.

కామినుల వీక్షణములయందు దొకత్తైన సమ్మోహకశక్తికలదు. దానిని వ్యక్తీకరింప వాఙ్ప్రపంచముచే గాఁజాలదు కాని యా వీక్షణములందలి కుసుమకోమలత్వమునో వజ్రకర్కశత్వమునో చవి గొన్నవారి యనుభవముచేత వ్యక్తీకరింపవచ్చును. కఱకుఁదనము నందును మెత్తఁదనమునందును గూడ నవి సమ్మోహకములే. ఏవ్విధమునైన నవి యితరుల నాకర్షింపఁగలవు. ఆ సమ్మోహకశక్తి యొక్క స్వరూపమే మదనుఁడు. ఆతనియస్త్రశస్త్రాదిపరికర మంతయు గామినులందే కలదు. వాని నూఁతగొనియే యాతఁడు జగజ్జయ మొనరించెను.

జగచ్చంద్రుఁ డాసుదతి వీక్షణపాశములఁ దగుల్పడియెను. ఆ విలోకన మాలిక లాతని నాకర్షించినవి. అటనుండి యడుగుటకునైన గాళ్ళాడలేదు.

“కొంచెము మంచినీళ్లిచ్చెదరా?” అని యా నెపముమీఁద కొంతసేపట నుండనెంచి జగచ్చంద్రుఁడా కాంత నడిగెను.

ఆమెయు లోనికి శీఘ్రముగఁ గొనితేఁబోయెను. జగచ్చంద్రుఁడా యింటివాకిట వైచియున్న బల్లపైఁ గూర్చుండెను. ఆమె మంచినీరు గొనివచ్చి యాబల్లపై నుంచెను. జగచ్చంద్రుఁడు దాహము దీర్చుకొని యిట్లు ప్రశ్నించెను.

“నాగపురమునకు నేను నిక్కముగ వెడలితిని. ఇప్పుడుగాని మార్గములోగాని అందఱకేశవులు కనఁబడలేదు. నేను వచ్చినది కీచకాటవిఁ జొచ్చి కొనిపోవు మార్గము. అటుగాక నాగపురమున కింకేదైనఁ ద్రోవ యున్నదా?”

“ఉన్నది. కీచకాటవిమధ్యమునఁ బోవు మార్గము [illegible]. అది చాల దగ్గఱ. కాని యా మార్గమున దొంగలభయ మధికము.”

“మీనాక్షియుఁ గేశవుఁడు నేమార్గమునఁ బోయిరో తెలియునా?”

“తెలియదు.”

“సరిసరి! నేను విజయచంద్రుని కుమారుఁడను. జగచ్చంద్రుఁ డనువాఁడను. మఱల నేను కీచకాటవిమధ్యమునఁ బోవు మార్గమున నాగపురమునకుఁ బోయెదను. వారు మార్గమధ్యమున నాకగపడిన మంచిదే. లేక వా రింటికి వచ్చినపిదప నా సంగతితో నా రాకఁ దెలిపి మరల నెప్పుడయినను వచ్చెదననియు నింటనే యుండుమనియు దెలుపుము.”

“అట్లె చెప్పెదను.”

జగచ్చంద్రుఁడు లేచెను. మెల్లగ నశ్వముకడకు నడిచి నిలిచెను. ఒకసారి యా యువతిదెస మోహపూరితవీక్షణములఁ బఱపెను. ఆమె తలవంచుకొని వాకిటనే నిలువఁబడి యుండెను. అశ్వము నధిరోహించి యతఁడు కీచకాటవివైపుఁ బోయెను.

ఆమె లోపలి కరిగి తలుపు మూసికొనెను.

౬

మణిపుర సంస్థానమున కుత్తరపుశ్ర నిఱువదిమైళ్ళ దూరమునఁ దూర్పు పడమరలుగా నాగపర్వతములు వ్యాపించియున్నవి. వానికి దక్షిణము నాగపురము గలదు. అదియొక చిన్న జమీందారి.

నాగపుర జమీందారు అక్షయవసుమిత్రుఁడు. ఈతని పాలనమున నిఱువదియైదు గ్రామములు గలవు. ఆ జమీందారునకు మూఁడులక్షల రాబడియును గలదు. నాగపురమునందే యక్షయవసుమిత్రుఁడు వసించుచుండెను.

ఒకనాఁడు స్వాధ్యాయమునం దొక గదియందు అక్షయవసుమిత్రుఁ డాసీనుఁడై యెదుటనున్న కొన్ని పురాతనసంపుటములలో నొకదానిం దీసి చదువుచుండెను.

అక్షయవసుబాబు యేఁబదిసంవత్సరములు గడచినవాఁడు గాని యాతని జూచిన నంతవయస్సు చెల్లినవాఁడుగా గనుపడఁడు. ఉన్నతఫాలభాగమును దీర్ఘములయి విశాలములైన నేత్రములును కళాభాసితమగు నాననమును నున్నతకాయమును నాతని యుత్తమవంశీయునిఁ దెలుపుచుండెను.

అక్షయవసుబాబు సతీమణి యిఱువదేండ్లకు ముం దొక కుమారుని గని మరణించెను. అదిమొదలు లక్షయుని మేనయత్త వారి యింటియందే యుండి గృహకృత్యముల విచారించుచుండెను. ఆతని కుమారుఁడు చూడాపాధనవసుమిత్రుఁడు. మన కథాకాలమున కతఁ డిఱువదేండ్ల తరుణుఁడై యుండెను.

అక్షయబాబు అట్టి ప్రాగ్రంథమునందలి పుటల నొకదాని వెనుక నొకటి తిరుగవైచుచుండెను. కొంతసేపటి కాతఁ డొక పత్రమునం దున్న విచిత్రవిషయ మేదో కని దాని నతిజాగ్రత్తమైఁ జదువఁదొడఁగెను. ఒకపరి బూర్తిగాఁ జదివెను. మఱల నీక్రింది విధమునఁ జదువఁ బ్రారంభించెను.

"అక్షయా! నేనిప్పుడు వ్రాయుచున్న యీ విషయ మంత్యంత రహస్యము. దీని నెవరికిఁ జెప్పఁగూడదు. ఎవరికిని జూపఁగూడదు. దీనియందు వివరించియున్న విషయములెల్ల జక్కఁగఁ జదివి యావిధమునఁ బ్రవర్తింపుము. ఈవిషయము మా పూర్వులనుండి పుత్రులను గుమారులను వరుసగాఁ దెలియుచు వచ్చుచున్నది. అదియు నేమన–

నాగపురమునకు సమీపమున నాగపర్వతములు గలవుగదా! అందుఁ దూర్పున భేతాళగిరి యను నొక శిఖర మున్నది. దానియందు మన పూర్వికులలో నొక్కరగు భీమదేవమహాప్రభువు కొన్ని కారణాంతరములచే నెనుబదిలక్షల విలువగల ధనభూషణములు, దాఁచి యుంచెను. అవి పెట్టెలయం దుంపఁబడి యున్నవి.

ఆ నిధియున్నచో టొకసూత్రము వలనఁ దప్ప వేఱువిధముగఁ దెలియుటకు వీలులేదు. అదియుండు చో టెవరికిని తెలియ సాధ్యముగాదు. దానిఁ దెలియఁదగు సూత్ర మీ క్రింద వివరించెదను.

నాగపర్వతములకు దక్షిణముగ నాగపురమునకుఁ దూర్పుననైదు మైళ్ల దూరమునఁ గీచకాటవి యున్నది. దానిమధ్యమం దొక శిథిల మందిర మున్నది. ఆమందిరప్రాంతమున నొకసరోవర మున్నది. ఆ సరోవరమునకుఁ జుట్టును శిలాసోపానము లున్నవి. ఆ జలాశయమునకు దక్షిణ దిక్కునఁగల సోపానములందు నీటి నానుకొనియుండు మెట్టునకు మధ్యమున నొక చలువఱాయి యున్నది. దానికి నేరుగఁ గ్రింద నాల్గడుగుల లోతున నొక చతురస్రాకారమందున్న రంధ్రములో నొక యిత్తడిపెట్టెగలదు. ఆ పెట్టెలో నుక్కుతోఁ జేయఁబడిన విచిత్ర మగు కంకణ మొకటి యున్నది. ఆ కంకణముపై ననేకచిత్రములున్నవి. ఆ చిత్రములను వరుసగఁ బరీక్షించిన నావల చేయవలసిన పని నీకుఁ దెలియఁగలదు. మఱియు నా పెట్టె మూఁతయందు నొక కాగితము పదిలింపఁబడియున్నది. ఆకాగితము మాత్రము శిథిలమై పోవునుగాన

వచ్చి ఉన్నను క్రొత్తతారీఖునకు నందగినిర్ణయములను వ్రాసియుంచ చుండవలయు.

ఆవిధి యెప్పుడు నుంచబడిన కాగితము తెలిపెను. కాని ఉంచ బడిన పెద్ద నూరు సంవత్సరముల వరకును దాని విప్పగ రాదని శాసింపబడినది. ఆ యాజ్ఞానుసార మిప్పటి కేబది సంవత్స రములు పోయినవి. జగతీంద్రుడు వ్రాసియుంచిన నిర్ణయదేశముల యంతరము దాని విప్పి చూచి యుపయోగింపవచ్చును. నీ యాయు ష్కాలములోపల నిర్ణయదేశములు నీకు చేరిన యెడల నీవుగాని వచ్చి యుపయోగించుము.

ఇట్లు జగతీంద్రుడు”

శ్రావణ బ॥ 7. గడచెను వారిని చదివినపుడు దక్షిణారణ్యవాసి తల్లి పోయెను. అతని చేతబడిన నీ వస్తువులకు నాయన తెలిపినదంతయు వినలేదు. తనపూర్వుల తపనిని నొక వానిని గుప్తముగ నుంచి యుంచుట జగతీంద్రుని వంశముతో నెప్పు డును చెప్పియుండలేదు. అతనికి దాని నిర్ణయములను తెలిసి కొనవలయునని తోచెను.

దానియందు చెప్పబడిన ప్రకార గ్రంథమునందు నిర్ణయ యము జగతీంద్రుడు వ్రాసి యుంచిన దేశములు చూడ యని లెక్కించెను. ఇంతవరకు తెలిసిన దేశములు గడచినవి. ఇక దానిని స్వాధీనము చేసుకొనుట కాటంక మేమియు లేదు. నుండవలసినది జగ దా కంకణముగ చేయవలయును. అందుకు కొన్నిదినములు బహు కాలము పని యొచ్చెనుగాని మూడావరకు కానిపనియము దేనిని గూర్చి తెలిపెడి యుత్తరమును తెరచి తోడనే కుమారుని పిలువనంపెను.

మూడావర్తము తండ్రి తనకు దెలిపి నానుసంధించెను. అక్కడి బాబు కుమారునితో నా గది తాళపుచెవి బదులుగ నాయన నియోగించి

యాతఁ డట్లొప్పెర తీసవాత తన కడఁ గూర్చుండఁ బెట్టుకొని యా పురాతన సంపుటము [illegible] లిఖితగ్రంథమును జూపి చదువు మనియెను. చూడాధ్రునుఁడు, దాని [illegible] జదివి [illegible] సాశ్చర్యమానసుఁడై —

“దీని నిదివఱకెప్పుడు చూచితిరా?” అని యడిగెను.

“చూడాధ్రునా! ఇప్పుడే చూచితిని. ఈ నిధి విషయమే యింత వఱకు నాకుఁ దెలియదు. నిగూఢ విషయము లన్నియుఁ జూచితిని. ఇప్పు డాదాని స్వాధీనము చేసికొనవలెనో నాకు దోఁచక నిన్ను బిలిపించి తిని. మనమిప్పుడెట్లు ప్రవర్తించిన బాగుండును?”

“మీకుఁ దెలియని విషయము నాకు మాత్రమేమి దెలియగలను. నా కన్న ననుభవజ్ఞులగు మీరు చెప్పుటకన్న సత్తమోపాయము నే నేమి చెప్పగలను. ధనము ముందాకంకణము మన స్వాధీనమొనర్చి కొనిన మంచిదని నాకుఁ దోఁచుచున్నది.”

“నాకును నాలోచనకుఁ దట్టినది. అందుల కెవరిని బంపుదమా యని యోచించుచుంటిని. అది యుంచఁబడియున్న స్థల మతి భయం కరమైనది: ఈ విషయ మత్యంత రహస్యము.”

“నేను నమ్మకమగు సేవకుఁడు వారలా లుండరే గా? అతని బంపు దమా? ధైర్యసాహసము లుగలవాఁడు. నమ్మదగినవాఁడు. మన కొఱకై ప్రాణములైన విడువఁగలఁడు.”

“చూడాధ్రునా! వాఁడెంతయో నమ్మకము గలవాఁడే అయియున్నను నిట్టివిషయ మెవ్వరికిఁ దెలుపరాదు. అంత జాగ్రత్తగ నుండుటచేతనే యానిధి యింతకాల మచ్చట సురక్షితముగ నిలయుండదని తెలిసికొనుము. ఎంతనమ్మకము గలవాఁడైనను నీ విషయముఁ దెలుపఁగూడదు. వాడుగా మన కంకణము చేసికున్నను నొక నోటినుండి యింకొక నోటికి పోవుట స్వాభావికము. అట్లే యొకటి రెండు దినములలో

నందఱు నా నిధివిషయముం దెలిసికొందురు. వారియం దెవ్వరైన దాని నపహరింపఁ బ్రయత్నింపవచ్చును గాదా? అట్లు గాకున్న కర్ణాకర్ణిగ నిది గగూలియాకుఁ దెలిసెనేని మన కది దక్కదు. ధనమన్న నెవరి కాశ జనింపదు. ఒక కంకణమూలమున నంత పెన్నిధి స్వాధీనము గానుండ నెవ్వఁ డూరకుండును? ఆ కంకణము మన స్వాధీన మగునంత కీ విషయము రహస్యముగ నుండవలయును."

"అట్లయిన నేఁడిది తీసికొనివచ్చెదను."

"నీవు పోవుటయే మంచిది. కాని యాప్రదేశ మతి భయంకరము. గగూలియా పొంచుకొనియుండునది యచటనే యని వినుచున్నాము గదా! కావున నీవచ్చటికిఁ బోవుదువన్న నాకు భయముగ నున్నది."

"తండ్రీ! ఏ భయమును లేదు. మన యుత్తమాశ్వము నెక్కి పోయెదను. చోరుల జాడ తెలిసిన దాని సహాయమునఁ దప్పించుకొని రాఁగలను. మనోవేగమును మించు దాని ధాటి నన్నెట్టియాపదకును లోనుగాకుండఁ గాపాడఁగలదు."

"సరేనా! ఈవిధమే రహస్యముగ సరిగి యా కంకణముఁ దెమ్ము. మన మాలసింపరాదు. 'ఆలస్యాదమృతస్య విషమ్' గదా! కీచకాటవియందు నీ కేదేని విపత్తు సంభవించునని శంకామాత్రమైనను దోఁచినచో నటనుండి వచ్చివేయుము. ఇటువంటి ధననిధులు వేయి యైనను నా కొక్క కుమారుఁడు గాఁజాలవు."

"నేఁటిమధ్యాహ్నమే పోయెదను."

వారిరువురు నట్లే కొంతకాలము కూర్చుండి యావిచిత్రనిధి విషయము మాటలాడుచుండిరి. పిమ్మట చూడామణుఁడు ప్రయాణసన్నద్ధుఁడగుటకై లోనికిఁబోయెను. అక్షయుఁ డింకను నచ్చటనుండి యాపురాతన సంపుటములను జదువుచుండెను.

ఆతఁడు మఱియొక పుస్తకము దీసి జదువుచుండ నందును నేదేని

విచిత్రవిషయము గనబడెనేమో తెలియదు గాని, హారానందుఁడా ! ఎంతదారుణమగు కృత్యము !

అంసుచేతనేనా యీ యుత్తమవంశ మంతరించినది ! ఆహా దైవ మాయ! పాపఫల మప్పుడే యగుపడునుగదా; ఎంత యుత్తముఁడు మహాదేవుఁడు! తన కుమారుఁ డొనర్చిన యకార్యఫలముఁ జూచి దేశాంతరుఁడైనాఁడు! ఎంతటి శాంతభావము! ఈవృత్తాంతము నాకుఁ దండ్రిగారు తెలుపలే దేలనో! అవును! ఇంతటి దుర్వృత్తాంతమును దానుగా, దెలుపనేల యని యెంచియో కాఁబోలు, నీ గ్రంథము నందు వ్రాయించిరి. హారానందుఁ డేమయ్యెను? .....

అని యింక నేమేమియో చింతించుచు నక్షయుఁ డటనే కూర్చుండి యుండెను.

౨

కీచకాటవి నాగపర్వతములకు దక్షిణమునఁ బడి చదరపుమైళ్ల వైశాల్యముగల భూమిసంతయు నాక్రమించుకొనియున్న యొక భీకరారణ్యము. అది దక్షిణమున మణిపురసంస్థానమునకును, నాగపర్వతములకుఁ దక్షిణమున నంటుకొనియున్న నాగపురజమీందారికిని మధ్య నున్నది. ఆ రెండుపురములకును రాకపోకలు యరణ్యామధ్యమునుండియే జరుగుచుండును. కాని, కొంతకాలముక్రిందట గగూలియా యను ప్రసిద్ధచోరుఁడు తనగుంపుతోఁ గూడి మానవధర్మశాస్త్రమునుండి తప్పించుకొనుట కాయడవిఁ జేరెనని యాపురములయందొక వదంతి పుట్టినది. ఆవదంతికిఁదోడుగా నా యరణ్యమునందుఁ జనిన పథికులు భయంకరహత్యలకు, దారుణాపదలకు, విచిత్రకార్యములకును లోనయి బాధపడుట యొకటిరెండుమాఱులు జరిగినందున మనకథాకాలమునఁ బట్టపగలుసైతము నెవ్వరు నాదారిఁ బోకుండిరి. కీచకాటవిఁ జుట్టుకొని

పోవు వేఱొకమార్గమేర్పఱచుకొని, యూదారినే ప్రయాణములు సలుపు చుండిరి. అట్లు జాగ్రత్తపడియు, నా యరణ్యమున జరిగిన హత్య లసంఖ్యాకములు: అచ్చట జరిగిన రక్తవిప్లవ మపూర్వము. ఆ హత్యల కన్నిటికి గంగాలికూటమే కర్తయై యుండునని చెప్పుకొనుచుండిరి.

గగనమునంటుచున్న శాఖోపశాఖలచేతను, వానినల్లుకొనియున్న కంటకావృతములగు తీఁగలచేతను, ఒప్పుచుండ సూర్యుఁడు చొరలు వాగియున్నను దెప్పరమైనంత దట్టముగఁ బెరిగిన పెనుమ్రాకుల చేతను దుష్ప్రకంటకావృతములై, పిట్టకేని చొరరాని ముండ్లపొదల చేతను, రెండుమూఁడడుగు లెత్తు గడ్డిచేతను, నిండి సూర్యరశ్మి యన్న నెట్టిదియో యెఱుఁగని యా యరణ్యమున నెట్టి మారణకేళి జరిగినను, భగవత్స్వరూపుఁడగు సూర్యభగవానునకే తెలియరానప్పు డితరుల కెట్లు తెలియఁగలదు!

ఒకనాఁటి మధ్యాహ్నము కీచకాటవి మధ్యమునఁబోవు నాగపుర మార్గమున నొకఁ డరుగుచుండెను. ఆతఁడు వంగదేశీయులు ధరించు నుడుపుల ధరించియుండెను. ఆతని చేత నొక లావైన చేతికఱ్ఱ గలదు. ఆతఁడు బలిష్ఠుఁడై యుండెను. సుందరుఁడని చెప్పుటకుఁ దగినంత రూప సౌష్ఠవవిలాసాదులు లేకున్నను, నాతనిఁ గురూపి యనిమాత్ర మను టకు లేదు. ఆతని వయస్సు నలుబదివత్సరము లుండవచ్చును.

ఆతఁ డట్లామార్గమునఁ గొంతదూర మరుగగనే దూరమునుండి యెవరో యశ్వము నధిరోహించి వచ్చుచున్నట్లు వాని గిట్టలశబ్దము విన వచ్చెను. ఆతఁ డటు చూచెను. రెండు నిముసములలో నిరువు రాశ్వికులు పవనవేగమున నట కరుదెంచిరి. మన పథికునిఁ జూచి తమ హయముల నాపిరి. ఆ యిరువురాశ్వికులయం దొకఁ డితనితో నిట్టు లనియెను.

"ఆనందా! నేను వచ్చులోపలనే నాగపురమునకుఁ బ్రయాణ

మైతివా? నే నీదినము వచ్చెదనంటినే? అంతమాత్ర మాగఁజాలక పోయితివా? తొందరపడి నీవు మాత్ర మట సుస్థిరముగ నున్నావా?"

ఆనం — కేశవా! ఉదయమున వచ్చెదనంటివి. అప్పటినుండి యింత వఱకు వేచియుంటిని. ఇఁక నీవు రావని తలంచి నాగపురమునకు బయలు దేరితిని. అంతమాత్రమునకే నీ విట్లు విసుగుకొనుచున్నావా? మాట లాడవలయునా? ఈతొందర నీకెప్పుడు నుండునదియే కదా!

కేశ — ఆనందా! ఏమో యంటివి పోనిమ్ము: ఇప్పుడు నాగ పురమునకేలా పోవుట?

ఆనం — అచట శీఘ్రముగాఁ జని, శాంతబాబు చేయవలసిన ధన మును దేవలయును. మణిపురమునకు రేపు పోవలయును.

కేశ — ఆఁ! పోయినట్లే యున్నది! మణిపురమున కెందుకు నీవు పోవుట! ఇఁక మనము మణిపురమునకు పో నవసరము లేదు.

ఆనం — ఏల?

కేశ — మార్గమునఁ జెప్పెదను" అని, తనతోటి యాశ్వికునితో "ఒరీ! మాధవా! నా యశ్వమును గూడ నీతోడఁ దీసికొని పొమ్ము! నేను నాగపురమున కరుగుచున్నాను." అని యశ్వమునుండి దిగియెను.

మాధవుఁడు గుఱ్ఱమును గూడఁ దీసికొని వెడలిపోయెను.

అంత నానంద కేశవులు, నాగపురమువైపు నడువఁ దొడఁగిరి.

కేశ — మణిపురమునఁ బది దినముల క్రీవల నడచిన దంతయు నెఱుఁ గుదువా?

ఆనం — నాకెట్లు తెలియఁగలదు. నీవే చెప్పుము: ఏమిజరిగినది. విజయచంద్రబాబుగారి దేహస్థితి యెట్లున్నది?

కేశ — దేహస్థితి యెట్లుండు టేమున్నది. ఆయన మరణించి పది దినము లయినది.

కనక — సంతోషము. చెప్పుము.

కేశ — ఒక సంవత్సరమునకు వెనుకటలెంగసి, న్యాయాధిక పీఠము చంద్రమణిపురము యొక్క సంగతి తెలిసినది గదా? అప్పటి శ్రీమన్మహారాజుగారు వృద్ధ యైనారట. రాజ్యము చేయుచుండిన రాజసింహుఁడను వాఁడు తుట్ట తుదకు అయినను రాజ్యము నిచ్చునని పైన సందేహపడుటలేదని చెప్పెనట. మహేంద్రబాబు రెండవవేళ వచ్చునని చెప్పెనట. అందుల కాతఁడు అంగీకరించక యొకయుద్ధ ప్రయత్నము చేసెను. పిమ్మట మహేంద్రుఁడు ఒకవ్యాపారియైయుండి, వేదాసుఁడను నొకవైద్యునిఁ బిలిపించి యానౌషధిని చేత నుంచెను. కాని యుపయోగములేకుండఁ బోయినది. తుదకు రాజసింహుఁడు మరణించెను. అతఁడొక మరణశాసనమును వ్రాయించెను: అందు మనము నాటుబడిచేయుచున్న యీభూమి తనకు, తనకొడుకైన మహేంద్రునకును నీభూమిని జగచ్చంద్రున కును జేరునట్లు వ్రాయించెనట. దానిచేత వ్రాసిన నభియోగమున నిందితుఁడై జగచ్చంద్రుఁడు మణిపురమును నుండజాలక పాఱిపోయెను గాదా! అప్పటినుండియు నాతఁడు కలకత్తాయందుండి, మూఁడు దినములక్రింద నిచ్చటికివచ్చెను. అచ్చటి పరిస్థితులరసి తనభూమిని విచారింప నిటకు రానెంచియున్నాఁడు. ఈదినమో రేపో రాఁగలఁడు. ఇవియే యచ్చటి విషయములు.

కన. — నీవు మహేంద్రుని జూచితివా? ఇఁక నాతనితో మనకే పనియు లేదుగదా? ఆతనితో, నీవిషయము మాటలాడితివా?

“మాటలాడితిని. ఆతఁడు నాతో నవసరమగు నొకవిషయము చెప్పియున్నాఁడు. ఆవిషయము నీకుఁ దెలుపవలయుననియే మార్గ మధ్యమున నిను గలసికొనఁ దలఁచి యిటువచ్చితిని.”

“ఆవిషయమేమియో తెలుపుము!”

“మహేంద్రుఁడు చాల గొప్ప మనసు గలవాఁడు. మంచి ధార్మిక

బుద్ధిగలవాఁడవు. మనవంటి బీదవారికి కావని యీప్రశ్నా దరిద్రులము కానుకలు! ఇతఁడు తెలిపినట్టులు నడచి ప్రవర్తించిన, నా జీవిత మంతయు హాయిగా జీవింతయు చేసి సకల భోగములతో నుండవచ్చును.”

“కేశవా! బాగుగనే యుపక్రమించితివి. కంఠోక్తముగా ముఖ్యాంశమును దెలుపక యేల యుపన్యాస మిచ్చుచుంటివి? ముఖ్యవిషయమును దెలుపుము.”

“ఆతఁడు చెప్పినవిషయము చెప్పిన అది కొంత వింత వెగటుగాఁ దోఁచవచ్చును: అందుచే ముందు దానివలన గలుగు లాభమును సూచించితిని. ఆతఁడియ్యవచ్చు నెఱవేర్చిన యెడల మనకుఁ బదివేలరూప్యములు, నీభూమియు దక్కును.

“ఆఁ! ఏమి? జగచ్చంద్రున కాతనితండ్రి యిచ్చిన భూమిని; మనకు వచ్చునట్లు శిలఁజూప నీకు హేమచంద్రున కేమికారణమున్నది? జగచ్చంద్రుఁడు లేఁడా, భూస్వామిని స్వాధీనము చేసికొనుటకు?”

“అదిగో! ముందే చెప్పితిని కదా నీవు దుడుకుతనము చూపుదువని, అప్పుడే ముఖ్యవిషయము చెప్పుటకు మునుపే, నీ వైమనస్యమును సూచించుచుంటివి.”

“ఇందు వైముఖ్యమేమున్నది నాకు? తన యిష్టవృత్తము నొసగ్గినందులకు, స్వార్థముండెనా యేని నీవు నొకఁడవుగను గాని, యితరార్థము నెట్టిమ్మటకు సమర్థుండనగుదు? ఆయనయనుమానముచే నట్లంటిగి తినిగాని, నేనెట్టియును లేదు.”

“ప్రస్తుత మావిషయము నటుండనిమ్ము! ఒకటిమాత్రము నీవిప్పుడు తెలిసికొనినఁ జాలును. హేమచంద్రుఁడొక కార్యమును జేయనభిలషించి, దానికి మనసాయము నర్థించెను. దానిని మనము నెఱవేర్చిన మనకందువలనఁ బదివేలరూప్యములు నీభూమియు వచ్చుననుట మాత్రము నీకిప్పుడు దెలిసినఁ జాలును.”

"సరసా! అదెట్టివిషయ మెట్టిదైనను విచారింపను లెమ్ము. నీ యిష్టానుసారమే యిప్పుడాప్రసంగము వలదు."

ఇట్లు వారిరువురు మాటాడుచుఁ గొంతదూరము నడచు సరికి, కేశవుని కాలికొక ఱాయి తగిలి, గాయమయ్యెను. అతఁడా దెబ్బకోర్వఁ జాలక చతికిలఁబడి మూల్గుచు "ఆనందా! నాకాలికి బలమగు గాయము తగిలినది" యనియెను.

ఆనందుఁడా కాలు బరీక్షించి మడమనుండి రక్తము స్రవించుచుండుటఁ గనుఁగొనియెను. అతఁడు కేశవునితో "కేశవా! ఈవాపుననే యొక శిథిలమందిరమున్నది. అచట నొక సరోవరము గలదు. మెల్లగ నచటికి రమ్ము. ఆగాయమునకుఁ దడిగుడ్డ కట్టుగట్టెదను. గాయము చాల చిన్నది. అయిదు నిముసములలో నొప్పి తగ్గిపోఁగలదు" అని చెప్పుచు నటనుండి యాతనిబిలుచుకొని మఱల నడువఁదొడగెను.

వారటుల నిఱువది బారలదూరము నడచి యా శిథిలమందిరముఁ జేరిరి. శిథిలమయి యున్నను లోపలిభాగము బాగుగనే యుండెను. చుట్టునుండు ప్రాకారకుడ్యము, చాలవఱకు పడిపోయియుండెను. దానికి దక్షిణపుఁ బ్రక్కనే యొకసరోవరమున్నది. ఈ సరోవరము నీ మందిరమును బూర్వికులెవ్వరో విహారస్థలముగ నుపయోగించుటకై నిర్మించినట్టులఁ భయంకరమైన కాలహస్తమున మఱుఁగుపడియున్న యచ్చటచ్చటి పూర్వశోభాప్రదర్శకములగు రంగులు తెలుపుచుండెను. ఆ మందిర మొక దివ్యమగు విశ్రాంతిభవనమై చుట్టును మనోహరమగు పువుదోఁటఁగలిగి నయనపర్వముగ వెలుఁగొందిన కాలము నుండియుండును. ప్రక్కనిసరోవరాంభశ్శీకరములఁగొని దక్షిణవాత మచటికి విశ్రాంతి కైకొనవచ్చినవారి మనంబులకు స్వర్గసౌఖ్య మనుభూత మొనర్చిన కాలము నుండియుండును. కాని ప్రస్తుత మది యంత శోచనీయ శిథిలావస్థ యందున్నది. అట్టి దుర్గమారణ్యా

మధ్యాహ్నంబున నాభవన మెవరు నిర్మించినారో? కాలగమనంబున నెన్ని విచిత్రము లుత్పన్నము లగుటలేదు, ఎన్ని చిత్రము లదృశ్యము లగుటలేదు!

ఆనందకేశవులు సరోవరప్రాంతమునకు వచ్చిరి. కేశవుఁడు గట్టు మీఁదఁ గూర్చుండెను. ఆనందుఁడు మెట్లను దిగి తన పైవస్త్రమునఁ గొంచెము చింపి దానిని నీటఁదడిపెను. తడుపుచుండ నాతనికి నీటి యందేదియో కనఁబడెను. ఆతఁడు మఱియొక్క మెట్టుదిగి జలము నందుఁ జేయిడి పరీక్షించెను. ఆతని చేతి కేదియో తగిలెను. దానిని పైకిఁదీసెను. అదియొక యిత్తడిపెట్టె. చాలకాలమునుండి నీటియందుం డుటచేతఁ గాఁబోలు నది నల్లనడియుండెను. ఆపెట్టె తొమ్మిది చదరపు టంగుళములు గలిగి రెండంగుళముల మందముండెను. కేశవుఁడు దానిని జూడనేలేదు. ఆనందుఁ డాపెట్టెఁ దెఱచుటకై కొంతసేపు ప్రయత్నించి విఫలుఁ డయ్యెను.

ఏమియో యాలోచనయందు మునిఁగియున్న కేశవుఁడు కొంత సేపటి కానందునిఁజూచి "ఆనందా! ఏమిటది?" యని యడిగెను.

"ఏమియునులేదు, నీటియందు గుడ్డఁ దడుపుచుండ నం దేమియో కనఁబడినది. అదేమని పరీక్షించితిని. అదియొక చిన్న సందుకము. ఇత్తడితోఁ జేయఁబడినది. కానిఁ దెఱచుటకు నాకు శక్యముకాలేదు." అనుచు నానందుఁడు పైకివచ్చెను.

కేశ — ఏదీ యాపెట్టె! చూపుము! నా మనసు దానిని జూడ వలయునని తహ తహపా టందుచున్నది.

ఆనం — ఉండుము. ముందు నీకాలికిఁ గట్టు గట్టనిమ్ము. ఆపెట్టె యెక్కడికిఁ బోదులే!

కేశ — చూపఁగూడదా! ఆనందా! ఆ పెట్టెయం దేమున్నదో నేను చూచుచుండెదను! నీవు కాలికి కట్టు గట్టుము.

ఆనం — అందేమూ యమూల్యపదార్థ ముండుననియూ హించావా! ఇట్టి నిస్తేజప్రదేశమం దదెట్లుండును. వ్యర్థమగు దాని నెవరో పాఱవైచి యుందురు." అనుచుఁ బెట్టెఁ గేశవుని కీయక యే యానందుఁ డాతని కాలి గాయమునకు తడిసినట్లున్నఁ దుడిచి కట్టుకట్టెను. కట్టినతరువాత కేశవుఁడు [illegible] నిల్చెను.

"ఆనందా! కష్టమైనను జూపవా యీ పెట్టెను! నీమాట నిలిపి కొంటివి గదా! ఇంకఁ జూపుట కాటంక మేమి?

— — తమ్ముఁడా! నీ వెంత వ్యర్థక్రోధివి? మాటకుముందే కోపము [illegible] నీకెటఁ జూపుచున్నానా" అనుచు నాపెట్టెను జోబీనుండి తీసి కేశవున కిచ్చుచు నిట్లనెను.

"నేనెంత ప్రయత్నించినను దెరువలేకపోయితిని. చాలకాలము నీటియందుమునఁగి పడియుండినది. కావునఁ దుప్పుపట్టియున్నది. ఇప్పుడు నీవిది దెఱచుమెట్లు"

కేశవుఁడును దానిని దెఱచుటకుఁ గొంతకాలము ప్రయత్నించెను. కాని రాలేదు.

"ఆనందా! ఆకట్టె పిమ్ము: చాలకాలముగా జలమున మునిఁగి యుండుటచే దీనికి నూత్నస్వభావ మేర్పడినది. ఒక్క ప్రహారణముతోఁ దని యౌదాసీన్యమును వీడఁగలదు." అని యానందుని కట్టెఁ దీసికొని దానితో నా పెట్టెపై నొక బలమగు దెబ్బగొట్టెను. మూత యూడ లేదు. అప్పుడానందుఁడు నవ్వుచు —

"కేశవా! నీప్రహారణము దాని యౌదాసీన్యమును మాన్పఁజాలక పోయినది. చూచితివా? మానవ మాత్రులొండొరుల యౌదాసీన్యమును మాన్ప దక్షులు గారని యిప్పుడైన నేర్చుకొంటివా" యనెను.

కేశవున కీమాటలు కోప మెచ్చించెను. "ఔనౌ! ఆనందా! ఈసారి చూడుము! దెబ్బకు దెయ్యమైన వెఱచుననుట మఱచితివా!" —

యనుచు కేశవుఁడు పెట్టెకు మఱియొక ప్రహరణ మొసఁగెను. మూఁత యూడిరాలేదు. పైఁగా నావైపు పెట్టె యొక్కింత నొక్కు వడెను. ఆనందుఁడు "కేశవా! నీకోపము పెట్టెమీఁదఁ జూపకుము. నీ ప్రహరణములు పెట్టె కపాయము గల్గించు టట్లుండఁగా నది యెన్నటికిఁ దెఱచుటకు రానంతగట్టిగా నతుకుకొని పోవఁజేయును. ఉపాయము మీఁద పని నెఱవేరినట్లు తొందరపాటున జరుగదు." అనుచుఁ గేశవునకడనుండి పెట్టెఁదీసికొని, పై మట్టి యంతయు నూడిరాలిపోవుట చేత బాగుగాఁ గనబడుచున్న, దాని మూఁతయొక్క యంచును, దన జేబినుండి యొక కత్తి తీసి దానితోఁ దొలగింపఁ బ్రయత్నించెను. రెండుమూడు నిమిషములు కేశవుఁ డోపికఁబట్టి చూచెను. తుదకు మూఁతయూడినది. ఆనందుఁడు పెట్టెమూఁతఁ గ్రిందబడవైచి దాని నుండి యొక కంకణముఁ దీసెను. పాపము కేశవుని యాశ లన్నియు వ్యర్థము లయినవి!

"ఆనందా ఈపెట్టెలో నేదియో యమూల్యాభరణము దొరుకునని యెంచితిని! ఈయుక్కు కడియమా! ఛీఛీ! యెంత నిరాశ గలిగించినది!"

"కేశవా! నీకోపమునకు భయపడి యింపలి రత్నాభరణ ముక్కు కడియ మైనది."

"పోపో! నీకెప్పుడును వేళాకోళము చేయుటతప్ప వేఱులేదు."

"లేదు లేదు. కేశవా! ఒకవిషయము! ఈయుక్కు వలయము నింత జాగ్రత్తగ నిచట దాఁచియుంచుట జూడ దీనియం దేదో ప్రాముఖ్య మున్నది."

"ఔను! ఉండవచ్చును! లేకున్న, నుపయోగశూన్యమగు నీకడియము నొక మందసములో పదిలించి యింతగా జాగ్రత్త చేయుటేల? ఇటు తెమ్ము చూచెదను."

"ఉండుము! దీనిపై నేవో చిత్రములు చెక్కబడి యున్నవి. ఒక

యంచునుండి యింకొక యంచున కాచిత్రములు వరుసగా నున్నవి. అన్నియు నాల్గుచిత్రములు.'' అనుచు నానందుడు దానిని మఱింత వ్యగ్రుడై పరీక్షింప దొడంగెను. కేశవుం డూరకుండజాలక తానును నానందునితో దానిని జూచుచుండెను.

ఆనం — మొదటిచిత్రము: కొండపై దేవాలయ మొండు కలదు. దానికడ నొకముసలి నిలిచి బద్ధాంజలియై యేమిరియో ప్రార్థించుచున్నాడు. రెండవచిత్రము: కొండయొక్క ప్రక్కభాగము; అచట నొక గుహ యున్నది. ఆ గుహాద్వారమునకు బ్రక్కన నొక చిన్న పీపర మున్నది. అందు మనుష్యశిర మొండు చిత్రింపబడి యున్నది. ఆశిరమునం దేమియునులేవు గాని ముఖమునం దొక దీర్ఘనాస యున్నది. మూడవచిత్రము: ప్రదేశమంత విచక్షణగ తెలి యుటలేదు. కాని మానవాస్థిపంజర మొండు చెక్కబడియున్నది. దాని కుడిచేయి క్రిందివైపున గొంతదూరమందు దేనినో చూపు చున్నది. నాల్గవచిత్రము: వరుసగ మూడుపెట్టె లున్నవి. పెట్టెలకు ముం దొకడు మోకరించి నిలువబడియున్నాడు. పెట్టెలకు వెనుక నెవరో యొకడు చేతులను జాపి ముందు మోకరించియున్న యాతని శిరముపై నానించియున్నాడు. ఇవి యిందలి నాల్గుచిత్రముల వివర ణము; ఇవి దేనిని సూచించుచున్నవి! ఇదేదో యాంత్రికకంకణముగ దోచుచున్నది. కేశవా! ఇట్టి దెన్నడైన జూచియున్నావా? ఈ చిత్రముల యర్థ మేమయి యుండును?

కేశ — ఒకపరి యా కంకణమును జూడనిమ్ము! దానిని వివరింప నాకు సాధ్యమగునేమో చూచెద.

ఆనందుడు కంకణ మిచ్చెను. పదినిముసములు కేశవుడు కంకణ మును బరీక్షించెను. తుద కాతని కేమితోచినదో కాని "ఏమి యీ విచిత్రము! ఇది నిజముగ నేమియో విచిత్రరహస్యమును దనయం

దిముపట్టుకొనియున్నది. రేకున్న మూడవమైపున దూరమునందలి విష యము చిత్రింపఁబడిన యీ కంకణ మింత భద్ర మొనర్పఁబడి యుం టకుఁ గారణ మేమి?" యనియెను.

కేశవుని యాశ్చర్యమున కానందమును బొడమి "కేశవా! ఏమి టావిషయమును. అందలి చిత్రములయర్థము నీవు గ్రహించినావే! ఏమిటి వానియర్థము?" యని యడిగెను.

కేశ — మొదటి చిత్రమునందలి కొండ భేతాళగిరి. దానిపై నున్న దేవమందిరము శైలశిఖరపు దేవాలయము. అట బద్ధాంజలియై నిలుచున్నవాఁ డెవ్వరో! మూడవచిత్రమునందలి గుహ నే నెప్పుడు జూచి లేదు. కాని యాగుహాముఖమున ప్రతిమాయుక్తమగు శిఖరము మాత్ర మొకపరి జూచినట్లు జ్ఞాపకము. అదియు భేతాళగిరియందలిదే! మూఁడవ నాల్గవ చిత్రములయర్థము నాకగోచరమై యున్నది.

ఆనం — అయిన నీకంకణవిషయ మేమని నీయభిప్రాయము?

కేశ — ఇదిచాల విచిత్రముగనున్నది! ఇచటికి మూడామైళ్లదూర మున నీయరణ్యాంతమునకున్న పర్వతచిత్రము చెక్కఁబడిన యీ కంకణ మేమి? దీని నిట్టి సర్జనస్థలమున నింతభద్రముగా దాఁచియుంచిన దెవరు? దాఁచియుంపఁ గారణమేమి? ఈచిత్రములేవో నిగూఢ మగు రహస్యమును జూపుచున్నవి. ఆ రహస్యమెట్టిదో చెప్పఁజాలను గాని, దానిని దుదవఱకుఁ బరీక్షింపవలయునని నిశ్చయించితిని. ఆనందా! ఈనాఁటికి నాగపురప్రయాణ మాపియుంచి భేతాళగిరి కరు గుదము రమ్ము. ఈ కంకణమునందలి రహస్యభేదనము చేయుదము.

ఆనం — కేశవా! రేపు పోవుదము. నాగపురమందలి యవసర కార్యములన్నియుఁ బూర్తియై పోవును. శాంతబాబుకడఁ బైకముఁ దీసికొని రావలదా! రేపు జగచ్చంద్రుఁ డపుడెంచి లెక్కఁజూచుకొనిన మన మీయవలసివచ్చు పైకము నిచ్చుటకు మనము సిద్ధులముగా నుండ

కలదా? సతీశచంద్రుఁడిప్పుడు నాకొఱకై యీనాఁ డెచ్చటికిని బోక కాచియుండును. వానికొఱకును మనసిద్ధముగ నున్నది. ఈదినము నాకన్న భేతాళగిరికి వేఱ పోవుదము రమ్ము.

కేశ — కాదు కాదు. అట్లు వీలుగాదు. రేపు మనమిరువురముబులయుం బేరాఁడుట్లు తీర్చి ప్రాంతల యుండెదము: నాగపురమునకు శాంతబా బెచ్చటికి పోవుదు. దేవాపులనా పైకమిచ్చాయుండా! సతీశుఁడు చెప్పుంచును: వాని తోడుకొని చేసి గాటాడునిచ్చును. నేఁడు భేతాళగిరికే పోవుదము.

ఆనం — కేశవా! నున కీవృథా ప్రయాస మెందులకు? ఈ కంకణముయొక్క రహస్య మేమియుండును! ఉపయోగకార్యమే యయిన దానిగూర్చి యింతపట్టు వ్యర్థమగును. నేఁడంతయు దీని యన్వేషణమున నడిపోవును. ఎందుల కీవృథాయాసము?

కేశ — ఏగోలయుఁబేమ రమ్ము! ఆనందా! ఏమిటి స్త్రీవలె మాట లాడుచుంటివి? ఇట్టిమాట లెప్పుడును వినలేదే! ఈదిన మేమైన భయ దేవత పూనినదా నిన్ను?

ఈమాటలు వినునప్పటికి కానందునకు కించుకేఁ గోపము వచ్చెను. ఆతఁడు తీక్ష్ణముగ "చాలుచాలు! నీకున్నంతధైర్యము నాకు లేదని యీ మాటలాడు చున్నావు! ఎప్పుడును నిష్ప్రయోజనముననే నీ ప్రతాప ప్రవాహమున లోకమును ముంచఁ బ్రయత్నించుచున్నావు: అవసరములగు కార్యముల వ్యర్థ మొనర్చుచు యిట్లనవసకార్యములకు బోయిన నుప యోగము లేదని యనుటేగాని వేఱుగాదు. రమ్ము! పోవుదము."

కేశ — ఎచ్చటికి?

ఆనం — ఎచ్చటికైనను సరియే!

కేశ — సరియే రమ్ము. భేతాళగిరికిఁ బోవుదము.

అంత వారిరువురు భేతాళగిరివైపున కేగిరి.

చూడాధనుఁ డతివేగముగఁ జీచకాటవిఁ జేరి శ్రీశైలమందిరప్రాంత సరోవరమునకై పోవుచుండెను. ఆతని కా సరోవరము చేరుటకెంతయో కాలము పట్టలేదు. సరోవరమునకు దక్షిణప్రాంతము దాఁటఁగ గుజ్జుమునిగెను. దాని ప్రాంతమందొక వృక్షమునకుఁ గట్టినదొక చెట్టు. ఆసరస్సునకు దక్షిణపు ప్రక్కనున్న శిలాసోపానములను గనుగొని దిగెను. తుట్టతుది మెట్టుకడకు వచ్చెను. ఆమెట్టునకు మధ్యభాగమున్న చదరపుఱాతిని స్పృశించెను. దానికి నేరుగా నీటియందు నాల్గవ మెట్లు దిగెను. మూడవమెట్టునం దొక ఱాయియందు రంధ్రముఁ జూచెను. దానియందే గదా కంకణపేటిక యుంచఁబడినది. చూచెను. పెట్టె కనబడదు. మఱల నాతఁ డాఱాతి కిరుప్రక్కలఁ జూచెను. ఎందును నెచ్చటను గాన్పింపలేదు.

చూడాధనుఁ డాశ్చర్యభయవిచలితుఁడై పోయెను. కంకణపేటిక యేమయిపోయినది. ఒకవేళ సరస్సుయొక్క పశ్చిమదిక్కుని యీ పురాతన గ్రంథమున వ్రాసియుంచినది పొరపాటుగ యుండునేమో? మందస ముంచఁబడియున్న దిక్కు వేఱేదేమో?

చూడాధనుఁడు దక్షిణమునుండి తూర్పువైపునకు యటఁ గిడపటి మెట్టుఁగూడఁ జదరపు చలువఱాయియైయుండుటఁ జూచెను. మందస ముంచఁబడిన దీప్రాంతమందేమో? మఱల నాతఁడు నీటిలోనికి దిగియెను. చూచెను. జలాంతర్గతసన్నివిష్టసోపానమధ్యశిలయందుఁ గ్రంతయేమి లేదు. ఆదిక్కునందు పేటిక యుంచఁబడలేదు. అని యనుకొనుచు నాతఁ డటనుండి యుత్తరమునకుఁ జనుదెంచెను. అటఁ గూడఁ బూర్వము వలెనే వెదుకుటయయినది. ఫలము మాత్రము లేదు. అంతఁ జూడాధనుఁడు తక్కుఁగల పశ్చిమదిక్కునందుఁ గూడఁ జూచెను.

చెప్పి యెచ్చటను లేదు. తనరాక వృథ యయిపోయినది.

అతని మానస మాశ్చర్య భయోద్విగ్న మయిపోయినది. ఆతఁడచటనే యొక సోపానముమీఁదఁ గూలఁబడెను.

"ఏమిది? ఏమయిపోయిన దా మందసము? ఆగ్రంథమునం దట్లు వ్రాయఁబడియున్నదే! ఎవరైనఁ దీసికొనిపోయియుందురా? ఇట్టి నిర్జన స్థలమునం దెవరు దాని నపహరించియుందురు? ఆనిధి వృత్తాంత మత్యంతరహస్యమని కదా యాపుస్తకము నివేదించుచున్నది. అంత రహస్యముగ కంకణ మీసోపానమునం దొక పేటికలోఁ బదిలింపఁబడి యుంచిన దెవరు కనుఁగొనియుందురు? కాలాంజన మెంత వింతది! ఎట్టి విచిత్రవిషయములను బయల్పఱచుటలేదు! నా మదృష్టవశమున నీకంకణ పేటిక పరహస్తగత మయిపోయినదేమో? .....ఒకవేళ నాపుస్తకమునందలి వృత్తాంతమే యసత్యమై యుండఁగూడదా? స్వార్థాపేక్ష నాకుఁ బుట్టించి ఆయాసక్లేశములఁ గని సంతోషింప నెవ్వఁడైన నట్లు వ్రాసియుండఁగూడదా? ఏమో!.... ఛీ ఛీ! ఎట్టి పాపమును స్మరించుచుంటిని. ఆ గ్రంథగతవృత్తాంత మసత్యమని నేనెంచు ప్రతియాలోచనయందుఁ దివ్యమహాత్ముఁడగు తాతగారిపై నాక్షేపించుటలేదా? ఆయన యసత్యదోషమున కొడిగట్టెనని నిమిషమునం దొక సహస్రాంశకాలమైన నాలోచింపఁజాలిన నావంటి పాపాత్ముం డుండునా? నావంటి నీచుఁడు తలచెగాని యింకొకఁ డట్లు తలంచునా? అసత్యవృత్తాంతము వ్రాసి మిథ్యాఫలములఁ జూపి మోసఁ గొలుప నాయన కేమి పట్టినది? అయిన నీకంకణ పేటిక యేమయినది?......"

చూడామణి యాలోచన యాగిపోయినది. ప్రక్కనే యెవ్వరో నవ్వుచున్నట్లు పదశబ్దము లాతని చెవిఁబడెను. చూడామణుఁడు నిద్రనుండి లేచువానివలె నులికిపడి లేచి నిలుచుండెను. నలుప్రక్కలఁ

జూచెను. ఎవరును లేరు. అశ్వము తాను గట్టివేయఁబడిన చోటనే పచ్చిక మేయుచున్నది. సంతోషానందచలితహృదయుఁడు భ్రాంతిపడెనే గాని యట్టి శబ్దమేదియు వినఁబడలేదని యెంచుచుఁ జూడాధనుఁడు మరలఁ గూర్చుండెను.

అతని మానసమున నాలోచనా తరంగము లుత్పన్నములై సంశయాంబుధి నిలయించుచున్నవి. ఒక్కటియైనను కంకణపుపెట్టె యేమయినదను ప్రశ్నమునకు సదుత్తరమును స్ఫురింపఁదగినది కాలేదు. ఆతని దృష్టు లాసరోజలంబులపైన నిలిచియున్నవి. పవనవేగమున నాతటాకమున నతులతరంగములు పుట్టి కొంతదూరముపోయి యట నాజలంబుననే మాయములగుచుండెను. చూడాధనుఁడు తన మనోంతరమందు జనించి యంతట మాయములగుచున్న యాలోచనలతో నాజలతరంగములఁ బోల్చికొనియెను. రెండును చంచలములే! అవి నిర్థాంతాకారములే! క్షణికములే! అని యనుకొనియెను.

ఎట్టకేల కేనిశ్చయమునకు రాఁజాల కాతఁ డక్కడనుండి లేచెను. సరస్తీరముఁజేరెను. గృహమున కరిగి తండ్రితో నావిషయమంతయు జెప్పవలయునని నిశ్చయించికొనెను. మఱల నొక సంశయ మారంభమైనది. తండ్రితోఁ జెప్పిన పిమ్మట కంకణపేటి నుద్ధరించుట కేమి యుపాయము?

ఈసంశయమున కాతఁడే ప్రత్యుత్తరమును సమర్థింపలేకపోయెను. వ్యర్థముగాఁ గాలమును బాడుచేయుచు నాభయంకరాటవి నుండు టెందుకు? గృహంబున కరిగి యావల నాలోచింతము.

చూడాధనుఁ డశ్వముగట్టి వైచియున్న వైపుజనెను. దూరమునం దేదో యాతని దృష్టి నాకర్షించినది. అదేమైయుండును. కంకణ మందసముకాదు గదా! అని చూడాధనుఁ డది పడియున్న యెడకుఁ జని దానినిఁ దీసికొనెను.

ఏమాటూ? ఇత్తడితోఁ జేయఁబడిన యొకపెట్టెయొక్క క్రింది సగము. చూడామణియను దానిని బాగుగా పరీక్షించెను. అది యొకకంకణము. పట్టు దగినంత విన్నదే! ఇదియే నాకంకణపు మందసము? అయిన దాని పైభాగ మేమాయినది? కంకణమేమయినది? ఆతఁడు చుట్టు ప్రక్కల చూచెను. దూరమున నిటువంటిదే వేరొకటి పడియున్నది. చూడామణియను దానిని దీసికొనియెను. పెట్టె యడుగుభాగమును మూతతో మూసిచూచెను. సరిపోయినది, కంకణమేమయినది? ఎవరైన [illegible] దీమందసమును గుర్తించి వెలికిదీసి పరీక్షించి చూచియుం, మోగరూప్యమగు నయ్యకంకణమును పాఱవైచియుందురా? నిరాశాపూరమునఁ గొట్టుకొని పోవుచున్న యాతనికిఁ గించి దాశాస్త్రము [illegible]. దాని సాయమున గట్టెక్కవలెనని యభిలషించి యాతఁడు కంకణము కొఱకా ప్రాంతమున వెదుక నారంభించెను. ఎంత వెదకినను గానరాదు కంకణము. ఆ దేమయినదో తెలియకున్నది! తెలియకున్నది. ఎవరో దానిని దీసి యుండవచ్చునని [illegible] గొంత యాలోచనా సామర్థ్యమున సంశయించి [illegible] దీసికొని పోయియుందురనుట నిజము!! ఆతీసిన దెవరో [illegible] నెకే [illegible]!

వెదకి వెదకి, అలసి తుద కాతఁడు మఱల గట్టుపైఁ బ్రథమ సోపానముమీఁదఁ గూర్చుండెను. ఇట్లు వితర్కించెను.

"కంకణము పోయినది! కాని మందసము మాత్రము దొరికినది. చిల్ల దొంగిలింపఁబడిన తరువాత శూన్యపంజరము లభించిన [illegible]? [illegible] నాకీ శూన్యపంజరమువలన నెంత యుపయోగమో యూ [illegible] వేసినతోడఁ గూడ నంత యుపయోగమే!"

యాతఁడాలోచనాధీనమానసుఁడై నాఁడు. నిర్మలముగనుండిన యాకాశమున మేఘములు వ్యాపించినవి. రాను రాను దట్టములగుచున్నవి.

చూడాధనుని మనంబునఁ జింత నెలకొనెను. రహస్యము నిబిడమగు చున్నది. కాని భయంకరమగు నామేఘావరణమునందు నెక్కడనో సౌదామని యొకటి తళుక్కుని మెఱసి క్రొంచెము దారి చూపెను. పురాతన సంపుటమునందు కంకణపుఁ బెట్టె మూఁతయందు నవశ్యరహస్య వివరణము గల కాగితమొకటి యుంచఁబడినట్లు వ్రాయఁబడియుండ లేదా? ఆ కాగితము గూడ నపహరింపఁబడినదా! లేక యీమూఁతలో! మఱల పెట్టె మూఁతఁదీసి సూక్ష్మముగఁ బరీక్షించెను. దానియందు చుట్టును నంచుగా నున్న రేకు రెంటి మధ్య కాగితపుమడత యుండెను.

ఆతఁడు దానిని భద్రముగాఁ దీసినాఁడు. విప్పి చదువ మొదలు పెట్టినాఁడు.

"శ్వేతాశ్మగిరికి దక్షిణపుఁబ్రక్కఁ శైలభైరవ్యాలయము నకు నేరుగా నొకగుహాయున్నది. ఆగుహాద్వారమున కెడమవైపొక వివరమందు నాసామాత్రయుతమగు నొక శిలాశిరము గలదు. ఈ పేటికయందలి కంకణము నా నాసికకుఁ జొప్పించి కుడివైపునకుఁ ద్రిప్పిన గుహాకవాటము తెఱువఁబడును. లోన నొకకవాటమునకుఁ గుడిప్రక్క నిట్టిశిరమే మఱియొకటి యున్నది. దానికీకంకణము జొప్పించి నెడమ ప్రక్కకుఁ ద్రిప్పిన ద్వారము మఱల మూసికొనును.

ఇప్పుడు కొన్ని గజములదూరమున ద్వారమునకు నేరుగా మఱొక ద్వారము గలదు. దానిఁ దెఱచుకొని వేఱొకగదిఁ బ్రవేశింపవల యును. ఈగదియందొక మానవాస్థిపంజర మున్నది. అది మంత్రశక్తి వలనఁ గదలుశక్తిఁ గలిగినది. ఈకంకణమునందలి శైలభైరవ్యాలయ చిత్రముతో నాయస్థిపంజరమును దాకవలయును. అప్పుడు దాని కుడి చేయి నేలపై నొకచోటు జూపుచుఁ జాచును. ఆప్రదేశమును గుర్తించిన నచ్చట నొక శిలాకవాటమున్నది. ఆకవాటమధ్యమం

దొక యినుపవలయము నుండును. ఈకంకణమును గుడిచేత ధరించి యా వలయమును పైకి లాగిన ద్వారము తెఱచుకొనును.

అటనుండి క్రిందికి దిగుటకు మెట్లున్నవి. ఆసోపానముల ననుసరించి దిగి పోయినఁ గ్రింద నొకయంగణము గలదు. ఇయ్యంగణమునందే ధననిధియున్నది. ఆగదిలో వరుసగ మూఁడుమందసము లున్నవి. ఆ మందసములందు ధనము భూషణములు గుప్తమొనరింపఁబడియున్నవి.

"ఈధననిధిఁ బొందువాఁడు గమనింపవలసినవిషయములు ముఖ్యములైనవి మూఁడున్నవి. ధనాగారమునందు మందసములుంచఁబడి యున్న దిక్కున కెదుటివైపు వేఱొకగది యున్నది. ఆగది యెచ్చట నుండునది తెలియదు. దానిఁ గనుఁగొనుట కొకమార్గమున్నది. ఆ పెట్టెలకు వెనుక గోడయందలి గూటియందు దీపమునకుఁ గావలసిన యుపకరణములున్నవి. వాని వెనుకభాగమున నే యొక బిరడ యున్నది. దానిని ద్రిప్పిన నాగదితలుపు తెఱచుకొనును. ఆగది యందు శైలభైరవీవిగ్రహ మున్నది. ఆ విగ్రహమునకుఁ దొల్త నచటనున్న దీపోపకరణములచేత నొకదీపము వెలిఁగించి యారతీయ వలయును. రెండవది ధననిధియందొక నాణెము దీసినను సరియే ఆ నాణెమును దెచ్చి పైగదియందున్న యస్థిపంజరమువద్దఁ బెట్టి యా యస్థిమాత్రవిగ్రహదత్తముగా మఱల నానాణెమును బరిగ్రహింప వలయును. మూఁడవవిషయము: భేతాళగిరిశిఖరముననున్న శైలభైరవాలయమున భైరవవిగ్రహము లేదు. కొన్నికారణములచేత నా విగ్రహము పాతాళమందిరమునకుఁ జేర్పఁబడినది. ఈ ధననిధిఁ దీసి కొనిన తర్వాత నావిగ్రహమును యథాస్థానంబునఁ బ్రతిష్ఠింపవల యును. ప్రతిష్ఠించునప్పుడా యాలయంబునందున్న కృత్రిమవిగ్రహ మును భూస్థాపితముఁ జేయవలయును.

ఈనిధి యొక మంత్రశాస్త్రవేత్తచేత నభిమంత్రింపఁబడియున్నది.

పై మూఁడునియమములను పాటింపక తీసి స్వాధీనము చేసికొనఁ గోరువాఁడు నిరంతరావేశమున్ భీతితాపములను బొందును. పలు కష్టముల పాలగును. తుద కట్టులే చనిపోవును. ఈనిధిని రక్షించుచున్న మంత్రశక్తి యనన్యఘటనాసాధ్యము. అతిభయంకరశీలము కరుణాదూరము. కాఁబట్టి యీమాంత్రికశ్రేష్ఠునిచే నియమితములైన పై మూఁడునిబంధనములఁ బ్రతిఘటింపరాదు. ప్రతిఘటించినవారు లోకంబునఁ గసి విసి వెఱ్ఱులగుచు దారుణాపదల పాలవుదురు.''

చూడాధనుఁ డందలివిషయములెల్లఁ జదివెను! ఎంతవిచిత్రములుగ నున్న నందలి వివరణములు! ఎంతభయంకరయుక్తనిబంధనములు! ఎవరైన నీనిఁ బ్రతిఘటించుటయే పొసఁగినయెడల, వారి యవస్థ లెంత భయంకరములుగ నుండునో? ఇంతకఠోరనియమములుగు మంత్రముల చేత, నానిధిని బద్ధమొనరించుటకుఁ గారణమేమి? ఆమాంత్రికుఁ డెవ్వఁడో! ఈకాలమున మంత్రశక్తిచేత మానవజీవితములఁ దమ యిచ్చవచ్చినట్లు చేయు మాంత్రికులు గలరా? ఇందేదో భయంకర రహస్యమున్నది. ఈనిధిని నూఱేండ్లు మంత్రబద్ధ మొనరించిరి! ఏల? ఇంతధనమును శత్రుభయముననో చోరభయముననో దాఁచి యుండవలెను. దానిని మంత్రబద్ధమొనరించు టెందులకు? ఉపయోగశూన్యమని యెవ్వరైనఁ బాఱవేయఁదగిన యుక్కుకడియము చేతనే తెలుపుటకు వీలగునంత రహస్యమేల? ఇంత దూరప్రదేశమున దాఁపనేల? మొదలగు యోచనలొండొంటి నాశ్రయించుచుఁ జూడాధనుని మానసమును భ్రాంతినొందించెను! ఆతని యొడలు కంపించుచుండెను. ప్రకంపితకరముల నాతఁ డాకాగితమును మఱల నొకపరి చదివెను. ఇట్టు లాలోచింపఁదొడఁగెను.''

“ఇంతకు నాకంకణ మేమయినది? ఈపేటికయందే యాకంకణ ముండినది. నీటినుండి దీని నెవరు తీసియుందురు?''

మనసు నిల్పఁజాలక సూరాఘనుఁడు నలుప్రక్కల నాకంకణము కొఱకు వెదకెను. ఎచ్చటనున్న దాకంకణము? లేదు లేదు! 'కంకణము — అమూల్యమగు నాకంకణము నిక్కముగఁ బరహస్తగత మయిపోయినది! అత్తుని సంపత్తు పరులచేతిలో పడిపోవును.

ఈనిశ్చితాభిప్రాయము సూరాఘనునికిఁ దోఁచినపుడు ఆతఁడు అభావోద్రేకముచేఁ గాఁగ జాలక, చతికిలఁబడిపోయెను. యాతని కంపిత కరములనుండి యాకాగితము జారి క్రిందఁబడిపోయెను. ఉపవనపవన తరంగములు దానిని నొక్కయూపుఁ జాలదూరమునకుఁ ద్రోసికొని పోయెను. అది యొక లతామధ్యమున దగుల్కొని వాయువశమున నిటునటుఁ జలించుచు బటపట శబ్దమొనరించుచుండెను. చింతాక్షోభమున నణఁగిపోయిన సూరాఘనుఁడు దీనిని గమనింపలేదు. హృద్గత చింత నాలోచనలచే నుపశమింపఁజేసికొనఁ బ్రయత్నించుచుండెను.

“ఇవ్విషయమంతయు విని నాతండ్రి యెంతగఁ జింతించునో కదా? ఇప్పు డేమిచేయుదును? కొంతగంటలకుముందు గొప్పధననిధి తనది యని యుప్పొంగుచున్న యాతని మనస్సున కిది యెంత నిర్ఘోష ఘాతము కాకుండునా! ఆకంకణముగొన్నవా రెవరైనను నీపత్త్రము నందలి విషయములను జదివియుండరు. ‘ఈపెట్టెమూఁతయందు—కాగిత మొకటియున్నది. దానియం దీనిధికి సంబంధించిన ముఖ్యవిషయములు వ్రాయబడి యున్నవి.’ అనియే వారెఱుంగరు! ఈకంకణమొక ధన నిధిమార్గమును సుగమ మొనర్చునది యనియు వారికిఁ దెలియదు! ఈనీటియందు వారికీసంపుటము లభ్యమైనది. అందలి కంకణము జూచిరి. దానిపైఁ జెక్కఁబడియున్న చిత్రములు వారికి విచిత్రముగఁ దోఁచియుండును! ఆవిచిత్ర మాత్రమునకు వారు దానిఁ దీసికొనిపోయి యుందురు! వారీకంకణరహస్యమే తెలిసికొనియుండి యీకాగిత మును వారు చదివి యుండినయెడల దీని నిచ్చట పాఱవైచి పోయి

యుండునా! ఏమో దీనియందున్న విషయములు తెలిసినవెనుక వారికి దీనితోఁ బని యేమున్నది?....... .. అట్లైనట్టికిని జరిగియుండదు. వారీపత్రమును చదివినచో యుండిన నిచట దీనిని బాఱవైచి పోయి యుండరు. దీని నితరులు చూచుట తటస్థించియుండిన వారు దీనినిగూడ తీసికొనిపోయిరో లేక చింపివైచియో యుందురు. కంకణమాత్ర మునే వారు తీసికొనిపోయిరి. ఈపెట్టెయందలి యితరవస్తు విశేష ముల వారు పరీక్షించి యుండలేదు. .....ఇంతకు నాకంకణ మెవరి చేతఁబడిపోయినదో? దానిని గనుగొనుటెట్లు? ......ఏమార్గమున సంపాదింపఁగలను. శేషాద్రిగిరిపద్దకుఁ బోయి యచట నెవరయిన నా గుహ నీ కంకణసాహాయ్యమునఁ బ్రవేశించుచుండిరేమో చూడ వలయు!... ఆ కంకణము మూలమున నాగుహఁ దెఱచుట వారి కెట్లు తెలియఁగలదు? తెలిసియుండినఁగదా వారు కంకణసహాయమున గుహఁ దెఱచుటకుఁ బ్రయత్నింతురు ......ఒకవేళ వారికా విష యమే తెలిసియుండదు: ఇంక దానిఁ గనుగొనుటెట్లు?...... ఏమార్గ మునులేదు. కంకణమునకు ధననిధికిని విలోపకము వదలవలసినదే!

మఱల దూరమునుండేదో బరువైనవస్తువు క్రిందఁబడినట్లు శబ్దము వినవచ్చినది: చూడాధనుఁ డులికిపడి లేచి నిలుచుండెను. ఆ దెసఁ జూచెను. ఇంతవఱకు నటమేయుచుండిన గుఱ్ఱ మచ్చటలేదు! ఏమయిన దీ హయము! ఆనేలఁబడియున్న దేమి? ఒక్కపరిగనఁ జూడాధనుఁ డచటి కరిగెను: అచటఁ గనఁబడిన దృశ్యమాతని కన్నులయందు నీరూరించెను. చూడాధనుఁ డెక్కివచ్చిన హయము, గతప్రాణమై నేలఁ బడియుండెను. దాని మెడయందొకవైపునుండి మఱొకవైపునకు నొక తీక్ష్ణ నారసము గ్రుచ్చుకొనియుండెను.

"ఆబాణ మెక్కడనుండి వచ్చినది? దానిని విడిచినవా రెవ్వరు? వారి యుద్దేశ్యము హయసంహారణమేనా? నన్నుఁ జంపుటయా?"

చూడాఘనుఁడు విచిత్ర స్వాంతుఁడై భయవిహ్వలుఁడై నలు దెసలఁ బరికించి చూచెను. ఎవ్వరును లేరు. 'సహాయమును జంపినవారు తన్నుమాత్రము చంపకుందురా?' చూడాఘనుని మెదడు భయమూర్ఛాకలిత చిత్తమైపోయినది.

"కంకణాపహర్తనేనా, మాయహంతకుఁడు? అతఁ డీప్రక్కనే యెట కోడాగి ఈచర్యల నన్నిఁటిని గనిపట్టి చూచుచున్నాఁడు. అతఁడే గగ్గాలియాయై యుండునా?"

ఆ భయవశమున గగ్గాలియా పేరు స్మరణకురా మఱింత భీతావహుఁడై పోయెను. అతఁ డింక పట నొల్లుండఁగలఁడు? చూడాఘనుని దేహ మాపాదమస్తకము వడవడ వడఁకఁ జొచ్చినది. గగ్గాలియాచేఁ జిక్కి యవాచ్యావస్థలపాలై మరణించినవారి విపత్తు లొక్కొక్క టొక్కొటిగ నాతని మనఃఫలకమున భయముచే నుద్వేజితంబై యున్న భావనాశక్తి చిత్రింపఁ బొడఁగినది: పటుతర ఝంఝూవాతము వీచుచున్నది: వృక్షమును గూకటివ్రేళ్ళతోఁ గూడఁ బెల్లగింపఁ గలదు! ఇంకను నాస్థితివచ్చుటకుఁ జాలకాలములేదు: ఇఁక నాప్రభంజనుని ధాటికిఁ గోమలలతాంత మెంతకాలము నిలువఁగలదు. అనేక రక్తప్రవాహములకుఁ దావకమై యగణిత ఘోరహత్యలకుఁ దావలమైన యీ భయంకర నిర్జనారణ్యమధ్యంబునఁ గలికాలరాక్షసుండగు గగ్గాలియా స్మరణపిశాచావేశమున కాతరుఁడుఁ డెంతకాల మాఁగఁగలఁడు? ఇఁక నటుపైని టపాయకరము! చూడాఘనుఁ డొక కాలిబాటఁబట్టి నాగపురమునకుఁ జనవలయునని రెండడుగులు వైచి యాఁగిపోయెను: కంకణరహస్యవివరణపత్ర మేమయినది? చూడాఘనుఁడు నల్గడలఁ జూచెను. ఎందుఁ గనఁబడలేదు. ఇవ్విధముననే నీ ధననిధియు లభ్యదూరమై పోయినది. చూడమునుటకో యనఁ బవనుఁడు దానిని జాలదూరము తీసికొనిపోయెను. దూరమునందా తెల్లఁగ గనబడున దేమి? 'ఆ కాగి

తమే ! ఒక్కపరుగునఁ జూడాధనుఁ డటకరిగి యాకాగితము దీసికొని యెను. మడిచి దాచుకొనఁ బోయెను: అంత రహస్యవృత్తాంతములు గల పత్రము తనయొంటిమీద నుండు టపాయకర మని వానికిఁ దోఁచినది. తోడనే చూడాధనుఁడు దాని ననేక తునకలుగఁ జింపివైచెను. గాలియం దెగజిమ్మివైచెను. అప్పు డాతని యెడఁదనుండి కొంతబరువు దొలఁగించిన ట్లుండెను. అంతట నాతఁడు నాగపురాభిముఖుఁడై నడువసాగెను.

ఇంకను భయపిశాచము ప్రతినిమేషము నూత్నముగ మాఱుచున్న వికారవేషముతో నాతని భావపథమునఁ దాండవించుచునే యున్నది. ఇంకను గంగూలియాచర్య లాతని కొక్కొక్కటిగ స్ఫురించుచునేయున్నవి. వానితీవ్రధాటి కాతఁడు చలించుచునే శీఘ్రగతిని నాగపురముఁ జేరవలయునని యరుగుచునే యున్నాఁడు.

ఆతఁడు రెండుమూఁడు ఫర్లాంగుల దూరమరిగి యుండెను. ఆతని వెనుక మఱల నెండుటాకులు గలగలమను శబ్దము వినవచ్చెను. ఆతఁడు వెనుదిరిగి భయకంపితవీక్షణములఁజూచెను. ఆతనికి వెనుక రెండుచెట్ల మధ్యమునందు వినీలవర్ణవస్త్రధారియు దీర్ఘకాయుఁడును భటబల సమన్వితుఁడును ఆజానుబాహుఁడును రక్తారుణ నేత్రద్వయుఁడును మహాభయంకరమూర్తి యొకఁడు నిలువఁబడియుండెను. నల్లని యాతని కంచుకముపై వక్షమున మూఁడుతలల నాగమొకటి, బంగారముతోఁ జేయఁబడి నిగనిగలాడుచుండెను. దాని మూఁడుశిరములందుఁ గన్నులకు మాఱుగాఁ జెక్కఁబడిన వజ్రములు పశ్చిమమునఁ గ్రాలిన యుష్ణాంశురేఖలట్లు ధగద్ధగాయమానముగా మెఱసి పోవుచుండెను.

ఆతనిఁ జూడఁగనే చూడాధనుఁడు నిలువున నీరై పోయెను. నిలిచినచోటనే స్తంభీభూతుఁడయి నిలువఁబడి పోయెను. రెండునిముసముల కాతని యొడలొకపరి, గంపించెను, తోడనే "గంగూలియా!"

అని మొగ్గ [illegible] నిలువున నఱుకఁబడిన తరువువలె నేలఁ బ్రాలి పోయెను. ఆ [illegible] [illegible] మొలచన్ను [illegible] చెను.

౬

కేశవచంద్రుఁడు [illegible] [illegible] నిరత్రాంతసరోవరమునుండి బయలుదేఱి శ్వేతాచల [illegible] గంటలకుఁ జేరిరి.

[illegible] శిఖరములలో నొకటి. దాని కా [illegible] దానిని జెప్పుకొందును.

[illegible] నఖండ [illegible] విక్ర మార్క [illegible] శ్వేతాంకుఁడు భూపతి రాజును దనస్వాధీనమునం దుంచుకొని [illegible] ప్రయత్నములను జేయుచుండెను. ఆ శ్వేతాంకుఁడు సత్కార్యపరాయణుఁడైన విక్రమార్క [illegible] ఋజుమార్గగామిగ నొనర్చెను. విక్ర మార్క [illegible] భూపతి నాగపర్వతములందలి యీ శిఖరము [illegible] నేర్పఱచుకొనియెను. ఈ శిఖరముపైనున్న శైలశైవ [illegible] యావాసము.

[illegible] పూజాదికార్యములను నెఱవేర్చుచుండిన బ్రాహ్మణు [illegible] చక్కఁగఁ జేయక [illegible] కాశనముగ నేర్పఱచిన దానినంతయు [illegible] చుచుండుటచే వారి నీశ్వేతాంకుఁడే శిక్షించెను. వారి వంశ మపుత్రమై పేరులేకపోయెను. అది మొదలెవ్వరు నాయాలయమున దర్శకులుగ నుండుట కంగీకరింపలేదు.

ఇప్పటికి శ్వేతాంకుఁ డచ్చటనే యున్నాఁడను నమ్మిక మాదేశప్రజలకుఁ గలదు. అతఁడు వచ్చుటకుఁ బూర్వ మాగిరి కేనామముండినదో తెలియదు. కాలవశమున నాపేరు మాసిపోయినది. ఇప్పుడందఱు దానిని శ్వేతాంకగిరియనియే పిలుచుచుండిరి.

కేశవానందులు భేతాళగిరిని దాటినంతనే కేశవుఁడొక కాలిదారి ననుసరించి కొండప్రక్కనే పోవఁదొడంగెను. అప్పు డానందుఁ డాతని నిట్లు ప్రశ్నించెను.

ఆనం — కేశవా! ఇటు లెక్కడికి?

కేశ — ఆనందా! నావెంటరమ్ము. నీకు విచిత్రములఁ గొన్నిటిఁ జూపుదును.

ఆనం — మనమీప్రయత్నమున నాగపర్వతాభిముఖులమై నడువఁ దొడఁగినది మొదలు నామనంబేమో భయపడుచు శంకించుచున్నది. ఈకంకణ మేమియో? దాని రహస్యాన్వేషణ మెట్టిపరిణామము నిచ్చునో? తెలియక విపత్తులోఁ జిక్కుకొందుమేమో?

కేశ — అన్నా! బయలుదేఱినది మొదటినుండి యొక్కటే పాఠము వల్లింపఁజొచ్చితివేల? ఆపద యనునది యొకచోట నుండిన వచ్చుట వేఱొకచోట నుండిన రాకుండుట యునా? ఇచటికి రాక నాగపురమునకే పోయితి మనుకొనుము. మార్గమునం దేదేనాపద సంఘటిల్లఁగూడదా? దానికై భీతిఁజెంద నేల? సహజములగు భయంబులకు హృదయంబునఁ జోటిచ్చుట పురుషులకుఁ దగునా? ఊరక రమ్ము.

ఆనం — కేశవా! నీవాకవేళ నచంచలస్థైర్యము [illegible]. కాని, నేను భయపడువాఁడనైనను నీకంటెఁ దక్కువవాఁడను గాను. నీవంటిబలవంతు లనేకు లీప్రాంతమునందే [illegible] మైరి. ఈభేతాళగిరియే యెన్ని హత్యలకో రంగస్థలము. ఎట్టిదిట్టయైనను నీప్రాంతములందు భీతిఁజెందవలసినదే. బలవంతుఁడైన నెవ్వఁడు నాపదఁ దెచ్చుకొనఁడు గదా! ఇంతకును ఉపయోగము తేటపడని ఈ కంకణమునందలి రహస్య మెఱుంగునిమిత్తము మన మిచ్చటికి వచ్చుటాపదలకుఁ దావిచ్చుట గాదా!

కేశ — ప్రయత్నదూరు లగువారల మాట లిట్లుండును.

ఇదిగో యియ్యదె మనము రావలసినది. చూడుము. పైన శైలభైరవాలయము. దానికి నేరుగ క్రింద నే మనమిప్పుడు పరీక్షింపవలసినస్థానము:

ఆనం — కేశవా! ఈప్రదేశము నీవు మున్నెప్పుడో చూచినట్లున్నాఁడవే?

కేశ — ఔను! ఒకపరి నాగపురమునందలి కొందఱితోఁ గూడ నీప్రాంతములకు వచ్చియుంటిని. అప్పు డిచ్చట నొకచిన్న గుహను గనిపెట్టితిని. అదియే మనమిప్పుడు వెదుకవలసి యున్నది.

కేశవుఁడు పర్వతమునందు పైఁగ్రమ్మియున్న పొదలందు వెదుకఁ దొడఁగెను. కొంతకాలమిట్లే గడిచిపోయినది. ఆనందుఁడు తనలో "ఎంతవ్యర్థుఁ డీకేశవుఁడు. ఉపయోగశూన్యమైన యొకవ్యర్థప్రయత్నమున కవసరకార్యములు పాడుచేసికొను వాఁడుఁడురా? ఇంతకు దీని పరిణామ మేమియో" యనుకొనుచుండెను.

ఉన్నట్లుండి కేశవుఁడు "ఆనందా! చూచితివా: ఇదిగో గుహ!" అనియెను. ఆనందుఁడును కేశవునికడ కరిగి యాగుహను జూచెను.

అది చాలచిన్నది. తన్ముఖవైశాల్యము రెండడుగు లుండును. దానిలోపల నడుగుదూరమున నొక శిలామస్తక ముండెను. ఆకారమునుబట్టి యది తల యనఁదగి యుండెనేగాని యందే యవయవములును లేవు. ముఖమువలె నొక గుండ్రనిసమభాగము దీర్ఘమగునాసిక యొండు గల్గియుండెను. కేశవుఁడు కంకణమునందలి చిత్రమునకును, నచటి గుహయందలి నాసాయుక్త శిలాశిరస్సునకును బోల్చి చూచికొని, జయనగవుదోఁప నానందునితో నిట్లనియెను.

"ఆనందా! కంకణమునందలి చిత్రములోని త్రాతితలఁ జూచితివి. ఇప్పు డీగుహయందలి దానికిని దీనికిని నేమైన భేద మున్నదా? ఇందేదో గొప్పరహస్య మున్నదని నేను చెప్పియుండలేదా? చూడుము. ఈగిరికి — నీకంకణమునకును గల సంబంధ మేమియో!"

ఆనందుఁ డా పెట్టెనిజూచి యాశ్చర్యమందియు నేమియుఁ బలుకక యూరకుండెను. కేశవుఁడు కొంతకాల మేమియో యాలోచించుచుండెను.

కేశవుఁడు "ఈకంకణము ఈనాసికాంతము సమానప్రమాణము గలిగియున్నట్లు కనఁబడుచున్నది. ఇదిదానికిఁబెట్టిన సరిపోవునేమో!" అనుచు దాని నా నాసికకుఁ జొప్పించెను. అది యానాసికకొఱకే చేయింపఁబడిన దానివలె సరిపోయినది.

"సరిపోయినది. ఈనాసికకు నీకంకణమునకును గల సంబంధ మేమి?" అనుకొనుచు కేశవుఁ డాలోచనలో మునిగిపోయెను. కేశవుని చర్యయంతయుఁ బరీక్షించుచు నింతదనుక నూరకుండిన యానందుఁ డిప్పుడు కేశవునితో నిట్లనియెను:

"కేశవా! ప్రాచీనగాథలయం దుంగరములచేతను దీపప్రమిదల చేతను ననేక విచిత్రచర్యలు జరుపఁబడుచుండినటుల వింటిమి. ఇదియును నట్టిశక్తి గలిగినదేమో? దీనిమూలమున "అల్లాయుద్దీన్ దీపప్రమిద" కథలోవలెనే నేదేని భూతము ప్రత్యక్షమగునేమో! ఆకథయందు నాప్రమిద మృత్తుతోఁ దాఁకినఁ గదా భూతము ప్రత్యక్షమగుచుండినది? ఇందుఁగూడ నీనాసికకు కంకణమును జొప్పించి యిటునటుఁ ద్రిప్పిన నేదేని భూత మిటకు వచ్చునేమో!"

కేశ — అవును. అట్లేయుండవచ్చును. అదియునుగాక గిరిపైని భేతాళుఁడను భూతరాజున్నట్లు మన పూర్వులు చెప్పుచుండ విని యున్నాము. ఈకంకణ మాభూతప్రత్యక్షము గలిగించునేమో! నీవు చెప్పినట్లే దీని నిటునటుఁ ద్రిప్పిచూచెదను.

కేశవుఁడు కంకణమునుబట్టి యెడమవైపునకుఁ ద్రిప్పెను. కంకణము తిరుగఁ జొచ్చెను. భూతప్రత్యక్ష మేమియుఁ గాలేదు. మఱలఁ గంకణమును కుడివైపునకుఁ ద్రిప్పెను. కంకణమును దానితోడ నాసికయుఁ గూడఁ దిరుగఁ జొచ్చెను. ఆతఁడింకఁ గొంచెము త్రిప్పెను. తోడనే

వారు నిలుచుండబడియున్న యెడ కెడమవైపునుండి దడదడ మను శబ్దము వినఁబడెను. వా రాదెసఁ జూచిరి. రెండు పెద్దశిల లెడమవైపులకు జరుగుచుఁబోయి కొంచెము సందుకల్పించి నిలిచిపోయినవి. కేశవుఁడు మఱల నా కంకణమును గుహప్రక్కకు మూఁడునాలుగుచుట్లు త్రిప్పెను. ఆ రాలు రెండును నట్లే వెనుక వెనుకకు జరుగుచుఁబోగా మధ్య నొక ద్వారము వెలువడెను.

ఆద్వారము సుమారు పదియడుగు లెత్తు గలిగి యొకేమాఱు నలువురు ప్రవేశింపఁ జాలినంత విశాలముగ నుండెను. కేశవానందు లిరువురు నాశ్చర్యమున ఆద్వారమున కెదురుగ నిలిచి లోపలఁ జూచిరి. అదియొక పెద్దగుహ. ఆద్వార మాగుహఁ బ్రవేశించుటకే యేర్పఱుపఁ బడినది. గుహ చాల విశాలమైనదిగ నుండెను.

కేశ — ఆనందా! ఏమి విచిత్రమిది? ఇందేదేని మంత్రశక్తి యుండవలయును. లేకున్న నూర్గురు మనుజులైన కదలింపఁ జాలనంత పెద్దశిల లింత చిన్నకంకణము నానాసికకుఁ జొప్పించి త్రిప్పిన నిట్లు కదలిపోవునా? నీ వనినట్లు దీనియం దేదో మంత్రప్రభావ మున్నది.

ఆనం — ఔను! ఇది మంత్రప్రభావమే! ఈగుహయం దేమున్నదో!

కేశ — అదియే మన మిపుడు పరీక్షింపవలసి యున్నది. లోనికిఁ బోవుదము రమ్ము.

కేశవుఁడు శిలా శిరోనాసికనుండి కంకణమును దీసికొని మెల్ల మెల్లఁగ నాగుహఁ బ్రవేశించెను.

ఆనందుఁడు "కేశవా! జాగ్రత్త! నాసికనుండి కంకణమును దీసిన మరల నీరాళ్లు రెండును మూసికొనపోవుచేమో! జాగ్రత్త" అని హెచ్చరించెను.

కేశవుఁడు కొంచెమాగి, యానందుఁ డనిన ట్లాశిలలు కదల కున్నందున, లోనఁబ్రవేశించి "ఆనందా! రమ్ము. భయ మేమియును

లేదు. ఆశిల లంతమాత్రమున మూసికొనవు" అని యానందునిఁ బిలిచెను.

ఆనందుఁడును లోనఁ బ్రవేశించెను. లోపలఁ దొలుత వారి కంతయు నంధకారపూర్ణమై యున్నను, గొంతసేపైన వెనుక నా చీఁకటి కొంచెము తగ్గినది. అప్పుడు కేశవుఁడు గుహకు లోపలద్వారమునకుఁ గుడివైపున వెలుపల నున్నట్టి వేరొక వివరమును, శిలాహస్తకమును గనుగొనెను.

"ఆనందా! ఈ ద్వారము మూసికొనుట కిచ్చటఁ గీలుఁ గనుగొంటిని. వెలుపల నున్నటువంటిదే వేరొక శిలాహస్తక మిచ్చట నున్నది. దానికిని బొడవైన ముక్కున్నది. ఆముక్కునకుఁ గంకణము జొప్పించి త్రిప్పిన మరల నీశిల మూసికొనునని తోఁచుచున్నది" అనెను కేశవుఁడు.

ఆనందుఁడును కేశవునికడకుఁ బోయి నిలిచెను. కేశవుఁడు నిగ్రహానాసికకుఁ గంకణము జొప్పించి కుడిప్రక్కకుఁ ద్రిప్పెను. కంకణము మాత్రమే తిరిగెను. నాసిక తిరుగలేదు. శిలాద్వారము మూసికొనలేదు. ఎడమవైపునకుఁ ద్రిప్పెను. శిలాద్వారము కొంచెము కొంచెముగా జరిగి మూసికొనెను. తోడనే గుహయంతయు మఱింత నిబిడముగ నంధకార మావరించెను. ఆనందుఁ డించుక భయపడి "కేశవా! ద్వారమును మూయకుము. ఇంత భయంకరమగు చీఁకటియం దుండుటెట్లు? ఈ గుహయం దేమున్నదో? ఏదేని భూతముండి మనలఁ జిక్కించునేమో?" యనియెను.

కేశ — ఆనందా! ఏమియు భయములేదు. ఇంతమాత్రముననే భీతిల్లుచుంటివా?

ఆనం — నాకుఁ జూడ నీ గుహ పిశాచములు కాటపట్టగు భీకరస్థలముగఁ గనఁబడుచున్నది. ఎట్టియాపదలు రానున్నవో! తెఱువుము ద్వారమును. మనయం దొకరు ద్వారముకడనుండి యింకొకరు లోననేమున్నదో పరీక్షింపవచ్చును.

కేశ — ఆనందా! ఇన్ని విచిత్రములకుఁ గారణమై, యింత ప్రభావముగలిగిన యీకంకణము మనవద్ద నున్నంతవఱకు నే భయమును లేదు. ఇన్ని చిత్రకార్యములఁ జేసిన యిది మన కాపదవచ్చునట్లు చేయునా? మనము భయపడవలసినది లేదు.

ఆనందుఁ డూరకుండెను. ఏమియు మాటాడనులేదు కదలనులేదు. నిలుచున్న యెడనే నిలువఁబడియుండెను. కేశవుఁడుమాత్ర మా నిబిడాంధకారబంధురంబయిన యా గుహాభ్యంతరభాగంబున నొక పిశాచమువలె నిటునటుఁ దిరుగుచుండెను. కొంతసేపట్లు పాతరలాడ నాతని కా గుహయందు వేఱొక ద్వార మగుపడెను. ఆద్వారము శిలానిర్మితము కాన నాతఁడు స్పర్శనముచేతఁ దెలిసికొనియెను. దానికిఁ దాళముగాని గడియగాని లేదు. కేశవుఁడు దానిఁ దెఱచుటకుఁ బ్రయత్నించెను. ఎంతత్రోసినను నది తెఱచుటకురాలేదు. కేశవుఁడప్పు డానందునితో నిట్లనియెను.

"ఆనందా! ఇటురమ్ము. ఇచ్చట వేఱొక ద్వారమున్నది. ఈద్వార మెంతత్రోసినను దెఱచుటకు రాలేదు! నీవుఁగూడ త్రోసి చూతము. రమ్ము."

ఆనం — నేను రాఁజాలను. నాకుఁ జూపే తెలియుటలేదు.

కేశ — ఆనందా! నీవెంత పిఱికివాఁడవు!

కేశవుఁ డొక వికృతహాస మొనర్చెను. భయంకరమగు నా గుహలోని నీరంధ్రాంధకారమును గేశవుని వెడగునవ్వు మఱింత భయంకరముగ నొనర్చెను. ఆనందుఁ డేమియుఁ బలుకలేదు. కేశవుఁడు మఱల దలుపుఁ ద్రోసెను, అది తెఱువఁబడలేదు. మఱియొకమా ఱాతఁడు తన బలమంతయు నుపయోగించి యొక్క త్రోపు త్రోచెను. తలుపు గుభాలునఁ దెఱువఁబడెను. ఆయూపునఁ గేశవుఁడు క్రిందఁబడియుండు వాఁడే! ఒకకాలు ముందుంచి యా యావేగము నాపఁజాలెను.

ఆద్వారమున కావల వేఱొక గదియున్నది. మొదటిదానివలెఁ గాక యిది వెలుఁగుఁ గలిగియుండెను. అచటికి నావెల్తు రెటునుండి వచ్చుచుండెనో కేశవునకుఁ దెలియలేదు. ఆనందుఁడు దూరమున నావెలుఁగుఁగాంచి "కేశవా! అచ్చట నేదో వెలుతురు కనఁబడుచున్నది. అదేమిచూడుము" అనియెను.

కేశ — ఆనందా! ఇచ్చట నింకొక గదియున్నది. ఆ గదియందలిదే యీవెల్తురు. పైన నెచ్చటనోయున్న రంధ్రమునుండి వచ్చుచున్న దీవెలుతురు. ఇచ్చటకు రమ్ము.

ఆనందుఁడు ఆగదిలోనికిఁ గేశవునితోఁ బోయెను. కేశవుఁడు గదియం దొక్కెడ నిలువఁగ, నానందుఁ డొకచోటికిఁ జని యందేమున్నదో పరీక్షింపమొదలిడెను. అతఁడు క్రిందనే చూచుచుఁ గొంతదూరము చనెను. ఆతని కచ్చట నేదో నిలువఁబడియున్న యొక రూపచ్ఛాయ కొంచెముగా నేలపైఁ దోఁచెను. అతఁడు తలయెత్తి చూచెను. ఆతని యెదుటఁ బ్రాణయుక్తమువలె భ్రమింపజేయు నొక మానవాస్థిపంజరము గనఁబడెను. ఒక్క పెనుగేక వైచి యాతఁ డొక్కయుదుటున నాలుగడుగులదూరము వెనుకకు దూఁకెను. కేశవుఁ డింకొకమూలనుండి యచటికిఁ బరువిడివచ్చెను.

కేశ — ఆనందా! ఏలయిట్లు కేకవైచితివి? నీకేమి కనఁబడినది? ఏదేని యమానుషశక్తి నిన్నుఁ బ్రహరింపలేదుగదా?

ఆనందుఁడు వణఁకుచున్న కేల నాయస్థిరూపమునుజూపుచు కంపితకంఠస్వరమున నిట్లు పలికెను.

"కేశవా! అటుచూడుము. ఆభయంకరరూపము! ఎంతభయము గొల్పుచున్నదో!"

కేశవుఁ డారూపము గనెను. ఒకపరి యాతనియొడలు జల్లుమనియెను. కాని యాతఁ డానందునంత బెగడువడలేదు. దానిని

మెల్ల[illegible] [illegible]శ్చర్యాంకిత నేత్రముల దానిం బరీక్షించెను.

[illegible] పైని చర్మమాంసాదికములను, లోని యాంత్ర మూ[illegible] యెముకలరూపము. అది దేనినాయమును లే[illegible]చెను. ఆనందుఁడు కేశవుఁడు దానికడనిలిచి [illegible] [illegible] యేదో భూతావాసమని నే[illegible] ఇటువంటి కృత్యములు పిశాచము లవి[illegible] మన మనుగుదము.”

కేశ[illegible] — [illegible]నా! పై కీక[illegible]నముసందు నమ్మకము గుదుర లేకున్నాని [illegible] [illegible]విశ్వాసముసందున నమ్మకమున్నది. చూడుము ఆ[illegible] [illegible]తీయు నిదర్శనము.”

అ[illegible] కే[illegible]కర్రయష్టితో నా యస్థిరూపమును దాఁకెను. తోడనే [illegible] కుడిచేయి మారమునం దేదో చూపునటులఁ జాచెను. కేశవుఁడు [illegible] [illegible]కకు వైచెను. ఆనందుఁ డొకమూలకు బరుగిడెను. కాని [illegible]కొనిన ట్లా యెముకలరూపము వారినేమియుఁ జేయలేదు. చేయి య[illegible]విధముగఁ జాపియుండెను. కేశవుని వీక్షణము లాచేతి[illegible] బడి చూపునెడకుఁ బ్రసరించెను. నేలయందచట నేదో కనఁబడె[illegible]. కేశవుఁడు నిలిచియున్న చోటినుండి యది చక్కఁగాఁ గనఁ బడలేదు. అతఁ డయ్యెడకుఁ జనియెను.

అచట నేలయం దొక ద్వార మమర్పఁబడియుండెను. దానిఁ దెఱచుట కే[illegible] నొక యినుపకడియ మాతలుపునకు బిగింపఁబడి యుండెను. కేశవుఁడు దాని నెత్తఁ బ్రయత్నించెను; కాని యాతని చేతినుండి కంకణము క్రిందఁబడియెను. ఆతఁడు కంకణము దీసికొని కుడిచేత ధరించి మఱల నాకడియముఁబట్టి ద్వారము నెత్తెను. ఏమియుఁ గష్టములేకుండ నాద్వారము పైకి లేచివచ్చెను.

కేశ — ఆనందా! ఇట నొక పాతాళగృహ మున్నది. దానికి దిగి

పోవుటకు మార్గము మెట్లు నిచ్చుచున్నవి. క్రిందికి దిగిన నచ్చట నేమియున్నదో చిత్రము.

ఆనం — అచ్చట నేముండును? ఈగదిలోనుండు మనము చూచిన యస్థిపంజరము మఱియొకటియుండును. నిరుపయోగమైన యీప్రయాసము మన కెందులకు?

కేశ — సరి! నీయిష్టము. నేనుమాత్ర మచట నేమున్నదో చూడక యీ గుహనుండి కదలను. నీవు రావేని యీగదియందే యుండుము. నేనుపోయిచూచి వచ్చెదను.

ఆనం — అటులైన నేనును వచ్చెదను. కాని, నీ సంకల్పమున కేఫలము గలుగదనిమాత్రము నాకు స్ఫురించుచున్నది.

అంతట నిరువురు నాద్వారమునుండి మెట్లమీఁది క్రిందికిఁ బోయిరి. పాతాళమందిరము జేరుటకు వారు ముప్పదిమెట్లు దిగవలసివచ్చెను. కేశవుఁడు, ధైర్యమున ఆపాతాళగృహమునకు దిగియెను గాని, యానందుఁడు మాత్ర మా భయంకర గృహాంతరాళమునుండి నిరపాయముగఁ దన్నుఁ గేశవుని వెలికిఁ జేర్ప దైవమును బ్రార్థించినపిమ్మటనే యా మందిరముం బ్రవేశించెను.

ఆ పాతాళమందిరమునకుఁ గూడ నెచ్చటనుండియో వెలుతురు వచ్చుచుండెను. ఆగది యంత విశాలమైనది గాదు. పదియడుగుల పొడవు, నెనిమిదడుగుల వెడల్పు గలిగిన చిన్నగది. అందు వారి కేయస్థిపంజరము గన్పడలేదు. ఒకవైపు గోడనానుకొని మూఁడు పెట్టెలుండెను. తదన్య మాగదియందు వారికేమియుఁ గనఁబడలేదు.

కేశవుఁ డాపేటికలయందు మొదటిదానిని దెఱచెను. గది యంతయుఁ దళతళమని యొక్కమెఱుపు మెఱసినది. పైగదియం దెవ్వరో నేలపైఁ గఠినమగు వస్తువుతోడఁ గొట్టుచున్నట్లు ఠకఠకమను శబ్ద మాగదియందుఁ బ్రతిధ్వనించుచు వినఁబడియెను. కేశవుఁ డొక్క-

పెట్టెను నాపెట్టెకలుపును సగము తెఱచినదాని పట్టెపదలి, యూరించుకుని నడ కొక్క యడుగువేసెను. ఆ పెట్టెకలుపు గుభాలునఁ బడిపోయెను. మఱల నొకమెఱపును దానువెంటనే నింతకుముందు వినఁబడిన శబ్దమును గలిగినవి. అంతయు నిశ్శబ్దమైపోయినది. కేశవుఁ డానందుని బట్టు కొనియెను. ఆనందుఁడు భయమున వణఁకుచుండెను.

ఆనం — కేశవా! ఈయుత్పాతములేమి? ఆపెట్టెలయం దేమి యున్నది? దానిఁ దెఱచినంతటనే యింతభీకరమగు శబ్దమును మెఱుము నెట్లుగలిగినవి? కారణమేమో?

కేశ — ఆనందా! ఇందేదో మహామంత్రము తన శక్తిప్రభావమును బ్రబలనిదర్శనములచే వ్యక్తీకరించుచున్నది. ఆపెట్టెయం దేమున్నదో చక్కఁగ దెలియరాలేదుగాని, ఏవియో కాంతిమంతములగు వస్తువు లున్నవి. అవేవియో? బహుశఃరత్నభూషణములయి యుండవచ్చును. తక్కినవానియం దేమున్నదో! అవికూడ నీపెట్టెవలెనే యమూల్యా భరణములతో నిండియుండునని తోఁచుచున్నది.

ఆనం — కేశవా! అందేమున్నను నీవు చూడవద్దు. ఇఁక నున విచ్చట నుండనేవద్దు. ఇఁక నీవు దానిని దెఱచుటకుఁ బ్రయత్నించితివేని యీ గుహయే మనపైఁ గూలునేమో యని భయము గలుగుచున్నది.

కేశ — నీభయ మెప్పుడు నుండునదిదే! మనపై నీ గుహ కూలు నదైన నిప్పుడే కూలియుండును. మనము పొడియై పోయియుందుము. ఇఁక నిది కూలదు. ఆ భయమేమియును లేదు.

అనుచుఁ గేశవుఁడు మరల నా పేటికను డాసెను. మొదట తెఱచుట కాతఁడు కొంచెము వెనుదీసెను. మరల నెుండిధైర్యముతో నా పెట్టె మూఁత దెఱచినైచెను. కేశవానందు లిరువురును మరల నుల్కాసంక్షోభము గలుగునని యెంచి నిరీక్షించిరిగాని యీమాఱు అట్టి దేమియు జరుగలేదు.

ఆపేటికయందు కేశవుఁడు పరికింపఁగ యమూల్యములగు రత్నాభరణములుండెను. దాని ప్రక్కనున్న పేటికను కేశవుఁడు తెఱచెను. అందు రెం డఱలును వానిలో నొకదానియందు బంగరునాణెములు వేఱొకదానియందు వెండినాణెములు నుండెను. కేశవుఁడు మూఁడవ పేటికఁ దెఱచెను! దానియందు మొదటి రెంటియందువలె యమూల్యాభరణములుగాని స్వర్ణరజతములుగాని లేవు. ఒక రాగి రేకుల కట్ట యుండెను. కేశవుఁడు దానిని పరీక్షించుట మాని మొదటి పెట్టె కడకు వచ్చెను. ఆనందుని పిలిచెను. ఆనందుఁడు నామందసము కడకు వచ్చెను. అప్పు డతఁడు "ఆనందా! మనపై దైవమునకు వర్ణింప నలవి గానంత కరుణ జనించినది. చూడు మీ యాభరణములను! ఆధనమును జూడుము: ఇవన్నియు నెన్ని లక్షల రూపాయల విలువగలిగి యుండునో! ఈనాఁటి మన యదృష్ట పరిపాకము! నాగపురమునకు నీవు చెప్పినట్లు మనము పోయియుండిన నీ నిధి మనకుఁ దక్కియుండునా? ఎన్ని జన్మాంతరములు వ్యయము చేసినను దరుగునా యీనిధి!" అనియెను.

ఆనందుఁ డామందసమునందలి యాభరణ సమూహమును జూచుచుండెను. వాని యున్నతప్రభాలోక మాతని దృష్టియందుఁ బ్రతిఫలించుచున్నది. కాని కేశవునివలె నానిధి స్వామ్యనిశ్చయము వాని మనంబునఁ గలుగుచున్నదో లేదో! ఆతఁ డేమియు మాటాడ లేదు. కేశవుఁడనుచున్న మాటలన్నియు వినినాఁడు: కేశవుఁడు మఱల నిట్లనియెను. "మొదటినుండియు నిం దేదో మహత్తరరహస్యమున్న దంటినే! నీవు నమ్మలేదు గదా? ఈ కంకణ ప్రభావము నీకిప్పుడైనఁ దెలిసినదా? ఎంత ధనము! అన్నా! మనవంటి యదృష్టవంతులుందురా ?"

ఆనం — కేశవా! ఈధన మెవరిదో మనకుఁ దెలియదు! ఇంత

ధ మొనరిచేసెనో నిట గుప్తమొనరింపఁ బడకున్న నెట్లు వచ్చియుం డును! పరధనమును మనము గనుఁగొనుటచేతనే మనదని యుప్పొంగుట సమంజసముగాదు. అదియుఁగాక ఈ ధననిధి ప్రబలప్రభావము గల మంత్రశక్తిచేత రక్షింపఁబడియున్నది. ఈకంకణము మనవద్ద నున్నంతనే దీని మన మపహరించుటకు శక్యముగాదు. ఈనిధి యక్షకాపలు తమ మంత్రశక్తిచేత మనలను దగ్ధమొనరించివైతురు. తాకకుము దానిని. దీనిని స్వాధీనమొనరించుకొనుట మన కపాయములను తెచ్చి పెట్టుకొనుట.

కేశవుఁ డానందుని మాటలు లక్ష్యము నేయలేదు. ఆతఁడు రెండవ పెట్టి కడ కరిగి కూర్చుండెను. అందుండి చేతినిండ నాణెములఁ దీసికొని యీ చేతినుండి యా చేతికి నా చేతినుండి యీ చేతికిఁ బోయుచు నవి పడునప్పు డొనర్చుచున్న గలగల మను శబ్దమున కానందించుచుండెను. మరల నానందుఁ డిట్లనియెను.

“కేశవా! ఆధనమును దాఁకకుము. దానివల్ల నేమైనఁ బ్రమాదమువచ్చునేమో ఇప్పటికిఁ బోవుదము రమ్ము. దీనిఁగూర్చి యావల నాలోచింతము.”

కేశవున కానందుని పల్కులు వినఁబడలేదు. ఆధనమును జూచుచుండఁగనే యాతని చిత్తము దురాలోచనాకలుషితమగుచుండెను. “ఈధననిధి విషయము నాకు నానందునకే కదా తెలిసియున్నది. ఈతని యభిప్రాయము తెలియుచునేయున్నది. ఈ ధనమునం దొక నాణెమైన దీసికొనుట కీతఁ డొప్పఁడు సరికదా నేను దీసికొనెంచినను నంగీకరింపఁడు. ఈ రహస్యమును నిముసములో బహిరంగ మొనర్చి వేయును. ఈవిషయము బహిరంగమైన నిధి యధికారులకును గగూలి యాకు దెలిసిపోవును. వారలకుఁ దెలిసిన నిది మాకు దక్కునా? ఎన్నటికిని దక్కదు! గగూలియా దీనిని నిముసములో నపహరింప

కుండునా? ఒకవేళ నీతఁడితరుల కీరహస్యము దెలుపకున్నను నీనిధియం దర్థభాగము దన కీయకున్న నూరకుండునా? ఈతనికి సగపాలొసంగిన నాకుఁ గల లాభమేమి? తన కిచ్చిన సగముభాగము తీసికొనిన తరువాత నీతఁడీనిధి రహస్యము వెలిబుచ్చిన నే నేమిచేయఁగలను. ఈతని నెట్టులైన భయపెట్టి యీనిధి విషయము బయల్పరుపకుండ దిట్ట మొనర్పవలయును."

ఈ విధముగఁ గేశవుఁడాలోచనాప్రవాహముఁ బడిపోవుచుండ నానందుఁడు మరల నాతని హితప్రబోధన మొనర్చుచు నిట్టు లనియెను.

"కేశవా! మన మెట్టివిధముగఁ జేసిన మన కేవిధమగు నపాయము రాదని యెంచెదను. ఈధననిధి విషయమంతయు నిది మన కెట్లు లభించినదియు జగచ్చంద్రునికిఁ దెలిపిన నాతఁడీనిధికి భర్త యెవరో తెలిసికొని వారివలన మనకు బహుమానము వచ్చునట్లొనర్చుటయో అట్టివారే లేకున్న మనకు దీనిఁ బంచి యిచ్చుటయో చేయును. ఆతఁడు వచ్చునని తెలిపితివి గదా! ఆతనితో నీవిషయమంతయుఁ దెలుపుదము."

కేశ — ఆనందా! మన మాతనికిఁ దెలుపు టెందులకు? ఆతఁడీరహస్యము దనకుఁ దెలయఁగనే మనల నిరువురను చోరులమని పట్టించి తా నీనిధి నపహరించును. అంతటి నీచుఁడు దుర్మార్గుఁడు నింకొకఁడుండునా! బోసుగారింట ధన మాతఁడు హరింపలేదా? పోయి పోయి యాతని కీ విషయ మెఱింగింపవలయుఁ గాబోలు. చాలును చాలును నీమాటలు.

ఆనం — నీ వనునట్లాతఁ డెన్నటికి నట్టివాఁడు గాఁడు. బోసు ధన మాతఁడు తీయనేలేదు. పోనిమ్ము నీకిష్టములేకున్న నాతనికిఁ జెప్పవలదు లెమ్ము. మనమే యీనిధి యెవరిదో తెలియఁ బ్రయత్నించుదము. దీని యధికారియే బ్రదికియున్న మనము దీనిలోఁ జిల్లిగవ్వ

ప్తైనం నీకింకొకరూడదు. అట్టివారేసు లేకున్న మనమే పంచుకొందము."

కేశ — చేతికివచ్చిన ఫల మెవరిదా యని ప్రయత్నముచేయుట నీవంటి మహాత్ముడు చేయును గాని నేను చేయుదునా? ఈనిధి యెవరిదో యయియుండి వా రిప్పుడు జీవించియుండిన నింతవఱకేల దీనిం దీసికొనకుందురు? ఇంత నిధి యున్నదని తెలిసిన ప్రతి మను జుడును నిధి నాగునేయోయని వెలికి రాకుండునా?

ఆనం — అందఱును వచ్చిన మనము నమ్ముటకుం గంకణరహస్య ముండలేదా! వారు చెప్పియును చెలిపినగదా మనము నిశ్చయమని యంగీకరించుటకు? ఇంత మంత్రప్రభావముచే రక్షితమైయున్న యీనిధి యెవరిదో తెలిసికొనకుండ మనము తీసికొనరాదు.

కేశ — నీసలహా నే నడుగుటలేదు. నాకు నీవు బోధింపవలసినది లేదు. ఈనిధి విషయ మెవ్వరికిం దెలుపంగూడదు.

ఆనం — నాసలహా నీకక్కఱలేనిచో నేను చెప్పవలసిన యవసర మే మున్నది.

కేశ — చెప్పవలదు. నీ వీనిని విషయ మొకల కెవ్వరికిం దెలుపంగూడదు. తెలిపితివా నే నూరకుండను.

ఆనం — నీవూరకుండకున్న నాకేమియు భయములేదు. న్యాయ మునకై పోరాడకుందు ననుకొంటివా?

కేశ — ఆనందా! ఇదే మరల చెప్పుచున్నాను వినుము. నీ వీరహస్యము బహిరంగ మొనర్పంగూడదు. జాగ్రత్త. దీనిని నాయిచ్చ వచ్చినట్లు చేయుదును. నీకిందేమియుం బ్రసక్తిదీసికోరాదు.

ఆనం — నాపై నధికారము చేయుటకు నీ కీనిధిపై నున్నంత యధికారము నాకు లేదనియా? నీకువలెనే నాకీనిధియం దర్ధభాగ మున్నది మఱచితివి కాంబోలు నేఁడు?

కేశ — నీకు దీనియందు వచ్చిన గర్వమైన నీయును. దీనిపై

నీకుఁ గల యధికారమేమున్నది. పితృకోపదప్తమై వలను పలుకుచు నధైర్యము గొలుపుచుంటివని యీ నీకిం దద్భాగము?

ఆనం — కేశవా! యింత కృతఘ్నుఁడవైతివేల? నా కీనిధియం దేభాగమెట్లు లేకుండునో చూతును. తొలుత నీకంకణము దెచ్చినది నేనే. మఱచితివా? అకంకణము నాయదియైయుండ నిధిలో నర్ధభాగమైన నీకు నిజముగ నెట్లు చేకుఱు?

కేశ — ఏమి! కంకణము నీయదియా? మరల చెప్పుచున్నాను. ఈనిధియందు నీకే భాగమును లేదు: నీ వీవిషయము వెల్లడింపఁ గూడదు. అందుల కొడంబడని యెడ నీవిటనుండి కదలఁజాలవు.

ఆనం — కదలకుండ నన్ను నీవేమి చేయఁగలవు? వెలి కరుగుటయే గాక యీవిషయ మందఱకు నీదినమే తెలిపెదను.

కేశ — ఏమి! ఈవిషయ మందఱకి నేఁడే తెలిపెదవా? తొలుత ప్రాణములతో నీగుహనుండి వెలువడుటఁ జూచికొమ్ము. నిన్నుఁ బ్రాణములతోఁ బోనిత్తు ననుకొంటివా? ఎవరికి నీవిషయము దెలుపనని మొదట ప్రమాణ మొనరింపుము.

ఆనం — నేను ప్రమాణము చేయను. నన్ను నీ విచ్చటినుండి పోకుండ నెట్లాపఁగలవో చూచెదను.

అనుచు నానందుఁ డొక్క దూఁకున గేశవునిపైఁబడి యాతని చేతనున్న కంకణమును లాగికొనియెను. మఱునిముసముననే యానందుఁడు పై కరుగుచుండెను. ఆనందునితోపునకు గేశవుఁడు క్రిందఁ బడియెను. ఆతని చేతినుండి నాణెములు క్రిందఁబడి టంగ్ టంగ్ మనుచు నలుదిక్కులకుఁ జెదరిపోయెను. కేశవుఁడు తొందరగా లేచి యానందుని వెన్నంటెను. ఒకనిముసములో నాతని బైగదియందు గలసికొనియెను. ఓరీ! దుర్మార్గా. ఎచ్చటికిఁబోయెద వనుచు నొక్క తాపున నాతని క్రిందఁద్రోసెను. ఆనందుఁడు క్రిందఁబడియెను. పడునప్పుడు తలకు

బలముగా దెబ్బతగిలెను. ఆతనికి స్పృహదప్పెను. కేశవుఁ డాతనివద్ద నుండి కంకణమును దీసికొనెను.

"ఇటులఁ బడియుండి యన్నము నీరు లేక చావుము. నాయిష్టమునకు వ్యతిరిక్తముగఁ బ్రవర్తించువాఁడవా నీవు?" అనుచుఁ గేశవుఁడు నాకలనుండి గదిఁ జేరి, యటఁ గొంతధనము దీసికొని మరల వెలుపలికివచ్చి యందుండి కంకణ సహాయమున గుహాద్వారమును దెఱచి వెడలిపోయెను.

క్షణకాలములో నెంత విపర్యయము. దీనికి హేతుభూతము ధనముగదా!

౧౦

చూడాధనుఁడు కన్నులఁ దెఱచి నలుదిక్కులఁ గలయఁజూచెను. ఇంకను దనయెదుట నా భయంకరమూర్తి యున్నట్లే యాతఁడు భావించుచుండెను. కాని యాతనియెదుట గగూలియా లేఁడు. కుడి యెడమప్రక్కల నిద్దఱు శ్యామల వస్త్రధారులు నిలువఁబడియుండిరి. వారి యెదలపైని వెండితోఁ జేయబడిన నాగపతకము లుండెను. రూపమున వారు గగూలియాయంతటి భీకరులు గారు. వా రాతని యనుచర సంఘములోనివారని చూడాధనుఁడు భావించుకొనియెను. వారును క్రౌర్యమునను, ఘోరకార్యాచరణమందునను గగూలియాకుఁ దీసిపోవువారుగారు. వారి స్వాభావిక క్రౌర్యమునకు వారు ధరించి యున్న వదనాచ్ఛాదనములందలి రంధ్రములనుండి శిఖిశిఖాయమానముగఁ బ్రజ్వలించుచున్న తీక్ష్ణదృష్టులే సాక్షి.

తెలివివచ్చిన వెనుక చూడాధనుఁడు తనకరపాదములు రజ్జుబంధితములై యుండుటయు నా త్రాటి యొరయికచేత బంధితస్థానములందు తీవ్రముగు బాధగనుండుటయు గ్రహించెను. ఆతఁడు లేచి కూర్చుండఁ బ్రయత్నించెను గాని శక్తిచాలనందున మరల వెనుకకుఁ బడిపోయెను.

వారియందొకఁ డప్పుడు చూడాధనుని పాదబంధనములను ద్రెంచి విప్పివైచెను. త్రాళ్లు విప్పఁబడినంతనే లోని రక్తనాళములం దింత వఱకుఁ బ్రతిఘటింపఁబడి యుండిన రక్తము వేగముతోఁ బ్రవహింప మొదలిడుటచే బంధితసమయమునకన్న నిప్పు డధికబాధ కలిగెను. పాదములు తిమ్మిరిగొనెను. ఆబాధకు సహింపఁజాలక చూడాధనుఁడు "అబ్బా!" అనుచు లేచి కూర్చుండి చేతులతో నాస్థానములఁ బట్టుకొనఁ బ్రయత్నించెను. కాని పాపము! చేతులు కట్టఁబడియున్న వానిచేతు లాచోటికిఁ బోలేకపోయెను. నడుమువంచి కాళ్లఁబట్టుకొన యత్నముచేయ యాతఁ డురంబున నొప్పికలిగి మరల నొకపరి "యబ్బా" యనుచు గ్రిందఁ బడిపోయెను.

ఇరువైపుల నిలిచియున్న వారిరువురు నీతనియవస్థఁజూచి దాని నుండి యాతనిఁ దప్పింపఁ గలవారయ్యు మిన్నకుండిరి. వారి హృదయము లెంతకఠినములో!

క్రిందఁ బడిపోయినవా డట్లే కొన్ని నిముసముల కాలము కదలక మెదలకుండి చూడాధనుఁడు మరల గన్నులు విచ్చెను. ఏమియో మాట్లాడవలయునని ప్రయత్నించెను. పెదవులు గదలుచున్నవే కాని మాట వెలువడలేదు.

ఆ యిరువురయం దొకఁడు తనకడనున్న యొకసీసానుదీసి యందున్న పానీయమును జూడాధనుని నోటఁ గొంత పోసెను. చూడాధనునికి దానిరుచి యేమియుఁ దెలియలేదు గాని యది కంఠనాళముండి జీర్ణ కోశము చేరియుఁ జేరకమున్నే దేహంబున నూత్నజీవము విద్యుత్ప్రసరణమువలెఁ బ్రసరించెను. చెదరియున్న వానిమనస్సు కొంచెము కుదురుబాటు చెందెను. అప్పు డాతఁడు వారి నిట్లు ప్రశ్నించెను.

"అయ్యలారా! మీ రెవ్వరు? నన్నిట్లు బంధింపఁ గారణమేమి? మీ రిప్పుడు నన్నేమి చేయనుంటిరి? నేనిపు డెచ్చటనున్నాఁడను?"

"మేము గగూలియా పరివారమునందలి వారము. నిన్ను బంధింప మాయజమానుని యాజ్ఞయే కారణము. నిన్నిప్పుడు గగూలియా వద్దకుఁ గొంపోవ నుంటిమి."

"గగూలియా నన్ను బంధింపుమనెనా? వానికడకుఁ గొంపోవ నుంటిరా? అతఁడు నాయెడలఁ గినుక యేమి? ఎచ్చటికి బోయెను? ఇప్పుడు నేనాతనికడకు రాకున్న నన్నేమి చేయుమని మీకుఁ డాజ్ఞాపించెను?"

మాచేతఁబడిన వెనుక మాయిచ్ఛ వ్యతిరేకముగఁ బ్రవర్తింప నీకుఁగాదు నివంటి వేవురకైన సాధ్యముగాదు. మామాట వినవలసినదే! చెప్పినట్లు నడుచుకొనవలసినదే!"

"అటులనా! సరియే! మీయిష్టానుసారమే యగునుగాక."

వా రిరువురును జూడాధనుని లేవనెత్తి తమతోఁ దోడుకొని పోయిరి. బలహీనాంగుఁడై నడుచుటకు సైతము శక్తిచాలని చూడాధనుఁడు అచేతనంబగు విగ్రహమువలె వా రెట్లు లాగుకొనిపోయిన నట్లు పోవుచుండెను.

అట్లు గొంతదూర మరిగినంతనే వారిలోనొకఁడు విచిత్రధ్వని యొకటి యొనరించెను. ఆశబ్దము పక్షికూఁతవలె ధ్వనించి నిలిచినవెంటనే దూరమునసుండి యిదే విధమగు మఱియొకకూఁత వినఁబడియెను. అంత వారటనే నిలిచిరి. కొంతవడికి వారియెదుట గగూలియా ప్రత్యక్షమయ్యెను. వారిరువురు నాతనికి వంగి సలామొనరించిరి.

గగూలియా చూడాధనునికిఁ గనఁబడిన విధముననే వస్త్రములను ధరించియుండెను. ఆతని వక్షముపై నాగప్రతిమయుండెను. దాని నేత్రస్థానమందలి రత్నములకాంతి విరాజమానముగ నొప్పుచుండెను. ఆతఁడు రెండునిముసములు చూడాధనుని దదేకదృష్టిని జూచి యీవల నిట్లు ప్రశ్నించెను.

"ఓయీ! నేనెవరో నీకు తెలియును గదా?"

ఇంతవఱకుఁ దలవంచుకొని యేమియో యోచించుచున్న మాడాధనుఁడు గగూలియా వచ్చుట చూడలేదు. ఇప్పు డాతని ప్రశ్నము విని తలయెత్తి చూచెను. ఎవ్వనిపేరు విన్నమాత్రమున నా దేశమంతయు భయభ్రాంతమైపోవునో ఎవ్వనిపేరు స్మరణకు వచ్చినమాత్రాన తానంత భీతినందెనో ఎవని రూపము జూచినంతనే నిశ్చేష్టుఁడై తాను భూమిపై వ్రాలెనో యా ప్రసిద్ధ చోరశిఖామణిని గగూలియాను ఎదుటఁ జూచెను. ఆతనిగని మొదట మాడాధనుఁ డతిభయ మందెను. కాని యా భయము చాలకాలము నిలుపలేదు. ఆతఁడు గగూలియాప్రశ్నమున కిట్లు ప్రత్యుత్తరమిచ్చెను.

" తెలియును! నిర్దయామతియుఁ గర్కశుఁడును దస్యుపతియు నగు గగూలియా నెఱుంగకుందునా? "

గగూలియా ముఖమున మందహాసము దోఁచెను.

గగూ — తెలియును గదా! మంచిదే! నే నెట్టివాఁడ నైనదియు నాయాజ్ఞ నుల్లంఘించువారి కెట్టిగతి పట్టునదియుఁ గూడ తెలిసియుండు నని యెంచెదను. ఇప్పుడు నేనడుగఁబోవు ప్రశ్నములకుఁ దగు సమాధాన మీవలయును.

(1) "ఈదినము మధ్యాహ్నము శిథిలమందిరప్రాంతసరోవరము నందు నీవు వెదకుచుండినవస్తు వేది?

(2) అల్లు వెదకఁ గారణమేమి?

(3) ఆవల నీ కా ఇత్తడిపెట్టెయందు దొరికిన కాగితమున విషయ మెయ్యది?

(4) దానిని జదువఁగనే నీవట్లు వివర్ణుఁడవై పోవఁ గారణమేమి?

(5) ఆకాగితము నెందులకుఁ జింపివైచితివి?

(6) నీ వెవ్వఁడవు? నివాసమెక్కడ?"

నాప్రశ్నములకుఁ బ్రత్యుత్తరమిమ్ము. ఈయక ప్రాణము వహించితివా దానికిఁ దగిన శిక్ష ననుభవింతువు."

ఆప్రశ్నములెల్ల చూడాధనుఁడు వినియెను. అన్నియు నిధికి సంబంధించిన ప్రశ్నములే. వానియందు దేదానికిఁ బ్రత్యుత్తర మిచ్చినను నిధినిరయము బహిరంగమగును. ఆ ధనవృత్తాంతమును గుఱించిన యొక్కొకముక్కయైన బయల్పడిన గగూలియా యూరకుండువాఁడుగాఁడు. ప్రత్యుత్తరమొసంగిన బుద్ధిపూర్వకముగ సంశోధనము నాశనము పాలొనరించుటగదా? అసలీ ప్రశ్నములకు బదు లొసంగఁ గూడదు. చూడాధనుఁ డిట్లు నిశ్చయించుకొని యిట్లనెను.

"నీవిప్పుడడిగిన ప్రశ్నములందు దేనికిని నేను బ్రత్యుత్తర మీయఁజాలను."

గగూ — ఓయీ! మూఢమతీ! గగూలియా కెదురాడి జీవముల తోడ నుండినవారు లేరని తెలియవా? బుద్ధిగలిగి నాప్రశ్నములకుఁ బ్రత్యుత్తరమిమ్ము.

చూడా — నీబెదరింపులకు నేను భయపడను. నీవడిగిన ప్రశ్నములందు దేనికిఁ బ్రత్యుత్తర మిచ్చినను దానివలన నాకుఁ జాల నష్టము వాటిల్లఁగలదు. నీవేమిచేసినను వానికి బ్రత్యుత్తరముల నావలనఁ బడయఁజాలవు.

గగూలియా క్రుద్ధుఁడై పోవుచుండెను. కోపారుణితములై యున్న యాతని నేత్రములనుండి వచ్చు చూపులు అగ్నివిస్ఫులింగములవలెఁ దీక్ష్ణములయినవి. వానిచే నాతఁడు చూడాధనుని భయమందింపఁ బ్రయత్నించుచు నిట్లులనియెను.

"మఱల చెప్పుచున్నాను. నాయాజ్ఞకుఁ బ్రతిఘటించినవారిని విధ్వంసమొనరించుట నాకు సహజము. అతిభయంకరమగు నాకోపంబు నకు గుఱిగాకుము. ప్రత్యుత్తర మిమ్ము."

జూడా — ఫలశూన్యమగు ప్రయాసతోఁగాని నీభయంకర వాక్యములు నను బెక్కసించునంతటి శక్తిగలవి గావు.

అంతట గగూలియా జూడాధనుని బట్టుకొనివచ్చిన యిరువురకు నిట్లాజ్ఞాపించెను.

“వీనిని దోడ్కొనిపోయి నాగపురపుమార్గమునకు దక్షిణమందున్న మఱ్ఱిచెట్టుకొమ్మకుఁగట్టి యురితీయుఁడు. నేనడిగిన ప్రశ్నముల కుత్తరము లిచ్చునట్లు మీచే నైనంతవఱకు బోధింపుఁడు. వినకున్న నట్టి దుర్మ్మరణముచేత నాయధికారబలమును గ్రహింపనిండు.”

గగూలియా యచటనుండి వెడలిపోయెను. వారిరువురును జూడాధనుని దోడ్కొని యావటవృక్షముకడకుఁ బోవఁదొడఁగిరి.

జూడాధనుఁ డురితీయఁబడుటకు నిర్దేశింపఁబడిన మహావటవృక్షము గగూలియాకు నాతనికిఁ బైసంభాషణము జరిగినయెడ కెంతయో దూరములేదు. గగూలియాభటులు జూడాధనునితో నటకుఁ బదునైదు నిముసములలోఁ జేరఁగలిగిరి. వారిరువురందొకఁడు వటవృక్షముపై కెక్కి యట నొక శాఖాకోటరమునుండి లావుగనున్న త్రాడునుదీసి యాకొమ్మకే దాని నుచ్చుగావేసి రెండుకొనలను గ్రిందికివిడచి దిగివచ్చెను. ఇప్పటికైనఁ జూడాధనుఁడు ప్రత్యుత్తర మొసంగుట కొడంబడునేమో తెలియ వారియందు రెండవవాఁడు జూడాధనుని కిట్లు బోధింపఁగడంగెను.

“అబ్బాయీ! నీవు చాల చిన్నవాఁడవు. ఈలోకాన నీ వనుభవింపఁదగిన సౌఖ్యము లెన్నియో గలవు. కొన్ని ప్రశ్నములకుఁ బ్రతిభాషణము నొసఁగనని, నీవు ప్రాణములఁ గోలుపోవుదువా! నీ వెంత తెలివిహీనుఁడవు. గగూలియా యిష్టము నెరవేర్చి లోకమున మనవచ్చును. దానికిఁదగిన బహుమాన మాతఁడే యొసంగును. ఆతనిఁ బ్రతిఘటింపఁజూచుట నీవినాశమును జాటుచున్నదిగాని వేఱుగాదు.

ఇప్పటికైనను జెప్పిన దేమియును లేదు. ఆప్రశ్నములకుఁ దగు నుత్తరము లిచ్చెద నంటివేని యిప్పుడే నిన్నాతనివద్దకుఁ దోడ్కొనిపోయెదను. ఆతఁడు నీవు మఱలవచ్చితివని సంతోషించి బహూకరించును. ఏమనెదవు? చెప్పుము."

చూడా — నీవు నీయధికారియాజ్ఞ నెరవేర్చుకొనవచ్చును. గగూలియా యడిగినసంగతి తెలుపుటకే నే నెంచియుండిన నాతఁ డడిగినప్పుడే చెప్పియుందును. చెప్పనిచో తరువాత నీ వొకమాఱు నింకొకఁ డొకమాఱు, గగూలియా భయంకరరాక్షసుఁడని నన్ను బెదరించిన మాత్రమునఁ జెప్పెదనా? చెప్పను. మీపని నెఱవేర్చి పొండు.

ఇంక నాతనికి, జెప్పుటవలన నుపయోగములేదని యెంచి మాటాడినవాఁడు తాడియుంచిన కొకదానికి నుచ్చు ముడివైచి చూడాధనుని మెడకుఁ దగిలించెను. రెండవవాఁడు చిగిలికొనఁ బట్టికొని త్రాటిని లాగుటకు సిద్ధముగనుండెను. చూడాధనుని ప్రాణము యమసదనమున కరుగుట కెంతయో వ్యవధిలేదు.

ఎటనుండియో యప్పు డొక యశ్వారోహి పవనవేగమున నయ్యెడ కనతిదూరమున కరుదెంచెను. వచ్చుచున్నప్పు డొక్కవీక్షణముచేతనే యట జరుగనున్న ఘోరకృత్యము నాతఁడు గ్రహించెను. చొక్కాయిజేబినుండి యొక నాళీకాస్త్రము దీసెను. తనకేదే నపాయము రానున్న దాని నుపయోగింప సిద్ధముగ నుంచుకొనియెను. గంభీరస్వరమున నిట్లనియెను.

"ఓరీ! హంతకులారా! విడువుఁడా యువకుని! ఆతనిపైనఁ జేయి నిడితిరేని మీప్రాణములు మీవి కావు."

గగూలియాసేవకు లిరువురు భ్రాంతులై వెనుదిరిగి చూచిరి. వారి యెదుట నొక యుత్తమాశ్వమును నధిరోహించి యొకవీరుఁడు తమపై పిస్తోలును గుఱిపెట్టియుండుట కనఁబడెను. ఆతనిరాక తమ హత్యా

కార్యమును జూచుట పిస్తోలు గుఱిపెట్టుట పైపాటు లాగుట ఇవన్నియు నఱనిముసములో జరిగిపోయినవి. అందుచేత వారు వాని కంట్లబడకుండ తమ ఘోరకృత్యమును దాచుటకు గాని యాతని విజృంభణముం బ్రతిఘటించుటకుంగాని కాలము లేకపోయెను. తాము నుచేయం బ్రయత్నించినను నాపీయనిచేతి పిస్తోలునందలి యగ్నిగోళము తమ్మూరక విడిచిపుచ్చదని వారికిం దెలిసిపోయెను. అందుచే వారేమిచేయుటకుందోంపక చూడాధను నచ్చటనే విడచిపైచి పాఱిపోయిరి.

అంత నాపీయుఁడు గుఱ్ఱముపైనుండి దిగెను. చూడాధనుని మెడనుండి యాయుచ్చును చేతికట్లను విప్పివేయుటకు నాతని కెంతయో కాలము పట్టలేదు. చూడాధనునిగూడఁ దన యశ్వముపైననే యెక్కించుకొని తాను నధిరోహించి యా భయంకరస్థలమునుండి యాపీయుఁడు నిష్క్రమించెను.

• ౧౧

నాఁటిరాత్రియంతయు లలితకు నిద్రపట్టలేదు. ఎన్నఁడును రాత్రులందు గృహమును వదలియుండని తనతండ్రి నాగపురమునకరిగి రెండు దినములయినను రాకుండుట యామెకుఁ జిత్రముగనుండెను. మార్గమధ్యమం దాతఁ డేదైననాపదకు లోనయ్యెనా? వారట్లు గృహంబునకు రాకుండుటకుఁ గారణ మేమయియుండును. కేశవచం దామధ్యాహ్నము మణీపురమునుండి యరుదెంచి వెంటనే నాగపురమునకు జనెను. ఇరువురు రెండుదినములయినను నింటికి రారైరి. పోయిన కార్యము పూర్తికానందున నాగపురముననే నిల్చిరా?

లలితమానసమున నేదో యవ్యక్తభయంబుతోఁచి యామెను గలంచివైచుచుండెను. తన కలవరమునకుఁ గారణ మిదమిత్థ మని యామెకు బోధపడుటలేదు. ఎంతయూరడించుకొనినను నామె మాన

నము క్షమింపఁబడుటలేదు. వెలుపల నేవిధమగు శబ్దము వినవచ్చినను క తండ్రిగారు వచ్చుచుండిరని మాధవుఁడు వెలుపలికివచ్చి చూచుచుండెను. కాని యారాత్రియంతయు నిరీక్షణముననే గడచిపోయెను. ఆనంద కేశవులజాడయే లేదు. కాలము జరుగుచుండినకొలఁది లలితభయము హెచ్చుచుండెను. ఆరాత్రి మాధవుఁడు మహాభయంకరము నధిక వేదనము గలిగించునదిగా నుండెను.

ఆరాత్రి యెట్లో గడచెను. దిక్కులు తెల్లవారెను. తూర్పు రేకలు తోఁచెను. లలిత మరల వాకిటకువచ్చి యిప్పటికైన నానంద కేశవులు వచ్చుచుండిరేమో యని యెదురుచూడ మొదలిడెను. రాత్రి యంతయు నిద్దురలేనందున నామె కన్నులు గెంపుగారియుండెను. ఆమెచూపులు కీచకాటవిపై నిలిచియుండెను.

అప్పు డొక డా గృహారామమును బ్రవేశించి బిరబిర నామెకడ కను దెంచి "లలితా! మీతండ్రిగా రింకను రాలేదా ?" అనియెను. లలిత యాతనివైపు దృష్టి మరల్చెను.

"మాధవా! రాలేదు! నీవు మొన్న మధ్యాహ్నము కేశవ బాబుతోఁ బోయినప్పుడు నాన్న నెచ్చట గలిసికొంటిరి ?"

"కీచకాటవియందే కలిసికొంటిమి. కేశవబాబుగారు మీతండ్రి గారితో నాగపురమునకుఁ బోయిరి నేను మరలివచ్చితిని."

"మాధవా! నీవు నాకొకపనిచేసిపెట్టెదవా ?"

"లలితా! నీవడుగుటయు నేను చేయకుండుటయునా! నా ప్రాణములైనను నీపాదములకడఁ దీసివైచెదను. నీయొక్క చిఱునవ్వే చాలదా నాచేత నెట్టిపనిగాని చేయించుటకు ?"

"మాధవా! నాన్న నాగపురమునకుఁ బోవునప్పుడు శాంతబాబు వద్దకు బోవలయునని చెప్పెను. నీకిప్పు డేమియుఁ బనిలేకున్న నాగ పురమునకుఁ బోయి చూచివచ్చెదవా? శాంతబాబు నడిగిన నా

చ్చుటనున్నదియుఁ జెప్పుము.”

“నాకిప్పు డేమియుఁ బనిలేదు. ఈ దినము మధ్యాహ్నము మీరాఁడటచే నేను తోఁట కరుగఁ దలఁచినది. అంతకుఁ బూర్వము ప్రభాకరుఁడు చూచుకొనును. ఇప్పుడే బయలుదేరితినేని మధ్యాహ్నమునకే రా గలను.”

“కొంచెము దయయుంచి పోయిరమ్ము. నాకేమియుఁ దోఁచుటలేదు నాకింకేదైన నపాయము కలిగిన దేమో యని భయముకలుగుచున్నది.”

“అట్లే పోయివచ్చెదను. నిశ్చింతతో నుండుము. ఏభయమును లేదు.” అని మాధవుఁడు వెడలిపోయెను. ఆతఁ డరిగిన వెనుక లలిత వాకిటవైచియున్న బల్లపై గూర్చుండెను. ఆమె మనంబున నేమాలోచనకలిగెనో తెలియలేదుగాని యామె నయనములు బాష్పపూర్ణము లయ్యెను. కన్నీరు ముత్తెములవలె బొటబొట జారి యామె చెక్కుటద్దములనుండి వక్షముపైఁబడి మాయమగుచుండెను. క్రమముగా నామె తన మొగమును జేతులతో మూసికొని వెక్కివెక్కి యేడువ దొడఁగెను. కొంచెముసేపిట్లే గడచెను.

“లలితా! ఏల యేడ్చుచుంటివి?”

లలిత ముఖమునుండి చేతులను దీసెను. అప్పుడప్పుడే యుదయించుచున్న సుధాకరబింబము మబ్బు తెఱనుండి వెడలినప్పు డెట్లుండునో యట్లులనే తీవ్రాశ్రుపాతముచేత నరుణితమైపోయిన యామె మోము కేశవుని కాశ్చర్యము కలిగించెను. ఆతఁ డామెయెదుట నిలువఁబడి తదేకదృష్టినిఁ జూచుచుండెను. “ఈమె యేల యేడ్చుచున్నది! ఆనందుఁడు నాసంగమునకు గాదుగదా? కాకున్న మఱెందులకు?” అని యాతఁడు భావించుకొనుచుండెను.

లలిత యాతనిఁ జూడఁగనే మన మొకింత కుదుటపడ నిట్లడిగెను.

“నాన్న యెక్కడ? నాగపురమునుండి మీతోడవచ్చెనా?”

భ్రాతృఘాతకుఁడగు కేశవునకు లలిత వైచిన యనుమానరహిత

మునఁ బ్రేమరసప్రాంతమునునగు పై ప్రశ్నము నందొక తీవ్రమైన యసాధారణస్వభావము ద్యోతక మగుచున్నట్లు తోఁచెను. ఆమె కెట్లు ప్రత్యుత్తరమిచ్చుటకును దానికిఁ దెలియలేదు. ఏసమాధానము చెప్పినను పతిసూక్ష్మమగు లలితబుద్ధి దానియందు నిశ్చయార్థమును గనుఁగొనునేమోయను భీతి యాతని నావరించెను. బదులు చెప్పకున్న నది సంశయమునకును నాస్పదముగాదా? బదులుచెప్పుటెట్లు? చెప్పకుండుటెట్లు? మనంబునఁ దోఁచుచున్న పలువిధములగు ననహ్యాలోచనలను బలవంతముగ నడఁచికొని, యెట్టకేలకుఁ గేశవుఁ డిట్లు ప్రత్యుత్తరము చెప్పెను.

కేశ — లలితా! నాగపురమునం దవసరకార్యము లుండుటచేత నాకందుఁడు రేఁడుకూడ నచ్చటనే నిలిచెను. ఈదినము సాయంత్రమునకు రాఁగలఁడు నీవేడ్చు టెందులకు?

లలి — ఎందులకును లేదు! మనస్సునం దేదో భయము కలిగినది. అందుచేత నా కేడుపువచ్చినది.

కేశ — ఆనందుఁడు రాఁడనియేనా?

లలి — అవును.

కేశ — ఎంత పిచ్చిదానవు? ఆనందుఁ డేమైనను నిన్నువిడిచి పారిపోవునని యెంచితివా? లేక యాతని నెవరైన నెత్తుకొని పోదురని భయపడితివా? ఏభయమును లేదు. ఏడువకుము! అంతమాత్రమున కేడ్చుటకేనా?

ఈమాటలనునప్పుడు కేశవుని కంఠస్వరమొక విధమైన తీవ్రత వహించెను. ప్రతివస్తువును బ్రతివాక్యమును బ్రతిమనుష్యుని ననుమానించు స్వభావముగల యపరాధకళంకిత మనస్కుఁడైన నీమాటలను గేశవుఁడు పలుకుచున్నపుడు వినియుండిన వానియందు భయంకరమగు సంతాపశ్రేణియో యున్నదని యనుమానించియే యుండును. లలిత

...లను పరిశీలించు స్వభావముగల దగుట కేశవుని మాటల నను మానించక తన యకారణభయమునకు సిగ్గుపడుచు లోనికరిగెను. కేశవుండును లోనికి వచ్చెను. అతని మనంబునం దప్పుడు ముప్పిరిగొనియున్న సంక్షోభము పౌర్ణమినాటి యుత్తుంగతరంగసంకలితమగు సముద్రము వలె నుండెననిన నతిశయోక్తి యుండదు. ఒక్కెడఁ గూరుచుండి యాలోచింపఁదొడఁగెను.

“ఈ దినము లలిత కంకణస్వరూపమేల విచిత్రముగ మాటాడిపోయినది? ఆమె దేనినో యనుమానించునట్లున్నదే! దేనిని! ఆనందుని నిజస్థితి తెలియకున్నను నామె మనంబున నాతని కేదే నపాయము గలిగియుండు నను సందేహ మామెకుఁ గలిగినట్లున్నది. ఇప్పు డనుమాన మాత్రముగా నున్నది యింకఁ గొన్నిదినములకు నిజంబయి నప్పుడేమి యొనరింతునో!......ఇప్పటి కానందుఁ డాగుపడుటయందు సగమాహారము లేకయు సగము భయముచేతను జచ్చియుండును. అతని యదృశ్యమునకుఁ గారణ మేమని తెల్పవలయునో తోఁచుటలేదు. శాంతబాబు నే నెట్లు పలికిన నట్లు వినును. సతీశుఁడును నట్టివాఁడే, ఆనందుఁడు నాగపురమునుండి వచ్చునప్పు డెవరో యాతనిఁ జంపివైచి నట్లు కల్పింపవచ్చును. తొలుత నాతఁడు నాతోడ నాగపురమునకు వచ్చినట్లు నిరూపింపవలయును. ఇందులకు శాంతబాబు సతీశుఁడే తగిన వారు. వా రానందుని నాగపురంబునఁ జూచినట్లు చెప్పిన నందఱు నమ్ముదురు. వారి నట్లుపలుకుట కొప్పించుటెట్లు? ఎట్లైన వారిని వలను వైచుకొని నా యిష్టానుసారము వచించునట్లు చేయవలయు. నేటి మధ్యాహ్నము నాగపురమునకు వత్తుననియు నాకొఱకు వేచియుండు మనియు వారికి సమాచార మంపవలయును. నేఁ డుదయము మాధవుని కేమియుఁ బనిలేదుకదా? వానిని బంపెదను.” కేశవుఁడు లేచి వెలుపలికివచ్చి “మాధవా! మాధవా!” అని పిలిచెను. ఎవ్వరును

ప్రత్యుత్తరమీయలేదు. మరలఁ బిలిచెను. అప్పుడు వనమునకొక ప్రక్క నున్న ప్రాంగణమునుండి రాముఁ డేతెంచి "మాధవుఁడు నాగపురమునకుఁ బోయెను." అని తెలిపెను.

కేశవుఁడు ప్రబలనిర్ఘాతమును బడసినవానివలె కొంచెముసేపు నిశ్చేష్టుఁడై యుండి వానికిఁ దెలియకుండఁ దన భయమును దాఁచ ప్రయత్నించుచు "రామా! ఎప్పుడు పోయినాఁడు నాగపురికి?"

"ఉదయమే."

"ఎందులకు?"

"ఎందుకో తెలియదు. మధ్యాహ్నము వచ్చెదనని చెప్పిపోయెను."

"సరి. నీ పనిగనుము!"

అతఁడు వెడలిపోయెను. కేశవుఁడు లోనికివచ్చి యాసనమునఁ గూలఁబడెను.

"ఏమి! మాధవుఁ డెందులకుఁ బోయియుండును నాగపురికి? పెద్దవానియింటికే పోయెనేమో! పోయినవాఁడు శాంతబాబును సతీశుని జూడకుండునా? నాకు తా నామెఁ గాని జూడలేదని చెప్పెఁ గదా! ఒకవేళ నే నామెయందునకు నాగపురమున కరిగెనని చెప్పిన నమ్మునా? ఎట్లైనను మాధవుని మూర్ఖత్వమును నే యడ్డగించి యాతఁడు వెంటనే తెలిసికొనునట్లు కలుగునో గ్రహించి నామాటప్రకారము వానినొడంబఱచుకొనవలయును."

లలిత యప్పుడు లోనినుండి యరుదెంచి "బాబా! జగచ్చంద్రబాబుగారఁట! విజయచంద్రబాబుగారి కుమారుఁడట నిన్న నాయొంటరిగ నిచ్చుటకై వచ్చి నాన్నఁ గలిసెను. మీరిద్దరు నాగపురమున కరిగితిరని చెప్పితిని. అంత నాయన గూడ నాగపురమునకుఁ బోవుచుంటి ననియు సెలవిచ్చినట్టు నమస్కరించియుఁ జెప్పిపోయెను." అని చెప్పి మరల లోపలికిఁ బోయెను.

కేశవుని మాటలు విన్నవుడు వెల్లుకొనవు వర్ణింపఁ బూనుట సాహసము. అది వేదనముగాదు, భయముగాదు, ఆశ్చర్యముగాదు, సంగ్రహముగాదు. అన్నియు నొకదానితో నింకొకటి సంగుడితమై యేకముఖముగ శతఘ్నినుండి విడువఁబడిన గోళమువలె నాతని మానసమును వ్రేల్చఁబొడఁగెను.

అతఁడు నిలువఁబడి పైమాటలు చెప్పుచున్నంతకాలము వాని లోని కనుగ్రుడ్లు పిమ్మటఁ గొంతకాలము మాత్రము ద్రిప్పి యాతఁడు నిలువఁబడిన స్థానమునందే యచంచలంబుగ నిలువఁబడియుండెను. ఆ చూపునం దొక యద్వితీయశక్తి మిళితమై యున్నది. ఇతరుల హృదయమునందలి భావమును వీక్షణమాత్రముననే గ్రహించుశక్తి దానికి. కాని యాతనిదృష్టి యలిగినపై నేమియుఁ బ్రయోజనకారి గాలేదు.

“జగచ్చంద్రుఁ డిచ్చటికి వచ్చెనా? ఏమి వాని ధైర్యము! ఆతని కానందము సమృద్ధము తెలిసిన నాతఁడు నన్నే యనుమానించును. ఈమూలమున నా నిధివిషయ మాతని కర్పింపఁబడిన నా యాశయము లన్నియు వ్యర్థములై పోవునుగదా! నాగపురమునకు నేము వచ్చితిమని యాతఁడు మాకొఱకచ్చట విచారింపకుండఁడు. విచారించినచో నెవరినడిగిననైనను మేము రాలేదని తెలిసికొనును!...ఎంత పిచ్చియాలోచన! నాగపురములో నుత్తరదక్షిణములు సరిగ తెలియని జగచ్చంద్రుఁ డెచ్చటనని మాకొఱకు విచారింపఁగలఁడు? ఎవరు తెలుపుదురు మేము రాలేదని? మేము నాగపురమునకే పోలేదని యాతఁ డెవ్విధమునను గ్రహింపఁజాలఁడు. అచ్చటినుండి వచ్చునపుడు మాధవుఁడు నాతని గలిసికొందురేమో? కలిసికొనిన మాధవుఁడు నిజము దెలుపును. తెలిసిన జగచ్చంద్రుఁ డెన్ని యనుమానములఁ బూనఁగూడదు? ఏమో వరుసగ కష్టములు వచ్చునట్లున్నది. వీనిని బరిహరించుటెట్లు? ...... మఱికొన్ని దినములవఱకు

నాయందుండు నాకన్న లలిత జగచ్చంద్రాదులతోఁ దన తండ్రివిష
యము చెప్పకొనకుండునా! ఏవిధముగనైనను నారహస్య మాతనికిఁ
దెలియకపోదు. దీనిని ప్రతిఘటించుట యెట్లు! .... నే నుపాయ
మేమియుఁ గనఁబడుటలేదు! నారహస్యమును వెలికి రాకుండ నేనిం
కైన సాహసించెదను. జగచ్చంద్రుని బలిచూపించెదను: ఆతని
వలని భయ మంతటితోఁ దీరును. మాధవుఁడా! ఆతనికి ధన
మిచ్చెదనని యాశఁజూపియో లేక ప్రాణము తీయుదునని భయపెట్టియో
యీరహస్యమును బహిరంగము చేయకుండ నాపవలయును."

కేశవుఁ డటనుండి లేచివచ్చెను. వాకిటియందుఁ గొంతకాల
మేమియో చింతించువానివలె నిటునటు ప్రచారము చేయుచుండి
పొలాల నడుమకో వెడలిపోయెను.

రెండుగంటలు గడచినవి: లలిత వంటపూర్తి చేసి వెలుపలికి
వచ్చెను. కేశవుఁ డటలేఁడు. ఆమె యాతనికొఱకు వేచియుండెను.
కొంతసేపయిన పిమ్మట కేశవుఁడు వచ్చెను. లలిత కాతనియం
దేదియో యపూర్వమగు వైఖరి కనఁబడెను. అదియెద్దియో తెలియ
లేదు: తన యనుమానమును మనంబుననే యణఁచుకొని లలిత
భోజనము సిద్ధముగనున్నదని పలికెను. కేశవుఁడు వచ్చుచునే లలిత
యెడ నొక తీక్ష్ణవీక్షణముఁ బఱపి యిట్లడిగెను.

"లలితా! మాధవుఁ డెచ్చటికి బోయెనో నీవెఱుంగుదువా?"

లలిత — నాన్న రెండుదినములనుండి రాలేదని భయమున నే
నుదయమే మాధవుని మీకై విచారింప నాగపురికిఁ బొమ్మని యడి
గితిని. ఆతఁడు నప్పుడే పోయెదనని వెళ్లెను.

కేశ — ఎప్పుడు వచ్చెదనని చెప్పినాఁడు?

లలి — ఈ మధ్యాహ్నమే వచ్చెదనని పలికినాఁడు.

కేశవుఁడు వెలుపలికివచ్చి పెద్దగొంతుతో "భాస్కరా! భాస్కరా!

ఇటు రమ్ము" అని పిలిచెను. నారి యింటి వెనుకనైపున నుద్యానవనము నంటియున్న గృహమునుండి నౌకరు దయచేసెను. అతనిగని కేశవుం డిట్లు ప్రశ్నించెను.

"మాధవుడు వచ్చెనా!"

భాస్క — రాలేదు. మధ్యాహ్నమే వచ్చెద నని చెప్పిపోయెను. దాని కారణమేమో తెలియలేదు.

కేశ — అతఁడు వచ్చినవెంటనే నావద్ద కంపుము.

కేశవుఁడు లోనికి వచ్చెను.

కేశ — లలితా! నీవు చాలా తొందరపడితివి. ఒకపూట మే మాలస్యముచేసిన – అందుకై యింతభయపడి మాధవుని నాగపురమునకు బంపవలయునా? అతఁడు పోయినందున నిచ్చట పను లెన్నియో నిలిచి పోయినవి.

లలి — ఆతని కేమియు నవసరమగు పని లేదనినాఁడే?

కేశ — వాని కేమి తెలియును! ...... జగచ్చంద్రుఁడు వచ్చెద ననెనా నేఁడు?

లలి — అవును. ఈదిన ముదయమే వచ్చెద ననియెను.

కేశ — అయిన, మన మాతనికొఱకు వేచియుండుట మంచిది. ఇంకొక యఱగంటకాలముచూచి యావల భోజనమునకు వచ్చెదను.

లలిత లోనికరిగెను. కేశవుఁడు ముందు గూర్చుండిన యాసనంబు ననే గూర్చుండెను.

"ఒకపని పూర్తియయినది. ఇఁక రెండవదియు నీనాఁడే పూర్తి గావలయును. వీరేగాదు, ఇంకెవరు నామార్గమున కడ్డమువచ్చినను వారిగతియు నంతియే. నేఁ డీ రెండవకార్యముగూడ పూర్తి యొనర్చుకొని త్రైపానందుని మరణము కథగా ప్రచారము గావింపవలయును. అంతటితో నాయాశయములు చాలవఱకు ఫలించినట్లే యగును...,

లలిత యున్నదే! నన్ను గాదని ప్రతిఘటించి లలిత యేమి చేయఁ గలదు? అప్పటికప్పుడే నేదైనఁ జేయుదునెంచిన నామెనుగూడ హత జే. స్వలచితినే! నేఁడీకార్యము నెఱవేరిన నీభూమియంఁ బదివేల సామ్రాజ్యములను గన్నదానని!"

కేశవుఁడు మాటలాడుచుండగనే బాలిక్రాకమున్నే వెలుపల నుద్యానవనద్వారమునకడ బండిచక్రముల చప్పుడు వినవచ్చెను. కేశవుఁడు వెలుపలి కరిగెను. ద్వారమునకడ బండియుండి యిద్దరు యువకులు గృహాభిముఖముగ వచ్చుచుండిరి. వారిలో నొకఁడు జగచ్చంద్రుఁడు. రెండవ వాఁడు మాధవుఁడు.

వారిరువురఁ జూచినంతనే కేశవుని మోము నల్లనడియెను. నాకార్యములకీ విఘ్నములు వచ్చెనే! జగచ్చంద్రుఁ డొకఁడు వచ్చునని యనుకొన్న వేళల కిప్పుడీ యెవ్వరినో తోడ్కొని వచ్చుచున్నాఁడే! ఈతఁ డెవఁడు? విఘ్నములు వచ్చినవని కేశవుఁడు తొలుత మోము నల్లఁజేసి కొనినను నిపుడాతని మనఃస్థితి యాగంతులకుఁ దెలియఁగూడదను. తెలిసిన వారనుమానింతురు. కావున లేని నగ వదనమందెచ్చుకొని తనమ్రోలమున మధింపలేని మిత్రత్వమును వదనముతో వారల కెదురు చని లోని కాహ్వానించెను.

“మీపరిచయభాగ్య మింతవఱకు లేకున్నను మీరాక యేదియో కార్యార్థమని యెంచుచున్నాను రండు. (అని జగచ్చంద్రునిఁజూచి) మీరే జగచ్చంద్రబాబని యెంచెదను. మీతండ్రిగారికడకుఁ గార్యావసరముల నప్పుడప్పుడు వచ్చుచుండువాఁడను. అప్పుడు మీరు చాల చిన్నవారు. అందుచేత గుర్తింపరానంత మీరు మాఱిపోవుటచేత తొలుత మీరే జగచ్చంద్రులా యని యడిగితిని. బాబుగారు! వీరి పరిచయము నాకెప్పుడును గలిగియుండలేదు. వీరి నెచ్చటనో చూచినట్లు మాత్రము తోఁచుచున్నది. అయ్యా! మీరు నాగపురవాసులుగదా!”

చూడా — అవును నా నివాసస్థానము నాగపురము.

జగచ్చంద్రుఁ డేమియు మాట్లాడలేదు. అతఁడు మొదట కేశవుని జూచినప్పుడు దేనినో స్మరించి నిర్భ్రాంతుఁడై తదేకదృష్టి నాతని గొంత కాలము చూచి యేమియో యాలోచన చేయుచుండి కేశవుఁడు పై ప్రశ్నము వైచినతరువాత నిద్రనుండి మేల్కొనినవానివలె దానినుండి విముక్తుఁడై యలఁతినవ్వు మోమునందోప నిల్లనియెను —

ఆనందబాబు —

కేశ — నాపే రానందబాబుగాదు. కేశవచంద్రు. మాయన్న యానందచంద్రు.

జగ — కేశవచంద్రుబాబుగారా మీరు? మీయన్నగా రెక్కడ?

కేశ — నాగపురమున కరిగెను. ఇంకను రాలేదు.

జగ — మీ రెప్పుడు వచ్చితిరి?

కేశ — ఈదిన ముదయముననే వచ్చితిని. ఆనందుఁడు సాయంత్రమో, రే పుదయమో వచ్చును.

ఇట్లు మాటలాడుచు వారు గృహములోనికిఁ బ్రవేశించిరి. అట నున్న యాసనములయందుఁ గూర్చుండిరి. వారి సంభాషణము మరల నుపక్రమింపఁబడినది.

జగ — కేశవచంద్రుగారు! ఈతఁడు నాగపురజమీందారుని కుమారుఁడు చూడాఘనవసువు. మార్గమధ్యంబునఁ గలియఁగా మాకుఁ బరస్పరము మైత్రి ప్రారంభమైనది. అంతే నిరువురము గలసి యిటకు వచ్చితిమి.

ఆ బహిర్గృహమునకును వెనుకనున్న యింటికిని మధ్యనున్న ద్వారముకడ నొక మెఱుపు మెఱసిన ట్లయినది. జగచ్చంద్రుఁ డా దెసఁ జూచెను. క్షణకాలము కించిన్మందహాసశంకాద్యోతకమైన లలితావదనము కనఁబడినది. వారిచూపులు మరల సంధించినవి. లలిత లోనికిఁ బాఱిపోయెను.

జగ — కేశవబాబుగారు! మీరు నాకొక కార్యమున సహాయము చేయవలయును.

కేశ — ఏకార్యమునందైనను సరియే! నేను ఆనందునకు మీకుం దగుసహాయము చేయుదము. ఇంతకాలమునుండి మాతండ్రి మొదలు మే మందఱము మీయుప్పుతినియే జీవితము గడుపుచుంటిమి. బాబుగారు! మీరు మా సహాయమును గోరుటయా? ఆజ్ఞాపింపుఁడు. మీముదల నౌదలఁదాల్చి యొనరింతుము.

జగ — అంత గొప్పకార్య మేమియును లేదు. మాతండ్రిగారు నాకీప్రాంతమందున్న తోఁట లన్నియు నొసఁగిరి. నేను కలకత్తాయందపరాధపరిశోధకుఁ డగు నాగార్జునమిత్రునివద్ద సహాయోద్యోగమందుఁ బనిచేయుచున్నాఁడను. అంతదూరమునుండి యిచ్చటి యాస్తి సంబంధవ్యవహారములు విచారించుకొనుట కష్టము. అందుచేత నిచ్చట భూమి నంతయుఁ దగినవెల కమ్మివేయ నిశ్చయించితిని. నాగపురమునను నీప్రాంతములందును దానిని గొనఁదగినవారి నెవరినైన విచారించవలయును. అమ్మకమునందు మన కేమియు నష్టములేకుండ వెల నిర్ణయింపవలయును. ఈ కార్యములందు మీయొక్కయు ఆనందబాబుగారియొక్కయు సహాయ మర్థించుచున్నాఁడను.

చూడా — మిత్రమా! మీ రీభూమి నమ్మివైచెదరా?

జగ — అవును. అమ్మివేయ నిశ్చయించితిని.

కేశ — బాబుగారు! ఆవిషయమై మీ రేకష్టమును బడ నవసరము లేదు. నాగపురమునం దనేకు లున్నారు. వారిలో నెవరైనఁ గొనుట కంగీకరింతురు. — ఇంతయేల? ఇచ్చటనున్న మన మిత్రులు చూడాధనబాబుగారే కొనవచ్చును.

చూడా — మాతండ్రిగారితో మాటలాడెదను. ఒకవేళ మేమే కొనఁగలము.

కేశ — అట్టులే మాటలాడుదును. నేనును నాగపురమున విచారించెదను..... జగచ్చంద్రబాబుగారు! ఇంతశీఘ్రములోనే మీరు దీని సమ్ముకెంచవలదు! మేమేకదా దానిఁ గట సాగుఁబడిచేయించువారము! మీరు కలకత్తానుండి రాకున్నను మీకు సంవత్సరఫలితమును మణిపురమునుండి మహేంద్రబాబుగారిద్వారా పంపుచుందుము.

జగ — అట్లును చేయవచ్చును గాని ధనము చేతనుండిన నా ప్రస్తుతోద్యోగము మాని వేఱొక యుద్యోగమునకై ప్రయత్నించిన ఫలించునటు లున్నది. దానికొఱకుఁ బ్రయత్నింపవలయునని యెంచియున్నాను.

కేశ — మీయిష్టప్రకారము చేయవచ్చును. లోనికరిగి భోజనమునకు సిద్ధమొనర్పుమని చెప్పి మరల వచ్చెదను. మీరు స్నానము చేయుటకు సిద్ధముగనుండు" అనిచెప్పి కేశవుఁడు లోనికరిగెను.

ఆతఁ డరిగినవెంటనే జగచ్చంద్రుఁడు జేబునుండి పిస్తోలు తీసి చూడాధనుని కిచ్చి యిట్లనెను.

"మిత్రమా! ఈదినమంతయు మన మిచ్చటనే గడపవలయును. నేను మాటలాడుమాటలు నీకు విచిత్రార్థద్యోతకములుగఁ దోఁచినను నప్పుడేమియు మాటలాడకుము. దీనికిఁ గారణమంతయు నావల వివరించెదను. ఇచ్చట నేనపాయము శంకించుచున్నాను. కాఁబట్టి యీపిస్తోలును సమయమువచ్చినప్పు డుపయోగించుటకుఁ దగినస్థితి యందు దాఁచుకొనుము. భోజనము చేయునపుడు ముందు కేశవుఁడు తినని వస్తు వెద్దియు నీవు తాఁకవలదు."

ఈ మాటలు చూడాధనుని కాశ్చర్యము గలిగించినను నింతలోఁ గేశవుఁ డచ్చటికి వచ్చుటచేతఁ దన సంశయములను వాగ్రూపమున వెల్వరించుటకుఁ దగినవీలు లేకపోయినది. అందుచేత నూరకుండ వలసినవాఁ డయ్యెను.

కేశ — జగచ్చంద్రబాబూ! చూడాధనబాబూ! లెండు! స్నానమునకు నీళ్ళు సిద్ధముచేయించితిని.

జగ — కేశవబాబూ! పూర్వాహ్ణమున నదియందు స్నానాదికము నెఱవేర్చుకొంటిమి.

కేశ — అట్లయిన నేనుగూడ స్నానముచేసి వచ్చెదను. మీరు భోజనమునకు సిద్ధపడుడు.

అని కేశవుడు మరల లోనికరిగెను. జగచ్చంద్ర చూడాధను లచ్చటనే కూర్చుండి యేమియో సంభాషించుచుండిరి.

౧౨

భోజనానంతరము కేశవుడును జగచ్చంద్రచూడాధనులును జగచ్చంద్రుని భూమిని జూచుటకుఁబోయిరి. పోయి నాలుగు గంటలకాల మయినది. ఇంకను మఱలి రాలేదు. లలిత వాకిట నిలువఁబడి యుండెను. ఆమె యిట్లు భావించుకొనుచుండెను.

"ఉదయమున నాగపురమునకుఁ బోయిన మాధవుఁ డింకను రాకుండె నేలచెప్పుమా! మాతండ్రి సమాచారమును దెలియలేదే. మాధవుఁడు మఱలివచ్చి యేదైన నగత్యపుకార్యమువిూఁద నాతో మాటలాడ వ్యవధిలేకుండఁ బోయియుండునా? చిన్నబాబయ్యా యాతని దేనికైనఁ బంపియుండునా?... నేనెంతపిచ్చిదాననైతిని? ఒక దిన మాలస్యమయినంతనే యెంతదిగులు పడితిని? మాధవుని నాగ పురమునకుఁ బంపుటచేత నిచ్చటి పనులెన్నియో నిలిచిపోయినవఁట! సాయంత్రమునకు నాన్న వచ్చును. వచ్చినపు డాయనఁగూర్చిన నా దిగులును కేమనుకొనునో! అదుగో భాస్కరుఁడు — భాస్కరా! భాస్కరా! ఇటురమ్ము." భాస్కరుఁ డరుదెంచి "ఏమమ్మా! ఎందులకుఁ బిలిచితిరి?" అనెను.

లలి — భాస్కరా! మాధవుఁడు నాగపురమునుండి వచ్చెనా?

భాస్క — రాలేదమ్మా! కేశవబాబుగారు గూడ విచారించిరి. అతనికి మార్గమధ్యమం దేదైన నాపద సంభవించెనేమో! మధ్యాహ్నమునకే రావలసినవాఁ డింతవఱకు రాలేదు. వానికొఱకై కాళింది బెంగగొనియున్నది.

లలి — వచ్చి యింటికి రాక ఏపనిమీదనైన బోయియుండునేమో?

భాస్క — లేదమ్మా! పోయియుండిన నాకుఁ దెలియకుండునా? అయినను విచారించెదను అని భాస్కరుఁడు వెడలిపోయెను.

లలిత యచటనే కూర్చుండి యాలోచనాధీనమానస యైనది. అరగంటయైనది. అంత గృహోద్యానమునకు వెలుపలఁ గేశవజగచ్చంద్ర చూడాధనులు గనఁబడిరి. ఆమె లోనికి వెడలిపోయినది.

వారు ముగ్గురును గృహము సమీపించిరి. అప్పటికి సంజవేళ దాటియుండెను. సాయంత్రము నాలుగుగంట లయియుండును. గృహసమీపమునందు జగచ్చంద్రుఁడు కేశవునితో నిట్లనియెను.

"కేశవబాబు! మన మిపుడు నాగపురమునకు బోవలసిన దొక్కటియే నిలిచియున్నది. ఈవిక్రయ మెంతతొందరగఁ దీర్మానమయిన నంతమంచిది. ఇపుడే బయలుదేరుట మంచిది. మరల నుదయము రావచ్చును."

కేశ — ఆనందుఁడు రానిమ్ము. ఇప్పటికే యాతఁడు వచ్చియుండవలయును. ఆతనిఁగూడఁ దోడుకొనిపోయిన మంచిది. నాగపురమునం దాతనికిఁ జాలమంది పరిచితు లయియున్నారు. మనముపోయిన నాలుగుదినములు పట్టుపని యాతఁడుగూడ వచ్చినచో నొకనాటితోనే పూర్తియగును. మీరు కూర్చుండియుండుఁడు. ఆనందుఁడు వచ్చెనేమో విచారించివచ్చెదను అని కేశవుఁడు లోనికిఁబోయెను. జగచ్చంద్రచూడాధనులు వెలుపలనున్న బల్లపైఁ గూర్చుండిరి.

మాధవుఁడు జగచ్చంద్రబాబుతో నిట్లు సంభాషింపఁ బ్రారంభించెను.

"జగచ్చంద్రబాబు! నిన్నమధ్యాహ్నమునుండి యింతవఱకు నా జాడయే తెలియనందున మా తండ్రిగా రెంత దిగులుపడుచుండిరో! ఇంకను నాలసించి యాయనకు మఱింత మనోవ్యథఁ జేకూర్చుట మంచిదికాదు. నాకు సెలవిండు నేను నాగపురంబునకుఁ జనియెదను."

జగ — మిత్రమా! ఒకమాఱొంటిగఁ గీచకాటవియందు వచ్చి యట్టిమాపదకు లోనయితివి. మరల నీవు పోవుట క్షేమకరముగాదు. మఱియు నా నగూలియాంభటులు నా రాక నిరీక్షణమును వారి యధిపునకుఁ జెప్పికొనియుందురు: మఱికొంతమందిని సహాయముదీసికొని మనకొఱకు కాచియుందురు. కావున నొంటరిగ నీవరుగవలదు. అనపాయముగ ఱేపు పోయినను మేలే. మీతండ్రిగారీషద్వ్యథ నందినను బిమ్మట సంగతి సందర్భములన్నియు వినినపుడు మన మీదినమున రాక ఱేపు వచ్చినందుకు సంతోషింతురు.

మాధవుఁ డేమియు బదులు చెప్పఁజాలకపోయెను. ఆనాఁటి కచటనుండుట కంగీకరించెను. కేశవుఁ డింతలో నటకువచ్చి "జగచ్చంద్రబాబుగారు! ఆ నందుఁ డింకను రాలేదట. ఆతనికొఱకై పోయిన మాధవుఁడుసైత మింతవఱకు రాలేదఁట." యనియెను.

జగ — ఈమాధవుఁ డెవరు?

కేశ — ఆతఁడు మావద్దనుండు పనివాండ్రలో నొకఁడు. ఆతని తలిదండ్రులెవరో తెలియదు. మా తండ్రికాలమున నాయనవద్దనున్న పనివాండ్రందఱిపై యధికారిగా జయరాముఁడను నాతఁ డుండెను. ఆతనికి నాగపర్వత ప్రాంతమందు మార్గమధ్యమందొక శిశువు లభించెను. ఆమగబిడ్డను దెచ్చుకొని యాతఁడు నాతనిభార్య కాళిందియు దను యౌరసపుత్రునిగాఁ బెంచుకొనిరి. ఆతఁడే యీమాధవుఁడు. నాఁటి కీబిడ్డఁడు దొఁరకినపుడే యానందునికిని లలిత జన్మించియుండెను.

వారిరువురు నత్యంతస్నేహముతోఁ బెరిగిరి."

జగ — మాధవుఁడు నాగపురమున కెప్పుడరిగెను ?

కేశ — ఉదయమే! ఆనందుఁడు నాకొఱకై చింతించుచు లలిత వానిని పంపెనని. ఆనందుని యన్వేషింప నాతఁడు పోయెను. ఇంతవఱకు రాకుండెను. ఆనందుఁడే సాయంత్రమువఱకును గలసి రావచ్చునని మాధవుని నిలిపెనేమో!

చూడా — నాగపురమునుండి యిచ్చటికి మీరు ప్రయాణముచేయు మార్గమేది?

కేశ — కీచకాటవినుండి పోవుమార్గమే. అదియే నాగపురమునకు చాలదగ్గఱ.

చూడా — ఆ మార్గము చాల నపాయకరమైనది. ఆనందుఁడును మాధవుఁడు నామార్గమునం దేదైన నాపదకు లోనయిరేమో!

కేశ — ఏమో! ఇంతవఱకు నట్టియాపద లెప్పుడు గలిగియుండలేదు. వారికొకవేళ నిజముగ నపాయమే సంభవించియుండిన మనకెట్లు తెలియఁగలదు ?

జగ — ఎన్నటికి నట్టియాపద సంభవించియుండదు. ఆనందుని మాధవునిఁ గీచకారణ్యమునందుఁ గష్టములందించువాఁడెవఁడు? గఘూలియా యనియా మీరనుకొనునది ? ఇంతవఱకు గఘూలియా యుపయోగకార్యములగు హత్యలు చేసియున్నట్లు వినియుండలేదు. ఆనందాదులకడ నాతని కేమి లభించునని యాతఁడు వారికాపదఁ గలిగించును. వారేదో కార్యభారముచేతనే రాలేకపోయియుందురు. సాయంత్రమునకు దప్పక వత్తురు.

చూడా — నాగపురమున నెవరితోఁ బనియుండి యానందుఁడు నిలిచెను ?

కేశ — శాంతబాబను నొకఁడు ఘూకుఁ గొంతపైక మీయవలసి

యున్నవి. కేశవచంద్రబోసు మావద్దఁ దీసికొనిన [illegible]ములకై కొంత [illegible] వ్రాసియున్నవి. [illegible]వద్ద ధనము వసూలుచేయుటకే యీసం [illegible].

[illegible] — శాంతిబాబా! మీరను శాంతిబాబు ముదుసలియా? [illegible] మీ కుటుంబమునకుఁ బ్రక్కనున్నవాఁడేనా?

కేశ — [illegible]. అతఁడే.

చూడా — అతఁడు మా తాతగారి కాలమున మా గృహమందు [illegible]. మా తండ్రిగారి కాలమందు నొక చిన్నయధికార పదవియందుఁ బనిఁజేసియుండెను. ఇప్పుడేపనియుఁ జేయకున్నను మా తండ్రిగారు నెల కిరువదిరూప్యము లాతని కిచ్చుచుందురు. మొన్న [illegible] నాతఁడు మాకడకువచ్చి తనకీయవలసిన జీతమడిగెను. [illegible] మిచ్చెదనని తండ్రిగా రనుచుండిరి. ఆకారణమున నేమయిన నాలస్య[illegible]దేమో ?

జగ — ఈ శాంతిబాబు మీ తండ్రిగారికడను, తాతగారికడను నుద్యోగము చేసెనా? నీకుఁ జాల పరిచయముండునని యను కొనెదను.

చూడా — పరిచయ ముండుటేమి? నన్నుఁ బెంచినదే యాతఁడు. చిన్ననాటిమొదలు నాకు విద్యాదికము జమీందారివిచారణ మొద లగునవి యెల్ల నేర్పినగురువు. —

చూడాధనుఁ డీమాట లనుచున్నప్పుడు జగచ్చంద్రునిదృష్టి కేశవుని ముఖమునందొక వికృతిఁ గనిపెట్టెను. కేశవుని యొడలు విద్యుత్ప్రవహనమువలె నొకపరి గడగడవణఁకెను. అతఁ డంతలో దాని నణఁచివైచెను. జగచ్చంద్రచూడాధనులలోఁ దనయవస్థ నెవరైనఁ గనిపెట్టిరేమో యని చూచెనుగాని చూడాధనుఁడు వాకిటివైపుఁ [illegible] మాటలాడుచుండెను. జగచ్చంద్రుఁ డచంచలదృష్టిఁ జూడా

ధనుని జూచుచుండెను. కేశవుని సంశయము దొలఁగిపోయెను.

చూడా — చిన్ననాఁటినుండియు నాతఁడు నన్నపరిమితముగఁ బ్రేమించుచుండెను. మాతండ్రిగా రాతని యుద్గుణమ్ములఁ దెలిసినవా రగుటచేత, నతనికడ నావిద్యార్జన కేమియు నడ్డుపచింపలేదు. ఆతని జూడక నేను నన్నుజూడ కాతఁడొక్కదినమైన గడపలేము.

జగ — (చిఱునగవుతో) చూడా ధనబాబూ! ఈనాఁడు నీ వాతనిఁ జూడలేదే! ఎట్లుండఁగలిగితివి?

చూడా — (నవ్వుచు) ఔను. ఉండఁజాలను. పాపము! నన్ను జూడ కాతఁ డేమి చింతించునో.

కేశ — మించిన దేమియు లేదు లెండు. ఈదివసము చూచుకాలము గూడ రేపే తీర్చుకొనును లెండు శాంతబాబు.

నాఁటిసాయంత్ర మిట్లుగడచెను. ఆఱుగంటలయినది. ఆనందుఁడు గాని మాధవుఁడుగాని రాలేదు. కేశవుఁడు జగచ్చంద్రునితోడ మరల వచ్చెదనని చెప్పి, యెచ్చటికో పోయెను. జగచ్చంద్రుఁడుఁ జూడా ధనుఁడు నిరువురు, గృహారామమం దొక్కెడఁ గూర్చుండి, హాయి గొల్పుచు వీచుచున్న చల్లనిగాలి ననుభవించుచుండిరి.

ఇట్లే మఱి రెండుగంటలయినవి. రాత్రి యెనిమిది గంటలాయెను. కలకత్తాయందును మణిపురమునందును వసించుచుండిన జగచ్చంద్రున కచ్చటిరాత్రి వేరొకవిధముగా నుండునట్లు గన్పట్టెను. కేశవుఁడు వారు గూర్చున్నచోటికివచ్చి, భోజనమునకుఁ బోవుదమురండు. వంట సిద్ధమయినది యని వారిఁబిలిచెను.

జగ — కేశవబాబు! ఆనందుచందు వచ్చెనా?

కేశ — రాలేదు! మాధవుఁడుగూడ రాలేదు. ఉదయముమీతోడ నేనును నాగపురము వచ్చెదను. అప్పుడాతని కొఱకై విచారింతము. మధ్యాహ్నము చూడాధనబాబుగారు పలికినట్లు, నాయనుమానము

కారణ్యమందు వచ్చునప్పుడేదైన నపాయమునఁ జిక్కెదేమో యని భయము గలుగుచున్నది.

జగ — అట్లు మీ కనుమానమున్న, మన మిపుడే నాగపురము నకుఁ జని యానందబాబుగారిని గూర్చి విచారింతము.

కేశ — మన మిట్టివేళఁ గీచకాటవిని ప్రయాణముచేయు టాపదలఁ దెచ్చుకొనుటయే. పగటి యామార్గమునఁ బయనించు టపాయకర మైయుండ, రాత్రులందుఁ బోవ్రుదుమా? పలుమబాబు! ఒకనికి సహాయము చేయుటకుఁ బోయి తన కాపదఁ దెచ్చుకొనువా రున్నారా! ఉదయము పోవుదము.

జగ — సరియే ఉదయమే పోవుదము.

వారు మువ్వురు నింటిలోపలికి వచ్చిరి. జగచ్చంద్రుఁ డిట్లాలోచించుకొనియెను.

ఆనందుఁడు గృహంబునకు రాకుండుటకుఁ గారణ మేమయి యుండును? ... కేశవుఁ డానందుని ప్రసంగము వచ్చినప్పుడెల్ల, నాటి కానందుని గూర్చి విచారించు టాపుటకొఱకు వాదించుచుండుటకు, నన్నుఁ జూడాఘనుని, నీతఁ డీదినమంతయు నిటయుండు మనుటకు ప్రబలమగు కారణమున్నది. తనప్రతిజ్ఞఁ దీర్చుకొనుటకే కాఁబోలు! జాగునను జూతమీతని ప్రజ్ఞావిశేషము.

భోజనానంతరము జగచ్చంద్రచూడాఘనులకుఁ గూటమునందే రెండుమంచములపై శయ్య లమర్పఁబడియెను. వారు వానిపైఁ బరుండి నిద్రించిరి. ఆ కూటములోనికిఁ దెఱచుకొనుచు మూఁడుగదులుగలవు. అవి మూఁడును బడకగదులే. మొదటిదానియందుఁ గేశవుఁడు రెండవ దానియందు లలితయు, మూఁడవదానియందు నానందుఁడును బరుండు చుండును. నేఁ డానందుని గదియందెవ్వరునులేరు. కేశవుఁడు, తనగది యందుఁ బరుండెను. లలితమాత్రము శయ్యపై మేనువాల్చినదిగాని

యామెకు నిద్రఁబట్టలేదు. ఆరంభమందు నాగపట్నము విడిచి యానాటి తో మూఁడుదినములయ్యెను. కేశవుఁడు పలికిన ప్లీడరు డానాయుఁడ్రేమము రానేలేదు. ఆతనిఁగూర్చి విచారింపఁబడిన మాధవుఁడుగూడ రాలేదు. సాయంత్రమందుఁ గేశవు నావిషయమై యడుగ, నాతఁడు సరిగ సమాధానము చెప్పనేలేదు. నాకు రాకుండుటకుఁ గారణమేమని యూహింపవలెను? లలితమానసము సంశయప్రవాహమునఁబడి కొట్టుకొనిపోవుచున్నది. అట్టియెడ నామెకెట్లు నిద్రపట్టఁగలదు. ఆమె యాలోచనానిమగ్నమానసము నిద్రాదేవతను దఱిమివైచెను.

ఆమె యవ్విధమున నెంతసేపు నిద్రాహీనముగఁ బరుండియుండెనో తెలియదు. కేశవుని గదినుండి యొకవిధమగు శబ్దము వినఁబడి యామె నులికిపడఁజేసెను. లలిత లేచి కూర్చుండెను. శయ్యనుండి దిగెను. మెల్లఁగఁ దనగదికిని, గేశవుని గదికిని మధ్యగోడయందున్న ద్వారమునొద్దకుఁ జనియెను. అందలి చెక్కలసందునుండి ప్రక్కగది లోనికిఁ జూచెను. ఆగదియందింకను దీపము వెలుగుచునే యున్నది. శయ్యపైనఁ గేశవుఁడు పరుండియుండలేదు. దీపమువద్ద నిలుచుండి దేనినో వెలుతురునఁ బరీక్షించుచుండెను. ఆపరీక్షించు వస్తువేదియో? కేశవుఁడు లలితగదివైపు వీపుఁ ద్రిప్పియుండెను. ఆవస్తువు లలితకుఁ గనఁబడలేదు. కొంతసేపటి కాతఁడు లలిత గదిద్వారమువైపుఁ దిరిగెను. తిరుగునప్పుడాతనిచేతియందు దీపకాంతి నేదియో తళతళ మెఱసెను. లలిత కావస్తువు చక్కఁగఁ గనఁబడెను. అదియొక బిచువా (రెండంచులు వాఁడియైన పిడిబాకు) బాకొకటి చేఁబూని యిప్పు డాతఁడేమిచేయ నెంచియున్నాఁడు?

లలిత తానుజూచినది నిజమా లేక భ్రమయాయని యనుమానించెను మరలఁజూచెను. అంతయు నిజమే. ఆమెయట్లే స్తంభీకరించి నిలువఁబడిపోయెను. ఏమియును దోఁచలేదు. కేశవుఁడు లలితగది

వైపు తిరిగినపు డాతనిముఖ మామెకగపడెను. అది భయంకరమై యుండెను. అతఁడు చేయఁబూనిన ఘోరకృత్య మేమియో? ఆతని చేతియందలి యాసిశత్రుపాణ మెవని రక్తమును గ్రోలనున్నదియో? ఎవని ప్రాణముల నూఁపుసఁ దీయనున్నదియో?

ఉన్నట్లుండి కేశవుఁడు లలిత గదివైపు రాఁదొడఁగెను. లలిత దేహము కంపించుచుండె. ఆమె నిశ్శబ్దముగ శయ్యఁజేరి పరుండెను. మానసమున రెప్పపాటుకాలము భయంకరమగు నాలోచన యొకటి తోఁచి, యామె భయమును ద్విగుణీతము చేసెను. కేశవుఁడామెనే యాసిశాతాయుధఘాతమునకెఱ యొనర్పనెంచి యుండెనేమో?

ఆమెకంఁ బరుండుటకు మనసు నిలువలేదు! లేచి కూర్చుండెను. కూర్చుండఁ జాలకపోయెను. మఱల లేచి, యడుగుపై నడుగిడుచు ద్వారముకడ కరిగెను. కేశవుఁడు శయ్యపైఁ గూర్చుండి యుండెను. ఆమె గదిద్వారమువైపు చూచుచుండెను. ఆతఁడు తనదారుణకృత్యమునకు సమయము వేచియున్నాఁడు. ఆతఁడు హత్యచేయనెంచిన దెవరినైనను, నిప్పుడాతని కార్యమునకు భంగము గలిగింపవలయును. లలిత కొంచెముకాల మాలోచించుకొనెను. తుదకామె మెల్లగ లేచి గూటములోనికిఁ దెఱువఁబడు ద్వారముకడకుఁ బోయి యాద్వారమును నిశ్శబ్దముగఁ దెఱచెను.

తమతమ శయ్యలపై జగచ్చంద్ర చూడాధనులు పరుండియుండిరి. వారు ప్రశాంతముగ నిద్రపోవుచుండిరి.

జగచ్చంద్రుఁ డున్నట్లుండి యులికిపడి లేచి కూర్చుండెను. పడకపైన దేనికొరకో వెదకెను. ఆతని కేమియో దొరకినది. ఆతఁడు దానిని బరీక్షించిచూచెను. అదియొక యుంగరము. ఆతఁడేమియో భావించుకొనుచు మరలఁ బరుండెను. కొంతకాలమునకుఁ గేశవునిగదిద్వారముకడ నంతవఱకు సమయములేని దిపుడు కొంచెము వెలుతురు చాలుగాఁ

ప్రసరించినది. జగచ్చంద్రుని దృష్టు లాపైననే నిలిచిపోయినవి. గానురానాకాంతిరేఖ కొంచెముకొంచెముగ వెడల్పగుచుండెను. కేశవునిగదితలుపు నెవరో తెఱచుచున్నట్లు జగచ్చంద్రుఁ డూహించెను. కేశవుఁడుగా కింకెవ్వరు? ఇతఁడే తెఱచుచుండవలయును! అర్ధరాత్ర మయినవెనుకాతనికి గదితలుపుఁదీయు నవసరమేమి వచ్చినది? జగచ్చంద్రుఁడు పడకక్రిందఁ జేయిడి, యటనున్న తోలుసంచియందలి వాళీకాయుధమును క్షణములో గ్రహించి సమయమునకుపయోగింప వీలుండునట్లు, చూచువారి కెవరికిఁ గాన్పించనట్లును దాఁచి పట్టుకొనియెను.

కేశవుని గదిద్వారము రెండంగుళుల వెడల్పువఱకుఁ దెఱవఁబడినది. ద్వారముకడఁ గేశవుఁడు నిలువఁబడి యుండెను. కేశవునిగది యందలి దీపకాంతి పూర్ణముగఁ జూడాఘనుని పడకపైఁ బడియుండెను. ఆమంచమునకుఁ బ్రక్కననే జగచ్చంద్రుని మంచము వేయఁబడి యున్నది. జగచ్చంద్రుఁ డర్ధనిమీలిత నేత్రములతోఁ గేశవుని చర్యను గనిపెట్టియుండెను. మెల్లగ గదిద్వారముకడఁ గేశవునిమూర్తి ప్రత్యక్ష మయినది. ఆమూర్తి నీడ చూడాఘనుని మంచముపైఁ బ్రసరించి యున్న వెలుఁగున కడ్డమువచ్చినది. జగచ్చంద్రుఁడు కేశవుని నీడపై దృష్టినిల్పి చూచుచుండెను. రానురా నది చిన్నది యగుచుండెను. ముందుకుఁ బోవుచుండెను. రెండునిముసములకు ఆనీడ పూర్తిగ తొలఁగిపోయినది. అప్పుడు కేశవుని కుడిచేతియం దేమియో దీప కాంతిలోఁ దళతళమెఱసినది. అదియేమి? జగచ్చంద్రుఁడు గ్రహించెను.

కేశవుఁడు మెల్లమెల్లనఁ దనపడక డాయుచున్నాఁడు. నిముస మింకొకటిగడచిన పరిస్థితు లెట్లుండునో జగచ్చంద్రుఁడు పడకకుఁ గొంత దూరమునందే కేశవుఁడు నిలిచియున్నట్లు గ్రహించెను. ఇఁక నూర కుండుటకు వీలులేదు.

హఠాత్తుగ జగచ్చంద్రుఁడు లేచికూర్చుండెను. ఆతనిచేతిలోనుండి పిస్తోలు కేశవుని చేతిలోనికి సులభముగా జారిపోయియుండెను:

“ఓరీ! హంతకా! పిశాచమా! కదలితివా చచ్చెదవు” అనుచు జగచ్చంద్రుఁడు చేతియందలి భయంకరాయుధమును జూపించెను.

కేశవుఁడు నిర్ఘాంతపోయి నిలువఁబడిపోయెను. కొంతకాలము వఱకుఁ దానెక్కడనున్నదియు, ఏకార్యము చేయఁదలఁచినదియు, చేత నెట్టి మారణాయుధ మున్నదియు మఱచెను. ఆతనిదృష్టి జగచ్చంద్రుని నాల్గుదిక్కులనుండి తానున్న యుద్యానభాగము నెదురు చూచెను. జగచ్చంద్రుఁడు లేచి నిలువఁబడెను. మృత్యుముఖముఁ బోలిన యాతని పిస్తోలుయొక్క ముఖ మంతయు కేశవుని వక్షమును జూచుచుండెను. జగచ్చంద్రుఁడు కేశవుని డాయవచ్చి యిట్లు మాటాడఁ దొడఁగెను.

“కేశవా! జగచ్చంద్రుఁడు నీవంటివాని కుయుక్తులకును, హత్యాకార్య వైదగ్ధ్యమునకును సంతె సామాన్యముగ లోఁబడువాఁడు గాఁడని యిప్పటికైన నీకుఁ దెలిసిన మంచిదే! నన్నిచ్చటికి రావలదని శాసించిన ప్రతిజ్ఞను దీర్చుకొనఁజూచితివా? మదాంధుఁడవగు నీవు గమనింపలేకపోయితివిగాని నిన్నుఁజూడఁగనే నీ వెవ్వఁడవైనదియు గ్రహించితిని. ఒకపనియందుమాత్రము నీవు పిచ్చితనముఁ జూపితివి. సురేశబాబుగారి గదాపేటుకడ నీ యాననము నాకుఁ జూపియుండక యుండిన బాగుండెడిది. నన్నుఁజంపిన నీకు రాఁగల బహుమాన మీనాఁటికి వలదు. ఉదయమున నాగపురమునకుఁ జని మరల నీ దర్శనము చేసికొనెదను. అప్పుడు ప్రయత్నింతువుగాక బహుమానముకొఱకు.

ఈసమ్మడికి జూడాధనుఁడు మేల్కొనెను. తనకు జగచ్చంద్రుఁ డిచ్చిన పిస్తోలు తీసికొని జగచ్చంద్రునికడకు వచ్చి నిలువఁబడెను. మధ్యాహ్నము జగచ్చంద్రుఁ డాయింట నపాయము శంకించుచుంటి

నని చెప్పినమాటలయందలి విపరీతార్థము నిప్పు డాతఁడు గ్రహించెను. కేశవుఁడు ప్రపంచమునందలి యనేక వేషధారులకంటెను మిన్న యనఁ దగినవాఁడు. ఉదయమునుండి యాతఁ డెంతమిత్రుఁడుగ నటించినాఁడు! ఎంతవినయము! ఎంత మధురములైనవాక్కులు! చూడాధనుఁ డాశ్చర్య మందెను.

ఇప్పట్టున నొక సుభాషితము స్మరణమునకు వచ్చుచున్నది—

“ముఖమ్ పద్మదళాకారమ్ – వాచా చందనశీతలః।
హృదయమ్ కర్తరిసంయుక్త – మతివినయమ్ ధూర్తలక్షణమ్॥”

భర్తృహరి యెంత – లోకజ్ఞానము కలవాఁడు! ధూర్తలక్షణములుగా చెప్పఁబడిన లక్షణములన్నియుఁ గేశవునియందు మూర్తీభవించి యున్నవి.

లలిత గదిద్వారముకడ నిలువఁబడి యంతయు బాష్పపూరితములగు దృష్టులతోఁ జూచుచుండెను. నిర్మలమును, సరళమును నగు స్వభావముగల యామె తన పినతండ్రిచర్య కెంతగ చింతించెనో! గృహంబున కభ్యాగతులైనవారియెడఁ గేశవుఁడుజూపిన యతిచర్యఁ గూర్చి యామె యెంతగఁ గుమిలిపోవుచుండెనో!

చూడాధనుఁడు జగచ్చంద్రునికడకుఁ బోయి “మిత్రమా! ఏమిటిది?” యనిప్రశ్నించెను. జగచ్చంద్రుఁడు మందహాస మొనరించి యిట్లనెను.

“చూడాధన బాబు! అంత విశేషమేమియునులేదు. ఈ కేశవచందు తన శౌర్యమును నాకు విశదపరుపనెంచి సహజభీరువగు హంతకోద్యోగివలె నన్నుఁ జంపఁబూనెను. అది తెలిసికొంటిని. అట్టిపని నింక కొంచెము జాగ్రత్తగఁ జేయవలయునని యాతనికి బోధించుచున్నాను.” – కేశవునితో – “కేశవబాబు! నీ గదిలోనికిఁబొమ్ము” అనెను జగచ్చంద్రుఁడు. ఆమాటయం దొక తీవ్రమైనయాజ్ఞ వ్యక్తమగుచుండెను. కేశవుఁడు గిఱ్ఱుమని తిరిగి తనగదిలోనికరిగి తలుపు గుభా

[illegible]

[illegible]మారాధను [illegible]వుదు మాట్లాడుకొనుచు జగచ్చంద్రుని [illegible]

౧౩

సాయంత్రము దాయుచుండెను. ఇంకను సహస్రకిరణుని యంశువులు [illegible]ష్టములునాలేదు. పద్మినీవదన మింకను ముకుళింపలేదు. తద్వాసనాసంసృతము లయిన పిల్ల తెమ్మెరలు గవాక్షములుగనే వీచుచుండెను గాని శిశిరశైత్యము నాహరింపలేదు.

అట్టివేళ బసవపురమందలి ప్రధానవీధియం దొకఁడు దేవీదాసు గృహ మెక్కడ? యని యచ్చటచ్చటఁగనబడిన వారి నడిగికొనుచుఁ బోవుచుండెను.

ఆతనివయసు ముప్పదియెనిమిదేఁడు లుండును. బలిష్ఠములగు నంగకములును స్థిరపదచాలనము నాతని దార్ఢ్యమును దెలుపుచుండెను. ఆతని వస్త్రాదికము సామాన్యమంగదేశీయులు ధరించునవియే. ఆతఁ డట్లు కొంతదూరము వచ్చినవెనుక మార్గమునందుఁ దనకెదురుగవచ్చుచున్న వృద్ధు నొకనిఁగని "అయ్యా! వైద్యులు దేవీదాసుగారి గృహం బెక్కడ?" అని ప్రశ్నించెను.

అతఁడును వా రతఁడు నిలువఁబడియున్నచోటి కెదురుగనున్న గృహముం జూపుచు — "ఇదియే దేవీదాసు నివాసము" అనియెను.

"ఆతఁ డిప్పు డింటనుండునా?"

"ఉండవచ్చును" అని యాతఁడు వెడలిపోయెను.

మన పథికుఁడును నాగృహమ్మునకడ కరిగి తలుపుఁదట్టెను. లోపల నుండి యెవ్వరును వచ్చునవ్వడి యేమియు వినరాలేదు. మరల నాతఁడు తట్టెను. లోపల నెవరో తిరుగుచున్నట్లు మన పథికున కిప్పుడు మెల్లగ శబ్దము వినవచ్చెను. అప్పు డాతఁడు బిగ్గఱగా "ఎవరయ్యా లోపల?

దేవీదాసుగా రింటనున్నారా?" అని యడిగెను.

కొంతవడికిఁ దలుపుసందులనుండి దీపప్రకాశముగుపడఁజొచ్చెను. లోపల గడియఁదీయు సవ్వడి వినఁబడెను. తలుపుతెఱచెను. చేత నొకదీపము బట్టుకొని ద్వారబంధమునకుఁ గవాటమునకు మధ్య రెండవచేత ద్వారమును బట్టుకొని నిలువఁబడి యొకఁడు పసివానివలెను "ఎవరుమీరు?" అని ప్రశ్నించెను.

"అయ్యా! నేను దేవీదాసుగారితో నవసరకార్యార్థినై వచ్చి యున్నాఁడను. ఆయన యింటనున్నారా?"

"లేరు. మీరెవరో తెలిపినయెడల ఆయన యింటికి రాఁగనే మీసంగతిఁ దెలిపెదను."

"నేను దేవీదాసుగారి కపరిచితుఁడను. అట్టియెడ నాపేరుగాని యూరుగాని తెలిపినందున వారి కేమి తెలియఁగలదు?"

"మీరు వచ్చియున్న కార్యము విశదపఱచిన నాకార్యావసరముఁ బట్టి వారిదర్శనము లాభించును, లాభింపకపోవచ్చును."

"నావచ్చిన కార్యమును విశదపఱచుట కిది స్థలముగాదు. అదియుఁగాక దేవీదాసుగారి కొక్కరికిఁదక్కఁ దదన్యులకుఁ దెలుపఁదగినదియుఁ గాదు."

"ఇది చాలవిచిత్రముగ నున్నది. ఇరువది సంవత్సరములుగ దేవీదాసుగారితోడ వారి పరిచారకుఁడుగనుండు నాతోడ నెవ్వరిట్టిమాట లనియెఱుంగరు. మీరెవరో విచిత్రమనుష్యులుగ నున్నారు. మీకార్యమునుగూర్చి నాకుఁ దెలుపఁజాలకపోయిన నావలన మీకగు పని యేమియును లేదు. దేవీదాసుగారు వచ్చినవెనుక నారితోడనే మాటలాడుఁడు. అప్పుడేరండు" అని యాపరిచారకుఁడు తలుపు మూయఁబోవఁ బథికుఁడు—

"అయ్యా! నీయెడ నేనుజూపిన యవజ్ఞకు క్షమింపుము. నన్ను

లోనికి రానిచ్చిన సావకాశముగ నేనరుగుదెంచినపని విశదీకరించె దను" అనియెను.

పరి — అట్లు దాటికిరండు. అధికారివద్దకు కార్యార్థము వచ్చినవారు ముందు పరిచారకులను దృప్తిపఱచి మంచిచేసికొనినగదా యధికారుల యనుగ్రహము శీఘ్రముగఁ గలుగును. (అని నికృతముగ నవ్వుచు) రండు. లోనికిరండు.

పథి — (నవ్వుచు) అయ్యా! నాకెప్పుడు నటువంటి యధికారుల వద్దకు వచ్చు కార్యము రాలేదు. అందుచేత నచ్చటివిధులు నేనెఱుంగను.

అనుచు లోనఁ బ్రవేశించెను. ఆ పరిచారకుఁడును దలుపు మూసెను. వారిరువురు నొక యంగణము దాటి గది నొండుఁ బ్రవేశించిరి. అచ్చట నున్న రెండు కుర్చీలపై నాసీనులైరి. అప్పుడు వారికీ క్రింది సంభాషణము జరిగెను.

"ఇంక మీకార్యమును గూర్చి తెలుపుఁడు."

"అయ్యా! నాయెడ నింత కరుణఁ జూపిన యుదారగుణుని పేరు తెలిసికొనిన తరువాత నాకథ నుపక్రమించెదను. మీనామ మేమి?"

"నాపేరు గోవర్ధనుఁడు."

"గోవర్ధనబాబుగారా మీపేరు! చాల మంచిపేరు......గోవర్ధన బాబుగారూ! ఇఁక నాకథఁ బ్రారంభించెదను."

"ఉండుఁడు. ముందు మీపేరు గూడఁ దెలుపుఁడు."

"పేరు చెప్పకుండ కథ యెట్లు చెప్పెదను? పూలులేని పెండ్లి యుండునా? సంభారములులేని యంగడి యుండునా? నాపేరు గణేశ చంద్రుఁడు. నా నివాసము పూర్వము మణిపురము. ఇప్పుడు నాగ పురము!"

"గణేశబాబుగారు! నాగపురమునుండి యింతదూరము వచ్చితిరా!"

"అవును. మణిపురమునం దుండుకాలమున మా యన్నతో నుండు

వాఁడను. మా యన్న విజయచంద్రబాబను భాగ్యశాలి యింటఁ బరిచారకుఁడు. నే నాకాలమున రమేశచంద్రబాబను నాయన వద్దఁ బరిచారకుఁడుగా నుంటిని. మా యన్న పేరు నాగేంద్రుఁడు: నేను నాగేంద్రునియింటనే యుంటిని. అప్పటికి వానికి వివాహమై యుండెను. ఆతనిభార్య చాల చెడ్డది. ఆమె కోపమునకు నేను గాని నాగేంద్రుఁడు గాని నిలువఁజాలకుంటిమి. ఆమె చిన్నప్పటి నుండియు నొక పుస్తకముగా వ్రాయఁదగినన్ని తిట్లు నేర్చుకొనియుండెను. ఆమెకు మా యిరువురలో నెవరిపైనఁ గోపము వచ్చినను సరియే తన తిట్లను బుంఖానుపుంఖముగఁ బ్రయోగింపక విడచునది కాదు. కొంతకాల మోర్పుతో నుంటిని. తన భార్యయొక్క కోపమును దలఁ దాల్చ వలసినది నాగేంద్రుఁడు గాని నా కేమి యవసరము? ఒకనాఁడు నాగేంద్రుఁ డింట లేనపుడు నేను గార్యార్థము రాఁగా నన్ను బజారునకు బోయి యేమియో సామానులు దెమ్మని చెప్పినది. ఆమెకు మన మెందులకుఁ బనిచేయవలయునని యెంచుకొని 'నేను బోవ' నంటిని. అంతట నామె తన పంచాంగమును విప్పెను. నా కందుకుఁ బట్టరా నంత కోపము వచ్చినది. అన్నిదినములు తిట్టుటయం దారి తేరియున్న యామె గూడ భయపడునట్లు బదులు తిట్టితిని——"

"బాగు బాగు. మంచిపని చేసితివి. తిట్లతోనే పోనిచ్చితివా? కొంచెము చేయి చేసికొనలేకపోయితివా?"

"చేయి చేసికొనుటయా! తిట్టినందుకే యింతకాలమును ననుభవింపఁజాల కవస్థపడుచుంటిని. కొట్టియుండిన నా రాక్షసి నన్నా నాఁడే చంపియుండదా? నా కోప మంతవఱకుఁ దేలేదని సంతోషించుచున్నాను."

"ఏమి చేసిన దామె? పైన బడి కఱచినదా యేమి? లేకున్న నాగేంద్రునిచేతఁ దన్నించినదా?"

"గోవర్ధనబాబు! మీకు స్త్రీలెంత సాహసురాండ్రైనదియుఁ జక్కఁగఁ దెలియదని తోఁచుచున్నది. ఆమె నాపైఁబడి కఱవను లేదు. నాగేంద్రునిచేతఁ దన్నింపను లేదు. సావధానముగా వినుము. ఆమెను దిట్టి నేను వెడలిపోయితిని. కాని పోయినప్పటినుండియు మనస్సులో వేదనగానే యుండినది. నాగేంద్రునితోడ నేను తిట్టితినని యామె చెప్పెనేమో! చెప్పిన నాతనికి నాపైఁ గోపము వచ్చునేమో యని దిగులుపడుచుంటిని. సాయంత్ర మెట్లో ధైర్యముచేసి యింటికి భోజనము వేళకు పోయితిని. నాగేంద్రుఁ డప్పటికే భుజించెను. పరుండి నిద్రించెను. ఆమె నన్నుఁ జూడఁగనే యత్యంతాభిమానము జూపి భోజనమునకుఁ బిలిచెను. మన తిట్లు చాల మంచిపని చేసినవని సంతోషించితిని. ఏలననగా నంతవఱకు నామె నన్ను భోజనమునకుఁ దానుగా పిలిచినదే లేదు. పోయి భుజించితిని. వచ్చి పరుంటిని. మఱునాఁటినుండియు నొక తీవ్రరోగ మారంభమయినది. ఆరోగ మింతవఱకు విడువలేదు. ఎందఱో వైద్యులకుఁ జూపితిని. నారోగకారణముగాని దాని తత్త్వమునుగాని తెలిసికొనిన వైద్యుఁడే లేడు. అంతట మణిపురమునకుఁ బోయితిని. అచ్చట పదిదినములక్రింద నొకఁడు దేవీదాసుగా రిట్టి జబ్బులను వాసి యొనర్చుటయందు సుప్రసిద్ధులనియు నన్నక్కడకు బొమ్మనియుఁ జెప్పెను. అంతట నిచ్చటికి వచ్చితిని."

"మీరోగలక్షణములు చెప్పినారుగా రేమి!"

"చెప్పెదను. అమావాస్యగాని పౌర్ణమిగాని వచ్చినట్లయిన నాదినమంతయు నాకేమో పిచ్చిపట్టినట్లుండును. ఏపనిచేయుటకుఁ దోఁచదు. ఎవ రేమన్నను వారిని దిట్టుదును; అనాఁ డన్నము సహింపదు. తిన్న కొంచెముగూడ వమనమైపోవును. తక్కిన దినములం దేమియునుండదు!"

"ఓహో! తెలిసినది: ఇవన్నియు నున్మాద్యలక్షణములు. ఇప్పుడిప్పుడే ప్రారంభించుచున్నందున నంత తీవ్రముగాఁ దెలియుటలేదు.

ఇతఁడు గొన్నిదినముల క్రిందట బాగుగా నుండెను. దేవీదాసుగారు శస్త్రములను బాగుచేయుటలో సుప్రసిద్ధులు. మీకుఁ గనఁబడుచున్న లక్షణములే యొకనియందుఁగూడ నేను జూచియున్నాను. అతనికిఁ జక్కఁగఁ గుదిర్చిరి."

"ఎవరికి? ఆవిషయమంతయుఁ దెలుపుము."

"అది రహస్యము. తెలుపఁగూడదు. దేవీదాసుగారు దానియ మెవరికిని దెలియఁగూడదని యాజ్ఞ యిచ్చియున్నారు."

"నే నెవరితోడను జెప్పను. భయపడకుము: దేవీదాసుగారు నా దేహమును బాగొనర్చిన వారికి నీకును గూడ మంచి బహుమానము దక్కును."

"ఎవ్వరితోడను జెప్పఁగూడదు సుమా. దేవీదాసుగారికిఁ దెలిసినా నాప్రాణముఁ దీసివేయుదురు. ఒకనాఁడు వాణీనాథుఁ డను నీయూరి వర్తకుఁ డింకొక పల్లెనుండి చీఁకటి పడఁబోవు సమయమున మఱలి వచ్చుచుండ దారిలో నొకఁడు స్మృతితప్పి పడియుండెను. అతనిఁ జూచి యావర్తకుఁడు జాలిఁజెంది తనయింటికిఁ బిలుచుకొనిపోయెను. దేవీదాసుగారిచే మం దిప్పించెను. దేవీదాసుగారు మం దిచ్చుటకుఁ బోయి వానిని దమకుఁ బ్రబలశత్రువుగా గుర్తించెను. ఇక వానిని బ్రదుకనిచ్చుట యపాయకరము. మందుచేతఁ జంపిన వాణీనాథుఁ డను మానించును. ఎట్లు? తుదకొక యుపాయము నాలోచించిరి. దేవీదాసుగారికి మందుల కుపయోగించు నోషధులయందును, మూలములయందును జక్కని పరిచయము కలదు. ఆవేళ్ళయం దొకదాని నింకొకయాకురసములోఁ జాదియిచ్చిన సేవించినవా రెల్లఁ బిచ్చివా రౌదురట. దేవీదాసుగారీమందును దయారుచేసి యొకనిచేత నారోగికిఁ బంపిరి. ఆమందుఁ దీసికొనిపోయినవాఁడు తుంటరి. రోగికిచ్చినది పోగాఁ దక్కినదాని నాతఁడు సేవించెను. రోగియు నతఁడుగూడఁ

పిచ్చివాడై పోయిరి. దేవీదాసుగారు తనవద్దనుండి మం దెత్తుకొని పోయినవాడు పిచ్చినిమాన్పిరి. అతని లక్షణములుగూడఁ బ్రారంభమున నిట్లే యుండెను. ఆతఁడిప్పుడు చక్కగ నున్నాఁడు. — గణేశబాబుగారు! యీవిషయ మితరులకుఁ జెప్పకుఁడు. ఇది నాకీనాఁడు నాకుఁ దెలిసెను. దేవీదాసుగారి కపాయము సందుమూలమున నా కపాయముఁ దప్పెను."

"గోవర్ధనబాబు! నా కేమనవసరము? నే నితరులతోఁ జెప్పుటకుఁ గూడ నవసరములేదు నాకుఁ దెలిసినదాఁ డొకఁడైనలేఁడు."

"మీరు చెప్పుదురని గాదండీ! ఈవిషయ మంతరహస్యమయిన దగుటచేత నొక్కి చెప్పవలసివచ్చినది. ఇట్లు పలికితి నని యేమియు నెంచుకొనవద్దు."

ఇట్లు వీరు ప్రసంగవశులై యుండ నింతలో వెలుపలఁ దలుపు దట్టు సవ్వడి వినవచ్చెను. గోవర్ధనబాబు లేచి "దేవీదాసుగారు వచ్చినట్లుగ నున్నది. మీరిక్కడనే కూర్చుండియుండుఁడు. నేనుపోయి తలుపుఁదెఱచి వచ్చెదను" అని వెడలిపోయెను. వెంటనే గోవర్ధనబాబు దేవీదాసుఁడు నిరువురు నాగదిఁ బ్రవేశించిరి. దేవీదాసుని గని గణేశుఁడు లేచి నమస్కరించెను.

దేవీ — కూర్చుండుము, నేను లోనికిఁ బోయి యీవస్త్రములు వదలివైచి వేఱుగుడ్డలు గట్టుకొనివచ్చెదను. నీవిషయము గోవర్ధనుఁడు చెప్పినాఁడు — అనుచు నాగదినుండియే వేఱొకగదిలోనికిఁ బోయెను.

పదినిముసములు గడచినవి. దేవీదాసు మరల గదిఁ బ్రవేశించినాఁడు. ఆతనివయస్సు సుమారు నలువదియెనిమిదేఁడు లుండవచ్చును. అయిదడుగు లెత్తుఁడును. అసాధారణబలము గలవాఁడని యాతని యంగములు దెలుపుచుండెను. కోలముఖమును, చిన్నకన్నులును, మిగులఁ దీక్ష్ణములగు చూపులును నాతని దార్ఢ్యమునకుఁ దగిన కార్య

మున దెలియఁజేయుచుండెను. గదిని ప్రవేశించినవాఁడనే గోవర్ధనుఁ డింతకుమున్ను హెచ్చరించిన కుర్చీపై గూర్చుండి సూక్ష్మదృష్టిని గణేశునిఁ జూచుచు దేవీదాసుఁ డిట్లనియెను.

"గణేశబాబూ నీవెవరు? నిన్నెచ్చటనో చూచినట్లున్నదే!"

"మణిపురమందుఁ జూచియుందురు. విజయచంద్రబాబుగారింటనుండు నాగేంద్రుని కొడుకను."

"ఆఁ! ఇప్పుడు జ్ఞాపకమునకు వచ్చినది. నాగేంద్రునిపోలిక నీయందగపడుచుండుటచేత నెచ్చటనో నిన్నుఁ జూచినట్లు జ్ఞాపకమున్నదని యడిగితిని. ఇప్పుడు నీరాక చాల విచిత్రమగు ననుమానమును గలిగించినది. గోవర్ధనునితో నీవు చెప్పినదంతయు నిజమేనా?"

"అవునండి. నిజమే." అనుచు గణేశుఁడు గోవర్ధనునివైపుఁ జూచెను. దేవీదాసది గ్రహించెను. "గోవర్ధనా! ఇతఁడేవో రహస్యవిషయములు దెలుపఁదలఁచినట్లున్నది. నీ వావల నుండుము."

గోవర్ధనుఁడు గణేశునిదెస క్రూరముగఁ జూచుచు వెడలిపోయెను.

దేవీదాసు లేచి గదితలుపు లోనికి గడియవేసి మరల వచ్చి కూర్చుండెను.

* * * *

కొంతవడికి గణేశుఁడు దేవీదాసును మఱునాఁడు వచ్చి కలిసికొందునని చెప్పి వెడలిపోయెను.

౧౪

గదిలోనికిఁ బొమ్మని జగచ్చంద్రునిచే ననుజ్ఞాతుఁడై కేశవుఁడు గది ప్రవేశించి, తలుపును దీవ్రముగ మూసివైచి, యంతకన్న కోపమున చేతియందలి బాకును నేలపైఁ బాఱవైచి గదియందున్న పెట్టిమీఁద గూర్చుండెను.

“నే నూహించినదంతయు, నాప్రయత్నమంతయు, నిముసమున విఫల మయి పోయినదిగా! నన్నవమానమునఁ జూచుచుండిన జగచ్చంద్రుఁడు, నారహస్యము బరిపూర్ణముగఁ దెలిసికొనినాఁడు. నాకుఁ బ్రత్యక్ష విరోధియైనాఁడు. సామ్రాజ్యమున జరగఁగల పనిని జెఱచుకొని కష్టసాధ్య మొనర్చుకొంటిని. అచిరకాలముననే యానందుని విషయముగూడ బహిరంగము కాకపోవునా!..... జగచ్చంద్రుఁడు మధ్యాహ్నమున నన్నుఁ బరామర్శించునపుడే, యనుమానించియుండును. ఆతనిమాటలు గూడ నా యనుమానమునే వెల్లడించినవి. రహస్యమంతయుఁ బరిపూర్ణముగఁ దెలియకున్నా నతనికి ? తెలిసియే యుండును. లేకున్న బహుమానప్రస్తావన మెట్లు చేయఁగలఁడు ... ఇఁక మహేంద్రుని దృష్టిపఱచు టెట్లు? ఇతనికి నాపై సహజమిత్రక్రోధము జనించునేమో! చేఁజిక్కిన పిట్టను బుద్ధిహీనుఁడనై విడచినవాఁడనైతిని — ”

క్రౌర్యక్రోధములకుఁ బెక్కులు దారుణకృత్యముల నిమిత్తముచేత సంస్పృశముగఁ బెరిగిన హృదయమే యిది. కాని, యట్టిదిజూడ నుఱ్ఱూఁత లూఁగుచున్న చేయఁగల ప్రజల ఝుంఝూవాతము వీచుచున్నపు డదేమి చేయఁగలదు? తన వేళ్ళయందు శక్తియున్నంతవఱకు, నా ప్రభంజనోత్పాటి కాఁగఁజూచినది. కాని — ఇంతవఱకుఁ బ్రకృతియందే మహా నిలపుఁ జిక్కిన నాఁగిన వస్తు వేదియు లేదు. ఇఁక నిది యూఁగఁగలదా? కేశవునెడందలి యీ వేదనము, క్షుభితమై పోవుచున్నది. తన దుష్ప్రవర్తనమెఱింగినవారు జగచ్చంద్రచూడాధనులే కద! ఉదయమున నాగపురమునకుఁ బోవునపుడు, మార్గమున వారి యుక్కడంచవచ్చును. ఈ యాలోచనతో తన మనోవేదనాగ్ని నొకింత యుపశమింపజేయఁ జూచుచున్నాఁడు. కాని, యీ యాలోచన యాయగ్ని నార్పునో లేక మఱింతతీవ్రముగ మండించునో?

కేశవుఁడు పెట్టెమీఁదనుండి తన శయ్యకడకుఁ జనెను. ప్రక్కగది

యందు, లలిత పడుచున్న ప్లాతెడు శంకించెను. మెల్లగ లేచివచ్చి దీపమార్పి, తనగదికి లలితగదికి మధ్యనున్న ద్వారముకడకుఁ జని చెక్కలసందునుండి చూచెను. అప్పుడే ద్వారముకడనుండి లలిత యొయ్యన జేరి, దానిపైఁగూర్చుండెను. చేలాంచలముతోఁ గన్నులఁ దుడుచు కొనుచుండెను.

లలిత మేల్కొనియున్నట్లు కేశవునకుఁ దెలిసిపోయెను. ఆమె యిప్పుడేడ్చుచున్నది. ఎందులకు? తన ప్రయత్నము వ్యర్థ[illegible]ట వలన, జగచ్చంద్రాదులు తనకపాయము గలిగింపనున్నారనియా? లేక జగచ్చంద్రుఁడు యమపురిని డాసి తప్పించుకొని నందులకుఁ గలిగిన సంతోషోత్కర్షచేతనా? లలిత యెన్నఁడు కేశవునెడ [illegible]ప్రేమను చూపియుండలేదు. ఆమె నిజముగ జగచ్చంద్రుఁ డపాయమునుండి తప్పించు కొనిన యాపదకై దుఃఖించుచున్నది.

“ నా కపటవర్తనము లలితకూడ నెఱింగినదా? ఇఁక నా[illegible] యదృశ్యమునకుఁ గారకుఁడను నేనేయని తప్పక యామె యనుమానింపఁ గలదు. జగచ్చంద్రుఁడు ననుమానించును. నేఁడు గాకున్న రేపయిన నీరహస్యము వీరికిఁ దెలియగలదు. శాంతబాబు చూడాధనుని గురు వఁట. ఇఁకఁ జూడాధనుని యిచ్చ కన్యముగ నాతోఁ దూ[illegible]నా? తప్పక తనకుఁ దెలిసినదంతయుఁ జెప్పివైచును. తా నాసం[illegible]గాని, నన్నుఁగాని చూడనే లేదని చెప్పితీరును. నేను శాంతబాబు కొఱకే యానందుఁడు నాగపురమునందు నిలిచియున్నాఁడని వీరికిఁజెప్పితిని. నా మాటలు, శాంతబాబు మాటలు నసంబద్ధములుగనుండును. ఆనం దుని విషయము జగచ్చంద్రుఁ డనుమానించును. ఇఁక దీనినుండి తప్పించు కొనుటకు మార్గమేది?

ఇఁక కేశవునిమనము శాంతించుటెట్లు! గోరుచుట్టుపై రోకటి పోటు! బడబాగ్నిపై నాజ్యవర్షము!

ఇవ్విధముననే రాత్రిశేషము గడచిపోయినది. రహోవిలయరంగము ముగిసినది. ఉదయముననే జగచ్చంద్ర చూడాధనులు నాగపురికిం బోవ నిశ్చయించిరి. పోవుచున్నప్పుడు జగచ్చంద్రుఁడు కేశవునిగదిం బ్రవేశించెను. కేశవునకు నిద్రయే లేదు. ఆతఁడు పరుండిన పడక యగ్నికణనిర్మితమైనట్లు యాతఁడు దానిపైఁ బొరలాడుచుండెను. కేశవునితోడ జగచ్చంద్రుఁ డిట్లనియెను.

"కేశవబాబు! రాత్రి నీవు చేయఁబ్రయత్నించిన యమానుష కృత్యమునకై నిన్నే మొనర్చినను న్యాయమైన శిక్షయే యగును. నీ కెట్టిశిక్షనైన గలిగింపఁ గలిగియుండియు నేను నీయాపదకై చింతించు నవనీతహృదయులగు వారికి మనఃక్లేశము గలిగింప నిష్టము లేమి, నూరకే పోవుచున్నాఁడను. అట్లగుటచేతనే నీవేమి చేయ నున్నను, జేయుచున్నను, నూరకుండుదునని యనుకొనకుము. పరాహిత బుద్ధి నీవు వదలువఱకు నీడవలె నిన్నుఁ గాచియే యుందును. నీ దుష్కార్యములనెల్ల భంగమొనర్తును. ఆనందబాబు విషయమై యింత వఱకు జాగ్రత్తగనే మెలఁగితివి. ఇఁకఁగూడ నంతజాగ్రత్తగనే ప్రవర్తింపుము. మఱల నీ దర్శనలాభము గలిగినపుడు విశేషములఁ దెలిపెదను. ప్రస్తుతము మహేంద్రునకు నీప్రయత్నము వ్యర్థమైనదనియు నీనాఁడే బహుమానము నంపవలదనియు సమాచారమంపుము."

అని క్రిందఁబడియున్న పిడిబాకుఁజూచి దానిఁదీసికొని "కేశవబాబు! ఈ బాకు నీ కింక నుపయోగపడదు. నేను దీసికొనిపోవుచున్నాను." అనుచు జగచ్చంద్రుఁడు వెడలిపోయెను.

చూడాధనుఁడు, నాతఁడు నాగపురమునకు బయలుదేరిరి. ఉద్యానవనమందు లలితనుజూచి జగచ్చంద్రుఁడు—

"లలితా! నీవొనర్చిన సహాయ మెంతయు గణనీయమైనది. అపాయమును శంకించుచుండియు నప్పుడప్పుడే నిద్రామాయకు లోనుగా

నున్న నన్ను నీయుంగరము పరిపూర్ణముగ మేల్కొలిపెను. కేశవబాబు కృపాణమునుండి రెండుప్రాణములను గాచెను. ఇదిగో నీయుంగరము" యని చొక్కాయిజేబునుండి రాత్రి తస్కరించిన యుంగరమును దీసి యీయఁబోయెను. లలిత తీసికొనలేదు.

జగచ్చంద్రుఁడు నవ్వుచు "లలితా! నాయుంగరము తీసికొనవలెను. నీకిష్టములేకున్న వేఱొకటి యొసఁగెదను. దానిని దీసికొనుమా" యనుచుఁ దనచేతనున్న యంగుళీయకమునొక దానిని దీసి యీయఁబోయెను.

లలిత మాఱుపల్కక యూరక తలవంచుకొని నిలువఁబడెను. జగచ్చంద్రుఁడు లలిత కుడిచేతియుంగరపువ్రేల నంగుళీయకమును బెట్టెను. అతనిచేత గ్రహింపఁబడి యొకనిమిషమునుండిన యామె హస్తము చలించినదికాని వెనుకకుఁ దీయఁబడలేదు.

జగ — లలితా! కేశవబాబు చూచిన, నాపైఁ బూనియున్న ద్వేషమును నీయెడఁగూడఁ జూపును. కావున లోనికరుగుము. ఒక విషయము నీతోఁడఁజెప్పుట నీకు దుఃఖకారణమయ్యును జెప్పక తప్పదు. ఆనందునకు కేశవునివలననో వేఱెవ్వరివలననో విపత్తుగలిగినదని శంకించుచున్నాను. నాగపురమున కరిగినవెంటనే యాతనిఁగూర్చి విచారించెదను. నీవుమాత్రము కేశవునియెడ జాగ్రత్తవహించి మెలఁగుము. మరల రేపుదయము వచ్చెదను. నీ వరుగుము.

జగచ్చంద్ర చూడాధనులు నాగపురమునకు వెడలిపోయిరి. లలిత గృహములోనికిఁ జనెను.

జగచ్చంద్రుఁ డరిగినవెంటనే కేశవుఁడు గదినుండి వెలుపలికివచ్చెను. తోడనే తోఁటలో నొకదృశ్యము తనదృష్టి నాకర్షించినది. అచటికి బోయి జగచ్చంద్రునకు లలితకు జరుగుసంభాషణ మాలకించుట కాతఁడు చాలనాసపడెను గాని సాహసింపలేదు. ఆతని యెదలో విపరీతమగు ననుమానము జనించినది. వారలపై శిఖిశిఖాయమాన

ముగఁ బ్రసరించినయాతనిదృష్టి జగచ్చంద్రుఁడు లలితపాణిని గ్రహించుటఁగూడఁ గనుగొనెను. వారలమధ్యజరిగిన సంభాషణము నాతఁడు వినకున్ననేమి? వారి సంబంధము దెలుప నీ నిదర్శనము చాలదా? నిజము! వారిపువ్రు రొండొరులఁ బ్రేమించుకొనుచున్నారు.

మరల కేశవుఁడు గదిలోనికరిగి తలుపు మూసెను. ఒక్కఁడుఁ గూరుచుండెను. అతని యెడఁద చేయిపెట్టి కలంచినట్లుండెను. ఇంతవఱకానందుని యదృశ్యమునందలి విపరీతరహస్యము నసుమానింపకున్నను లలిత యిఁకనైన ననుమానించును. ఆమెమూలమున జగచ్చంద్రుఁడావిషయమునను జోక్యము గలిగించుకొనును. ఆనందుని రహస్యము నాతఁడు బహిరంగపఱచుటకుఁ బ్రయత్నించెనేని యనతికాలముననే యతి విప్లవ మందకుండునా? కేశవుని యాలోచన యత్యంతవేగమునఁ బోవుచుండెను. అది యెన్నిమార్గములనో పోయి చూచినది కాని ప్రతిపథాంతమునందును జగచ్చంద్రుఁడు నిలువఁబడియుండెను. ఆతఁడు తన్నె చూచుచుండెను. ఆతనిహస్తమునందలి తర్జని తన్నే చూపుచుండెను. ఆతనిచూపులయందు దత్యంతక్రౌర్యము వెలుఁగుచుండెను.

ఆతనినుండి తప్పించుకొన నుపాయమేది? కేశవుఁడు క్రమక్రమముగ భీతుఁ డగుచుండెను.

“కావుననే మహేంద్రుఁ డీతని కంతభయపడినాఁడు. ఈతఁడు నిజముగ నసాధ్యుఁడు – ఇప్పు డీతని దృష్టినుండి యానందుని విషయము దాచుటెట్లు? లలితమూలమున జగచ్చంద్రుఁ డిందుఁ బ్రవేశించును. ఆనందుని విషయముమూలముననే కంకణరహస్యము బహిరంగమగును — ప్రస్తుతము వారానందునకు సహజముగనే కీచకారణ్యమున నేదేని విపత్తుసంభవించియుండునట్లు తలంపఁ దగినయుపాయము వెదుకవలయును — ఇపుడే భేతాళగిరికిఁబోయి యానందుని శవమును మూఁడు దినములనుండి యా గుహాంతరాళము నందుఁ బడియున్న

యానందుఁ డింతవఱకు జీవించియుండునా! వెఱ్ఱి కీచకాటవియందుఁ బడవేయవలయును. ఎవరో యామార్గమునఁ బ్రయాణముచేయునాఁడు దానిఁజూచి యెల్లరకు నావిషయము జెప్పివేయుదురు. నాపైనుండి యియ్యవమానము తొలఁగిపోఁగలదు"

ఏదో యొకవిధముగ గట్టుసేసినాఁడు. మనమునకుఁదట్టిన యా యుపాయాంతరము గ్రియారూపము దాల్పవలసినదే! పెట్టెనుండి కంకణము దీసిచేతిలోఁబెట్టుకొని సంతృప్తవీక్షణముల దానినిఁజూచుచునిలువఁబడినాఁడు. విచిత్రచరిత్రయుతమగు నావిచిత్రకంకణ మాతనిచేతియందే యున్నది! దానినిఁజూడఁగానే యాతఁడుప్పొంగిపోయెను. "కంకణరాజమా! నీకొఱకై వేవురు జగచ్చంద్రులనైన నామాయాబలమున బొడిచివేయనా! నీకొఱకై పదివేలమంది యానందులు మన్నుఁగలిసిపోయినను నూఱువేలమంది లలితలు దగ్ధమైపోయినను మాత్రముచింతింపవలసిన దేమున్నది!" యని యనుకొనుచు మరలఁ బెట్టెమూసెను. కంకణమును జొక్కాయిజేబునందుఁ బదిలపఱచుకొని యటనుండి నాగపర్వతములకు బయలుదేరెను.

౧౫

క్రిందటిప్రకరణమునందలి విశేషములు జరిగిననాఁటి యుదయమే, మణిపురమున నొక విశేషము జరిగినది.

మహేంద్రుఁ డుదయమే యెచటికో పోయియుండి, మఱల నింటికి జనుదెంచుచుండెను. మార్గమధ్యమం దాతనికి పిచ్చివాఁ డెదురయ్యెను. మహేంద్రుఁడాతనిఁ జూడఁగనే యేకారణముచేతనో మొగ మింకొక వైపునకుఁ ద్రిప్పికొనియెను. ఆయున్మాదుని వీక్షణమునుండి తప్పించుకొని పోవలయునని కాఁబోలు నాతఁడు నడక నింకకొంచెము వేగముచేసెను. కాని పిచ్చివాఁ డీతనినిజూచెను. ఒక్కపరుగున నీతని

కేకకుఁ బయటికి వచ్చెను. అతనివద్దనుండి తొలఁగి మహేంద్రుఁ డనుగ వలయునని ప్రయత్నించెను. కాని యా పిచ్చివాఁడు వెగటుగనవ్వుచు,

“ప్రభాకరా! ప్రభాకరా! మఱచిపోయితివా?” అనియెను.

ఆ పేరు వినఁగనే మహేంద్రుని మోమున వైవర్ణ్యము తోఁచెను. కాని యెంతసేపో కాలము నిలువలేదు.

మరల పిచ్చివాఁడు “ప్రభాకరుఁడుగాఁడు నీపేరు; ఏమి మాట్లాడవు? పాపము నీకు మాటలురావు గాఁబోలు నేమి? మూఁగవాఁడవా నీవు? కాదు కాదు.. ...నిన్నేదో మూఁగదయ్యము పట్టినది” అనుచు నవ్వసాగెను.

సాధారణముగఁ బిచ్చివానివెనుక పోకిరిమూఁక యుండనే యుండును. అందులో నీతఁ డసాధారణ వాచాలత్వము గలవాఁడు. వాని వెనుక నొకపెద్దగుంపు నుండినది. ఆ గుంపు నిముసములోనే ప్రవృద్ధమై మహేంద్రుని, నా వెఱ్ఱివానిని జుట్టివైచెను.

ఆ వెఱ్ఱివాఁడు తనచుట్టునున్న వారలఁజూచి “చూచితిరా? ఈతని పేరు ప్రభాకరుఁడుగాదట! — అవునా? అయితే మాట్లాడఁడేమి?” అనియెను. మహేంద్రుఁడు నవ్వుచు “నా పేరు ప్రభాకరుఁడుగాదు. మహేంద్రబాబు నా పేరు.

పిచ్చివాఁడు “హో హో! నీవు చెప్పునది యబద్ధము. నాకు తెలియదు నీ పేరు?” అనియెను.

చుట్టుమూఁగియున్న వా రీసంభాషణము విని నవ్వసాగిరి. వెఱ్ఱియు వారి నవ్వుచూచి “నాకు మాత్రము రాదా నవ్వు? పూర్వమొక పట్టున ప్రభాకరునివద్ద నేను సేవకుఁడనుగా నుండినాను. అప్పుడాతఁడు తాను నవ్వలేకపోయినపుడు నన్ను నవ్వుమనేవాఁడు (అని మహేంద్రునిచూచి) ప్రభాకరా! నిజముగా కాదా నేనుచెప్పునది?” అని యడిగెను.

ఇవ్విధముగ నర్థశూన్యమగు నా సంభాషణముచే నాయున్మాదుఁడును నాతనిఁ బరివేష్టించియున్నవారును నానందించుచుండిరేగాని వారొక విషయము గమనింపలేదు. ఆ జనసమూహమునం దింతకు ముం దున్నవారుగాక మఱి ముగ్గురు క్రొత్తగవచ్చి కలిసికొనిరి. వారియం దొకఁడు మా పాఠకులకు నామమాత్రమునఁ బరిచితుఁడై యున్నాఁడు. అతఁడే రమేశచంద్రబోసు: ప్రసిద్ధవర్తకుఁడు. ఆతనితోడ నున్నవారియం దొకఁ డుద్యోగచిహ్నములచేఁ బ్రభుత్వోద్యోగిగ గుర్తింపఁదగినవాఁడు. మూఁడవవాఁ డెవరో తెలియదు.

ఆ ప్రభుత్వోద్యోగి కొంతవడికా జనసంఘమును నధికారయుక్త స్వరమున "పొండు పొండు. ఇదేమి మార్గమం దీరచ్చ? ఆ పిచ్చివాని తోనా మీయాట" లనుచుఁ దఱిమివైచెను.

అచట మూఁగియున్నవా రందఱును బాఱిపోయిరి. పిచ్చివాఁడు రమేశుని యెదుట నిలువఁబడి పకపక నవ్వుచు, 'ఈ ప్రభాకరుని పట్టుకొనండి! మీరు దయ్యముల మంత్రము తెలిసినవారఁట కదా? అతని నొక దయ్యము పట్టియున్నది. మంత్రింపండి' అనియెను. రమేశబోసును వానిమాటకు నవ్వసాగెను. కాని యాతని వీక్షణము మహేంద్రునిపైఁ బడినది. మహేంద్రుఁ డచ్చటనుండి తొలఁగిపోవఁ బ్రయత్నించుట నాతఁడు కనిపెట్టి తనతోనున్న యిరువురియం దొకనికిఁ గనుసన్న జేసెను.

ఆతఁడును మహేంద్రుని భుజముపై చేయివైచి "అయ్యా! మహేంద్రబాబుగారు! రమేశచంద్రబోసుగారికి మీ రీయవలసియున్న యేడువేల రూప్యముల బాకీకై మీపైఁ దేఁబడిన యభియోగపుఁ దీర్పు ప్రకారము మీరు చెల్లింపవలసిన పైకమునకై మిమ్ము కోర్టుఉత్తరువు ప్రకారము నేను బంధించుచున్నాను. మీరు నాతోడఁ గారాగృహమునకు విచ్చేయవలయును" అనియెను.

మహేంద్రుని మోము వివర్ణమై పోయినది. కాని యాతఁడు మనము సంకలి భావవైకల్యము నడంచుకొని రమేశచంద్రబోసుతో "బోసుగారు! మీ పైకము నే నీయనంటినా? నావంటివానిని మీ రింత క్రూరముగ వీథియందవమానింపఁజూచుట తగునా?" అని యడిగెను.

రమేశు — మహేంద్రబాబు! ఇది పదియవసారి. తొమ్మిది మారులు నీకడకు వచ్చి యడిగినపు డేమంటివి? పైక మిత్తునంటివా! తుట్టతుదకు నీ మాటలుగూడ వెగటుగ మాట్లీనవి. కడపటిమాఱు వచ్చి యడిగినపుడు నీ సేవకునిచే నన్నిల్లు వెడలింపఁ బ్రయత్నించితివి. అది నన్నవమానించుట కాదా? నీ వేమనియు నుపయోగము లేదు. నా కీయవలసిన పైకము మొత్తమంతయు నీ విప్పుడే చెల్లింపవలయును: లేదా చెఱసాలకైనఁ బోవలయును.

మహేంద్రు — మిమ్ములను వీరు మఱచి మాటాడు టెందులకు? విజయచంద్రబాబుగారివంటి యుత్తమగుణుని వంశీయుఁడనగు నన్ను మీ రవమానించి యూరక తప్పించుకొనఁజాలరు.

అధికా — మహేంద్రబాబుగారు! ఈ మాటలవల్ల నేమి యుపయోగము? పైకమిత్తురా? లేక కారాకునత్తురా?

ఎటకో పోయియుండిన సురేశుఁ డా మార్గముననే యింటికి వచ్చుచు మార్గమందు జరుగుచున్న యా విచిత్రముచూచి యచ్చటికి వెళ్ళెను. కారాగృహవాసము తప్పదని భయపడుచున్న మహేంద్రుఁడు సురేశునిఁగని యించుక ధైర్యము దెచ్చుకొని "సురేశబాబుగారు! ఇటురండు" అని పిలిచెను. సురేశుఁడు మహేంద్రునికడకుఁ జనుదెంచెను.

సురే — మహేంద్రా! ఏమిటిది?

మహేంద్రుఁడు దీనవదనుఁడై సురేశుని రెండుచేతులు బట్టుకొని "సురేశబాబుగారు! ఈ సమయమున మీరు నన్ను రక్షింపవలయును" అనియెను.

సురే — మహేంద్రా! ఉపోద్ఘాతములేల? విషయమునకు రమ్ము — అని బోసును గని "బోసుగారూ! మీరు మారు వచ్చియున్నారే! ఏమి టీ సంగతి?"

రమే — సురేశబాబుగారు! ఈయన, వత్సరముక్రిందట నాకడ నాఱు వేలరూప్యము లప్పుదీసికొనియెను. ఆ విషయముల దనతండ్రికిఁ దెలుప వలదనియుఁ దానే మూఁడు నెలలలోఁ దెచ్చియిత్తుననియుఁ బలికెను. ఆ మూఁడు నెలల వ్యవధి నాలుగుసార్లు గడచినది. ఈయనతండ్రి గారు చనిపోయియే మూఁడునెల లయినది. ఇంతవఱకును రూపైక మీయలేదు. ఎంతకాలమని యూరకుండవలయును? ఈతనిపై నభి యోగము దెచ్చితిని. ఆ యభియోగము తీర్పుప్రకారము మీతోఁ జేయవల సిన పైకమునకై వారంటుమీఁద నీతని నిర్బంధితుని జేయవచ్చితిని. ఇంతియే యిచ్చటివిషయములు. ఆతఁడు వ్యవధిఁ గోరఁగా నిచ్చుటకు వీలులేదని పలికితిని.

సురేశునకు బోసుమాటలకుఁ గోపమువచ్చినది. ఆతఁడు కొంచెము కఠినస్వరముతో బోసుఁగూర్చి యిట్లు పలికెను.

"బోసుగారు! నేను పలుకఁబోవుమాటలు మీకుఁ గోపకారణ ములు గావచ్చును. కాని నాయుద్దేశముమాత్రము మీకుఁ గోపము దెప్పింపవలయునని కాదు. తొలుత విజయచంద్రబాబు జీవించియుండు నపుడు ఆతనికుమారునికి రహస్యముగ నంతపెద్దమొత్త మప్పీయఁ గూడదు. ఇచ్చిన విషయ మాయనకు పిమ్మటనైన మీరు తెలుప కుండుట చాల పొరఁబాటు. ఆఱువేలరూప్యములు అస్వతంత్రుఁడగు కుమారునికి అప్పిచ్చుటయా? తండ్రి చనిపోవువఱకు నూరకుండి వారంటుమీఁద నాతని నిర్బంధింపఁజూచుటయా! మీవంటి గుణ వృద్ధుల కిట్టి కార్యములు కరణీయములుగావు."

రమే — సురేశబాబుగారు! నన్ను క్షమింపుఁడు, నే నెందుల కీతని

కాపైక మిచ్చితినో మీకుఁ దెలిసియుండిన మీరంత క్రూరముగ నన్నుఁ దండలించియుండరు. ఆతనినే యకుఁగుడు కారణమును. జగచ్చంద్ర బాబునకుఁ బట్టినగతి తనకుఁ బట్టకుండ రక్షింపుమని నాకాళ్ళమీఁదఁ బడి యీతఁడు వేఁడుకొనినాఁడు. ఈతఁడు చెప్పినకారణముగూడ నిజమైనదనియే నమ్మి అటువంటి యాపత్కాలమున నీతని రక్షింపకుండుట న్యాయముగాదని యాపైక మిచ్చితిని.

సురే — సరిసరి, గతమునుగూర్చిన విమర్శనలేల? మహేంద్రా! ఇప్పు డాధనమును నేనిచ్చిన నీవు నాకెప్పుడిత్తువు?

మహే — బాబుగారు! ఇంక నెలలో నిచ్చెదను. నావంటి యుత్తమ వంశీయుని ఈబహుళావమానమునుండి రక్షింపవలయును.

సురే — సరియే. బోసుగారు! మీరు నా రక్షకాధికారియును ముందరుగుఁడు. నేను మహేంద్రుఁడు వెనుక వచ్చెదము.

రక్ష-అధి — అట్టులు వీలుగాదు. నే నీయనను విడుచుటకు వీలులేదు.

బోసు — ఏ యపాయమునులేదు. రమ్ము రమ్ము. మనము ముందరుగుదము. సురేశబాబుగా రెన్నఁటికి నాడినమాటఁ దప్పువారుగారు.

రక్షకభటాధికారియు బోసును ముందుఁ జనఁదొడఁగిరి. వారికి వెనుకఁ గొంచెము దూరమున సురేశమహేంద్రులు పోవుచుండిరి.

వారు సురేశు నింటిని డాసిరి. ఆ సమయమున వారి కెదురుగ నొకఁడు వచ్చుచుండెను. ఆతఁడు దీర్ఘకాయుఁడు, బలిష్ఠుఁడు. కాని రూప మంతచక్కనిదికాదు.

ఆతఁడు ముందుబోవుచున్న బోసును రక్షకభటాధికారిని వెనుక వేసి, వారికిఁ బిరుందవచ్చుచున్న సురేశ మహేంద్రులదగ్గరకు వచ్చెను. ఆతని వీక్షణములు మహేంద్రునిపైఁబడినవి. నాలుగుప్రక్కలందును నొకేమారు అదృశ్యతంతువులచే బంధింపఁబడినవానివలె నాతఁడు నిలిచిపోయెను. ఇంకొకనిముసములో సురేశమహేంద్రు లాతనిదాఁటి

ముందునకు బోయిరి. వారికిఁ గొంతదూరమునసే యాతఁడును వెన్నంటి పోవఁదొడఁగెను.

౧౬

కేశవుఁడు భేతాళగిరిఁజేరుట కెంతయోకాలము పట్టలేదు. అప్పటికిఁ బదిగంటల ప్రొద్దెక్కినది. భేతాళగిరి గహ్వరప్రాంతమునసే యశ్వముఁ గట్టివైచి కంకణసహాయమున గుహాద్వారము దెఱచుకొని కేశవుఁడు లోనఁ బ్రవేశించెను. ఒకపరి లోపల నంతయు బాగుగాఁ జూచి యున్నవాఁ డగుటచే సంధకారబంధురమైన గుహాగర్భమున నిర్భయముగఁ బోయి శల్యకంకాళమున్న గదిఁ బ్రవేశించెను.

అచటనేకదా తన భయంకరముష్టిఘాతమున నానందుఁడు నిస్పృహుఁడై నేలఁబడిపోయినది! అచటనేకదా యనిర్వాచనీయ విద్రోహబుద్ధితో తన ధనాశ సౌభ్రాతృత్వము నడుగంటఁ ద్రొక్కివైచినది!

అదేమి! ఆనందుని కళేబర మచ్చట లేదేమి! ఏమయియుండును! కేశవుఁడు గది నల్గడల వెదకెను. ఆనందుని శవ మచటనుండి మాయమయినది! ఒకవేళ నాతనికి మరల స్పృహవచ్చి పాతాళమందిరమునకుఁ బోయెనేమో! కేశవుఁడు ఇనుపవలయముబట్టి పాతాళమందిర ద్వారముదెఱచి క్రిందికిఁబోయెను. పాతాళమందిర మంతయు వెదకి చూచెను. కాని ఆనందుని కళేబర మచటనుండి మాయమైనది!

ఇపుడు కేశవుని క్రొక్రొక్కటిగ నూహాలు పొడముజొచ్చినవి.

ఆనందుఁ డేమయ్యెను? రెండుదినములక్రింద నిర్గతస్పృహుఁడై పడిపోయినయాతఁ డిప్పు డచట లేకుండుటకు గారణ మేమి? నేనుగాకింకెవ్వరైన నీగుహఁ జొచ్చుచున్నారా? ఎవరైనవచ్చి యాతనిఁ దోడ్కొనిపోయియుందురా? అట్లు వచ్చుటకు మార్గమేది? నేను వచ్చునది మంత్రబద్ధముకదా? ఇచ్చట వేరేదైన మార్గ మున్నదా?

అనుకొనుచు కేశవుఁ డన్ని దిక్కులఁ గ్రిందమీదఁ గూడ నట్టి ద్వారము నకై వెదకెను. అట్టిమార్గ మేదియును లేదు.

"నా ప్రబలతాడనమునఁ బడిపోయిన యానందుఁ డట్లే మరణించి యుండవలయును. మరణించిన నాతని కళేబర మేది? శవాశనమగు మృగ మేదయిన వచ్చియుండునా యిటకు! మనుష్యులు వచ్చుటకు లేని మార్గ మామృగమున కెట్లుఁ గలుగఁగలదు? ఈగుహాయే మంత్రప్రభావ మున నానందుని నదృశ్యుని జేసియుండునా?"

కేశవుఁ డెంత యాలోచించినను నాతని కానందుఁ డేమయినదియు నూహామాత్రముగనైనఁ దోచియుండలేదు. తన విపరీతాపరాధమును నీచకాటవ్యంతస్స్రగ్ని చోరసంఘముపై మఱలించి నిశ్చింతుఁడును, నిర్భయుఁడును గావలెనని యుండిన కేశవుని యాశ వ్యర్థమయ్యెను. జగచ్చంద్రుఁడు — మహామర్మజ్ఞుఁడగు జగచ్చంద్రునిచేతఁ జిక్కక తప్పించుకొనవలెనని గంటలకొలఁదిగ నాలోచనాసముద్రమున పార మెఱుంగఁజాలక కొట్టుకొని దరిజేర్పఁ దుదకు కేశవుఁ డందికొన్న యాశ్రసీయ ప్రకాండము గడ్డిపోచకన్న హీనమయినది. మరల నెప్పటివలెనే ఆభయంకార మహాసముద్రముననే తన్ను బడవైచినది. ఆపాతాళమందిరముననే యొక్కఁడఁ గూలఁబడి కేశవుఁడు ఆలోచనా ధీనమానసుఁ డయ్యెను.

ఆనందుఁ డెట్లో యిచ్చటనుండి మాయమైనాఁడు! ఇఁక నారహస్యమును లోకమునకే యగమ్యముగ జేయవలయును. లేకున్న నిప్పుడుగాకున్న నికఁ గొంతకాలమునకైనను నన్ననుమానించుట తప్పదు. అప్పుడే జగచ్చంద్రుఁడు నన్నెచ్చరించినాఁడు. ఆతఁడు నన్ననుమానించి పలికెనో లేక నావైఖరిని గనిపెట్టుటకై ప్రయత్న పూర్వకముగ నామాటలనియెనో! ఎట్లైనను నాతఁడు నిశ్చయవిషయ మీషన్మాత్ర మనుమానించుటేని దటస్థించిన నూరకుండువాఁడు

గాఁడు. ఊరకుండఁడు. ఎట్లో నా రహస్యమును లోకుల తిరస్కారము నకు వెదఁజల్లివైచును. ఇయ్యపాయమునుండి తప్పించుకొనవలయును. అది యెట్లు? రాత్రి నా ప్రయత్నమే నెఱవేఱియున్న నింతటి కష్టము వచ్చియుండదుగదా? జగచ్చంద్రుని యాయువు నేఁక దినములలో ముగించవలయును! అతఁడీ లోకమునకు దూరమైన నా కేమియు భయము గలుగఁజాలదు. లలితయా! నా యిష్టానుసారముగఁ బ్రవర్తింపకున్నచో లలిత తనుగూడ అంతదూరము వచ్చునా! తనతండ్రి నాచేత సంహరింపబడెనని తెలిసిన యుత్తరక్షణముననే నన్నుఁజూచి బెగ్గడిలి లలిత నా వశముకాదా? తప్పినఁ దన్నుఁగూడఁ జంపుదు నేమోయని భయపందదా? ఆనందుని విషయమును దానితో సభేద్య సంబంధముగల నిధి వృత్తాంతమును నొకదానివెనుక నొకటి బహిరంగ మగుటయే తటస్థించిన పిమ్మట నేను జీవించియుండుట వ్యర్థమే కదా? కానీ చూతము: అట్లుగాకున్నచో లలితాజగచ్చంద్రులు పేరు లేకపోవలసినదే. తన్మూలమునఁ గేశవుని ప్రతిభ వ్యక్తముగావలసినదే!

ఎంతకాలమున కీ యాలోచన ముగియుట? ఆద్యంతశూన్యము! సముద్రమధ్యమునఁ బవనఘాటి నుత్పన్నములగు తరంగము లెన్నఁటికి గనఁబడకుండునది? ఇదియు జరుగదు. అదియు జరుగదు. అది ప్రకృతి సిద్ధము. అపరాధిమానసము సంక్షుభితకల్లోలిని. రెండును సమానములే. ఆద్యంతశూన్యములగు నాలోచనాతరంగముల కావాసములే!

కేశవుఁడచటినుండి బయలుదేరి ఇంటికి వచ్చెను. మార్గమునందు గూడ నుపాయాంతరముల వెదకుచునే వచ్చినాఁడు. ఏ యుపాయము నైన స్థిరము గావించుకొనినాఁడో లేదో.

లలిత తోటమునఁ గూర్చుండియుండెను. ఆమె చేతులందున్న పుస్తక మట్లే యొడిఁ బడియుండెను. తల వంచికొని యాలోచనాధీనమానసురాలై యున్నది లలిత. ఆమె మానస మనేక చింతలతో

నిండియున్నది. రాత్రి జరిగిన విషయములే యామె మనోవీథిని మఱి మఱి ప్రత్యక్ష మగుచుండెను. సంశయములచేఁ గలతఁ జెందియున్న యాముగ్ధచిత్తమునఁ గేశవుఁ డొక భయంకరమూర్తియై హత్యాకారుఁడై సంచరించుచున్నాఁడు. మధ్య మధ్య నానందుఁడుగూడ గనఁ బడుచుండెను. ఆనందుని యదృశ్యమునకుఁ గారణభూతుఁ డెవడు? ఈ ప్రశ్న నామె పలుమారు ప్రశ్నించుకొనియెను. కాని, యా ప్రశ్నకుఁ బ్రత్యుత్తరభూతమగు రంగమునఁ గేశవానందు లిరువురు నాగపురమునకుఁ బోవుట; కేశవుఁ డొక్కఁడే తిరిగివచ్చుట; మాధవుఁ డానందునికొఱకు నాగపురమునకుఁ జనుట; అంతియేగాని అంతకుఁ బైన నేమియుఁ గనఁబడుటలేదు. కేశవుఁడు ఆతనిఁ దలఁచు కొన్నప్పు డెల్ల లలిత కొకవిధమైన భయము గలుగ నారంభించినది. ఆతఁడే యానందు నేమైనఁ జేసియుండునా? కేశవుఁ డట్లెన్నటికిని జేయువాఁడు గాఁడు. తన యన్నను — సౌభ్రాతృప్రేమమే స్వరూపము గొన్న ఆనందుని, ఏమైనఁ జేయునంతటి ద్రోహియా కేశవుఁడు? ఎన్నఁటికిని గాఁడు.

ఈ యాలోచనలో మునిఁగియున్న లలిత, కేశవుఁడు గృహముఁ బ్రవేశించుట చూడలేదు. కేశవుఁడు నేరుగఁ దనగదిలోనికిఁ బోయెను. ఆతఁడు గదితలుపుఁదెఱచుశబ్ద మామె వినినది. అంతటితో నామె యాలోచన మాగిపోయినది. తలయెత్తి యామె కేశవునిఁ జూచెను. తనగది ద్వారముకడ నిలువఁబడి కేశవుఁడు లలితను దదేకదృష్టి నొక నిముసముజూచి లోనికిఁ బ్రవేశించెను.

లలితయు లేచి, కేశవుని గదిద్వారముకడకుఁ బోయి "బావా! నాన్న వచ్చెనా నాగపురినుండి?" అని ప్రశ్నించెను.

కేశవుఁడు గిఱ్ఱున వెనుకకుఁ దిరిగెను. ఆతని వదనము జేవురించి యుండెను. కన్నులెఱ్ఱవారియుండెను. ఆతనిముఖమే భయంకరముగ

మాఱిపోయియుండెను. లలిత భయమున నొక్కడుగు వెనుకకుఁ బోయెను. తలవంచుకొనియెను మరలఁ జూచెను. కేశవుని వదనము సుప్రశాంతమయి యుండెను. ఆవికృతి కర్థమేమియో!

కేశ — లలితా! ఆనందుఁడు నాగపురమునుండి మాధవునితో నిన్న యుదయమే వచ్చినాఁడట. కాని గృహమునకుమాత్రము రాలేదు. ధనముతోఁ గూడ వచ్చుచున్నవారికి గీచకాటవియందు విపత్తు సంభవించుచుండునని యెంచుచున్నాను. ఇప్పుడే నాగపురము నుండి వచ్చితిని. మార్గమునగాని నాగపురమునగాని వా రగుపడలేదు.

లలిత — (భయకంపితస్వరముతో) వారికి నిజముగ నపాయమే సంభవించియుండునా?

కేశ — ఏమో! ఎట్లు తెలియఁగలదు?

కేశవుని వాక్యములు నిలిచిపోయినవి. తనయెదుటనున్న యాముగ్ధ మనమును దన మృషావాక్యములఁ గలుషీభూతము చేయకమున్నే కేశవుని వాక్యములు నిలిచిపోయినవి. ఎటనుండియో యాయిల్లు ప్రతిధ్వనించునట్లు లీక్రిందివాక్యములు వినఁబడినవి.

"ఓరీ! భ్రాతృహంతకా! జాగ్రత్తగనుండుము! స్వయంకృత పాపానలము నిన్నుఁ జుట్టుముట్టి భస్మముచేయనుండ నింకను నా బాలిక మనంబును నీయనృతములఁ గలఁతఁబెట్టెదవా? ఇఁక నిలుపుము. నీయనృతవాక్యములు దివాకరునియెదుట తమశ్చయమువలె విచ్ఛిన్నములు గానున్నవి!"

కేశవుఁడు నిర్విణ్ణుఁడై నిలువఁబడిపోయెను. లలిత "హా! తండ్రీ!" అనుచు మొదలునఱికిన వృక్షమువలెఁ గూలఁబడిపోయెను.

ఆమాటలు నిలిచినవి. ఎవ్వ రా వచించినది? కేశవునకుఁ దెలియ లేదు! కొంతకాలము లలిత కీరహస్యముఁ దెలియకుండఁ జేయవలయునని యెంచిన కేశవుని యాశయము భగ్నమైనది! ఇఁక బలవంతమున

లలితను దనవశముచేసికొనుటయే —

ఒక్కయుదయమునఁ గేశవుఁడు లలితవద్దకు వచ్చి యామె చేయి బట్టుకొని, కఠోరస్వరమున —

"లలితా! సర్వమును దెలిసికొంటివి! ఇఁక నీవానందమని జూడఁ జాలవు. నామాటవిని నాయిష్టానుసారము నడచుకొందువా నేనే నీకుఁ దండ్రి నయ్యెదను. ఇఁక నీవు జగచ్చంద్రు నెన్నఁటికిని గలిసికొనఁ గూడదు. ఆతని కీవిషయములు దెలుపఁగూడదు. అట్లు వాగ్దాన మొన రింపుము" అనియెను.

లలిత కేశవుఁ డనినటుల సర్వమును గ్రహించినది. తనతండ్రి రాక్షసుఁడగు కేశవునిచేతఁ జంపఁబడియెనని, ఆహత్య యితరు లెఱుంగ రాదని కేశవుఁడు తన్ననుమానించిన జగచ్చంద్రుని జంపియైన తన రహస్యమును నభేద్య మొనరింపఁ బ్రయత్నించినాఁ డని సర్వము గ్రహించినది.

ఇఁక నామె చేయవలసినపనియేమి? కేశవునివద్దనుండు టపాయ కరము. ఎట్లైనను దప్పించుకొని పోవలసినదే. కేశవుఁడు తనమాటలకుఁ బ్రత్యుత్తరము రాలేదని మరల "నాయిష్టానుసారము ప్రవర్తింతువా లేదా?" అని గద్దించెను.

ఒకక్షణములో కేశవుఁ డెన్నఁడు నెఱుంగనంత బలవేగమున నాతని నుండి విడివడి లలిత గృహ బహిర్ద్వారముకడ నిలిచి, క్రోధోద్వేగ మునఁ దడబడుచున్న కంఠముతో —

"ఓరీ! ద్రోహీ! నీవు నాకుఁ బినతండ్రి వైనందులకు నాకెంతయు సిగ్గగుచున్నది. పవిత్రమగు నాతండ్రివంశమును నీహత్యలచేతను, పాప రక్తపరిప్లవమునను కలుషితము జేసితివి! ఛీ! ఛీ! ఇఁక నీముఖము జూచుటే రాఁగల వేయిజన్మములకైన మనుష్యునిఁ బాతకుని జేసి వైచును! నీయిష్టానుసారము నడచుకొనవలెనా! ఆమాటఁ జెప్పుటకు

నీకు సిగ్గు గలుగలేదా? ఛీ! ఛీ! పాపంముండా! నీవంటి ఘాతకున కేమాటపలుక సిగ్గుండును" అనియెను.

కేశవుఁడు తనకు లలిత భయపడునని యెంచెను గాని యెదురు తిరిగి నిర్భయముగ నిల్చి పలుకునని తలంచి యుండలేదు. అతఁ డప్పుడు చొక్కాజేబునుండి పిడిబాకు నొకదానిని బయటికిఁ దీసెను. దానితో లలితను చంపవలయునని యే కాఁబోలు! లలితను డగ్గఱఁ జొచ్చెను. కాని యొకటి రెండడుగులు ముందడియు నిడకమున్నే బలిష్ఠమగు నొక కరము వెనుకనుండి యాతని చొక్కాను బట్టుకొని, యొక్క లాగునఁ గేశవుని గదిలోనికిఁ బడునట్లు త్రోసివైచెను. కేశవుని చేతి యందలి బాకు ఘణిల్లుమనుచు దూరమునఁ బడిపోయెను.

లలిత యీవిషయమును గమనించక తన్నుఁ జంపఁ గేశవుఁడు వచ్చు చున్నాఁడని విద్యుద్వేగమున నటనుండి పరువెత్తెను. ఆమెను గేశవుని నిశితకృపాణమునుండి రక్షించినది యేయమానుష హస్తమో!

౧౭

మిత్రమా! నీవేదో దుఃఖమునఁ జిక్కియున్నట్లు కనబడు చున్నావు. నేను కేశవునితో సంభాషించుచుండినపుడు గూడఁ గనిపెట్టి తిని. నీమనంబేదో యాలోచనాంతర ప్రమగ్నమయి యుండినది. నీ వైఖరియే నాకనుమానము గలిగించుచున్నది. ఇప్పుడును, మనము నాగ పురి డాయుకొలఁది నీవదనము వాడుచున్నది. దైవము మనకిరువుర కును స్నేహరూపబాంధవ్యము గూర్చినాఁడు. అది సామాన్యముగ విడి వడునది కాదు. నీవు కార్యార్థము కీచకాటవికి వచ్చినట్లు నాతోడ జెప్పియున్నావు. ఆకార్యభంగమేనా నీదుఃఖమునకుఁ గారణము? ఆవిషయమును నాయందు నమ్మకముంచి చెప్పితివేని నాచేయఁదగు సాయము చేసెదను."

"జగచ్చంద్రబాబు! నాదుఃఖకారణము నీకుఁ దెలుపఁగూడనిది కాదు. నీవంటిసద్గుణునికిఁ దెలిపినఁ బ్రమాదమేమున్నది? మాతండ్రి విషయము నీకుఁ దెలిపియుంటిని గదా? ఒకనాఁడు మాతండ్రి యింట నున్న ప్రాచ్యపుస్తకములను జూచుచుండ నందొక విచిత్రమగు విషయము గనఁబడినది. మాతాతయగు జగతీంద్రవసువుగారు ఆవిషయమును వ్రాసిరి. నాగపర్వతములయందు భేతాళగిరియందలి యొక మంత్రబద్ధమగు గుహలోఁ గొన్ని కారణాంతరములచే మాపూర్వీకులలో నొకరగు భీమదేవ వసువుగారు గొప్పధననిధిని దాఁచి యుంచిరఁట. ఆగుహ ప్రవేశింపవలెనన్న మంత్రబద్ధమగు నయఃకంకణ మొండు గలదనియు, దానిసాయమున నాగుహద్వారము దెఱవవలయు ననియు వ్రాసియుండిరి. ఆకంకణమొక యిత్తడి పేటికయందుంపబడి కీచకాటవి మధ్యమందున్న నొక సరోవరమందు గుప్తపఱుపఁ బడినది. మాతండ్రిగారు ఆకంకణముఁ దీసికొని రమ్మని నన్నంపిరి. వచ్చిచూడ నాకంకణ మందుఁ గాన్పింపక పోయినది. అది యాసరోవరమున లేదు. ఇత్తడిపెట్టెమాత్రము గట్టుపై మూఁత యొకచోటను, పెట్టె యొకచోటను బడవేయఁబడి యుండెను. కంకణము బోవుటకు నేనెంతయు దిగులుపడి యటనుండి పోవలయునని యెంచుకొని నాయశ్వమునకై వెదకితిని. నాయశ్వమాప్రాంతముననే గతప్రాణమై పడి యుండెను. ఇఁక నచ్చటనుండఁ గూడదని నేను బయలుదేరితిని. మార్గమందు నాకు గగూలియా దర్శన మయ్యెను. ఆతని గని భయమున మూర్ఛిల్లితిని. నాకు తెలివివచ్చిన పిమ్మట గగూలియా నేను గీచకాటవికి వచ్చిన కారణము దెలియఁగోరెను. నేను చెప్పలేదు. అందులకు నన్నురిదీయుమని యాతఁడాజ్ఞాపించెను. ఆతని భటులు నన్నుఁజంపఁ బోవుచుండ నీవు రక్షించితివి. అదియే నావృత్తాంతము. ఆకంకణము పోయినదానికై మాతండ్రి చింతించునో యనియే నేనిప్పుడు విచారించు

చున్నాను."

జగచ్చంద్రుఁ డాశ్చర్యచకితుఁడై పోయెను. చూడాధనుఁడు పలికిన ప్రతి మాటయు నాతని కాశ్చర్యముఁ గలిగించెను.

"చూడాధనబాబు! ఆకంకణముఁ దీసికొనినవారి కీనిధి వృత్తాంత మెట్లు దెలియగలదు. ఒక యయఃకంకణము మూలమున నింతగొప్పనిధి వచ్చునని వారికిఁ దెలియుట యసంభవము. కంకణాపహర్త గగూలియా యైయుండునా? అతనికిమాత్ర మీవిషయ మెట్లు తెలియఁగలదు? ఈరహస్యము తెలియనప్పు డాకంకణముతో నెవరి కేమి యుపయోగము? — మనమిప్పు డొకవిధముగఁ గంకణమెవరికిఁ జిక్కినదియు గనఁ గొనఁ గలము."

"ఎట్లు"

"ఆభేతాళగిరి ప్రాంతమున మనము కాచియుండి యెవరైన నా కంకణముతో గుహదెఱచుటకుఁ బ్రయత్నింతురేమో కనిపెట్టవలయును. ఎవ్వరును కనబడకయే దినములపర్యంతము వేచియుండవలసివచ్చును. అయినను గంకణమునుగాని దానిని దీసికొన్నవానిని గాని తెలిసి కొనుట కింతకన్న వేఱుమార్గము లేదు. ఒకవేళ నాకంకణము యొక్క నిజప్రయోజనము తెలియనందున నాకంకణాపహర్త యటకు వచ్చుటయే పోసగని యెడల మన కా కంకణము లభించుట దుర్లభమే యగును."

"జగచ్చంద్రబాబు! మరల నా కంకణము లభించునను నమ్మకమే లేదు. దానిని దీసికొన్నవాఁడు నిష్ప్రయోజకమని పాఱవైచియుండి నను నుండవచ్చును. దానిప్రయోజన మెఱుంగక వానియింట నేమూల నైనఁ బాఱవైచి యుండినను నుండవచ్చును. ఏది యెట్లున్నను ఆకంకణము దీసికొన్నవానిఁ దెలియక మనకది లభించునని యెంచుట వ్యర్థము. దానిగూర్చిన యాయాసము మఱింతవ్యర్థము."

మిత్రమా అంతమాత్రముననే అధైర్యపడకుము. అసంభావ్యములని మనమెంచునవి తెప్పపాటుకాలములో జరుగుటయుఁగలదు. — సంభావ్యములని నమ్మియుండినవి విఘటితములై పోవుటయుఁ గలదు. ఆకంకణమెవ్విధముననైన మరల లభించునని నాకుఁ దోఁచుచున్నది. నేనే యీరహస్యభేదనమున కుపక్రమించెదను.

పైసంభాషణము ముగియున్నప్పటికి జగచ్చంద్రచూడాధనులు నాగపురముఁ బ్రవేశించిరి. అక్షయుని సౌధ మెంతయో దూరమునలేదు. శీఘ్రముననే వారు సౌధము సమీపించిరి.

చూడా — మిత్రమా! అదియే మాగృహము. మాతండ్రి లోన గూర్చుండి నేను రానందులకుఁ జింతతో జమీను వ్యవహారములఁ గూడ విచారింపక నొక్కెడఁ గూరుండి దురపిల్లుచుండును.—

అనుచు జగచ్చంద్రునితో సౌధముఁ బ్రవేశించెను.

అక్షయబాబు హర్మ్యము చాల పెద్దది. నాగపురమునందు దానికి సమానమైన భవన మొక్కటియైన లేదు. అందు నాలుగు ప్రత్యేక భవనములు గలవు. ఆనాలిగింటియందొకటి యక్షయుఁడు నింకొకటి చూడాధనుఁడు వసించునవి. తక్కిన రెంటియం దొకటి స్త్రీలుండునది. పూర్వ మెప్పుడో ఆమందిరము శరచ్చంద్రచంద్రికామయి యగు యామినివలె నవవిలాసినులగు కాంతలతోఁ గళకళ లాడుచుండెను. అక్షయునిభార్య చనిపోయినతరువాత నాయింట స్త్రీలే లేకపోయిరి. దాసీజనుల నందఱను నక్షయుఁడు నిలిపివైచెను. కొంతకాలమువఱకు నాగృహము జనశూన్యమయి యుండెను. పిమ్మట అక్షయబాబు మేనత్త వారితో నుండుటకు వచ్చినది. ఇప్పు డామెయు, నామె పరిచారిక లిరువురు నామందిరమున వసించువారు. నాల్గవమందిరము పరిచారకు లుండునదిగను పాచకాలయముగను నున్నది.

జగచ్చంద్ర చూడాధనులు చూడాధనుని మందిరమునకుఁ బోయిరి.

చూడాధనుఁడు మార్గమందు భటు నొకని జూచి—

"రామనాథా! నాన్నగా రెక్కడనున్నారు."

"అమ్మగారితో మాటలాడుచున్నారు."

"సరి. నీవరుగుము"

జగచ్చంద్రుఁడు — చూడాధనా! అమ్మగా రెవరు?

"మా తాతగారి చెల్లెలు. నాచిన్నతనమునుండియు నామె యిచ్చటనే యున్నది."

ఇరువురును లోని కరిగిరి. చూడాధనుఁడు జగచ్చంద్రునికి స్నానానంతరము గట్టుకొన వస్త్రములు దీసికొని రమ్మని తన పరిచారకునకాజ్ఞయిచ్చి, జగచ్చంద్రునితో స్నానమునకు సిద్ధముగమ్మని పలికెను. ఇంతలో నొక సేవకుఁడువచ్చి చూడాధనునితో నాతని నక్షయబాబు పిలుచుచుండె నని పలికెను.

చూడాధనుఁడు తండ్రికడకుఁ బోవనెంచి జగచ్చంద్రుని బిలిచి -

"మిత్రమా! తండ్రిగారు పిలుచుచున్నారఁట. నేనుమాత్రమే పోవుటకన్న మన మిరువురమును బోవుట మంచిది. నాకిప్పుడే మనము తల్లడిల్లుచున్నది. కంకణవిషయ మాయనతో నేమనిచెప్పుటకును దోఁచుట లేదు. నీవును వచ్చి, యాయనకు జింతాభరము గలుగకుండ నీవృత్తాంతమును దెలుపుదువా?" అని యడిగెను.

జగచ్చంద్రుఁ డంగీకరించెను. వారిరువురును, నక్షయుని మందిరమునకుఁ బోయిరి. అక్షయబాబును మాపాఠకులకు మొదట పరిచితుఁ జేసినపు డుండినగదియందే కూర్చుండి వీరలకొఱకు వేచియుండెను. జగచ్చంద్రచూడాధను లాగదిఁ బ్రవేశించిరి. చూడాధనుఁ డక్షయునకు నమస్కరించెను. జగచ్చంద్రుని జూచి యక్షయుఁడు 'చూడాధనా! వీరెవరు ?' అని పశ్నించెను.

చూడా — తండ్రీ! ఈతఁడు మణిపురమునం దొక శ్రీమంతుని

పుత్రుఁడు; పేరు జగచ్చంద్రబాబు. ఈతఁడే యిపుడు నాతో వచ్చుట తటస్థింపకుండిన, నన్ను మీరు మరల చూచియేయుండఁజాలరు.

అక్ష — చూడాధనా! ఏమిటి చెప్పినది! మార్గమందు నీ వేదైన నపాయమునకు లోనయితివా?

చూడా — అవును. గగూలియా చేఁ జిక్కితిని: మరణింప నుండు నపుడు, ధైర్యసాహసములు మూర్తీభవించిన తెఱఁగున నీధీరుఁడు వచ్చి నన్ను వారలనుండి కాపాడెను.

అక్ష — ఆఁ! ఏమి! గగూలియాచేత జిక్కితివా? ఆ సంగతు లామూలము తెలుపుము.

చూడాధనుఁడు తానెట్లు గగూలియాచేతఁ జిక్కినదియు, జగచ్చంద్రుడు తన్నెట్లు రక్షించినదియు నంతయుఁ జెప్పివైచెను. అక్షయుఁడు గగూలియాపేరు వినుటతోఁ బ్రారంభించిన యపారభయము, చూడాధనుని కథ నాంతముగ వినినపిమ్మట మహాసంతోషముగ మాఱిపోవ, లేచి జగచ్చంద్రుని రెండుచేతులఁ బట్టుకొని —

"జగచ్చంద్రబాబు! అత్యంత ధైర్యశాలివగు నీకు నేను నాజీవిత మంతయు ఋణపడితిని. నావంశమును నిలిపితివి. నావంశాంకురమును రక్షించితివి. నాకుఁ బుత్రదాతవయితివి. ఇఁక నెంతని నిన్ను పొగడఁ గలను!!" అని, జగచ్చంద్రుని దన యాశీఃకుసుమముల నభిషిక్తుని గావించివైచెను. జగచ్చంద్రుడు కించిద్వికసితవదనారవిందుఁడై "బాబు గారూ! మీకుమారుని రక్షించుటయందు నిమిత్తమాత్రుఁడ నగు నన్ను మీరింత పొగడుట బాగుగలేదు. అన్నిఁటికిని దక్షుఁడగు దేవుఁడే జీవకృతకార్యములకుఁ గారణుఁడు, కారయిత. కాని నామూలమున నాపరమాత్ముడు మీకుమారుని రక్షణము నెఱవేర్చినందున మీవంటి మహాత్ముల మైత్రి నాకలవడి నాజన్మమును సార్థక్యముగ జేసెను. అంతియే చాలును." అనియెను.

అక్షయుఁడు – జగచ్చంద్రబాబు! అంతటి విపత్తుకు లోనయిన నాకూపహారుఁడు మరల నాకు దక్కుట కావలసినది కాని, యానిధి నాకంత యపేక్షణీయము గాదు. అటువంటినిధులు వేయి బోయినను, ఈక్షణమున నేను నిర్ధనుఁడనై పోయినను, నాకుపహారుడు నాకు దక్కుట కన్న వాంఛనీయమైన దన్యములేదు. దానికిఁ గారణుఁడ వగు నిన్ను మహాత్మునిగాఁ బూజింపవలయును సుమా!

జగ – మహాత్మా! ప్రస్తుత మానిధి వృత్తాంతము మీతోడ మాటాడ నెంచియున్నాను. పరహస్తగతమయిన కంకణమును మరల నుద్ధరింపవలయును. కష్టములకు వెఱచి, యంతటి ధనమును బోఁగొట్టు కొనఁగూడదు. కష్టములేక ఫల మెన్నఁటికిని దక్కదు గదా! మన మెట్లు ప్రయత్నించిన బాగుండునని మీ యభిప్రాయము? మీ కుమారుఁడు నాకన్ని విషయములును దెలిపియున్నాఁడు. నేనే యీ కార్యమునందుఁ బ్రసక్తిఁ గలిగించుకొన నెంచియున్నాఁడను. కాని, మీ యంగీకారములేనిది నే నాకార్యమునకుఁ గడంగఁజాలను.

అక్ష – మిత్రమా! ఈనిధి మరల మాకుఁ దక్కుననుట నాకు నమ్మకముగఁ దోఁచుటలేదు. కాని ముందు మన మాలోచింపవలసిన విషయము లున్నవి. దక్కునో దక్కదో యను ననుమానాస్పదమగు నొకకార్యార్థము ప్రయాసపడుట తుదకు వ్యర్థమేయయిన నీకును మాకునుగూడ సంతాపహేతువగునుగదా! అయినను నొక నిబంధనకు నీవంగీకరించిన నీ వీకార్యమునందుఁ బనిచేయుటకు నే నంగీకరించెదను. ఆనిబంధనము – నీప్రయత్నమువలన నానిధి మాకులభించెనా దానియం దర్థభాగము నీయది. అది దక్కకపోయెనా, నీప్రయాసమునకు బదివేలరూప్యము లొసంగెదను. దానిని నీవు పరిగ్రహింపవలయును. ఏమందువు?

జగ – బాబుగారు! నా కీకార్యమునందు ధనలాభ మవసరము

లేను. నేను ధనమునకై యీ ప్రయత్నము చేయుటలేదు.

అక్ష — అశ్లైన్నట్టికిని వీలుపడదు. ఈ నిబంధనమునకు నీ వంగీకరించియే కావలయును. లేకున్న వృథాప్రయాస నీకీయ నేనొప్పుకొనను.

చూడా — (జగచ్చంద్రునితో) మిత్రమా! అంగీకరింపుము. తండ్రిగా రత్యంత ప్రశంసనీయమగు నిబంధమునే వచించిరి.

జగచ్చంద్రుఁడు మనంబున "ఆహా! వీరి పరస్పరప్రేమ మెంతయు శ్లాఘనీయమైనది. అక్షయబాబునకుఁ జూడాధనునిపైఁగల వాత్సల్యము నందు సగపాలేని నాతండ్రికి నాయెడ నుండియుండినచో" అని వితర్కించుకొనియెను. అక్షయబాబునకుఁ బ్రత్యుత్తర మేమి యిచ్చుట? ఆతఁడు తన నిబంధనమున కంగీకరింపనియెడ జగచ్చంద్రుని సాయ మపేక్షింపఁడు. జగచ్చంద్రుఁడు తుద కంగీకరింపక తప్పలేదు.

జగచ్చంద్రుని యంగీకారమున కక్షయుఁ డానందమంది —

"మిత్రమా! నాయిచ్చకు నీవొప్పుకొని యెంతయు సంతసము గూర్చితివి. రేపటినుండియు నిధిని బునరుద్ధరింపఁ బ్రయత్నింపుము. అందు నీకు జయము కలుగుఁగాక! ప్రస్తుతము నీకుఁ గావలయు కర్చులకు నూఱురూప్యము లిచ్చెదను."

జగచ్చంద్రుఁడు వారింపనెంచెను గాని యక్షయుని నోటవచ్చిన మాట జరిగియే తీరునని యాతఁడు తెలిసికొనినవాఁ డగుట నుపయోగము లేదని యూరకుండెను.

జగచ్చంద్ర చూడాధనులు స్నాన మొనరించుటకుఁ బోయిరి. అక్షయుఁడు వారిరాక భాగీరథీదేవికిఁ దెలుపఁ జనియెను.

౧౮

ఆనాఁటి సాయంకాలము జగచ్చంద్ర చూడాధనులు శాంతబాబువద్ద కానందునిగూర్చి విచారింపఁబోయిరి. శాంతబాబు నాగపురమునందలి శక్త్యాలయమునకుఁ గుడిప్రక్కనున్న చిన్న యింటియందు వసియించు

చుండెను. ఆతని వయ స్సెనుబదేండులు. ఆతఁడు చిన్నవాఁడుగా నుండినది మొదలు మూఁడు నాలుగేండ్లు క్రిందటివఱకు సత్యయుని కడను నాతని తండ్రియగు తారానాథునివద్దను లేఖరిగ నుండెను.

జమీనువిషయికములగు లెక్కలను వ్రాయువారు, విచారణకర్తలు ననేకు లున్నను నీతనియందుఁ దారానాథున కత్యంతమగు వాత్సల్య ముండి యుండెను. ఇతఁడు గృహవిషయికములగు లెక్కలను వ్రాయు చుండును. తారానాథుని యనంతర సుకృయుని కాలమునఁ గూడ నీతఁడు కొన్నివత్సరములవఱకుఁ బనిచేసెను. కాని వయస్సు మీఱి నందున నక్షయుఁ డతని కీపనిచూపాయల యుపకారవేతన మేర్పఱచి యాయుద్యోగమున నీతని బదులీతనికుమారుఁడు హరలాలుని నియ మించెను. శాంతబా బప్పటినుండియు విశ్రాంతి గైకొనెను.

ద్వారముకడ జగచ్చంద్రచూడాధనులను జూచి లోపలఁ గూర్చుండి యేమియో వ్రాసికొనుచున్న శాంతబాబు లేచి వారి కెదురువచ్చి "బాబు! రండు లోనికి" అని యాహ్వానించెను. చూడాధనుఁడు జగ చ్చంద్రునితో లోనికిఁ బోవుచు "తాతా! కుశలముగ నుంటిరా?" అని యడిగెను.

శాంత — కుమారా! కుశలము గా కేమున్నది. మీవంటి యుదారగుణులగు ప్రభువుల మన్ననఁ బొందినతరువాతఁ గూడ నా విషయమైన శంక యుండునా: ఈయనయెవరు?

చూడా — దైవానుగ్రహమున ... నాకు లభించిన యపూర్వ మిత్రుఁడు. ఈయనపేరు జగచ్చంద్రుఁడు.

శాంతబాబు వారి నొక బల్లమీఁదఁ గూర్చుండుఁ డని కోరెను. అతఁడును నాసీనుఁడై యిట్లు ప్రసంగింప మొదలిడెను.

"చూడాధనా! ఎవరు? జగచ్చంద్రబాబా! ఈయన? (జగచ్చం ద్రుని కొంచెముకాలము నిదానించిచూచి), జగచ్చంద్రా! మఱచి

తాతా నన్ను? నీవు విజయచంద్రుని కుమారుఁడవుగదూ? నేను జూచి నప్పుడు పదేండ్లకొల్లవాఁడవు. ఇప్పుడు నవయౌవనమున ప్రారంభించు చున్న మత్తగజమువలె మీఱిపోతివే! నన్నెఱుఁగవు? నీ చిన్ననాఁటి తాతయ్యను?"

జగచ్చంద్రుఁడు శాంతబాబును దదేకవీక్షణములతోఁ జూచుచుఁ గొంతవడికి మొగము వికసింప శాంతబాబుకడకు గంతువైచి "తాతయ్యా! నాచిన్ననాఁటి యరటిపండ్ల తాతయ్యవుగదూ? జ్ఞాపకమునకు వచ్చినది. ఇంతకాలము నన్ను మఱువలేదుగా మీరు? మీకన్న నెన్నియోవత్సరముల యంతరముగల నేనిప్పుడే మఱచితిని. క్షమింపుఁడు" అనియెను.

శాంత — మఱవనుసుమీ! ఈకాలపు పిన్నవాండ్ర తెలివి యంత మాత్రములోనున్నది. నిన్న చూచినవస్తు వీదినము కనఁబడిన నది యెన్నఁడు నెఱుఁగనివస్తువే వారలకు.

చూడా — (నవ్వుచు) జగచ్చంద్రబాబు! శాంతబాబు నాకొక్కఁ డికే తాత యనుకొంటిని. నా తాతను నీవు లాగుకొంటివి. ఇఁక నిరు వురుచేరి వీనియవసరమేమని నన్నుఁ దఱిమివైతురా?

శాంత — నిన్ను తఱుమవలసినదే! నీవీమధ్యఁ జాలఁ దులిపి వాఁడవైతివి. నావద్దకువచ్చి యెన్నినాళ్లయినదినీవు? మూఁడుదినము లుగ 'నీ తాత' నీకే కనఁబడలేదు. ఇఁక నీయవసర మేలకలుగును?

చూడా — లేదులేదు; తాతయ్యా! ఒకానొక కార్యార్థము గ్రామాంతరము పోయియుండి యీదినమే వచ్చితిని.

శాంత — ఎచ్చటికిపోయియుంటివి?

చూడా — కీచకాటవికి.

శాంత — ఎచ్చటికి?

చూడా — కీచకాటవికి తాతయ్యా!

శాంత — సగూలియానుగూడ చూచితివా? ఇంకను తీపి భక్ష్యములయందొకదానిని నీకు రుచిచూపలేను?

చూడా — (నవ్వుచు) తినుటకు మాకెంతో భక్ష్యమునిచ్చినాడు. కాని జగచ్చంద్రుండా భక్ష్యమును వారిమొగమునకే సాజ్జైచినాడు.

శాంత — అట్టులనా? ఎక్కడ నీకా తినుబండారమును వారిచ్చినది?

"శిథిలమందిరముకడనున్న సరోవరప్రాంతమున"

ఆమాట వినుటతోడనే శాంతబాబు మొగము వెల్లనాయెను. ఒకటి రెండు నీటిచుక్కలు కనురెప్పలయంచుల నిలిచెను. శాంతబాబొకతీవ్రమున ముఖమటు ద్రిప్పి కన్నులు తుడిచికొనియెను. కాని, శిథిలమందిరప్రాంత సరోవరశబ్దము వినినంతనే శాంతబాబునందలిపరివర్తనము జగచ్చంద్రుఁడు తిలకించెను. అతఁడు శాంతబాబును డగ్గఱి, మెల్లఁగ నిట్లనియెను.

"తాతా! కీచకాటవియందలి శిథిలమందిరవిషయము మీకంత దుఃఖము కలిగించినదేల? ఆసంగతి యేమియో చెప్పరు?"

శాంత — ఏమియునులేదు. ఆశిథిలమందిరము యొక్కయు దత్ప్రాంత సరోవరముయొక్కయు పూర్వచరిత్ర జ్ఞప్తికివచ్చినది. ఆవిషయ మెప్పుడు జ్ఞాపకమునకువచ్చినను నాగుండె నీరయిపోవును.

చూడా — తాతా! మాకాచరిత్రము చెప్పుము. వినవలెనని యెంతో యభిలాషగనున్నది.

శాంత — అది యంత సంతోషకరమైన విషయము గాదుసుమా! మఱియొకటి, యీవిషయమును దెలిసినవారెందఱోలేరు.

జగ — దుఃఖకరమైన విషయమైనంతనే యపాయములేదులెండు. దానిని మాకుఁ దెలుపుఁడు. అది మీకు సంబంధించినదా?

శాంత — కాదుకాదు! కాని, చూడాధనుని పూర్వికులకు సంబంధించినది.

చూడా — ఏమిటి? నా పూర్వకథను సంబంధించినదా? ఏమి యా విషయము! చెప్పుము.

శాంతి — అట్లయితే చెప్పెదను. వినుము.

౧౯

“కృష్ణాసమీపమున కాలవయున్న ప్రాంతమున నా ప్రదేశమాక్రమించుకొని పసులపాడు యను గ్రామముండెను. ఆగ్రామము నాలు గువైపుల నున్న పన్నెండు గ్రామములును నొక జమీనాయైయుండెను. ఆ జమీనుకు మహాదేవుడు అధిపతిగ నుండెను.

ఆతనికిఁ జాలకాలము సంతానములేక తుదకొక కుమారుఁడు గలిగెను. లేక లేక పుట్టినముద్దులబిడ్డఁడగుటచేత నాతనికి హీరానందుఁ డను నామధేయమిడి మిగులగారాబముతో మహాదేవుఁడు పెంచు చుండెను. తలిదండ్రుల యసమానప్రేమయందుఁ బెరుగుటచేత హీరా నందుఁడు దుర్మార్గుఁడై పోయెను. బాల్యపుఁ జిలిపిచేఁతలు యౌవ నపుదౌష్ట్యములుగా మారెను. కట్టకడకు హీరానందుఁడన్న నాగ్రామ నివాసులకు ఒకతీరైన భయముకలుగుచుండెను.

చాలకాలమువఱకు మహాదేవునకిఁ గుమారుఁడొనరించు దుర్మార్గ మింతగాఁ జింతఁగలిగించలేదు. ఎంతటిదౌష్ట్యమునైనను దనయమృత కరముచేత నాచ్ఛాదించు పితృప్రేమ హీరానందుని నిజస్వరూపమును మహాదేవుని కన్నులకుఁ గనఁబడకుండఁ జేయుచుండెను. తుదకు తీవ్రమగునిర్ఘోషపాతమువలె నొక భయంకరవిషయముజరిగి దాని మూలమున మహాదేవునకిఁ గుమారుని నిజస్వరూపము వెల్లడిఅయ్యెను. మహాదేవుఁడొక క్రీడాసరోవరమును దానినంటియొక విశ్రాంతి భవనమును నిర్మించియుండెను. ఆ సరోవరమునందలి జలమునే యా గ్రామప్రజలు పానీయముగాఁ గొనిపోవుచుండిరి.

హీరానందునకు కలవ్యసనములలో నొకటియైన విషయలోలత, యాతని గ్రామస్త్రీలు తీర్థమునకై యా సరస్సునకు వచ్చు వేళ కా విశ్రాంతిభవనమునకు వచ్చునట్లు ప్రేరేపించెడిది. ప్రతిదినమును రహస్యముగ నెవ్వరికిఁదెలియకుండ నాతఁడు విశ్రాంతిగృహమునుజేరి యచ్చటికి వచ్చువారి సంగతినిజూచి సంతోషించుచుండును. అచ్చటికి వచ్చుకాంతలలో నొకతెయు నాతనికి నచ్చియుండలేదు. అందుచే నాతని యితరదుష్కృత్యములకు మఱింత భయంకర వర్ణ మొసంగుటకు పరకాంతాపహరణోద్యోగము జరిగియుండలేదు.

మహాదేవునివద్ద, జమీనుదారి వ్యవహారములపై యధికారము గలిగి, కళాధనుఁడను నాతఁడుండెను. కళాధనుఁడు అక్షయబాబుగారి మేనత్త భాగీరథీదేవి తమ్ముఁడు. ఆతనిభార్య శారద తారానాథవసువుగారి దౌహిత్రి. భాగీరథి తనభర్త మరణానంతరము తమ్మునివద్దనే యుండెను. రెండువైపులను వారు అక్షయవసువుగారి బంధువు లయ్యును నంతభాగ్యవంతులుగారు.

మహాదేవుఁడు కళాధనుని తల్లివంక చుట్టము. ఆతఁడు తనకు సంతానము లేనికాలమున కళాధనుని దగ్గఱదీసి పెంచెను. కుమారుఁడు కలిగినపిమ్మటఁగూడఁ గళాధనుని జమీనువ్యవహారముల నన్నిటిని విచారించు నధికారిగా నియమించెను.

హీరుఁడు పరస్త్రీ సౌందర్యపరీక్షార్థము విశ్రాంతిభవనము కరుగుట ప్రారంభించినతరువాత రెండుమూఁడు నెలలు గడచినవి. దురదృష్టవశమునఁ గళాధనునిభార్య శారద హీరునికండ్లఁబడుట తటస్థించెను. జవ్వనమునఁ గళలఁ దేరుచు, శరచ్చంద్ర చంద్రికా ప్రఫుల్లయైన యా యువతి చెలిమికత్తెలు గొందఱితోఁగూడి యొకసాయంత్రము సరస్తటోపవనమునకు రాఁగా విశ్రాంతిభవనమున దాఁగియున్న హీరుఁ డామెను జూచెను. ఇంతవఱకెందఱ స్త్రీలనో చూచియుండినను జలింపని

హీరుని యెడఁద శారదను గనినంతనే చలించెను. కాని యా నాటి కేమియు నతఁడు తొందరపడలేదు. బహుశః అట్లు కావించుట కష్టంబు నెఱుఁగఁగాఁడ లేకపోయి యుండవచ్చును. శారద యచట కొంత వడి చెలులతో విహరించి గృహమునకుఁ బోయినది.

మోహపీడితుఁడగు హీరుఁ డామె యెవ్వరైనదియుఁ దెలిసికొనినవాఁ యుండెను. తన సమీపబంధు వేయని యెఱుఁగకపోయి నప్పటికిని, తన తండ్రి యప్రియమునకు గురికావలసివచ్చునేమో యను కొంత భయము పడినప్పటికిని, మోహాంధు ప్రవృత్తి నేమైన నడ్డగింపఁగలదా? — అడ్డగింపఁ జాలదు. హీరుని మోహము కట్టలు తెగి శారదపై ప్రవహించినది. తుదకొకదుర్దినమున శారద యందు మునిఁగిపోయినది. ఆనాటి సాయం సమయమున శారద చెలులతో మరల నా యుద్యానవిహారమునకు వచ్చి నది. కొంతవడి యందుఁ దిరుగాడి యామెయు వారును సరోవరము చెంత సుఖాసీనులయి ముచ్చట లాడుకొనుచుండిరి. ఇంతలో నొక సేవకుఁడు వారి చెంతకు పరుగిడివచ్చి, శారదతో "అమ్మా! మీభర్త గారికి ప్రమాదకరమైన గాయము తగిలినది. వారిని ఇంటికి, తీసికొని వచ్చినారు. మిమ్ము వేగమె రమ్మనిరి" అని చెప్పి యావెంటనే వాఁడు మరలి పరుగెత్తిపోయెను. శారద యా వార్త విని నిర్ఘాంతపడి, యనంతరము చెలులతో నేమియో యని - పడిచెడి విశ్రాంతిభవన మార్గము మీఁదుగా గృహమునకుఁ జనినది.

కాని! యట్లు గృహమునకు జను సమయముననే యామె మాయ మైనది. కళాధరుఁడు జమీందారీభవనమునుండి రాత్రి కింటికి వచ్చి నాఁడు. ప్రియపత్ని యదృశ్యతను దెలిసికొని నిర్విణ్ణుఁడై పోయినాఁడు. అనుకూలవతియు, పతివ్రతాతిలకము నగు తనశారద యేదియో యిక్కట్టు పాలయ్యె ననియే నిశ్చయించుకొనినాఁడు. ఎంతయు బెగడొందుచు నంతట నామె నన్వేషించుటకు బయల్వెడలెను. శారద మాయమైన

దుర్వార్త గ్రామమంతట త్రుటికాలములోఁ బ్రాకిపోయినది. చిన్నవా రందఱు కళాధరునితోఁ గూడ నన్వేషణమున కేగిరి. పాపము, వారా రాత్రియంతయు పరిసరారణ్యమంతట వెదకుచునే యుండిరి. కాని శారద కాన్పించకపోయెను.

ఉదయమునకు కళాధరుఁడు పిచ్చి యెత్తినవాని వాలకముతో గృహముఁ జేరవచ్చెను. వచ్చి యతఁడు తన గదిలోనికిఁ బోయి యందొక కుర్చీపైఁ గూలఁబడి కుమిలి కుమిలి వాపోవుచుండెను. కొంత వడికి హఠాత్తుగా నాతనిదృష్టి చెంతనున్న మేజాబల్లపై గల కాగితముపైఁ బడినది. అది యొక లేఖ యట్లు తోఁచగా నాతఁ డాత్రముతో నందికొనినాఁడు. విప్పి "ప్రాణనాథా!" యను సంబోధనముతో మొదలిడి యత్యుద్వేగముతో చదివికొనినాఁడు. "ప్రేయసీ!" యనుచు మూర్ఛిల్లినాఁడు. అనంతరము నలుగురు చేరుట, లేఖాంతర్గత ఘోరవృత్తాంత మెఱుఁగుట తటస్థించినది. ఆలేఖ శారద వ్రాసినదే. అందామె తనకు హేరునివలన బలవంతముగ జరిగిన మానభంగమును హృదయవిదారకముగ వెల్లడించినది. పతితనై భర్త సంస్పర్శనమునకు బనికిరాకపోయిన తన దేహము జాబును జదువుకొనఁ గలుగునప్పటికి ప్రాణహీనమైపోవునని తన నిశ్చయమును సూచించినది. పత్యనురాగయగు నాసాధ్వీమణి భర్తయొక్క తుది సందర్శనమును వాంఛించి పరువాతను రహస్యముగ నతనిగృహముఁ జేరినట్లును, ఆశోపహతయై లేఖనుమాత్రము వ్రాసి యందుంచి తన నిశ్చయమును నెఱవేర్చుకొనుటకు వెడలిపోయినట్లును నాలేఖ వివరముల వలన తెలియవచ్చినది. మూర్ఛితుఁడయిన కళాధరుని కింకను తెలివి రాలేదు. ఈ దుఃఖములో నీతనికి ప్రాణోపద్రవ మెక్కడకలుగునో యని భయము తోఁచినది. అందుచే వెంటనే వైద్యుని బిలువనంపఁగా నాతఁడు వచ్చి కళావంతునికి స్మృతి కలిగించు ప్రయత్నములఁ

జేయుచుండెను.

అప్పటికి అరఘామము ప్రొద్దెక్కినది. శారద యెంతవేగముగ గ్రామము నధిగమించినను ఎంతయో దవ్వరిగియుండనేరదు. ఒకవేళ నింకను ఆమె ప్రాణములతోనుండిన నుండవచ్చును. ఇట్టియూహ కలుగగానే యొకరిహెచ్చరికపై పలువురు శారదాన్వేషణమునకు మరల బయలుదేరి వడిగఁ బోయిరి. దైవసంకల్పముగానోపు, ఉత్తరదిశాభిముఖులయిపోయినవారికి క్రొన్నెపునగల యడవిలో, అనుకొనినట్లే యొకచెట్టునకు త్రాడు వేసి యురిపోసికొనబోవుచున్న శారదామంగళవిగ్రహము దృశ్యమైనది. వెంటనే వారామెకడ వ్రాలి తత్ప్రయత్నమును నివారించిరి. కాని యామె తన కృతనిశ్చయమును తీర్చుకొనకుండ మానుట కిచ్చగింపలేదు. వెళ్లినవారుమాత్ర మామె నొకటి ప్రార్థించిరి. కళాధనుఁడు మృత్యుముఖముననున్న విషయముఁ దెల్పి యొకపరివచ్చి యాతని నుద్ధరించి మఱితనకార్యమును నెఱవేర్చుకొనవలసినదిగాఁ గోరిరి. కళాధనునివిపత్తును వినఁగనే యామెగుండె లెగసిపోయినవి. అంతట నామె మఱిమాటాడక వారి వెన్నంటినది. కాని యంతమాత్రము నామె తన నిశ్చితమును మరల్చుకొనినదనుకొనుటకు మాత్రము వీలులేదు.

కళాధనుఁ డప్పుడే, వైద్యమహాశయుని ప్రయత్నముల ఫలముగా నొకింత తేఱుకొనినాఁడు. అతఁడు మండువాలోనే యొక మంచముపై పరుండఁబెట్టఁబడియుండెను. శారద శివమెత్తినరీతిని హఠాత్తుగ నచటికే పరుగెత్తుకొనివచ్చినది. ఒక్కయుదుటన భర్త పర్యంకమును డాసినది. అరవిప్పియున్న కళాధనునికనులు చలించినవి. పెదవు లొకపరి కంపించినవి. ఏదియో నస్పష్టముగ ధ్వనికూడ వెలువడినది. అతనిచేతులు ముందుకుఁ జాచబడినవి. శారద తోడ్తోనే బాహ్యప్రపంచమును మఱచి యతనిచేతులలో తూలిపడిపోయినది,

శారద వీపుపై నాతనిహస్తములు బిగిసికొనిపోయినవి. ముఖములు రెండును దీర్ఘచుంబనమున లీనమయినవి. హృదయములు లొండొంటి ధ్వనులతో శ్రుతిగల్పినవి.

అయిదు, పది పదునైదు, ఇరువది, ముప్పది, నలువది నిమిషములు గడచినవి. శారద కళాధరుని యాశ్లేషణమునుండి విడివడలేదు. అప్పుడే లోనికివచ్చిన వైద్యుఁ డాశ్చర్యపడియెను. శారద వీపుపైనున్న కళాధరునిచేతిని దాఁకిచూచెను. అది మంచుగడ్డవలెఁ జల్లగ నుండెను. ఆతఁడు రెండుచేతులను విడదీసెను. శారద లేవలేదు. భాగీరథి, 'శారదా! శారదా!' అని పిలిచెను. ప్రత్యుత్తరములేదు. ఆమె మూర్ఛిల్లినదేమోయని యెంచి, భాగీరథి దేవి శారదను కళాధరునిపైనుండి లేవదీసెను.

ఇంక నేమున్నది? అంతయుఁ దేలిపోయినది. కళాధరుని హృదయమంతయు రక్తమునఁ దడిసియుండెను. వారిరువురకును నొక్కేసారి రక్తనాళములు తెగినవి. పరస్పరప్రేమోన్మాదులగు శారదా కళాధరులు తుది యాశ్లేషణమునందే యిహలోకత్యాగ మొనరించి, యేవిధమైన కష్టములుగాని దుఃఖములుగాని లేనట్టి యానందలోకమును జేరిరి.

* * * *

విషాదాంతమగు, శారదా కళాధరుల జీవితనాటకము పూర్తియయినది. ఇఁక జరిగిన విషయములు కొన్నివాక్యములలోఁ బూర్తిగావింపవచ్చును. మహాదేవుఁడు, రెండు దారుణమరణములకు మూలకారణమయిన హంతకుఁడగు కుమారుని నెట్లు దండించిన ఘోరాపరాధమునకు సరియైన శిక్షయగును? ఎన్నియో యోజించినాఁడు. ధర్మశాస్త్రాదికము లప్పట్టున నట్టి యపరాధములకుఁ దగిన శిక్షను విధించిన ట్లాతనికిఁ దోపలేదు. తుద కొకవిధమునఁ జేయ నిశ్చ

యించినాఁడు. తానే సంసారపరిత్యాగ మొనరించినాఁడు. సర్వమును బరిత్యజించినాఁడు. ఆనాఁటిరాత్రియే యెవ్వరికిఁ దెలియకుండ నెచటికో వెడలిపోయినాఁడు.

ఆగ్రామమునందు నూతనశక మారంభమయినది. వీరానందుఁడు తండ్రివలె యీసంపదలకై చింతింపక, శారదాకళాధనులయెడఁ దాఁగావించిన దౌష్ట్యమునకై పరితపించుచు ఎప్పటివలెనే సన్మార్గములో సంచరించుచు జమీనుదా రయ్యెను.

ప్రజ లెంతకాల మోర్వఁగలరు నిరంతర క్రౌర్యమును? రాను రాను హెచ్చుచున్న క్రౌర్యము గ్రామజనుల యోర్పున కతీతమగుచుండెను. గ్రామప్రజలలో తొమ్మదివంతులు తమ గృహాదికము లమ్ముకొని తారానాథుని కరుణావీక్షణముల నభివృద్ధినందుచున్న నాగపురమునకు వచ్చిరి. తక్కుంగలవారు అందఱు నొక్కటియై హీరుని రూపుమాపవలయునని నిశ్చయించిరి. వారిప్రయత్నము హీరుని కెట్టులోఁ దెలిసిపోయెను. ఇఁక దన కచ్చటనుండు టపాయకరమని యాతఁడు నెచ్చటికో పాఱిపోయెను. అదిమొదలు నాతని యుదంత మింతవఱకు నెవ్వఱు నెఱుంగరు.

హీరుని యనంతరము ఆగ్రామ మెంతయో కాలము నిలువలేదు. కొన్ని వత్సరములకే యది యధఃపతనముఁ బట్టెను. పట్టపగలే చోరుల గుంపు గ్రామముపైఁబడి యప్పటికే నిర్జనమయియున్న యాగ్రామమును దోఁపిడులచేతను హత్యలచేతను మఱింత భయంకరముచేయ నారంభించెను. ప్రజ లట నిలువలేక ప్రాణధనరక్షణమునకై నాగపురాది యన్యగ్రామముల కరిగిరి. ఆగ్రామమే మఱికొంతకాలమునకు అడవియైపోయినది. అంతకుము న్నాగ్రామము చుట్టునుండిన చిన్న యడవి యాయూరిని దనపొట్టఁబెట్టుకొని పెద్ద యరణ్యమైనది. ఇండ్లు పొలములు అన్నియు చెల్లయిపోయినవి. కాని హీరానందుని దౌష్ట్య

మునకు పరిస్థలమై యీజమీందారీ యధఃపతితమగుటకు హేతుభూతమైన యీసరస్సును విశ్రాంతిభవనమును హీనుని దుష్కృత్యశోకము వలె నిప్పటికి నిలిచియున్నవి."

శాంతబాబు శిథిలమందిర పూర్వవృత్తాంతమును ముగించెను. జగచ్చంద్రుడును చూడాధరుడును నాకథను విస్మయపడ్డవారై వినుచుండిరి. వారలకు లోకమున కల్యాణగుణాకరుండగు పరమేశ్వరుని యీలోకమున హీనునివంటి రాక్షసుడుగూడ నుండునా యను సంశయము తోచెననుటకుఁ బైవిషయములఁ బఠించిన మా పాఠకులే సాక్షులు. ఎంత ఉత్తములు తమ పవిత్రజీవనముల సధర్మమునకు ధారవోయుటలేదు! ఈకలి ప్రపంచము నిట్టి విషాదరంగము లెన్ని జరుగుటలేదు!

జగ — ఆహా! ఆవిహారోద్యాన మందిరమేనా కీచకాటవిమధ్య నిప్పుడు శిథిలమైయున్న మందిరము? దానికడనున్న సరోవరము మహాదేవుడు త్రవ్వించినదేనా?

శాంత — ఔను! సదుద్దేశ్యముతో మహాదేవుడు త్రవ్వించినదియుఁ గట్టించినదియు నయ్యనుబాపచిత్తుఁడగు హీనునివలన శాశ్వతమలినముగఁ జేయఁబడినది! ఇట్లే యెన్ని కార్యము లుత్కృష్టోద్దేశ్యములతో చేయఁబడి దారుణపరిణామములకు మూలభూతము లగుటలేదు!

చూడా — తాతగారు! ఈవిషయము లన్నియు నాయనగా రెఱింగియే యుందురని యెంచెద.

శాంత — ఎఱుంగకేమి! తన తమ్ముని మరణమునకుం జాల చింతిలి క్రుంగిపోయి భాగీరథీదేవిగారు మీతండ్రిగారికొఱకే కదా వచ్చియున్నారు. ఈయంశములు జరిగినప్పుడు అక్షయవసువుగారు పదేడులపిన్నవారు. వారికి గమనముండియుండవచ్చును.

జగ — (నవ్వుచు) చూడాధనా! మనమువచ్చినకార్యము విస్మరిం

చిత్రమే! తాతగారివార్ధకోరణి ముసల వేయిమాలకో లాగుకొనిపోయినది. ఇంకఁ బ్రస్తుత మనుసరింతము. తాతా! మీ కానందచంద్ర కేశవ చంద్రుల నొకచిత్తులనియే యెంచెదను.

శాంత — మీతండ్రిగారి తోటలను సాగుబడిచేయించుచుండు వారా? వారిని బాల్యమునుండియుఁ గూడ నెఱుఁగుదును. వారి తండ్రి గోవిందబాబు నాకత్యంతహితుఁడు.

జగ — అప్పుడప్పుడు వారిరువురు మీవద్దకు వచ్చుచుందురని యెంచెదను.

శాంత — సుమారు పదేండ్లనుండి వారిరువురు నావద్ద కెప్పుడును వచ్చియుండలేదు. ఆనందుఁడు మాత్రమే వచ్చును.

జగ — ఏల?

శాంత - కేశవుఁడు మంచివాఁడుగాఁడు. అతఁడుచేసిన యొకటి రెండు చెడ్డపనులను నేను ఖండించితిని. అది మొదలాతఁడు నావద్దకు రాఁడు.

జగ - ఆనందుఁడో?

శాంత - ఆనందుఁడా! కేశవుఁ డెంతచెడ్డవాఁడో యానందుఁ డంతమంచివాఁడు. వారిరువురు నొక తల్లికడుపునఁ బుట్టిన బిడ్డలయ్యు నొండొరుల నడవడియందేమి, గుణములందేమి, చాలభేదము గలవారు. వారిరువుర మార్గములు వేఱు. పరస్పరవిరుద్ధములు. ఈ షణ్మాత్రసంబధమేనియు లేదు. కేశవుఁ డెంతక్రోధియుఁ గ్రూరుఁడో యానందుఁ డంతశాంతుఁడు. సదయుఁడు. కేశవుఁ డెంత కఠినుఁడో యానందుఁ డంతమెత్తనివాఁడు. కేశవుఁడెంత యధర్మప్రవర్తనుఁడో యానందుఁ డంత ధర్మప్రవర్తనుఁడు. ఇప్పుడు మీకు వారిగుణాదికము తెలిసినదని యనుకొందును.

జగ — చాల బాగుగఁ దెలిసినది. మూఁడు దినములక్రింద నానందుఁడు మీకడ కేదైన కార్యార్థము వచ్చియుండెనా?

శాంత — ఈవిషయమును నన్నుఁ బ్రశ్నించుట యిది రెండవ మాఱు. అతఁడు నావద్దకు వచ్చి యుండి నెలయైనది. అప్పుడేయాతనితో నరేంద్రబాబుగారికి కలుపులు ఇచ్చుమని కోరితిని. పిమ్మట నాలుగు దినములకు ఆతనివద్దఁ బనివాండ్రలో నొకఁడు కలుపులను దెచ్చి యిచ్చెను. కాని యానందుని నేను జూడలేదు.

జగ — ఆనందబాబువిషయమై మిమ్ము మొదటిసారి ప్రశ్నించిన వాఁడెవరు?

శాంత — మాధవుఁడు. ఆనందునివద్ద నొకపనివాఁడు.

జగ — ఆ! మాధవుఁడా? అతఁడు నిన్న యుదయము గూడ వచ్చినది.

శాంత — అవును! జగచ్చంద్రదా! నీకీవిషయము లన్నియు నెట్లు తెలియును?

జగ — చెప్పుమందురా?

శాంత — చెప్పుము: ఏదైన రహస్యవిషయమా?

జగ — రహస్యవిషయమే. కాని తాతగారికిఁ దెలియఁగూడని రహస్య మేమియులేదు. మూఁడు దినములనాఁడు మధ్యాహ్నము ఆనందబాబు నాగపురమునకు వచ్చెను. మణిపురమునకుఁ బోయి యుండిన కేశవుఁ డానందుని కీచకాటవియందుఁ గలిసికొనియెను. అంతట వారిరువురును నాగపురమునకు వచ్చిరి. మరలఁ గేశవుఁ డొకఁడే మఱునాఁటి యుదయము ఇంటికి వచ్చెను. ఆనందుని జాడయేలేదు. అది మొదల లానందునిఁగూర్చి యేయుదంతముఁ దెలియ లేదు. ఆనందబాబు కుమారి లలితచేత నాతనిఁగూర్చి విచారింపఁ బంపఁబడిన మాధవుఁడు నాగపురమునకు వచ్చినవాఁ డెట్లో మాయమై నాఁడు ఆతనిజాడయుఁ దెలియలేదు.

శాంత — ఆనందుఁడు మూఁడుదినములక్రింద నాగపురికివచ్చెనా?

వచ్చియేయున్న నాకడకు రాకపోవువాఁడుగాఁడే? ఒకవేళ శచీశచంద్ర బాబుగారింటికేమయిన వచ్చియుండునేమో? చిన్న మాధవుఁడు నాకీవిషయమేమియుఁ దెలుపలేదు. నాకడ కానందుఁడువచ్చెనాయని విచారించెను. నేను లేదనినంతనే వెడలిపోయెను. జగచ్చంద్రా! ఆనందుని కేమియు నాపద కలిగియుండలేదుగదా?

జగ — నా కా యనుమానమే కలిగియున్నది. ఆనందునకుఁ గేశవుని వలననే యేదైన సంభవించినదని శంకించుచున్నాను. ప్రస్తుత మీవిషయమును నిశ్చయముగాఁ దెలుపఁజాలను. ఇప్పటికి సెలవుఁ గైకొందును. చూడాధనా! మనము శచీశచంద్రదత్తుగారి యింటికిఁ బోవుదము రమ్ము!

చూడా — అట్లే! తాతా! పోయివచ్చెదను. మరల నుదయము తమ దర్శనము గావించుకొందును.

శాంత — జాగ్రత్త! చూడాధనా! జగచ్చంద్రుని సహవాసమున నీవును బెగ్గలను నేర్చెదవేమో?

జగచ్చంద్ర చూడాధనులు శాంతబాబు ప్రశ్నమునకుఁ దమ హాసవనమే ప్రత్యుత్తరముగాఁగ వెడలిపోయిరి.

౨౦

సరోజని మహేంద్రుని భార్య. ఆమెకు భర్తపై నభిలాష మెండు. ఉత్తమపతివ్రతలలోఁ జేర్పఁదగిన యాసతీమణి భర్త యెంత కోపిష్టి యైనను, నెంత క్రూరుఁడైనను నాతనివినా యితరుల భావనాపథమున నైన రానచ్చునదికాదు. ముష్కరస్వభావఫలముగ నాతనికే యిక్కట్టులు వచ్చునోయని వేయి దైవములకు మ్రొక్కుకొనుచుండునది.

విజయచంద్రుఁడు ఉత్తమవంశజాతయు సుగుణాలంకారయు నగు సరోజనిని మహేంద్రునకు వివాహము చేసికొనుటకుఁ జాల సంత

సించెను. వివాహమయినపిమ్మట మూఁడువత్సరములకు విజయచంద్రుని మరణము సంభవించినది. మహేంద్రుఁడు పెండ్లియయినక్రొత్తలో నొకటిరెండు వత్సరములవఱకు సరోజనిని మిగులఁ బ్రేమించుచుండెను. అప్పు డాతని యమృత మధురవీక్షణము లామె మనంబునందలి ప్రేమ జ్యోతికిఁ దైలప్రాయమై మఱింత ప్రకాశింపఁ జేయుచుండెడివి. వారిరువుర యన్యోన్యానురాగము మణిపురమున కాదర్శప్రాయమై యుండెడిది. కాని పిమ్మట మహేంద్రుని గుణము మాఱిపోయినది. అంతకుముం దాతఁ డెంతగా సరోజనిని ప్రేమించుచుండెనో పిమ్మట నంతగా విరోధించి తిరస్కరించుచుండెను.

అయినను సరోజని నిరంతరము మహేంద్రుని శ్రేయస్సునే కోరుచు నాతని విషయము లన్నియు రహస్యముగ విచారించుచు సమయమున కాతని నెట్లెట్లో తప్పింపఁజూచుచుండెడిది. సరోజనిబోధన లాతనికి విషప్రాయములుగ నుండెను. ఉండదా మఱి! తన జీవితకాలమునఁ బ్రతినిమేషము నధఃపతితుఁడై పోవుచున్న వానికి, శరీరమును జీర్ణింపఁ జేయు మధుసేవఁ దగుల్కొన్న వానికి పయఃపానమువలె సుబోధ విషప్రాయముగా కింకేమగును?

ఇప్పుడును నటువంటిరంగమే యొకటి ప్రదర్శింపఁబడుచున్నది.

మహేంద్రుఁడు గదియందు గూర్చుండి చేతనొకకాగితముంచుకొని చదువుచుండెను. దానియం దేమి లిఖింపఁబడియున్నదో తెలియదుగాని, దానిఁ జదువఁగనే మహేంద్రుని కమితమైన యాగ్రహము గలిగినది.

"సురేశా! మహేంద్రునిసంగతి మఱచినట్లున్నావే? నీకుఁ జిన్నతనమునఁ దెలిసియుండిన మహేంద్రుఁడుగాఁడు సుమా యీతఁడు! స్వరూపాదిసర్వమును మాఱిపోయియున్నాఁ డీతఁడు! ఒక్క యుచ్ఛ్వాసనముచే నీవంటివారిని *వేయమందిని ధూళిగాఁ జిమ్మివేయఁగలఁడు."

అని మహేంద్రుఁడు తనక్రోధమును స్ఫుటముగ బాహిరించుచుండ మెలమెల్లన సవ్యాఘ్రమగు పర్ణశాలాంతరము ప్రవేశించు నట్లగనటె సరోజిని యాగదిఁ బ్రవేశించెను.

మహేంద్రుని యాక్రోశమాగిపోయినది. అతఁడు తీక్ష్ణముగ సరోజినితో నిట్లనియెను.

“ఏలవచ్చితివి? మరల నుపన్యాసమా?”

సరో — ఉపన్యాసమేమియు లేదు! మీకంత కోపమెందులకు? నా మొగమన్న మీకంత యేవగింపేల?” సరోజినికంత మిగుల క్రుద్ధమైయుండెను.

మహేం — నావిషయములందు నీవు జోక్యము కలిగించుకొనునంతకాలము, నిన్నుఁజూచిన నాకుఁగోపమే! తెలిసినదా? భార్య భర్తయెడఁ బ్రవర్తించు విధమా నీప్రవర్తనము? ఏకార్యము నేను చేయఁగ నీ వడ్డగింపనిది? ఈ పిలువని పేరంటము నీ కెందులకు?

సరో — (కన్నులనీరుచిప్పిలుచుండ) పోనిండు! నేనేమియు జోక్యము గలిగించుకొనుట లేదు. కలకత్తానుండి భూపేంద్రుఁ డేదో కార్యార్థము వచ్చుచున్నాఁడు. జేపువచ్చును. అతని కీయింట నొకటిరెండు దినములు నిలువఁ జోటుండునేమో యని యడుగవచ్చితిని.

భూపేంద్రునిపేరు వినంగనే మహేంద్రుని మొగమును భయమావరించినది. కాని యుత్తరక్షణముననే దాని నడంచి—

“భూపేంద్రుఁడా!”

సరో — అవును. భూపేంద్రుఁడే!

మహేం — భూపేంద్రుఁడా! మీ యన్నయా!! ఇచ్చటికివచ్చుటయా!· మా వంశమునకుఁ గళంకముఁదెచ్చిన జగచ్చంద్రుని కాశ్రయ మొసఁగి, మమ్మధిక్షేపించిన భూపేంద్రుఁడా? ఏ మొగముపెట్టుకొని రాఁగలఁడిటకు ?

సరో — అక్కటా! జగచ్ఛంద్రుని కాశ్రయమిచ్చినందుల కిదియా ప్రతిఫలము? ఆశ్రయమిచ్చు టపరాధమా?

మహేం — నాకు సంబంధించి సంతవఱకు నపరాధమే. ఆతఁడిచ్చటికి వచ్చుటకు వీలులేదు.

సరో — వీలులేదా? ఆహా! మీ రెంతకఠినులు? నా యన్నకు నిలుచుట కీయింటియందు నీడయైన లేకపోయినదిగా? దైవమా! నీ కెన్నఁటికిని నా పైన దయరాదు గాఁబోలు.

మహేం — చాలును! ఇటనుండి వెడలిపొమ్ము. నీ వుండువఱకు నాకు మనస్తిమితముండదు.

ఇంతవఱకు మహేంద్రుఁ డామె నింతభేదబుద్ధితోఁ బలికియుండలేదు. భూపేంద్రుఁ డెందుల కా యింటికిరాఁగూడదు? ఆతనిచెల్లెలాయూర నొక శ్రీమంతునియిల్లాలై యున్నతస్థితియందుండ నచ్చటికి వచ్చిన భూపేంద్రుఁడు పరులయింట నుండుటయా? అది యెన్నటికిని బాగుండదు. సరోజని యొక్కపెట్టున బోరుమని యేడ్చుచు, మహేంద్రుని కాళ్ళఁబడి, "నన్నెంతక్రూరముగ జూచినను సహింపఁగలను గాని నా బంధులకు మీ రిట్టి యవజ్ఞగలిగించుటకు నేను సహింపఁజాలను. భూపేంద్రుఁడిచటనే యుండుటకు మీ రంగీకరింపక తప్పదు. నా ప్రార్థనమంగీకరింపుఁడు! ఇప్పుడు మాత్రమే మిమ్ము నే నర్థించుట!"

మహేం — సరోజనీ! నిన్నిచ్చటనుండి పొమ్మనలేదా నేను? నీ వింకను నిచ్చటనుంటివేల? ఒక్కవిషయ మింకను నీవు తెలిసికొనఁజాలకున్నావు. నా యిష్టమునకు వ్యతిరేకముగ నీ గృహమున నేమియు జరుగుటకు వీలులేదు. నీప్రవర్తనచేత నా కెందులకుఁ గోపముఁ దెప్పింతువు? పొమ్మిచటనుండి.

సరోజనిలేచి నిలువఁబడియెను. ఆమెవదనము నల్లవడియెను. విపరీతాశ్రుపాతమునఁగన్ను లెఱ్ఱవడియెను. ఒకపరి దీనముగ మహేంద్రుని

వదనము వంకచూచెను. రూపుగొన్న కాఠిన్యమయిన యాతనివదనమునం దామె కేమియుఁబ్రోత్సాహము గలిగింపఁదగిన భావము పొడకట్టలేదు. ఆమె యాగదినుండి వెడలిపోవ నుంకించి వెనుదిరిగెను.

అప్పుడొక భటుఁడు తలుపుఁదెఱచి లోన సరోజనియుండుటఁ జూచి వెలుపలనే నిలిచెను. దానిని గని సరోజని యటనుండి వెడలి పోయెను.

ఆ భటుఁడు లోనికివచ్చి మహేంద్రునిచేతి కొక జాబిచ్చి "బాబుగారు! ఎవరోయొక క్రొత్తమనిషి యీ జాబు మీ కిచ్చి దీనికిమీరు తెలుపుప్రత్యుత్తరముఁ దనకుఁదెలుపు మనియెను.

మహేంద్రుఁడు జాబువిచ్చుచు "అతఁడెచట నున్నాఁడు? అని భటునిప్రశ్నించెను.

"వెలుపలనున్నాఁడు."

మహేంద్రునిచూపు జాబుక్రింద సంతకముపైఁ బడినది — "దామోదరుఁడు"

పెనుప్రయత్నమున నోటినుండి యెగిరిపోవనున్న యఱపునడంచి, మహేంద్రుఁడు భటునితో "వానిని లోనికి విడువుము. ఆతఁడు వచ్చిన తరువాత నా కొఱకెవ్వరైన వచ్చిన, నే నింటలేనని తెలుపుచుండుము, పొమ్ము" అనియెను. భటుఁడాకంఠస్వరమునందలి మార్పు గనిపెట్టెను. కాని యేమియుఁ జెప్పక వెడలిపోయెను.

మహేంద్రుఁడు కళావిహీనమయిన వదనముతో కుర్చీయందు వెనుకకు వ్రాలెను. ఆ యరనిముసములో నాతనికిఁ బదేఁడులు గడచినట్లుండెను. హృదయమున నుప్పతిల్లినభీతికి దేహమంత బలహీనమయిపోయి, యవశమయిన ట్లుండెను. "వీఁడెట్లు కనుఁగొని నాఁడు నన్ను? అక్కటా! ఈ ప్రభుత్వము జీవితాంతమువఱకు నుండునని యెంచితిని. దినదినగండము నూఱేండ్లాయుష్షనురీతి నున్నదే! ఎంద

దీని ప్రతిఘటింపఁగలను! నా రహస్యమెట్లు దాఁపఁగలను! అతఁడు ప్రవేశించిన మఱునిముసమునఁనే వానిఁజంపివైతునా!......" మహేంద్రుని యాలోచనముపూర్తిగాకమున్నే యానూత్నాగంతుఁడు లోనికిఁ ప్రవేశించి తలుపుమూసి తలుపునకు వీఁపానుకొని నిశ్చలముగ మహేంద్రునిఁజూచుచు నిలుచఁబడియెను. మహేంద్రుఁడాతనివైపుఁ జూడక భటుఁడిచ్చిన జాబును జదువునట్లు మొగమునకడ్డము పెట్టుకొని చూచుచుండెను.

నూత్నాగంతుఁడు బొమ్మవలె నిలుచఁబడియుండెను. ఆతని వీక్షణములును నిశ్చలములై మహేంద్రునిపై నిల్చియుండెను. మహేంద్రుఁడు మెల్లగ జాబును దొలఁగించెను. ఆతనిముఖమున బలవంతముగఁ దెచ్చికొనిన నవ్వు కనఁబడుచుండెను. ఆతఁ డొకటిరెండు మాటలు గొంతుసవరించికొని యిట్లనియెను.

"దామోదరా! దీని కర్థమేమి? మఱల నామార్గమున కడ్డము వచ్చుచుంటివా? నాసంగతి బాగుగ నెఱింగియున్నావుకదా? ఇట్టి నీప్రవర్తనమునకు నీసాహసమునకు నేనెట్లు మన్నింపవలయునని నీయాశ?"

"ప్రభూ........."

దామోదరునినోట నింకొకయక్షరము వెలువడకమున్నే మహేంద్రుఁ డాతనిపై నొక్కఁడుయుఱుకుఱికి "ఛీ! నోరుమూయుము. నలుప్రక్కలఁ జూడకుండ నీ దౌష్ట్యమును బ్రదర్శింపనెంచితివా? తుచ్ఛుఁడా?" అని యాతని భుజముఁబట్టి యొక్కఁడియూపూపెను.

దామోదరుఁడు ప్రశాంతభావమున "మహేంద్రబాబూ! తమ యిష్టానుసారమే కానిండు! ఉత్తమవంశీయులు! మహోత్కృష్ట గుణులు! మిమ్ములను నావంటి నీచుఁడు ప్రతిఘటించుటయా?" అనియెను.

మహేంద్రునివచనము పూర్తించెను. ఆతని కుడిచేయి పొక్కాయి జేబులోనికిఁ బోయెను. దామోదరుండు దానిని కనిపెట్టి, "ఉత్తము లను మాటలఁగూడ జేబునుండి పిస్తోలుఁదీయుచుకొనవలసినదే యున్నదా? దానిని జేబులనే యుంచుకొనుము! దానిని నాకంటె తుచ్ఛునిపై వినియోగించి నిష్కళంకమగు పూర్వవంశమును పాపకలుషితము చేయకుము" అనియెను.

మహేంద్రునకు తన మాట లింక సాగుట యసంభవమని తెలిసి కొనియెను. కుర్చీపైఁ గూలఁబడి దీనస్వరమున "దామోదరా! పురాతనస్నేహితుఁడవు! నాకు నన్నన కింతక్లేశము గలిగింపనెంచితి వేల? మన కీవిరోధ మెందులకు? ఒకకాలమున మనమిరువురము గలిసిమెలిసియుండినాముగదా? ఇప్పుడీపరస్పరద్వేష మేల? రమ్ము. ఇటఁ గూరుచుండుము" అనియెను.

దామోదరునివదనమున ఈర్ష్యాస్ఫురితమగు హాసము తోఁచినది. ఆతఁడు వెగటుగ "మన యిరువురం దెవరెవరిపైఁ గ్రోధద్వేషములఁ బూనియున్నారో నీకుఁ దెలియుటలేదు? పురాతనస్నేహితుఁడా? ఔనౌను! స్నేహితునిఁ జక్కఁగనే యాదరించితివి. మన మిరువు రముఁ గలెసిమెలిసియున్నకాలము నీకు జ్ఞాపకమున్నదా? తలి దండ్రులమాట వినక నీయెడనై తెలివిలేనివాఁడనై నీమాటలను నమ్మి వారిని బగతురగాఁజూచుకొని నీతోఁడఁ దిరుగులాడిన కాలము నీవు మఱవలేదుగదా? నీబోధనలకుఁ జెవియొగ్గి నాతండ్రియింటనే కన్నపు దొంగవలెఁ బ్రవేశించి తుదకు పితృహంతకుఁడనుగా వెలికివచ్చిన సంగతి నీకు స్మృతియందున్నదా?......" అనియెను.

మహేం — దామోదరా! ఆవిషయములన్నియు నిపుడేల? విస్మృతమయిపోయిన గతవిషయములను మరల వల్లించుటవలన నేమి యుపయోగము?

దామో — ఉపయోగ మెందులకులేదు? తెలిపెదను వినుము. తండ్రిని జంపి యింటనున్న సర్వస్వము నపహరించి నన్ను గన్నతల్లికి మఱునాఁటికిఁ గట్టవస్త్రమును దినుట కన్నము లేకుండఁ జేసితివి. ఆ మహాఘోరకార్యము నీప్రోద్బలమువలననే యని మఱచితివా? .."

మహేంద్రుఁ డామాటవిని భయమున వణఁకుచు నలుదెసలఁ బరికించుచు "దామోదరా! నన్ను క్షమింపుము! నీపాదములు నన్ను దహింపకుము. ఈదినమునుండి నీకేమి కావలయునన్న నిత్తును. నీకు సర్వసౌఖ్యములను గూర్తును. ఇంకెవరితో నాకీయుంగర విషయమును చెప్పుట మానుము. గోడలకుఁగూడఁ జెవులున్నవి. ఎవరైన వినిన నిప్పుడే మనలను మన దౌర్జన్యములకై బంధింపరా? ఇట్టువంటివిషయములకుఁ బ్రస్తావనకూడ తగదు; నీకేమి కావలయును దెలుపుము. ఏమయినను గూర్తును.

దామో — ప్రభూ — ఊహూఁ మహేంద్రా! నీయిష్టానుసారమే గతమును విస్మరింతము. ప్రస్తుతము నాకు రెండువందల రూప్యములు గావలయును. ఇఁకమీఁదట నీవు నెలకు నూఱురూప్యములను మీఁద నాకిచ్చుచుండవలయును.

మహేం — దామోదరా! ఏమి నీక్రౌర్యము! నెలకు నంద రూప్యము లిచ్చుచుండవలయునా? నాకే యంతయాదాయము లేదే! నీకెచ్చటనుండి తెచ్చి యీయఁగలను.

దామో — మహేంద్రా! ఆమాటలఁ గట్టిపెట్టుము. నీసందర్భములన్నియు నేను విచారించియున్నాను. నీవు నెలకు నందయే కాదు, వేయిరూపాయిలైన నీయఁగల స్థితియందున్నావు. ఎవరికో చెప్పినటుల నాకుఁ జెప్పఁబ్రయత్నించిన లాభమేమి?

మహేం — ఈయవలసినదేనా! ఎంతక్రూరుడవు నీవు? మన స్నేహితమున కిదియే నిదర్శనము కాఁబోలునేమి?

దామో — మనమైత్రిమాట మరల నెత్తితివి కావున నింకొక విషయముఁ జెప్పెదను. నామైత్రిలేకున్న నీపరిస్థితి యిట్లుండియుండునా ? నావలెనే నీవును నుండియుండవా.... ....

మహేం — దామోదరా! అట్లే యిచ్చెదను! ఇంక నూరకుండుము. నీకనేకశతవందనములు చేయుదును.

దామో — మొదటనే నీప్రవర్తన మీవిధముగనుండియుండిన నింతదూరము రాదుగదా? మహేంద్రా! నాసంగతి నీకుఁ దెలుపుటకై యిన్నిమాటలంటిని. వేఱుద్దేశ్యమేమియును లేదు. ఒక కార్యమునందుఁ బనిచేసి నెగ్గిన యిరువురియం దొకఁ డన్నములేక మలమలమాడుటయు, నింకొకఁడు రాజభోగ మనుభవించుట యునా ?........మన మెప్పటివలె స్నేహితులముగానే యుందము. నావలన నేమైన సహాయము కావలయునేని చేయుచుందును. నీ రహస్యము నాకడ భద్రముగనే యుండును. నాకుమాత్రము కోపము రప్పింపఁ బ్రయత్నింపకుము.

మహేం — సరియే! రాఁగల శుక్రవారమురాత్రి యిచ్చటికి రమ్ము. నీకొక కార్యమున్నది. అన్నివిషయములందు నాఱితేఱి యున్న నీవంటివాఁడుగాని యీకార్యము నెఱవేర్పఁజాలఁడు — అనుచు లేచి టేబిలుకడకుఁబోయి డ్రాయరుఁదీసి యందున్న కొన్నినోట్లు తీసి దామోదరునకిచ్చుచు "ఇవిగో వందరూపాయలు. శుక్రవారము నాఁడు నీ కీనెలకుఁ జేరవలసిన నూఱురూప్యములును ఇప్పుడీయవలసిన తక్కిననూఱును నొసంగెదను. ఇచ్చటి కెప్పుడువచ్చినను రాత్రులందు వచ్చుచుండుము. పదిమొదలు పదునొకండు గంటలవఱకు, ప్రతిదినము నీకొఱకు ఈగృహమునకు వెనుకనున్న చెఱువుకడ వేచి యుందును. నీవేమైనఁ జెప్పవలసియున్న వచ్చి నాకుఁ దెలుపుచు నుండుము." అనెను.

దామో — అట్లులే, ప్రతి దినమును వలదు. ప్రతి యాదివారమున మనము గలసికొనుచుందము. మరల శుక్రవారమునచ్చి కలిసికొందును. ఎచ్చటికి రమ్మందువు? ఆ చెఱువుకడకేనా?

మహే — అచ్చటికే రమ్ము. అచ్చటికే సుంగంటలకువచ్చియుందును. ఆనాడుమాత్రము మనము పదిగంటలకు గలిసికొనుటకు వీలులేదు.

దామోదరుఁడు సరియే యని వెడలిపోయెను. మహేంద్రుఁడేమియో యాలోచించుకొనుచుఁ గూర్చుండియుండెను.

౨౧

దేవీదాసు — గోవర్ధనా! గణేశబాబు నిన్న నిటకు వచ్చినప్పుడు నీతో నీదినము వచ్చెదనని చెప్పెనా?

గోవ — అవును, ఈదినము తప్పకుండ వచ్చెదనని చెప్పినాఁడు. ఆతడువచ్చునులెండు. మీరుపోయినపని యేమయినది?

దేవీ — ప్రభాకరుఁడు మణిపురప్రాంతమున నున్నట్లు దామోదరుఁడు చెప్పినాఁడు. మేమిరువురము నాదుర్మార్గుని గనిపెట్టుటకు పోయినాము. మణిపురమునందు మేమిరువురము రెండువైపులందు విచారింపనెంచితిమి. రెండుదినములు మాకుఁ బ్రభాకరునిజాడయే తెలియలేదు. మూడవనాఁడు అనగా మొన్నటిదినమున ఎప్పటివలె ఊరియం దాతనిఁగూర్చి విచారింపనెంచి బయలుదేరితిమి. మధ్యాహ్నమునకు నేనుమాత్రమే బసకుఁ దిరిగివచ్చితిని. కాని దామోదరుఁడును మాయమైనాఁడు. ఆదినమంతయు దామోదరునికొఱకు విచారించితిని. లాభమేమున్నది? ప్రభాకరునివలెనే వీఁడును మాయమైనాఁడు.

గోవ — మీరంతట నూరక నేవచ్చితిరా? దామోదరునిఁగూర్చి విచారించలేదు?

దేవీ — విచారించి యేమిప్రయోజనము? ఆదుష్టుఁడు నన్నిట్లు మోసగించి మరల నాకండ్లఁబడునా?

గోవ — మీరు మోసపోయినారు. దామోదరుఁడు ప్రభాకరుని గనిపెట్టి యాతనిఁ గలిసికొనియుండును. వారిరువురును మిమ్ము మోసగించియుందురు.

దేవీ — (కోపముతో) ఇఁక నెన్నడైన నాకుఁ గనఁబడనిమ్ము. వారిని హతముజేయక విడుతునా? తమకంత సహాయముచేసిన దేవీదాసునా వీరు మోసగించుట? కావలయునన్న నిపుడు గోపాలుని యున్మాద్యమును బోఁగొట్టితినేని ప్రభాకరదామోదరుల మదమడంగదా? ఎందుకని యూరకున్నాను. ఈవిధముగా వీరు నన్ను మోసగింపనెంచిన వారిబ్రతుకు తెల్లము చేయుదును. దామోదరప్రభాకరుల జీవితము నాచేతిలోనున్నది. ఇఁక బగిదినములు చూచెదను. అంతవఱకు వారీవిధముననే యున్నచో పిమ్మట వారిపనిఁ బట్టెదను. పోలీసువారిచేతిలోఁ బడవైచెదను. భూదేవికి బలియిచ్చెదను.

గోవ — బాబుగారు! కొంచెము మెల్లగ మాటాడుఁడు. మీరు నావిషయమునఁ గలిసియున్నారు. వారిని బహిరంగపఱచిన మీవిషయముమాత్రము దానితోఁ గూడ నందఱికిఁ దెలియదా? మీరుమాత్రము పోలీసువారిచేఁజిక్కరా?

దేవీదాసున కీమాటలు పిడుగుపాటువలె నుండెను. ఒకటిరెండడుగులు వెనుకకు వైచినాఁడు. స్తంభీకరించి నిలువబడిపోయినాఁడు. గోవర్ధనుఁ డీమార్పునుగనియుఁ జూడనివానివలె నిట్లనియెను—

"కావున, వారలను మనమే స్వతంత్రించి శిక్షింపవలయును. ఒకరి యపరాధమును వెలువఱుపనెంచి తన రహస్యమును బహిరంగము చేసికొనఁగూడదు."

దేవీ — (కంపితస్వరమున) గోవర్ధనా! నాశక్తి నీకింకను బోధపడ

లేదు. గోపాలునిచేత వారిగుట్టు బయలుబెట్టించెదను. అయుత్తర క్షణముననే నేను లోకమునకే మాఱిపోయెదను. అప్పటినుంచియు నేను దేవిదాసుఁడనుగాను. ఇప్పుడైనను దెలిసికొంటివా ? ఈపది దినములు జరుగనిమ్ము. వారునావద్దకు రాకుండనిమ్ము. పిమ్మట చూడుము. గోపాలుని.........

తలుపు తెఱవఁబడెను. గణేశుని వదనము లోనికిఁ బ్రత్యక్షమయ్యెను. దేవిదాసుఁడు, తనవాక్యములను గత్తితో నఱికినట్లు నిలిపెను. గణేశుని మోమునందుఁ దమ సంభాషణము వినినట్లైనఁ బొడగట్టునా యని పరీక్షాపేక్షణముల నాతనిఁజూచెను. గణేశుని వదనము సుప్రశాంతమయియుండెను. దేవిదాసుని వివర్ణవదనము మరల నైజకళవహించెను. ఆతని భయముఁగాంచి గోవర్ధనుఁడు లోన నవ్వుకొనియెను. గణేశుఁడు లోనికివచ్చి దేవిదాసునికి వందన మొనర్చెను.

దేవీ — గణేశా ! రమ్ము. కూర్చుండుము.

గణేశుఁ డేమియు మాఱుమాటాడలేదు. రూక్షముగ దేవిదాసుని జూచుచుండెను.

దేవీ — ఏమి ! గణేశా ! మరలఁ బైకివచ్చినదాపిచ్చి ? పిలిచిన పలుక వేమి ? ఇచ్చటికిరమ్ము కూర్చుండుము.

గణే — ఓరీ! ఓరీ! నాగేంద్రా! నీభార్య యిట్టిపని చేయఁగా నూరకున్నావురా? ఛీ! ఛీ! నీకు నూతేండ్లు నిండినవిరా! ఇప్పుడే-ఇప్పుడే-ఈక్షణమే నిన్నుఁ జంపి-నీపై-నీపై-నాట్యమాడుదునురా!...

గోవర్ధనుఁడు రహస్యముగ దేవీదాసుతో "వీనికిఁ బిచ్చి పైకి వచ్చినది. మరల మందీయవలయును. నేను పట్టుకొని యుందును. మీరు మందుఁ దీసికొనిరండు," దేవీదా సటనుండి ప్రక్కగదికిఁ బోయెను. గణేశుఁడు గోవర్ధనునిజూచి "ఏమే? దుర్మార్గురాలా! నిన్ను బొడి చేసెదనుచూడు! సున్నములోని కెముకలులేకుండ పిండి

పప్పుచేసెదనుచూడు" మనుచు ముందరికి వచ్చుచుండ గోవర్ధనుఁడు వానిని బట్టుకొనియెను. గణేశుఁడు "నన్నువిడువు, ఛీ! పిశాచీ! విడువు నన్ను" అని యఱచుచు విడిపించుకొనఁజూచెను గాని గోవర్ధనుని బలమే యధికమైనది. గణేశుఁ డూరకుండవలసినవాఁ డయ్యెను. దేవీదాసుఁ డాగదిఁ బ్రవేశించెను. ఆతఁడు రెండు మాత్రలు దెచ్చి గోవర్ధనుని కిచ్చి, గణేశునిచేఁ దిగమింపు మనియెను. గణేశుఁడు నిముసములో గోవర్ధనునిచేతిలోని రెండుమాత్రలు లాగుకొని పాఱవైచెను. దేవీదాసుఁడు గణేశునిఁ దిట్టుచు మరల రెండుమాత్ర లిచ్చెను. వానిని గణేశుఁడు లాగికొనియెను. "నాకు మందిస్తావా? నాగేంద్రా! భద్రము! నీమందుతోఁగూడ నీవు నాచేత దుమ్మైపోవుదువు" అనియెను.

ఇఁక నట్లుగాదని దేవీదాసుఁడు గోవర్ధనుఁడు నిరువురు గణేశుని బట్టుకొని వానినోటిలో రెండుమాత్రల వైచిరి. గణేశుఁడు వానినమలి మ్రింగెను. తోడనే యాతని యున్మాదచర్యయంతయు మాఱిపోయినది. ఆతఁడు తన్ను దేవీదాసుఁడు వానిసేవకుఁడు బట్టుకొనియుండుట కాశ్చర్యమంది, "దేవీదాసబాబుగారూ! నన్ను బట్టుకొనియున్నారేల?" అని యడిగెను.

దేవీదాసుఁడు నవ్వుచు "గణేశా! నీపిచ్చి చాల తమాషా పిచ్చి సుమా! నామందు నాలుగుమాత్రలు పాడొనర్చితివే! అమావాస్య యింకను నాలుగుదినము లున్నదే! అప్పుడే వచ్చినదేమి యీ యున్మాదము?" అనెను.

గణే — నాగ్రహచారము బాబు! నేను నాగపురమునకుఁ బోవలయునని యున్నాను. అవసరకార్యార్థము పోవలసి యున్నది. ఈదినమే యరిగెదను.

దేవీ — ఈదినమే నాగపురమునకుఁ బోవుదువా? నాకిత్తు నన్న పైకమేది? మరల నీవు వచ్చెదవో రావో? ఇంతదూరము వైద్య

మొనర్చినది వ్యర్థమేనా?

గణేశుఁడు నవ్వుచు జేబినుండి కొన్నినోట్లు తీసి "బాబుగారు! మీకిత్తునన్న పైక మీయకుందునా? ఇవిగో యేఁబదిరూప్యములు" అనుచు నిచ్చెను.

దేవీదాసు కళకళలాడుచు నానోట్లఁ దీసికొనియెను. గణేశుఁడు మఱి యేఁబదిరూప్యములెంచి, దేవీదాసున కిచ్చుచు నిట్లనియెను — "బాబు! నేను నాగపురము చేరినతరువాత నచ్చట మరల నీయున్మాద లక్షణము లగుపడినఁ గష్టముగదా? కావున నప్పుడు సేవించుటకుఁ గొంతమందిమ్ము" అని యడిగెను.

దేవీదాసుఁడు లోనికిఁబోయి యొకచిన్నసీసా తీసికొనివచ్చి గణేశున కిచ్చుచు, "ఈమందు సంవత్సరము వచ్చును. అందు నూఱు మాత్ర లున్నవి. ఎప్పు డున్మాదలక్షణము లగపడిన రెండుమాత్ర లుదయము, రెండు సాయంత్రము పుచ్చుకొనవలయును." అని తెలిపెను.

గణేశుఁ డంతలేచి పోఁబోవుచు, మఱల వెనుదిరిగి "గోవర్ధనబాబు, నిన్ను మఱచితిని క్షమింపుము" అని పదిరూప్యము లాతని కిచ్చి "దీనిని మనమైత్రికి నిదర్శనముగఁ దీసికొనుము. నాకు సెలవిండు. నేనింకఁ దడయుటకు వీలులేదు. నేను మాటలాడియుంచిన బండివచ్చి వేచియుండును. బాబుగారు! సెలవిండు" అనుచు వెడలిపోయెను. పోవునప్పు డాతని మొగమున మందహాసము నెలకొనియెను.

౨౨

ఆనందునికొఱకు, మాధవునికొఱకు, జగచ్చంద్రుఁడు నాగపురమునం దంతయు విచారించెను. శచీశచంద్రదత్తుగూడ శాంతిబాబువలెనే యానందునిజూచి నెలకుఁ బైననేయయినదని చెప్పెను. ఇంకను నాగపురియం

దాసదాసీలకు పరిచయమున్నవారి నందఱిని విచారించినను ఆనందుని విషయమేమియు వారికిఁ దెలియకపోయినది. జగచ్చంద్రున కిప్పుడు కేశవానందులు నాగపురమునకు వచ్చిన దసత్యమని తెలిసి పోయినది. వచ్చియుండిన, నంతపెద్దయూరునందు వారి నౌకరుగాకున్న నింకొకరైనఁ జూచియుండరా? వారిచ్చటికి రానేలేదు. ఎక్కడికో, ఏదో రహస్యకార్యార్థము వారిద్దరునుబోయి యుండవలయును. అచట కేశవునివలననో, కేశవునికిఁ దెలిసిన మఱెవ్వరివలననో యానందుఁడు విపత్తు నందియుండవలయును. ఆసంగతియంతయుఁ గేశవుఁ డెఱుంగును. ఏదో కారణముచేత దానిఁ గప్పిపుచ్చుచున్నాఁడు. మఱునటిదినము ఆనందునిఁగూర్చి విచారింపవచ్చిన మాధవుఁ డేమయ్యెను? అతఁడుగూడ నట్టి యాపదకే లోనయి యుండునా? ఆనంద మాధవుల విషయము నేదో భయంకరరహస్యము కప్పియున్నది. ఆరహస్యమొక పెద్ద సముద్రమువలె గంభీరమై, యంతు తెలియకుండ నున్నది.

మధ్య కేశవుఁ డెట్లున్నాఁడో? లలిత, తానింతకాల మచటికిఁ బోనందున కేమనుకొనుచున్నదో; కేశవుని విషయము కొంత తెలిసికొనవలయును.

ఈవిధముగ నిశ్చయించుకొని జగచ్చంద్రుఁడు ఆనందు నింటికిఁ బయనమయ్యెను.

అతఁ డచటికిఁ బోవునప్పటికి మధ్యాహ్నమై యుండెను. మార్గమున భాస్కరుఁడు జగచ్చంద్రున కెదురుపడెను.

భాస్కరుఁడును, మాధవుఁడును ఆనంద కేశవులక్రింద పనివాండ్రుగ జగచ్చంద్రున కిప్పుడు తండ్రియొక్క మరణ శాసన ప్రకారము రావలసి యున్న తోటలలోఁ బనిజేయువారు. ఆనందునికొఱకై లలితచేతఁ బంపఁబడిన మాధవుఁడు మఱలిరాకుండ మాయమయ్యెనుగదా? ఇప్పుడు మాధవ భాస్కరులలో మాధవుఁడును, ఆనంద కేశవులలో

నానందుఁడును మాయమైరి. కేశవుఁడుం-స్వకార్యమగ్నుఁడైన కేశవుఁడు-ఇప్పుడు తోటలఁగూర్చి విచారించుటయే లేదు. అంతయు భాస్కరుని తలపై బడియుండెను.

ఎటకో కార్యార్థము పోవుచున్న భాస్కరుని జగచ్చంద్రుఁడు పిలిచి – "బాబు! నీపేరేమి?" అని యడిగెను. భాస్కరునకు జగచ్చంద్రుఁ డెవ్వరైనదియుఁ బాగుగఁ దెలియును. కావునంత వినయమున "భాస్కరుఁడండి." యని బదులచెప్పెను.

"ఆనందుఁడుగాని, మాధవుఁడుగాని మఱలివచ్చిరా?"

"లేదు. వారిజాడయే తెలియలేదు."

"కేశవబా బెచ్చటికిఁబోయెను?"

"తెలియదండి! ఉదయమునఁ బోయినాఁడు. ఇంతవఱకునురాలేదు."

"ఇంట నెవరున్నారు?"

భాస్కరుఁ డిటునిటుఁ జూడఁదొడఁగెను. ఆతడు ఏదో విషయమును దెలుప సందేహించుచున్నాఁడని జగచ్చంద్రుఁ డూహించెను.

"భాస్కరా? నీ కెట్టిభయమును లేదు. నీవేదో సంగతిని దెలుప సందేహించుచున్నావు. ఆసంగతి నాకుఁ దెలుపుటవలన నీకేదైన నాపద సంభవించునెడల, దానినుండి నిన్ను నేను రక్షించెదను. అట్టి యాపద నామూలమున నీకేమియు రాకుండఁజూచెదను" అని జగచ్చంద్రుఁడు వానిబుజ్జగించెను.

భాస్కరుఁడు మొగము తేటవడ, మెల్లమెల్లన నిట్లు వచించెను. "ఈమధ్య కేశవబాబుకును, లలితకును నేదో కలహమువచ్చినది. లలిత నాతఁడు చంపుదునని బెదరించెను. అదిమొదలామె యెచ్చటను గానవచ్చుటలేదు. ఎచ్చటికిఁబోయినదో యెవ్వరు నెఱుంగరు."

జగచ్చంద్రునిమెదఁ బిడుగు తాకినట్లయ్యెను. ఆతఁ డుత్కంఠతో లలితను గేశవుఁడు చంపియుండలేదుగదా?" అని ప్రశ్నించెను.

"ఏమో! నాకెట్లు తెలియఁగలదు? అప్పటినుండియుఁ గేశవబాబింటనుండుటయే లేదు. ఆతని వైఖరి యంతయు మాఱిపోయినది. ఎప్పుడును చిరచిరలాడుచు, నందఱను దిట్టుచుండును. దినమంతయు నెచ్చటనో యుండి చీకటిపడువేళకు వచ్చుచుండును. పోవున దెచ్చటికో తెలియదు. మరల నుదయమే పోవుచుండును. ఇచ్చట విచారణ మంతయు నాపైఁబడినది."

"ఈవిధముగా నెన్ని దినములనుండి జరుగుచున్నది?"

"పదునైదుదినములనుండియు"

"లలిత నట్లు భయపెట్టిన కేశవుఁ డెట్టివాఁ డని నీయభిప్రాయము? ఆతని ప్రవర్తనము నీవెట్లు వ్యక్తీకరింతువు?"

"జగచ్చంద్రబాబుగారు! నేనాతనికడ సేవకుఁడను. ఆతని ప్రవర్తనాదికము నేను విమర్శించుట తగదుగదా?"

"అధర్మము సేయువాఁడు యజమానియైనంతమాత్రమున నూరకుండవచ్చునా? ఎట్టివాఁడైనను నధర్మప్రవర్తకుఁడైన వాని వర్తనమును ఖండింపవలసినదే!"

"జగచ్చంద్రబాబుగారు! కేశవచంద్రుఁడు మహాసాహసుఁడు. నేను, తనకు విరోధముగఁ బ్రవర్తించుచుంటినని యాతఁ డెఱింగిన నాకు ముప్పువాటిల్లును."

"ఆభయము నీకేమియువలదు. నీవలన నేనుగోరు సహాయ మేమన నీవృత్తియందు నీవు మెలంగుచునే కేశవబాబు చర్యలను గనిపెట్టి యుండుము. వానియందేవైన విశేషములున్న, మఱల నిన్నుఁ గలిసికొనినపుడు నాకుఁ దెలుపుచుండుము. అంతమాత్రమున నీకేమియుఁ గష్టము రాదుగదా?"

"సరియే, అట్లేచేయుదును. మీరుమాత్రము నాకెట్టియాపద రాకుండఁ గాపాడవలయును."

"నాశక్తికొలఁది యెవ్వరికిఁ గష్టము గలుగకుండఁ గాపాడెదను. ... ... కేశవబాబు సాయంత్రమునకుఁగాని యింటికిరాఁడుగదా?"

"ఇంతవఱకు నెన్నఁడును వచ్చినదిలేదు. ఈదినమును రాఁడనియే యెంచెదను."

"సరియే, ఇప్పుడు నేను కేశవునియింటిలోనికిఁబోయి కొంత పరీక్షింపవలసియున్నది. ఇఁక నీ వరుగవచ్చును."

మఱల భాస్కరుని వదనము నల్లవడియెను. అదిచూచి జగచ్చంద్రుఁడు, "భాస్కరా! నీవేమియు భయపడవలదు. నేను గృహము లోపల నున్నప్పుడే కేశవుఁడు వచ్చునెడల నీవేమియు నెఱుఁగని వానివలె నాతనితోఁగూడ నన్నుఁ బ్రతిఘటింపుము. ఏమియు జంకవలదు. నీవు కేశవునకు సహాయము చేయుచున్నట్లు నటింపుము."

భాస్కరుఁ డంగీకరించి యటనుండి యరిగెను. జగచ్చంద్రుఁడు మెల్లగ గృహద్వారముకడ కరిగెను. జేబునుండి రెండుకత్తులుగల చిన్న పేనాకత్తిఁదీసి, దానియందలి చిన్నకత్తితో ద్వారమునకు వేయఁబడియున్న తాళముఁ దెఱచివైచెను. లోనికరిగి మరలఁ దలుపు మూసెను. నేరుగఁ గేశవునిగదికిఁ బోయెను.

ఆగదియం దాతనికేమియు మార్పుగపడలేదు. తన్ను హత్య జేయఁ గేశవుఁ డుద్యమించిననాఁటి మఱుదిన ముదయము చూడా ధనునితోడఁ బోఁబోవుచుఁ గేశవుని గదిలోనికిఁ బోయియుండెను. అప్పుడెట్లుండెనో యిప్పుడుసైత మాగది యట్టులే యుండెను. కాని, గదియంతయు ధూళి ధూసరితమై యున్నది. అందు మంచ మొకటియుఁ గొయ్యపెట్టె యొకటియు నుండినవి. అవితప్ప మఱేవస్తు విశేషము నటఁ గాన్పించలేదు.

ఆగదియంతయుఁ బరీక్షించినను, జగచ్చంద్రున కేమియుఁ గనఁబడలేదు. ఇఁకఁ జూడవలసిన దాపెట్టెయం దేమున్నదో యనియే!

ఆపెట్టెకుఁగూడఁ దాళము వేయఁబడియుండుటచే, దానినిగూడఁ దెఱచుటకు జగచ్చంద్రుఁడు ప్రయత్నింపవలసినవాఁడయ్యెను. తుదకెట్టులో తాళముఁదీసివైచెను. మూఁతఁదీసెను. లోనఁ గొన్ని కాగితములును, నొక తగరపుఁబేటికయుఁ దప్ప నింకేమియును లేవు. జగచ్చంద్రుఁడా కాగితములు పరీక్షించెను. అవి తనతోటలకు సంబంధించిన లెక్కలకాగితములు. అంతముఖ్యములయినవి కావు. జగచ్చంద్రుఁడాతగరపుఁబెట్టెఁ దెఱచిచూచెను. ఆతనికన్నులు మిఱుమిట్లుగొలుపునట్టి వస్తువులు గొన్ని యందగపడినవి. ఆతనికిఁగలిగిన యాశ్చర్యమూహ్యమే! అందు బంగరునాణెములును, గొన్ని యమూల్యరత్నాభరణములు నుండెను. నిముసములో- వానిని జూచియు జూడకముందే యవి యమూల్యములని జగచ్చంద్రునకుఁ దెలిసిపోయెను, వానివిలువ యేఁబదివేలకు మించియుండును.

జగచ్చంద్రునకుఁ దెలిసినంతవఱకు కేశవానందు లంతభాగ్యవంతులుకారు. కేశవున కీయర్థ మెట్లు లభించెను? ఈ యాభరణము లెక్కడ లభించినవి? జగచ్చంద్రుఁ డా యాభరణములం దొక హారముఁదీసి పరీక్షించెను. అది మేలిమిబంగారుతోఁజేయఁబడినది. విలువఁగల రత్నము లందుఁ జెక్కఁబడియున్నవి. ఆ హారమునకుఁ బతకమొకటియుండెను. దానిఁ జూచునప్పుడు జగచ్చంద్రునకు, దానివెనుకఁ జిన్నయక్షరములు గనఁబడినవి. ఆతఁడు వానిఁ బరీక్షించెను. సాధారణముగ నాభరణములపైఁ జెక్కఁబడు నామములవలె నదియు నొక పేరై యుండెను. "భీమదేవవసువు" అనునదాపేరు.

"భీమదేవవసువా? ఈతనిపే రీయాభరణంబున నంకితమై యుండుటకుఁ గారణమేమి? ఈతఁ డెవ్వరు? సజీవియా? ఏదేశవాసియో? ......ఈతని నామముచెక్కఁబడిన యీ హారము కేశవున కెక్కడిది? ఇన్ని యమూల్యాభరణములును, నింత ధనమును నీతని కెట్లు

ప్రాప్తించెను ?''

జగచ్చంద్రుఁ డిట్లాలోచించుచు బంగరునాణెములనుగూడఁ బరీక్షించెను. అవి ప్రాఁతపడియుండెను. జగచ్చంద్రుఁడు కొంతకాల మాలోచించి "ఏమి ? భీమదేవసువు ! చూడాధనునివంశమునకుఁ జేరినవాఁ డేమో ! ఏల యైయుండఁగూడదు ? ఈ విషయమును జూడాధనునితోఁ బ్రస్తావించి చూచెదను : .. కేశవున కివి చౌర్యము వలన లభించియుండవలయును. లేకున్న సంతధనము, ఇన్ని యాభరణములు నీతనికిలభించుటకు వేఱుమార్గములేదు ! నానాఁటికిఁ గేశవుని గుణములు భయంకరముగ మాఱుచున్నవి ! ఈతని నిజవృత్తాంత మెట్లుండునో!'' అని యనుకొనుచు జగచ్చంద్రుఁడు ఆనందుని గృహము నుండి వెడలిపోయెను.

౨౩

క్రిందటి ప్రకరణమునందలి సమాచారము జరిగిన మూఁడవదినమున కేశవుఁ డెప్పటియట్లుగా నెటకో పోయి మధ్యాహ్నమునకే యిల్లు చేరెను.

తలుపు మరలఁ బదిలముగ మూసికొని లోనికి గడియవెట్టి తన గదిలోఁ బ్రవేశించెను. అందున్న పెట్టెకెదుటఁ గ్రిందఁ గూర్చుండి పెట్టెఁదెఱచి యందలి తగరపుమందసము వెలికిఁదీసెను. దానిని దన యెదుటనుంచుకొని యందలి బంగరునాణెములను లెక్కింప నారంభించెను. ఒకటి రెండు మూఁడు ఈవిధముగా నొకగంట లెక్కించి, పదునాలుగువందలతో లెక్క పూర్తిగావించెను. తన చొక్కాజేబు నుండి మరికొన్ని నాణెములఁ దీసి, వానినిగూడ లెక్కించి, యా మొత్తమునఁ బడవైచెను. అన్నియుఁ బదునైదువందలైనవి.

కేశవునియొడ లానందమునఁ బ్రఫుల్లితమైపోయెను. బుద్ధి తెలిసిన

నాఁటినుండియు నింతవఱకు నాతఁ డెన్నఁడు నింతధనము జూచినది లేదు. ఎన్నఁడును జూడనంత స్వర్ణము తనస్వాధీనమునందే తన స్వామ్యముగా నేఁ డున్నది. తన యెదుటనున్న బంగరునాణెముల ప్రోవు జీవితమునకంతయుఁ జాలును. ఆతనిచూపులు బంగరునాణెములపై నిలిచి – వికసితము లగుచున్నవి. హృదయ మావేగమునఁ గొట్టుకొనుచున్నది. ఇంతకు నెన్నియో మడుంగు లెక్కువగు నిధి తనదైయున్నదికదా! ఇఁకఁ దానొక జమీనుదారు కావచ్చును గదాయని మురియుచు కేశవుఁ డీక్రిందిరీతి నాలోచించుకొనఁదొడంగెను.

"బళిబళి! కేశవా! నీసామర్థ్యమవ్యాహతముగదా! ఇఁక నేమి కొఱంత యుండఁగలదు? జగత్తున నెన్నివిధములగు సౌఖ్యములున్నవో యన్నిసౌఖ్యములును బొందవచ్చునుగదా!...జగచ్చంద్రా! ......ఛీఛీ! ఆతనిపేరు స్మరణకు వచ్చినప్పుడిట్లు నాకు భయము గలుగునేల? ఆతఁడు నన్నేమి చేయఁగలఁడు! ఈనిధివృత్తాంత మాతనికెట్లు తెలియఁగలదు! మొదటిసారి నాచేతఁబడి తప్పించుకొనినాఁడు. ఇఁకఁ దప్పించుకొనలేఁడు. వేయి జగచ్చంద్రులనైన హత మొనర్చుట నాకొక లెక్కయా!..."

ఇఁక బ్రతిదినము కొంచెముకొంచెముగా ధనమంతయు నచ్చటనుండి దీసికొని రావలయును. మరలఁ జగచ్చంద్రుఁడు నాకంటఁబడుటకుఁ బూర్వమే నిధినంతయు నాగిరిగహ్వరమునుండి మార్చివేయవలయును. నిధి యచ్చట నున్నంతకాలము మనస్థిమితముండఁ జాలదు. ఆసందునిగూర్చి యాతఁడు శాంతబాబును, శచీశుని విచారించి తనతో నేను జెప్పినది యనృతమని తెలిసికొని యిచ్చటికి రాఁగలఁడు. ఆతనిబుద్ధి భేతాళగిరివంక మఱలునేమో? ఎవ్వ రెఱుంగుదురు? కావున నా నిధిని భేతాళగిరినుండి స్థలాంతరమునకుఁ జేర్చవలసినదే...

కేశవునిగది నానుకొని లలితగదియుండుట యెఱిఁగియున్న విషయమే. ఆగదికిని కేశవునిగదికిని మధ్య ద్వారమొకటి యున్నది. ఇప్పు డాద్వారము తెఱవఁబడియున్నది. సగము తెఱవఁబడినతలుపు నొకచేతితోఁ బట్టుకొని, యొకవ్యక్తి నిలువఁబడియుండెను.

అన్యాయార్జితంబగు కనక దర్శనంబునఁ దనకుఁ గలిగిన సంతోషాతిశయంబులోఁ గేశవుఁ డావిచిత్రవ్యక్తిని జూచి యుండలేదు. ఆవ్యక్తి యచ్చటనే నిలువఁబడి కేశవుని చర్యనంతయుఁ గనిపెట్టుచుండెను. ఆతఁడు శ్యామలవస్త్రధారి. ఆపాదమస్తకము నల్లని గుడ్డలఁగట్టియున్న యాతఁ డెవ్వఁడో! ఆతని మొగము గనఁబడుట లేదు. దానినాతఁడు రంధ్రద్వయవిశిష్టమైన యాచ్ఛాదనముతోఁ గప్పుకొనియుండెను. ఆరంధ్రములు నేత్రములకు సరిగనుండెను. వాని నుండి యతని నేత్రములు తీక్ష్ణారుణకాంతులఁ జిమ్ముచుండెను. దేహవర్ణము, ముఖవైఖరి మనకుఁ గనఁబడుటలేదుగాని, యాతఁడు బలిష్ఠుఁడును నాజానుబాహుఁడును నైయుండుట మాత్రము మనకుఁ గనఁబడుచున్నవి.

మరలఁ గేశవుఁడు ధనమును నాభరణములను పెట్టెయందుంచెను. కంకణమును గూడ దాఁచి గదినుండి పోవ నుద్యమించి గదితలుపుఁ దెఱచుటకుఁ బ్రయత్నించెను; అది తెఱచుటకు రాలేదు. వెలుపలికిఁ గొళ్లెము వేయఁబడి యుండెను. కేశవుఁ డాశ్చర్యభ్రాంతుఁడై పోయెను; ఏమిటిది! ఎవ రిట్లు వేసినది? ఆతఁడు బలవంతముగఁ దలుపు మరల లాగిచూచెను. అది రాలేదు. తాళము కూడ వేయబడెనేమో!

ఏమిటది? ఆశబ్ద మెచ్చట నుండి వచ్చినది? అట్లు విపరీతముగ నవ్వినవా రెవ్వరు? లోపలనుండియే వచ్చుచున్నదే యాశబ్దము! కేశవుఁడు వెనుకకుఁ దిరిగి చూచెను. లలిత గది తలుపుమూసి కేశవుని గదియందే యాతలుపు నానుకొనియె యొక యమానుషవ్యక్తి

వికటహాసచలితాపాదమస్తకుఁడై నిలువఁబడియుండెను. ఆకస్మికముగ విద్యుచ్ఛక్తిప్రవాహాఘాతమునొందినవానివలెఁ గేశవుఁడు నిర్విణ్ణుఁడై వెనుకకుఁ జవేసి నిలచెను. స్తంభించిపోయెను: ఆ విచిత్రవ్యక్తి యొక్క హాసధ్వని కరఁగిన సీసమువలెఁ గేశవుని శ్రవణములఁ బ్రవేశించి బాధించుచుండెను.

“ఆతఁ డెవ్వఁడు? ఇట కెట్లువచ్చెను? ఏలవచ్చెను?” ఈప్రశ్నము లన్నియు నసమాధానములే. గనియందుఁ దన చర్యనంతయు నితఁడు కనిపెట్టియుండెను. కంకణరహస్యము నితఁడు గ్రహించి యుండునా? తన్నిరతీసి గనియందే బంధితునిగాఁ జేసిన యీవ్యక్తి యెవ్వరు? ఇట్లు బంధింపఁ గారణమేమి? కంకణము నపహరింపనా? తన ప్రాణమును, తన ధననిధిని, తన కంకణమును, సర్వమును హరించుటకా?

అప్రయత్నముగఁ గేశవుని యొడలు చలించినది. ఆతని చూపు లావ్యక్తి వీక్షణముల నెదుర్కొనినవి. కాని యోగఁజాలక వ్రాలి పోయినవి. క్షణకాలములో మనమునఁ గేశవుఁ డొక నిశ్చయమును జేసికొనియెను. కృపాణ మొకటి జేబియందే యున్నదిగదా? దానితోఁ దన సర్వస్వమును రక్షించుకొనుట! వీలైన నావ్యక్తిని సంహరించుట. కేశవుని చేయి మెల్లనఁ గంచుకపు జేబిలోనికిఁ బోవ నారంభించినది.

అప్పు డావ్యక్తి “కేశవా! తియు మాచేతిని జేబినుండి! నీకడ నున్న బాకు నిన్ను రక్షింపఁజాలదు. నాచేతఁ జూచితివా, ఏమున్నదో?” అనియెను. కేశవుఁడు చూచెను. ఆవ్యక్తిచేత నొక పిస్తోలుండెను. అది కేశవునిపై గురిపెట్టఁబడియుండెను. కేశవుని చేయి యప్రయత్నముగ జేబినుండి వెలికివచ్చెను.

వ్యక్తి — కేశవా! నీ పాపచర్యలు నీకుఁ గనఁబడుట లేదా? నిన్ను నమ్మినకుఁ గష్టములు వచ్చునేమోయని నాగపురమున నెంత యవసరకార్యమున్నను వదలి నీతోడ వచ్చిన యానందుని

గుహాంతర్భాగమున నిధియున్న సుందరునిఁ జంపితివి. తన యాస్తి విషయములను విచారించుకొనుటకై వచ్చిన హరిశ్చంద్రబాబును జంపఁ బ్రయత్నించితివి. ఆనందుని విషయమై నిన్ను సంశయించినందున, నీదారుణహత్యాప్రయత్నమును విఫలము నొనర్చిన దని, లలితా బాయిని జంపఁ బ్రయత్నించితివి. పరుల ధనమునకై తలంపక యాస్తి నుండి ధనము నపహరించుకొనివచ్చు చుంటివి. నీవాచరించిన పాప ఫలము ననుభవించు కాలమున నీధనము నిన్ను రక్షించునని తలంచు చుంటివా? దానిని గాపాడఁజాలని స్థితిలో నున్నప్పుడు నీకది మృత్యుస్వరూపమై బాధించు ననుట మఱచితివా? ఇప్పుడు నీవంతగాఁ బ్రేమించుచున్న యాస్తికి మార్గదర్శకమగు కంకణము నేను గైకొన వలయునన్న నీవు రక్షించుకొనఁగలవా దానిని?

తన విషయమంతయు నెఱింగిన యావిచిత్రపురుషుఁ డెవ్వఁడు? కేశవుఁ డూహింపఁజాలకుండెను. ఆవ్యక్తి తన్ను సంబోధించి పలికిన మాటలెల్ల విని కేశవుఁడు భయకంపితస్వరమున నిట్లనియెను.

"నీవెవ్వఁడవు? ఒరుల వ్యవహారములందు జోక్యము గలిగించు కొన నీకుఁ గల యవసరమేమి?"

వ్యక్తి — కేశవా! నాపేరు భేతాళుఁడు. నివాసము భేతాళగిరి యందలి శక్త్యాలయము. ఇఁకఁ జేయు కార్యమా, నీవంటి పరమ నీచులను శిక్షించుట. ఇప్పుడు నే నిటకు వచ్చిన కార్యము నీవద్ద నున్న పరులసొత్తును బల్లిమీఁదనైనఁ దీసికొనిపోయి దాని స్వాధి కారులకుఁ జేర్చుట. తెలిసినది గదా నావృత్తాంతము? ఇదిగో కంక ణము! ఈనాళీకాయుధమునందలి యసలగోళము నీశిరమును సహస్ర చ్ఛిన్నముచేయుట నీకిష్టముగా దేని యాకంకణ మిట్లిమ్ము. ఆరత్నా భరణముల పేటిక నిట్లిమ్ము."

కేశవునకుఁ దానొక యంధకార కూపమునఁ బడిపోయినట్లుండెను.

కంకణము తన కడనుండి పోవలసినదేనా? తన యాశయములన్నియు గాలిలోఁ గట్టిన కట్టడములు గావలసినదేనా? ఏకంకణము కొఱకై దానెట్టి పరహత్యలైనఁ జేయ సాహసించెనో యాకంకణ మావ్యక్తి కరగతము కావలసినదేనా? కేశవున కేమియుఁ దోఁచలేదు. హృదయ మావేగమునఁ గొట్టుకొనుచుండెను. నిలువెల్లఁ జెమ్మటలూరెను. ఆభయోత్పాతమునఁ గేశవుఁ డెంతయో కాలము నిలువఁజాలఁడు!

వ్యక్తి — ఏమి కేశవా! మాటాడవేమి? కంకణమును ఆభరణ మందసమును నీయుము. వానిని నాపశమొనర్పక నీ వీ గది వీడి పోఁజాలవు.

విపరీత పరివర్తనమునఁ దనభయము నడంచి మొండి ధైర్య మవలంబించి కేశవుఁ డుద్విగ్నకంఠమున "ఓయీ! నామేనఁ బ్రాణము లుండువఱకు నీ వాకంకణముఁ దీసికొనఁజాలవు. తొలుత నాప్రాణములఁ దీసి యావల కంకణమును గైకొనుము" అనియెను.

వ్యక్తి — పిఱికిపందా! నీ సాహసోక్తు లేయేటఁ గలిసినవి ఆనందుని నీకిట్టులనే కదా గుహయందు భయపెట్టితివి? నేను నీవు జీవించియుండఁగనే నీకన్నుల యెదుటనే యాకంకణాభరణములఁ దీసికొని పోవనున్నాను.

కేశవుఁడు హఠాత్తుగాఁ బెట్టెపైఁ గూర్చుండి "ఎన్నఁటికి నట్టిది మున జరుగదు. ముందు నన్నుఁ జంపుము. నారక్తములోఁ దడిపి గాని యాకంకణము నీ నంటఁ జాలవు."

అప్పుడు వెలుపలనుండి "అట్లెన్నఁటికిని గాఁగూడదు. కేశవా! నీవు బ్రతికియుండఁగనే యాకంకణము దాని యజమానుని జేరఁ గలదు." అను మాటలు వినఁబడియెను. తోడనే కేశవుని గది తలుపు తెఱువఁబడియెను. జగచ్చంద్ర చూడాధనులు లోనఁ బ్రత్యక్ష

మయిరి. వా రిరువుర చేతులందుఁ బిస్తోలులుండెను.

జగ — కేశవా! నీ విషయము నే నింతవఱకుఁ బూర్ణముగ గ్రహించియుండలేదు. నీవు చాల దిట్టవుగానున్నావు. ఆపెట్టెపైనుండి లెమ్ము." అనుచు లలిత గదివైపు చూచెను. అచ్చటి వ్యక్తి లేఁడు. జగచ్చంద్ర దర్శనముతోడనే యాతఁడు మాయమయ్యెను.

"ఏమి కేశవా! లెమ్మంటినుండి?"

కేశవుఁడు లేవలేదు. నిస్తబ్ధుఁడై కూర్చుండియుండెను. జగచ్చంద్రుఁడు 'చూడాధనా! జాగ్రత్తగఁ జూచుచుండుము' అనుచుఁ గేశవునిడాసి యాతనిభుజముపైఁ జేయివైచి కంచుకము బట్టుకొని యొక్కలాగున నెదుటిగోడ కానుకొనిపడునట్లు లాగివైచెను. కేశవుఁడు గోడవద్దనుండి లేచి కోపమున నొక్కయెగురున జగచ్చంద్రునిపైబడనెంచి యత్నించెనుగాని జగచ్చంద్రుఁ డాతనిగుండెలకు నేరుగాఁ బిస్తోలుంచి 'కదలితివా' నీగుండె బ్రద్దలౌనచ్చెదను! హంతకా! లలిత నేమొనర్చితివి? ఆమెతండ్రి దగ్గఱలేక అసహాయయైయుండ, భయపఱచి చంపఁబ్రయత్నింతువా? ఇప్పుడు ముక్కలుగా తఱిగిన నిన్నుఁగాచు దిక్కెవ్వరు? ఆనందుఁడు, లలిత, మాధవుఁడు నేమయిరో తెలిసికొనువఱకును నిన్ను విడిచిపుచ్చను. అనిరూపితనేరమునకు నిన్నేమియుఁ జేయను. నిరూపింపబడిన యొక్కనేరమునకే నిన్నిప్పుడు శిక్షింపవచ్చునుగాని, నీవలన దెలిసికొనవలసిన సంగతులు చాలయున్నవి. కావున నిన్నిప్పుడేమియుఁ జేయఁజాలను. చూడాధనా! ఆపెట్టెలోనున్న తగరపుపేటికను దీసికొమ్ము. కేశవా! జగచ్చంద్రునితోడ నెట్లుప్రవర్తింతువో! జాగ్రత్త! ఈతఁడు పత్తేదారు జగత్సింహుఁడునుమా!'

జగత్సింహానామము వినఁగనే కేశవుఁడు ఒకటిరెండడుగులు వెనుకకు వైచెను. ఆతనిమొగము వెలవెలపోయెను.

చూడాధనుఁడు తగరపుఁబెట్టెఁ దీసికొనఁగనే జగచ్చంద్రుఁడు మరల "కేశవా! లలిత నేమొనర్చితివి? ప్రాణముతీయుదునని నీవు బెదరించిననాఁటిరాత్రియే చంపితివా?" అని యడిగెను.

కేశవుఁడు మాఱుపలుకలేదు. జగచ్చంద్రుఁడు "కాలాంజన మెన్నెన్నిరహస్యవిషయ నిధానములను బహిరంగపఱచుటలేదు, ఇది కూడ నందులో నొకటికాదా!" అనుచు చూడాధనునితోఁ బటమంది వెడలిపోయెను.

౨౪

"మహేంద్రా!

నీవు నాకుఁ జెల్లింపవలసియున్న ధనము. చెల్లింతునన్నగడవు మీఱిపోయినది. నెలలో నిచ్చెదనంటివి. రెండునెలలు గావచ్చినది. మీతండ్రికిని నాకును గలుగుచుండిన మైత్రివలన నిన్నింతవఱకు బలవంత పెట్టకుంటిని. నేఁటితోఁ బూర్తిగ రెండుమాసములు గడచిపోవును. ఇంతలోన నీవు నాకుఁ జేర్చవలసిన పైకమంతయుఁ జెల్లింపవలయును. ఈమాత్రమైనఁ దప్పక చెల్లింతువని యెంచెదను. ఊరక వ్రాసితినని యెంచకుము.

ఇట్లు
సురేశబాబు"

మహేంద్రునివదనమునఁ గోపసూచనలు పొడకట్టినవి. చేతనున్న జాబును విసరి యెదుటఁ గూర్చుండియున్న దామోదరునిపైఁ బడ వైచి, "దామోదరా! మన మనుకొన్నదానికన్న మించినది. ఇంకఁ గొన్ని దినములవఱకు నీకష్టముగాదని యెంచితిని. మనప్రయత్నములు శీఘ్రములోనే చేయవలయును. ఆజాబుఁ జదువుకొనుము" అనియెను.

దామోదరుఁడా లేఖ నామూలాగ్రము చదివెను. "ఔను!

మహేంద్రా! కానురేశుఁడు నాకుపెద్దవాఁడుగనున్నాఁడు. కష్టములో నున్న స్నేహితుని కింత బలవంతపఱచుచునా వేమన్నా!" అనియెను.

"బిగ్గరగా మాటలాడకుము సురేశుఁడన్న మణిపురమంతయు గౌరవించును. నాయింటనున్న సేవకులుగూడ సురేశున కేమైనఁ గష్టమురానుండుట విని యూరకుండరు. మావలన నాతనికిఁ గీడు రానున్నదని యణుమాత్రమైన తెలిసికొనినచో, యిఁక మనయాస వదలుకొనవలసినదే! తత్క్షణము మనమిచ్చటనుండి పాఱిపోవలసినదే!"

"అంతగౌరవమున్నదా, యాసురేశున కీయూరియందు?......"

వెనుక తలుపుఁదెఱచుశబ్దము వినవచ్చినది. దామోదరుని మాట లాగిపోయినవి. చూపులు వెనుకకు మఱలినవి.

ఆగదిద్వారముఁ దెఱచుకొని సురేశుఁడును, కూడ నింకొకఁడును నయ్యెడకుఁ బ్రవేశించిరి. సురేశునితోఁ గూడవచ్చిన యతఁడు సుమా రాఱడుగులపొడవుండును. ఆతని వదనమునందలి సువర్చస్సును, కను లందలి వైజ్ఞానికతీక్ష్ణతయు, ఫాలవైశాల్యతయు, దేహచ్ఛాయయు నాతని యాభిజాత్యమును దెలుపుచుండెను.

తొలుత సురేశునిజూడగనే మహేంద్రుని హృదయము వడిగఁ గొట్టుకొననారంభించెను. ఆతనితోడవచ్చిన యానూత్నాగంతుని జూడఁగనే యాభయము యినుమడించెను. మొగము తెల్లబోయెను. ఆతని యాలోచనానేత్రము త్రుటిలో వాని కానాఁడు మార్గమధ్యమున బోసు తన్ను బంధింపవచ్చుటను గనెను. ఈకూడవచ్చిన వాఁడుగూడ నొక రక్షకభటోద్యోగియేమో? తన్ను బంధింపజేయు టకు సురేశుఁ డాతనిఁ బిలుచుకొనివచ్చెనేమో?

కాని తన భయమును వ్యక్తముచేయ సమయమది కాదు. ఇంటికి వారుగా వచ్చినపుడు సత్కరింపకున్న బాగుండదు. ఒకవేళ నట్టి సత్కారముచేతనైన కొంచెము గడువు సంపాదింపవచ్చునేమో!

మహేంద్రుఁడు తెచ్చికోలునవ్వుతో "రండు, సురేశబాబుగారు! ఇచ్చట కూర్చుండుఁడు. మీతో వచ్చిన వీరి పరిచయభాగ్యము నాకెప్పుడును గలిగియుండలేదు! వారును నీయాసన మలంకరించి నన్ను ధన్యుని జేయ వేఁడుచున్నాను" అనియెను.

సురేశుఁడు "అదేమి మహేంద్రా! ఈతని నీవెఱుంగవా? నీ బావమఱఁది భూపేంద్రుఁడుగదా యీతఁడు?" అని యాశ్చర్యముతో ననియెను.

ఆనూత్నాగతుఁడు నవ్వుచు "మహేంద్రునకు నేను జ్ఞాపకముందునా? ఆకాలము కాదుగదా యిది? .....మహేంద్రా! నీవు సౌఖ్యముగనే యున్నాఁడవని యెంచెదను. సరోజిని క్షేమముగనే యున్నదిగదా?" అనెను.

సురేశ భూపేంద్రుల మాటలు వినినపుడు మహేంద్రుని ముఖము, తొలుత వారినిగన్నప్పటికన్న నూఱుమడంగు లెక్కువగ వివర్ణమయినది. ఆతఁడు దానిని మఱుగుపరచుటకుఁగాను క్రింద నేదియో పడినట్లు వంగితీయఁ బ్రయత్నించుచు, మొగమును వారికిఁ జూపక దాఁచెను.

మరల ముఖమెత్తి యెప్పటియట్ల శాంతభావమున నొక్కింత చిఱునవ్వుతో "భూపేంద్రా! ఎంతగ మాఱిపోయితివి? మూఁడు వత్సరములక్రింద నేను కలకత్తాకు వచ్చినపుడు నీ విట్లుండలేదు. ఇంతలో నింతమార్పా!" అనియెను.

భూపేంద్రుడు — మహేంద్రా! నీవు కలకత్తాకు వచ్చి నాలుగు వత్సరములు దాటినది. నాయందప్పటి కిప్పటి కంతమార్పు కలిగినట్లు నాకు దోఁచలేదు. ఒకవేళ మాఱినను మాఱియుందును. నీవు గూడ మాఱిపోయితివే! నీమెడపై నప్పుడుండిన గాయపుగుఱుతు పూర్తిగా నదృశ్యమయినట్టు లున్నదే!

సురే — అవునవును. మహేంద్రుఁ డొక రూపమునందే కాదు.

గుణమునందుఁ గూడఁ జాల మాఱిపోయెను. అప్పటి నారళ్య మిప్పుడు మందునకైన నీతనియందుఁ గనఁబడదు.

భూపేంద్రుఁడు లేచి "మహేంద్రా! మీరు మాటాడుచుండుఁడు. ఈ సురేశబాబు నీతో నవసరమగు కార్యార్థమయి వచ్చియున్నారు. నే నింతలో లోనికిఁబోయి సరోజనితో మాటలాడి వచ్చెదను." అని యటనుండి లోనికిఁ బోయెను.

సురేశుఁడు — మహేంద్రా! నేను వ్రాసిన జాబు చూచుకొంటివా?

మహేం — సురేశబాబుగారు! నన్ను క్షమింపుఁడు. మీకు నే నీయవలసిన ధన మిప్పటికెప్పుడో యిచ్చియుండవలసినది. కాని కారణాంతరములచేతఁ బైకము సమకూడలేదు. అందుచేత నాలస్యమగుచున్నది."

సురే — ఇట్లు లెన్ని దినములు గడపనెంచితివి? ఇఁక రెండు మూఁడు దినములలో నాకుఁ జాల నవసరముగ ధనము కావలసియున్నది. అప్పటిలోగా నీ విచ్చితీరవలయును.

మహేం — మీరంత పట్టుబట్టిన నే నేమియు ననఁజాలను. నాయెడ దయయుంచి యింకఁ బదిదినములు గడు విచ్చితిరేని మీ మొత్త మంతయు నొసంగెదను.

సురే — నా కిప్పు డీ యవసరమే లేనియెడల నీ యిష్టానుసారమె యెన్ని దినములైన నూరకుండవచ్చును. కాని యిప్పుడు మాత్రము వీలులేదు.

మహేం — సరియే మీయిష్టానుసారమే కానిండు. ఎల్లుండి సాయంత్రమునకు మీ బాకీ తీర్చివైచెదను.

సురే — సరియే, ఈయన యెవరు? క్రొత్తవాఁడుగా నున్నాఁడే?

మహేం — ఆతఁడు నా స్నేహితుఁడు. బదరపురవాసి. ఈయూరికి నాలుగుదినములక్రింద వచ్చినాఁడు. పేరు విశ్వేశ్వరబాబు.

సురే — విశ్వేశ్వరబాబా! ఈయనను నే నెక్కడనో చూచిన

ల్లినా? అప్పుడేనాకు జ్ఞాపకము వచ్చినది రానేరదు.

దామో — ఈ వ్యవహారమంతయు మాపియుంచుము. నే నప్పుడప్పు డిచ్చటికి వచ్చుచుందును.

సురే — ఇచ్చటనే నిలుయుండి పిల్చెదను.

ఈవిధముగ వీరు మాటలాడుచుండ భూపేంద్రుండు మరల నచటికి వచ్చెను.

“సురేశబాబుగారు! మీరు మాటలాడవలసిన విషయము ముగిసినదా? ఇంక మనము పోవచ్చునా?” అనియెను.

మహేం — భూపేంద్రా! నీ విప్పు డెచ్చటికిఁ బోవుట? ఇచ్చటనే నిలువుము భోజనమునకు.

భూపేం - ఈ దినముగాదు. రేపు వచ్చెదను లెమ్ము. మనలో మన కేమి భేదము లున్నవి? నీవు నన్నుఁ బిలుచుకున్న మాత్రమున నే నిచ్చటికి రాకుందునా? తప్పకుండ వచ్చెదను.

మహేం — నీవు వచ్చువరకు నాకుఁ దెలియదు. లేకున్న ని న్నిచ్చటినుండి పోనిత్తునా? రేపు తప్పక రావలయును.

భూపేం — అట్టులే వచ్చెదను.

భూపేంద్రసురేశు లిరువురు నచ్చటనుండి వెడలిపోయిరి.

మహేంద్రునిసౌధము దాటినతరువాత భూపేంద్రుఁడు సురేశునితో “బాబుగారు! చూచితిరా వాని ప్రవర్తనము. నేనొక యనుమానమువిషయమును అనుమానించితిని” అనియెను.

సురే — ఏమిటది?

మహేం — దానినిఁ జెప్పఁదగిన స్థల మిది కాదు. మీయింటఁ దెలిపెదను.

* * *

భూపేంద్ర సురేశు లరిగినపిమ్మట మహేంద్రునిఁజూచి దామోద

రుడు విపరీతముగ నవ్వదొడంగెను. మహేంద్రుడు "దామోదరా! ఎందులకు నీవునవ్వినది?" అని యడిగెను.

దామో — బళి! మహేంద్రా! నీబ్రతుకు కొలక్షణములలో జముబం డుచుండినది. తప్పిపోయినది. శుభాశీర్వాదముపాత్రుడను ప్రక్క-ల్లోని ఆర్తనముగా భావించుచు నీ వాసనివారించిన, సుశీలబాబు మాటలను విన్నప్పుడు నెట్లయుంటివో అది జ్ఞాపకమున్నది. అంతకు లకు నవ్వితిని, నాకెన్ని పేరులు! — దామోదరుడు; విశ్వేశ్వరుడు; ఇంక నెన్నియో! నేను సర్వనామాంతర్వ్యాపినిసుమా! అని మరల నవ్వసాగెను.

మహేంద్రుడు నవ్వుకొనుచు "దామోదరా! ఇది నవ్వులకుం దరుణముకాదు. ఊరకుండుము. నీవు దామోదరుండవు విశ్వేశ్వరుండవు నాకున్న నాపట్టు పట్టువలగుచున్నది. ఆవిశ్వేశ్వరనామమే నన్ను రక్షించినది. ఇప్పుడు మనము చేయవలసినదేమి! ఎట్లు ప్రారంభింతము?" అని యడిగెను.

దామో — నీయిష్టము. నీవెట్లన్న నట్లు. విపన్నమయిన పదమును క్షణములోఁ బ్రశాంతము చేయఁగల నాసామర్థ్యమునెఱిఁగిన నీకు మనము చేయవలసిన పని తెలియకుండునా?"

మహేం — దామోదరా! నీయొకనక్కజములు మానవా? ఇంక నోరుమూయుము.

దామో — చిత్తము, మహేంద్రప్రభూ! నీయాజ్ఞను శిరసావహించెదను.

ఈవిధముగా వారింకొకగంటసేపేమేమియో మాటలాడుకొనిరి.

౨౫

నిశీథము. నీలాంబుదసమాచ్ఛాదితమయిన యాకాశము ధూళిచే

నిండి దట్టమయిన ప్రచండవాయువు అంజనశ్యామలమైన తమస్సమూహము మధ్యమధ్య భయంకరములగు పిడుగుమ్రోఁతలు — ఇవన్నియుఁ గలసిన నెంత భయంకరముగ నుండవచ్చునో యంతభీత్యావహముగ నుండిన దా నిశీథము. తన బహుళ జీవనభారమంతయుఁ బుడమిపై ద్రోయు కృతకవర్తనునివలె మేఘసమూహ మేనిముసమునసో ధారాపాతముగ వర్షము గురియ సిద్ధముగనుండెను. ఏవైపుఁగనినను నంధకారమే నిబిడముగ నావరించియుండెను.

మణిపురమంతయు నిద్రాదేవత మోహపుటొడిలో నూయెల లూఁగుచుండెను. అప్పు డెంత రాత్రియైయుండునో తెలియదు. కాని రాత్రి చాల భాగము గడచినట్లున్నది. అట్టి యెడ నాభయంకర తమస్సమూహము, నాపరాగనిబిడవాయువును ఛేదించుకొని "దొంగలు దొంగలు" అను నఱపులు నలుదిక్కులకు వ్యాపించెను. దానితో నా శబ్దము వినఁబడిన ప్రాంతమునందలి గృహములందు జనులు మేల్కొనిరి. మరలఁ బూర్వమువలెనే "దొంగలు దొంగలు" అను నాక్రందనములు వినఁబడినవి. ఇప్పు డాప్రాంతజనులు కొందఱు శబ్దము వినఁబడిన వైపుఁ బరువిడిరి.

అందఱియొక్క గమనములును సురేశబాబు గృహము కడ నాగిపోయినవి. అందఱును ప్రాకార ద్వారమును దెఱచుకొని యెక్కుమ్మడి నా గృహబహిర్ద్వారము కడకుఁ బోయి తలుపుఁ దట్టిరి. అంతకు ముందే లోపల నలజడి వినఁబడుచుండినది. ఆ యలజడి గృహసేవక వర్గము మేల్కొనుటచేతఁ గలిగినదే. సేవకులం దొకఁడు ద్వారముఁ దెఱచెను. నిముసములో నాగృహమంతయు జనాకీర్ణ మయిపోయెను.

వారిలో నిరువురు ముగ్వురు మేడమీఁదికిఁ బోయిరి. మేడపై మూఁడు గదులుండెను. అందు మెట్ల సమీపమునందున్న గది సురేశబాబు శయనాగారము. ఆగదియందు శయ్యపై సురేశుఁడొడలు

తెలియక పడియుండెను. ఆగదికిఁ బ్రక్కగదియందుఁ గూడఁ జూచిరి. అం దెవ్వరును లేరు. శయ్యామాత్ర మంతకుముం దెవరో పరుండి యుండినట్లు నలిగియుండెను. ఆశయ్యపైఁ బరుండినవా రెవ్వరో! మూఁడవగది కడకు వచ్చిరి. ఆగదియందు వారికిఁ గనఁబడిన దృశ్యమునకు వారు హాహాకారములు చేసిరి.

ఆగది ధనాగారము. అందు మూల నొక యినుపపెట్టిక, తెఱవఁ బడిన తలుపులతో చిందరవందరగా పడియున్న కాగితములతో నుండెను. ఆపెట్టెకుఁ గొంచెము దూరమున నొకఁ డచేతనుఁడై పడియుండెను. గదులఁ బరీక్షింపఁ జనినవా రాతని మఱింత దగ్గఱఁ జూచిరి. అతఁడు నూతనుఁడు. ఆయుదయమే సురేశు నింటి కెచ్చటి నుండియో వచ్చెను. ఒకఁ డాతని హృదయముపైఁ జేయిపెట్టి చూచెను. హృదయమాడుటలేదు. చేతి కేదియో తడిగఁ దగిలినట్లు తోఁచి యాతఁడు చేయిఁదీసి చూడ హస్తమంతయు రక్తమయి యుండెను.

ఆతఁ డావృత్తాంతముఁ బక్కనవారికిఁ దెలిపి చౌర్యముమాత్రమే కాక, హత్యకూడ జరిగినదని పలికెను. వారియందొకఁడు క్రిందికిఁ బరువెత్తి యచ్చటనున్నవారి కావిషయ మంతయుఁ దెలిపెను. గృహసేవకుల నిరువురిఁ బిలిచి యందొకని వైద్యునికొఱకు వే రొక్కని రక్షకభటుల కొఱకు పంపెను.

ఆ యింటియందుఁ జేరినవా రెల్ల గుంపులు గుంపులుగాఁ గూడి గుస గుస లాడుచుండిరి. ఇట్లే ముప్పది నిముసములు గడచెను. వైద్యుఁడు వచ్చి చేరెను. వచ్చినవెంటనే యాతఁడు సురేశునిఁ బరీక్షించి "సురేశున కేయపాయమును లేదు. ఈ మూర్ఛ క్లోరోఫారము వలనఁ గలిగినది'' అని తెలుపుచు నొకనిఁ బిలిచి యాతనికి విసరుచుండ నియోగించి ధనాగారమునకుఁ బోయెను. అచ్చటఁ బడియున్న

యాశవమును బరీక్షించెను. పాపము! ఆనూత్నపురుషుఁడు ప్రాణములఁ బాసి నలుబదినిముసములయి యుండును. ఆతని మరణము హంతకుని చేతిబాకువలనఁ గలిగినది. హృదయమునఁ గుడివైపు చాలలోతుగ దిగిపోయిన పెద్దగాయముండెను. అందుండి రక్తము స్రవించి కరడుగట్టియుండెను.

అంత కొంతసేపటికి రక్షకభటశాఖవారు కూడ నరుదెంచిరి. వారితోఁగూడ వచ్చిన యుద్యోగి యచటి పరిస్థితుల నన్నిఁటిని సంపూర్ణముగఁ దెలిసికొనుటతో మాత్రమే యప్పటికి తనవిచారణను ముగించెను. మిగిలిన రాత్రియంతయు డాక్టరు సురేశున కుపచరించుటలోను, పోలీసువారు గృహము చుట్టునైచి పారా యిచ్చుటలోను గడచి పోయినది.

తెల్లవారినది. సుమారు ఎనిమిదిగంటల ప్రాంతమున సురేశబాబునకు స్మృతి వచ్చినది. మఱియొకగంట కతఁడు యథాస్థితికి వచ్చినాఁడు. రాత్రి జరిగినదంతయు నెమ్మదిగ నాతనికిఁ దెలియఁ జేయఁబడుటయే గాక, హత్యాగారమునకుఁ గూడఁ గొంపోఁబడెను. సురేశుఁ డచటి దృశ్యమును గాంచుటతోడనే 'హా! భూపేంద్రా!' యనుచు నేలఁబడియెను. ఆ శవముపైఁబడి బిట్టుగ విలపింపఁజొచ్చెను.

అపుడు వెంటనేయున్న రక్షకభటాధికారి సురేశుఁ డొక్కింత శాంతుఁడగువఱకు వేచియుండి పిమ్మట నిట్లు పలికెను.

"సురేశబాబుగారు! చూచితిరిగదా యీ హత్యను! ఇది రాత్రి మీయింట జరిగినది. చౌర్యము కూడ జరిగినది. హత్య గావింపఁ బడిన యీతఁ డెవరో మీరు గుర్తించి యాతని నామ నివాసములు, అతఁ డిచ్చటికి వచ్చుటకుఁ గారణము మొదలైన సంగతులు మాకుఁ దెలుపవలయును. మఱియు నాయినుపపెట్టెనుండి యేయేవస్తువులు దొంగిలింపఁబడినవో పరీక్షించి మాకొక జాబితా నీయవలయును."

అప్పుడు సురేశుఁడు మెల్లగ నిట్లుచెప్పెను.

"ఇన్‌స్పెక్టరుగారు! ఈశవము భూపేంద్రబాబను నాతనిది. ఆతఁడు కలకత్తావాసి. విజయచంద్రుని కుమారుఁడగు మహేంద్రుని కీతని చెలియలి భర్త. ఈతఁడు నిన్న యుదయము కలకత్తానుండి వచ్చి నాయింట బస చేసెను. దేవేంద్రవిహరలుఁడను నొక వృద్ధుఁడు మరణించినపుడు తన యావదాస్తిని జగచ్చంద్రబాబునకు వ్రాసెను. ఆ మరణశాసనముఁ దీసికొని భూపేంద్రుఁడు జగచ్చంద్రుని కీయఁ జనుదెంచెను. జగచ్చంద్రబాబీయూరలేనందున, నాకాగితములను నాకడ నుంచి యీ దినము కలకత్తాకుఁ బోవలయునని యూహించెంచి యుండెను. కాని రాత్రి యిట్టి దారుణమరణమునకు లోనయ్యెను."

రక్షు — సన్నటియుదయము మొదలుకొని రాత్రి మీరు పరుండు వఱకు జరిగిన విషయములు దెలుప్పుఁడు.

సురే — భూపేంద్రుఁడు వచ్చినపిమ్మట మధ్యాహ్న మంతయు మేమెచ్చటికిని బోవలేదు. సాయంతనమున భూపేంద్రుఁడు చెలియలిని జూడవలయునని మహేంద్రు నింటికిఁ బ్రయాణముకాఁగా నాతనితోడ నేను బోయితిని. మహేంద్రుఁడు నాకుఁ గొంతధన మీయవలసి యుండెను. భూపేంద్రుఁడు నేను అచ్చటికిఁ జేరునప్పటికి మహేంద్రు నితో 'విశ్వేశ్వరుఁ' డనునాతఁ డుండెను. మాకార్య మయినపిమ్మట మేమింటికి వచ్చితిమి.

ప్రతిదినము రాత్రి నేను పదిగంటలకుఁ బరుండువాడుక. అంత వఱకు జగచ్చంద్రునికి నూతనముగ సంక్రమించిన యాస్తి విషయము మాటలాడుచుండి, పదిగంటలకు మే మిరువురము పరుంటిమి.

"ఎంతకాలము నిద్రించితినో తెలియదుగాని గదియందేదో శద్దమునకు మేల్కొంటిని. నాగదియందే నేను బరుండియున్న పర్యంకమునకు సమీపముననే యొకఁడు నిలువఁబడియుండెను. ఆతనిఁజూచుట

తోడనే గుర్తించితిని. నాము హేంద్రునింట మేము జూచిన విశ్వేశ్వరుఁడే యాతఁడు. అతని జూచినంతనే నేను 'ఆఁ, విశ్వేశ్వరా!' అని యంటిని. అతఁ డదివిని నాపైకివచ్చుటఁ జూచి 'దొంగలు దొంగ' లని కేకలిడఁ బ్రయత్నించితిని. కాని ఆ యఱపింకను నోటినుండి వెలువడకముందే యాతఁడు నాపైఁబడి, తెల్లని చేతిగుడ్డతో నానోటిని ముక్కునుగూడ మూసెను. ఆగుడ్డయం దేదో ఘాటగు వాసనయుండెను. దానిని మూచూచి నే నొడలు తెలియక పడిపోయితిని. పిమ్మట నేమిజరిగినదో నాకుఁ దెలియదు."

పిమ్మట సురేశుఁడు పోలీసుయుద్యోగికోరికపై ఇనుపపెట్టెయందలి వస్తువులను పరీక్షించిచూచి, చెల్లాచెదురుగనున్న కాగితములను గొంతవఱ కాలోకించి యిట్లు చెప్పెను.

"ఇన్స్పెక్టరుగారు! ఈపెట్టెనుండి యేఁబదివేల విలువగల పత్రములును, నైదువేలవఱకు ధనమును అపహరింపఁబడెను. ఆ యైదువేలును నోట్లుగానే యుండినవి."

రక్ష — ఈపెటికను దేనితోఁ దెఱచియుందురు? ఆ తాళము మీవద్దనుండిన దేనా?

సురే — అవును. నేను రాత్రి దీనిని తలగడక్రింద దాఁచితిని. అచటనుండి యిది తేఁబడినది.

సురేశుని వాఙ్మూలమింతటితో పూర్తి యయిన దనవచ్చును.

క్రమముగా హత్యా సందర్భమున రక్షకశాఖవా రొనర్చు కార్యకలాపమంతయు నెఱవేరినది. గృహమునకు సంబంధించినవారి వాఙ్మూలము లన్నియుఁ దీసికొనబడెను. శవమును బరీక్షించిన డాక్టరు వాఙ్మూలమును గైకొనఁబడినది. శవదహనమున కనుజ్ఞ యిచ్చిన పిమ్మట ఇన్స్పెక్టరు భూపేంద్రబాబు గృహమునకు కలకత్తాకు వర్తమానమంపెను. అందఱి యనుమానముతోఁబాటు ఇన్స్పెక్టరుయొక్క-

అనుమానముగూడ విశ్వేశ్వరునిమీఁదికిఁ బెరిగినది. అందులకు ఫలముగ విశ్వేశ్వరుఁడు మహేంద్రపురమునుండి మాయమయ్యెను. మహేంద్రుఁడు విచారణలో విశ్వేశ్వరుఁడు తన మిత్రుఁడనియు ఒరిస్సాప్రవాసి యనియు, నాతఁ డిట్టికార్యమును జేయుటకుఁ గారణమేమియో తనకు దెలియదనియు వాఙ్మూల మిచ్చెను. విశ్వేశ్వరునిఁ బట్టుటకు రక్షకభటు లన్నిదిక్కుల నంపఁబడిరి.

౨౬

తొలఁగిపోయినది, భేతాళగిరి కందరమునుండి వెలిని మహాబాధకిఁ బ్రాణతుల్యమగు నయఃకంకణము! వ్యర్థములైపోయినవి కేశవుని యాశలన్నియు! అతని స్వార్థపిశాచావేశితమగు మానసము చిత్రించిన భావిసౌఖ్యములన్నియు నీటిబుగ్గలవలె, సుస్వప్నములవలె నుత్తరక్షణముననే మాయములైనవి. నిధియందుఁ దానపహరించుకొని వచ్చిన స్వల్పధనమును జూచినందువలనఁగలిగిన యానంద మంతలోనే యంతరించెను. దానితో నతనికి మతికూడ పోయినట్లయ్యెను.

కేశవున కప్పుడేమియుఁ దోఁచలేదు. కర్తవ్య మేమియు స్ఫురింపలేదు. తోఁచుట కేమియున్నది! అతని జీవితమే వ్యర్థమయిపోయినది గదా! ఇఁకఁ గేశవునకు గంతవ్యమగు పథమేమున్నది! ఏమియును లేదు...... కాని, కేశవుఁడు సామాన్యవిఘటనలకే యధైర్యమందునట్టి బలహీనహృదయుఁడు గాఁడు. తన జీవితమంతయు నిష్ఫలమే యయినను, గడ్డిపోచంతమాత్రము నిలుకడచిక్కిన సముద్రమంత విపత్తునేని ఈదివేయ నిశ్చయించునట్టి గుండెదిటవుగలవాఁడు. అట్లునుటచేతఁ దనకన్నఁ బదిరెట్లు బలవంతులగువారు, అసంఖ్యాకులు, మస్తకమును దండములతో బ్రయ్యలగునట్లు కొట్టుచున్నను నమానుష శిరోవేష్టనము లభ్యమై తనతలను సహస్రధా భిన్నముగాకుండ రక్షించునని యెంచు మూఢులలోఁ జేరఁడు. కాని వారందఱు నూఱుల

కొలఁది దెబ్బలుగొట్టినఁ, దాను పదిదెబ్బలన్నఁ గొట్టఁజాలనాయను స్వబలపరిజ్ఞానముగలవాఁడు. వానియెడ నాతనికి నమ్మకముగూడఁ గలదు.

వాఁడిట్లు తన్ను సంతోషపార్ధిని మునకలువేయుచున్న తన్ను మోసగించి జగచ్చంద్ర చూడాధనులు కంకణరత్నాభరణధనయుక్తముగు తగరపుఁ బేటిఁ దీసికొనిపోయినపిదప నాతఁడిట్లులే ప్రయాన్పడి, కొంతవడి యామందసముపైననే కూర్చుండియుండెను. అంధకారమున నాఁటి తెలియని తీఁమసలగుచున్న తెరువరక, క్షణప్రభామాత్రమగు క్షణప్రభతోఁచి, యాపత్కాలము మెఱసి యంతలోనే మాయమయి మరల నా చీకటినారసి నిబిడతమస్సునఁ బడవైచిపోయినట్లు, నిరంతరదారిద్ర్యాంధకారమునఁ బెనఁగుచున్న కేశవునికి అసంతైశ్వర్యము చూపి, అంతయు నాతనిదే యను యాసఁగొలిపి పరహస్తగతమై, యాకంకణము వాని నెప్పటివలెనే దారిద్ర్యమున నటమటఁ జెందునట్లు చేసి పోయినది. ఆ కంకణము చేతినుండి తప్పిపోవుటఁ గేశవునకుఁ దీవ్రమగు మనోవేదన గలిగించెననుటలో నాశ్చర్యమేమున్నది!

కొంతకాలమున కాతఁడు చెదరిపోయిన మనస్సును గుదుట బఱచుకొని ప్రస్తుతకర్తవ్య మాలోచింపఁ దొడఁగెను. ఆయాలోచనలో నిమిషములు గంటలు కూడఁ గడచిపోవుచున్నవి. కాని ఆలోచనకు అంతముమాత్ర మింకను కన్పించలేదు.

ఇట్టి యాలోచనముల కంత ముండునా? అవి తోఁచుచునే యుండును; ఉపయోగముమాత్రము సున్న! గాలిలో భవనములను గట్టినట్లు ఆయాలోచనలకు బద్ధుఁడగుట ...... కేశవుఁ డెంతకాల మాలోచనా నిమగ్నుఁడయి యుండెనో తెలియదు.

ఇంతలో మరల నతనియెదుట నొక శ్యామాలాంబరవ్యక్తి నిలు

వున నిలువబడి ప్రత్యక్షమయ్యెను. ఎవరో తన యొద్ద నున్నట్టూహించి, కేశవుఁడు తలయెత్తి వానిఁజూచి యులికిపడియెను.

ఇతఁడేనా యింతకుముందు కేశవునివద్దనుండి కంకణము నపహరింపఁ బ్రయత్నించినవాఁడు ? కేశవుఁ డాతనిఁ బరీక్షాకటాక్షములఁ జూచెను. ఈతఁడుగాఁడు! ఆతనికి నీతనికిఁ జాల భేదములున్నవి. ఈతనికన్న నాతఁడు పొడవు.

ఆ నీలాంబరధారి యేమియుఁ బలుకక యొకచీటి కేశవున కిచ్చి యచ్చటనుండి వెడలిపోయెను. కేశవుఁ డద్దాని నందుకొని చదువుటకై విప్పెను. ఆచీటియందలి విషయముల నాతఁడు చూడకముందే దాని కడుగు భాగముననున్న ముద్రను జూచెను. అది యెక్కడినుండి వచ్చినదియు గ్రహించెను. వణఁకుచున్న చేతులతోఁ, జలించుచున్న మనస్సుతో నాతఁడాకాగిత మిట్లు చదవఁదొడఁగెను.

“కేశవా! నీవలన నేను గొన్ని సంగతులఁ దెలిసికొనవలసి యున్నాను. అవి యతిముఖ్యములు, రహస్యము లయినట్టివి. రేపురాత్రి శిథిలమందిరప్రాంతమునకు రమ్ము. అచ్చట నీకొఱ కొక భటుఁడు కాచుకొనియుండును. ఆతఁడు నిన్ను నావద్దకుఁ దోడ్కొనిరాఁగలఁడు. తప్పక రావలయును. ఇది గగూలియా యాజ్ఞయని తెలిసినపిమ్మట రాకుండ నుండుటకు లేదు. ఉల్లంఘించితివా! తెలిసియే యున్నది నావిషయము.

గగూలియా.”

కేశవునకు లేఖఁ జదువఁగనే పెనుదిగులు జనించినది. చిత్తమీ క్రిందివిధముగా నూహాసంచరితము కా నారంభించినది.

“గగూలియా నామూలమున నేవిషయములు తెలియఁదలంచి యున్నాఁడు? ఆతఁడుగూడ నీకంకణరహస్యమును దెలుసుకొనియెనా? నావద్దనుండి కంకణ మపహరింపవచ్చిన వ్యక్తి యీగగూలియా

జట్టులోనివాఁడేనా? అతఁడును ఈవేషము దెచ్చినవాఁడును నానావిధములగు వస్త్రములు ధరించియున్నారు! ఆ నర్తకియే గఫూలియా కీవిషయముఁ దెలిపియుండునా? తెలిపియే యుండును! ఈ గఫూలియా యెంత ఘటికుఁడు! ఒక పెద్దసామ్రాజ్యమును పాలించు కుశాగ్రబుద్ధియగు రాజు ఎన్ని విషయములఁ దెలిసికొనియుండునో, ఎన్ని విషయములందుఁ జొచ్చుకొని పనిచేయునో అట్లే గఫూలియాకూడ తనకు లాభకారి యగు ప్రతివిషయమును దేశాంతరమందలిదైన నిముసములోఁ దెలిసికొను చున్నాఁడు! ఒక రాజ్యాధిపతిగాఁ బుట్టవలసినంత గొప్ప యాతఁడు! అతని దృక్పథమునుండి తప్పిన దేశాంతములం దేమియును లేదు గదా? ......అట్టి దిట్టయే నాకు సహాయమునుచేయువాఁడు గానున్నచో... ఇట్టి జగచ్చంద్రులను వేవురనైనను, నిట్టి చూడాధనాదులను లక్ష మందినైనను నెగఁజిమ్మివేయనా! . ఇప్పుడు మాత్రము గఫూలియా తో నేనేల స్నేహముచేయరాదు? కాని నిర్మలస్నేహము నెఱపుట కాతఁడు నమ్మఁదగినవాఁడుగాఁడు. ఇప్పుడునాకుఁ గర్తవ్య మెద్ది? ఎట్లు ప్రవర్తించిన నాకంకణము మరల నాకు లభించును?...జగచ్చం ద్రునివంటి గనుసుపోకలవానిఁ బ్రతిఘటించుట కష్టము. కంకణమును సులభముగ గ్రహించవలయును....సరియే, కానిమ్ము — రేపే యీ విషయమునంతయు గఫూలియాకుఁ దెలిపి వానిసాయము గోరెదను. నిధియం దర్థభాగ మిచ్చెదనన్న నాతఁడు నాకుఁ దప్పక సహాయము చేయును...... ఆహా! నాఁటిపరాభవము! నాఁటిప్రయత్నవిఘట నము! నేఁటి బలాత్కారము! వీని నెన్నఁటికైన మఱవఁగలనా? జగచ్చంద్రుఁడు దగ్ధుఁడై పోవువఱకు, నా యీయగ్ని చల్లారునా? రేపు గఫూలియాకడ కరిగెదను — అతని సహాయమే నాకు లభించిన..."

ప్రారంభించినది కేశవుని యాశానావ ప్రయాణమును! చుక్కాని

వద్ద గగూలియా నిలువనున్నాఁడు. భావికాలాంబుధియందు దానిగతి యెట్లో!

౨౭

జగచ్చంద్రుఁడు కంకణము జూడాధనునకుఁ జేర్చెను. అక్షయబాబు సంతోషమునకు మేరయేలేదు. తనసూక్ష్మబుద్ధి వినియోగించి విచిత్రముగ నెట్టి కష్టములులేకుండ జగచ్చంద్రుఁడుగాక ఇంకెవ్వరయిన నద్దాని నుద్ధరించియుందురా? ఇప్పుడు జగచ్చంద్రుఁడుగూడ నక్షయబాబునకుఁ జూడాధనునివలెఁ గుమారుఁడే! ఆతఁడిఁకఁ గష్టపడవలసిన యవసరములేదు. అక్షయుఁడొనర్చియున్న వాగ్దానప్రకారము నిధియందర్ధభాగ మిఁక జగచ్చంద్రునిదే!

నెలదినముల క్రింద మహేంద్రుని కృత్రిమోపాయములవలనఁ దనకు న్యాయముగా రావలసిన యాస్తి నంతయుఁ బోఁగొట్టుకొని జరుగనున్న పూటకుఁగూడఁ గష్టపడినఁగాని యన్నములేని జగచ్చంద్రుఁడు, నేఁడు నలువదిలక్షలధనముగలవాఁడయ్యెను. ఇఁక నేవిషమగు కష్టములేకయే తనవంటివారిని నూర్గురనైనను బోషింపగలఁడు.

కంకణము మరలఁ జిక్కినవెనుక నొకనాఁడు గజచ్చంద్ర చూడాధనులు నక్షయుఁడు నొక్కెడఁగూర్చుండి జరుగవలసిన పనులఁగూర్చి యాలోచించుచుండిరి.

చూడాధనుఁడు తండ్రితో శిథిలమందిరప్రాంత సరోవరతటమునఁ దనకుఁ గనఁబడిన యయఃపేటికయందలి కాగితమున వ్రాయఁబడిన విషయమంతయుఁ దెలిపెను. ఆకాగితమందు వ్రాయఁబడిన ప్రకారముగా నాధననిధి మంత్రబలముచే రక్షితమొనర్పఁబడియుండుటచే దానిని స్వాధీనమొనర్చుకొను పనుల నొకశుభముహూర్తమునఁ బ్రారంభించుట మంచిదని నిశ్చయించుకొనిరి.

అప్పుడొక భటుఁడు లోనికివచ్చి జగచ్చంద్రునితో "బాబు!

ఎవరో యొకక్రొత్తమనిషి మిమ్ముఁ దక్షణముచూడవలయునని కోరుచున్నాఁడు. ఏవో యవసరములగువిషయములఁ గూర్చి తెలుపవలయునఁట” అనియెను.

జగచ్చంద్రుఁడు లేచి వెలుపలికివచ్చి యానూతనాగంతుని జేరవచ్చెను. ఆపురుషుఁడొక వస్త్రముతో ముఖము కనఁబడకుండ ముసుఁగువేసికొనియుండుటచే గుర్తుపట్టుటకు వీలుకలుగలేదు. అంత జగచ్చంద్రుఁడు —

“ఓయీ! నీవెవ్వఁడవు? నాతోడ నీకుఁగల కార్యమెట్టిది?”

నూతన — జగచ్చంద్రబాబు! నేనెవ్వఁడనో నీవు తెలిసికొనఁ బ్రయత్నింపకుము. అది యింకను కొంతకాలము రహస్యముగ నుండవలసియున్నది. నన్ను మీరు తెలిసికొనకున్నను నేను మీమిత్రకోటిలోనివాఁడనని మాత్రము మీరెఱింగినఁజాలును. నావృత్తాంతము నంతయు వివరించు కాలము వచ్చినపుడు మిగిలిన విశేషాంశములెల్లఁ దెలియఁగలదు.

జగ — నీవిపుడు నాకడకు రాఁ గారణమేమి ?

నూతన — మీరు నాగపర్వత ప్రాంతము లందలి మీ భూస్థితిపై విచారణకర్తలుగ నున్న ఆనంద కేశవుల నెఱుఁగుదురుగదా ? అందానందుని కొకకుమార్తె ‘ లలిత ’ యను నామె కలదని మీకు తెలియునుగదా ?

జగ — తెలియును! నీవిప్పుడు లలితా విషయము దెలుపుటకా వచ్చినది ? ఆమె యెక్కడనున్నది ? నీ కావిషయము దెలియునా ?

నూతన — ఆమె యెచ్చటనున్నదియుఁ దెలుపుటకే నా యీరాక ! ఒకనాఁ డామె గగూలియా భటులచేత బంధింపఁబడి యాతని కడకుఁ దీసికొనిరాఁబడినది. ఆతఁ డామె నిప్పుడు నిర్బంధమునఁ బెట్టియున్నాఁడు !

జగ — ఏమి ? లలిత గగూలియాచేఁ జిక్కినదా ? ఆతఁ డామెను

నిర్బంధించియున్నాఁడా? ఆప్రదేశము నీకుఁ దెలియునా? తెలిసియున్న నన్నచ్చటికిఁ దీసుకొనిపొమ్ము. ఆమె నెట్టులయిన రక్షింపవలయును.

నూత — నేనును ఆమెను రక్షింపవలయుననియే ప్రయత్నించుచున్నాను.

జగ — నీవు గగూలియా పరివారములోని వాఁడవేనా?

నూత — అవును; కొన్ని కారణాంతరములచేత నే నాజట్టులోఁ జేరవలసివచ్చినది. ఆజట్టువాఁడ ననినంతనే వారివలెనే నన్నుఁ గూడఁ దలఁపకుఁడు. నేను వారిలోఁ బ్రవేశించుట సదుద్దేశముననే! లలితను మన మిరువురమును జేఁరి రక్షింపవలయును. నే నామెను నిర్బంధస్థానమునుండి యీవలకుఁ దేఁగలుగుదునే కాని సురక్షితస్థానమునకుఁ జేర్పఁజాలను. ఆపని మీరు గైకొనవలయును.

జగ — ఆస్థానమునుండి యీవలఁబడి నావశమైన వేవురు గగూలియాలనైన హతమొనర్చి యామెను రక్షింపఁగలను.

నూత — సరియే! ఇఁక నాలుగుదినములవఱకు మన మేమియును జేయఁజాలము. నాల్గవనాఁటిసాయంకాలమున గగూలియా పరివారమున కొకవిందు జరుగనున్నది. ఆవిందునందు వారు మునింగియున్నయపుడే మనపనిని మనము నెఱవేర్చుకొనవలయును. ఆనాఁడు సంజవేళకు సరిగ మీరు శిథిలమందిరప్రాంతమునకు వచ్చియుండుఁడు.

జగ — అచ్చటికి నేను వచ్చుట గగూలియా పరివారమునకు దెలిసిన మనకార్యము విఫలమగును గదా?

నూత — ఆనాఁడు వారెవ్వరు వెలుపలనుండరు. మిమ్ము వారు చూడఁగలరను ననుమానమువలదు.

జగ — నేనొక్కఁడనే రావలయునా? నాతోడ నింకొకని దోడ్కొనిరావచ్చునా?

నూత — తోడ్కొనివచ్చిన నాయభ్యంతరమేమియునులేదు. కాని మీ రతిజాగ్రత్తఁగ రావలయును. నాకవసరములగు కార్యములున్నవి.

ఎక్కువ కాల మిచ్చుట నేనున్న గఘూలియా నన్ననుమానించును. మీరు మాత్రము నిర్ణీతకాలమునకుఁ దప్పకరండు.

అని నూతనాగతుఁడు వెడలిపోయెను. అతని వాలకమును కంఠ స్వరమును బరీక్షించుచుండిన జగచ్చంద్రుఁడు వానిమూలమున నాతని గుర్తింపఁ బ్రయత్నించి విఫలుఁడై యిట్లనుకొనియెను.

"ఈతఁడెవ్వఁడు? పోలిక కొంచెము కేశవునిఁ బోలియున్నది. ఒకవేళ మారువేషమున కేశవుఁడే వచ్చియుండునా? కంఠస్వర మాత నిది కాదు. ఆతఁడే కంఠస్వరముగూడ మార్చుకొని మాటాడియుండఁ గూడదా? ఈతఁడు కేశవుఁడే యయినయెడ లలిత నొకప్పుడు హత్య చేయఁ బ్రయత్నించినవాఁ డిపుడు రక్షింపఁబూనునా? ఈతని రక్షణో ద్యోగముగూడ కృత్రిమమైయుండునా? ఈతఁడు కేశవుఁడే యైనఁ గృత్రిమమే!... ఈతఁడు నన్ను మోసగించి గఘూలియాచేఁ జిక్కిం చుట కీ యుపాయముఁ బన్నియుండునా? — కాని గఘూలియాచేఁ జిక్కుట తటస్థించునని యిప్పు డచటికిఁ జోవ వెనుదీయుదునా?... నిజముగ నీతఁడు లలితను రక్షింపనెంచిన, మిత్రుఁడే యయియుండిన నావలననే కదా లలితారక్షణము విఫలమగును? కాఁబట్టి యీతఁ డెవ్వఁ డైనను సరియే శిథిలమందిరప్రాంతమునకుఁ బోవలసినదే! లలితారక్షణము నెఱవేరినదా మంచిదే! లేక నే ననుమానించిన తెఱఁగున గఘూలియాచేఁ జిక్కుటయే తటస్థించిన అప్పటి కేదేని యుపాయము తట్టకపోవునా!"

తుద కట్లు నిర్ధారణచేసికొనిన జగచ్చంద్రుఁడు మరల నక్షయ చూడాధను లున్న యెడకు వచ్చెను. వారల కా నూతనాగతుఁడు తెలిపిన విషయములను దన యనుమానమును గూడ నెఱిఁగించి వారి యాలోచన మడిగెను.

అక్షయబాబు కడుదూరముచర్చించి జగచ్చంద్రుఁడు వెడలుటయే

కర్తవ్యమని యభిప్రాయమొసంగెను. చూడాఘనులు జగచ్చంద్రు నొంటరిగఁ బోనిచ్చుట కిచ్చగింపక తామగూడ వెంబడించుటకు సిద్ధపడెను. అతని జనకుఁడీమాటలు జగచ్చంద్రుని ధైర్యము చూచుకొని యంగీకరించకుండ నుండలేకపోయెను.

౨౮

జగచ్చంద్ర చూడాఘనులు నాగపురమునుండి శిథిలమందిరప్రాంతమునకు వచ్చునప్పటికి బాగుగఁ జీఁకటిపడినది. గగూలియా పరివారము వారెవరు నా ప్రాంతములందు వారికిఁ గనఁబడలేదు. వారు సరోవరమునకు దాపుననేగల యొకపొద మాటునఁ గూర్చుండిరి. నిశ్శబ్దముగ వారాప్రాంతమంతయు వీక్షించుచుఁ గూర్చుండియుండిరి. తొలుత వారికిఁ జూపు చాలదూరము ప్రసరింపలేదు. కొంతకాలము జీఁకటిలోనుండిన తరువాత వారికిఁ జీఁకటి యలవాటుపడినందున నా ప్రదేశ పరిసరములందుఁ బదిబారలదూరము చూపు సాగఁజాలినది. వారయ్యెడఁజేరి సుమారొక గంటయయిన పిదప గలగల మను శబ్దము వినవచ్చినది. తొలుత వారి కేమియుఁ గనఁబడలేదు గాని కొంతవడికి వారికి సరస్తీరముననే యిరువురు వచ్చుచుండుటఁ గనఁబడెను.

ఆవచ్చుచున్నవారు జగచ్చంద్ర చూడాఘనులు గూర్చుండియున్న చోటునకు దాపునకే వచ్చి యటనిలిచిరి. అప్పుడు జగచ్చంద్రుఁడు తాను దాగి యున్నయెడనుండి లేచి వారిని డాసెను. ఆ నూతనాగంతులును జగచ్చంద్రుని గుర్తించిరి. తనయెదుట నిలువఁబడియున్న యిరువురు పురుషులను గని జగచ్చంద్రుఁడు తన ప్రయత్నము విఫలమయినదేమో యనుకొనెను. ఆ యనుమానముతో జగచ్చంద్రునిహస్తమప్రయత్నముగ జేబులోనున్న పిస్తోలుమీఁదికి బోయినది. నూతనాగంతులలో నొకఁడు దీని గనిపట్టెను. జగచ్చంద్రుని యనుమానమున కాతనికి నవ్వు వచ్చినది. ఆతఁడు నవ్వుచు "జగచ్చంద్రా! ఇప్పుడు

నీ యగ్నిబాణముతో నేమియు నవసరములేదు. ఇరువురు పురుషులే వచ్చియున్నారను ననుమానమాత్రమునకే యింతసాహసమా! స్త్రీలు సంచరింపఁగూడని చోట, తగనివేళ వారు పురుషాకారమున వచ్చుటేమివింత ?" అనియెను

జగచ్చంద్రుఁడు తన యనుమానమునకు సిగ్గుపడెను. జేబునుండి చేయిఁదీసి యానూతనుని కరముబట్టుకొని "మిత్రమా! ఏమియు నను కొనకుము! ఈ ప్రదేశమట్టిది. మీరు ధరించియున్న వేషములట్టివి. అందుచేత ననుమానించితిని" అనియెను.

నూతన — జగచ్చంద్రబాబు! ఇచ్చట నేను జాలకాలము నిలుచుటకు వీలులేదు. ఈ దిన ముదయమున దొంగలసభ జరిగినది. అందుఁ గొన్ని రహస్యములు తెలిసినవి. అవి మీ వంశమునకు, మణిపురము నందున్న సురేశునకును సంబంధించినవి. వానిని నేను వివరించుట కవకాశముండదని వ్రాసి తెచ్చితిని. (ఒక కాగితమును జగచ్చంద్రునకిచ్చుచు) ఇదిగో దీనిఁ జదువుకొనుము. సంగతులన్నియు బోధపడఁగలవు. వానిఁ దెలుసుకొన్న పిమ్మట నెట్లు ప్రవర్తించిన మేలో యా విధమునఁ బ్రవర్తింపుము — (తోడనున్న పురుషవ్యక్తితో) "లలితా! నిన్ను జగచ్చంద్రుని స్వాధీనము చేయుచున్నాను. ఆతఁడు నిన్నే యపాయములేక సురక్షితముగ నాగపురమునకుఁ జేర్పఁగలఁడు. ఇంకఁ బది దినములకు నిన్నుఁ గలిసికొందును."

జగచ్చంద్రుని కామె నప్పగించి యతఁడు వెడలిపోయెను.

జగచ్చంద్రుఁడు లలితఁచేయి బట్టుకొని చూడాధనుఁడున్న యెడకు వచ్చెను. అతని తోడనున్న, యా పురుషరూపము గని చూడాధనుఁడించుక వెరగందుచుండ జగచ్చంద్రుఁ డొకటి రెండు మాటలలో నాతని కెఱుకజెప్పి ప్రయాణమునకు వేగిరించెను.

* * * *

మార్గమధ్యమున నెట్టియాపదల నెదుర్కొనక జగచ్చంద్ర చూడా ధనులు లలితతో సత్యబాబు సౌధమును జేరఁగలిగిరి. భాగీరథీ దేవి లలితనెంతయు నాదరించెను.

భోజనానంతరము జగచ్చంద్రచూడాధను లిరువురు జగచ్చంద్రుని గదియందుఁ గూర్చుండిరి. అప్పుడు జగచ్చంద్రుఁడు శిథిలమందిరము కడఁ దనకానూతనుఁ డిచ్చిన కాగితముఁ దీసి యిట్లు చదువుకొనియెను.

"జగచ్చంద్రబాబు! ఈ దిన ముదయము జరిగినసభలో, నాలుగు సంవత్సరములకుఁ బూర్వము గజూలియా జట్టులో నుండినట్టి దామోదరుఁడను నాతఁడు మరల సంఘముఁ జేరినట్లు గజూలియా ప్రకటించెను. ఈ దామోదరుఁడు మణిపురమునుండి యిచ్చటికి వచ్చెను. మణిపురమున మీ యన్న మహేంద్రుని యిష్టమువిూఁద సురేశ బాబునింటఁ జౌర్యమునసలిపి, అచ్చటఁ దన్నుఁ బ్రతిఘటింపవచ్చిన భూపేంద్రబాబను నాతని హత్యగావించెనఁట. భూపేంద్రుని దారుణ మరణమునకై యాతని చెలియలగు మహేంద్రునిభార్య సరోజని యనునామె యాత్మహత్య గావించుకొనియెనఁట.

సురేశబాబు నింట నారువేల రూప్యములు నగదుగను, ముప్పది నలువదివేల పత్రములును ముచ్చిలింపఁబడినవఁట. ధనమును మాత్రము దామోదరుఁడు తీసికొని పత్రముల నన్నిఁటిని మహేంద్రున కొసంగె నఁట. ఆ పత్రములందు మహేంద్రుఁడే సురేశునకు బాకీయున్న యారువేల విలువగల పత్రమొకటి యున్నదఁట. దానికొఱకే యీ చౌర్యము, హత్యయుఁగూడ జరిగినట్లున్నది."

పై విషయముల జదివినపుడు జగచ్చంద్రుని మానసము చలించి పోయినది. బిట్టుగ సంతాపించినది. అపు డతని కెన్నెని యాలోచనలు గలుగఁజొచ్చెను. కొంతవడికి వాని నడంచి జగచ్చంద్రుఁడు చూడా ధనునితోడ "చూడాధనా! రేపు మణిపురమునకుఁ బోవ నిశ్చయించి

తిని. అచట సురేశబాబుగారు పెద్దకష్టములోఁ జిక్కియున్నారఁట. అంతకంటె దుఃఖకరమైన విషయమొండు జరిగినది! నీకొకనాఁడు నా కలకత్తా నివాసముఁగూర్చి తెలుపునపుడు భూపేంద్రుఁడను నతని గుఱించి కొంతచెప్పి యున్నాఁడను. ఆతఁడు నాలుగు దినముల క్రింద హత్యగావింపఁ బడియెనని తెలియుచున్నది.

చూడా — జగచ్చంద్రా! ఏమి? మహేంద్రబాబు బావమఱఁది హత్యగావింపఁబడియెనా? ఎచ్చట?

జగ — మణిపురమందు. సురేశబాబు గృహంబున.

"హంతకుఁడెవ్వరైనదియుఁ దెలిసినదా? ఆకాగితమేమిటి? జాబా?"

"ఇది జాబుగాదు! ఇంతకుముందు లలితను దోడ్కొనివచ్చిన యాతఁడు కొన్నివిషయములు నాతోడఁదెలుపనెంచి వ్యవధిలేనం దునఁ గాగితముపై వ్రాసి తెచ్చి యిచ్చినాఁడు. హంతకుఁడు గగూలియా జట్టులోనివాఁడఁట! మహేంద్రుని ప్రోత్సాహముమీఁదఁ జేసెనఁట."

చూడా — ఏమి! మహేంద్రుఁడా హత్య చేయించినవాఁడు? తన బావమఱఁదినే! ఎంతఘోరము! మహేంద్రునకును నీ గగూలియా జట్టువానికిని గల సంబంధ మెట్టిది?

జగ — అదియే నేనిప్పుడు గనుఁగొనవలసిన విషయము. సంబంధ మున్నను నుండవచ్చును! లేకున్నను లేకుండవచ్చును! ధనమునకై హత్యచేయువారికి ధనమిచ్చి హత్యచేయించువారికి నేలాటి సంబంధము లేకున్న మాత్ర మేమి?

చూడా — జగచ్చంద్రా! ఇపుడరిగినట్టులే మనమిరువురము పోవుదము మణిపురికి? ఏమందువు?

జగ — నీయిష్టము. మహేంద్రునిభార్య సరోజని యన్న చావు విని యాత్మహత్యగావించుకొనియెనఁట. ఇది యన్నిటికన్నను వింతగ

నున్నది. ఆమె యాత్మహత్యగావించుకొనుట కింకను బ్రబలకారణ మేదైన నుండవలయును.

చూడా — సరోజిని యాత్మహత్య గావించుకొనెనా! ఎంత దారుణముగనున్న దీయుదంతము! ఒకవేళ మహేంద్రుడే తన యన్నను జంపించెనని తెలిసి యాదుఃఖముసహింప నట్లుచేసినదేమో!

జగ — ఏమో!

౨౯

రక్షక భటోద్యోగు లెంతకాలము ప్రయత్నించినను మహేంద్రుని హత్యగావించినవానినిగాని, అపహరింపఁబడిన సురేశుని సొత్తునుగాని కనుఁగొనఁజాలకపోయిరి. వారు తుదకు విసిగి తమప్రయత్న ఫలితమును అధికారరీత్యా సురేశునికి వ్రాసిపంపి తమ బాధ్యతను దీర్చుకొనిరి.

ఇప్పుడిప్పుడే అందఁజేయబడిన పోలీసువారి కాగితములనే యవలోకించుచు సురేశుఁడు తనయింటఁ గచేరీచావడియందు గూర్చుండి దీర్ఘనిశ్వాసములు విడుచుచున్నాఁడు. పాపము, ఒకటిరెండుగాదు ఏబది వేల అప్పుపత్రములే హరింపఁబడినవి. పత్రములు చేతఁబట్టుకొని పలుసార్లు నిర్బంధపూర్వకముగ నడిగినప్పుడే వాయిదాలువేయు బాకీదారుల నుండి యింతసొమ్ము వసూలగుట యెట్లు? సురేశుని కిదియెంతదెబ్బ!

సురేశుఁ డుద్విగ్నచిత్తముతో నట్లు కూర్చుండియుండగనే సేవకుఁ డొకఁడువచ్చి, మహేంద్రునియాగమనము నెఱిఁగించెను. సురేశుఁ డతనిని బ్రవేశపెట్ట నాజ్ఞయిడెను.

అంత మహేంద్రుఁడు లోనికివచ్చి సురేశునకు వందనముచేసి, యాతని యనుమతి లేకుండగనే యొకకుర్చీలోఁ గూరుచుండెను. సురేశుఁ డెట్లుమాఱిపోయినదియు మహేంద్రుఁడు గమనించినాఁడు.

అంను కతనికి నవ్వువచ్చినది. కాని దాని నడంచుకొని "సురేశబాబు గారు! మీ కీయవలసిన పైకము తెచ్చితిని. ఏదీ? పత్రముదెచ్చి చెల్లు వ్రాయుఁడు!" అనుచు వెంటఁదెసికొనివచ్చిన మూట విప్పఁదొడఁగెను.

సురేశుఁడు ఖిన్నవదనముతో "మహేంద్రా! నాఁడు పోయిన పత్రములలో నీపత్రముగూడ నున్నది. నీ మొత్తమునకు రసీదువ్రాసి యిచ్చెదను పైకము చెల్లింపుము. మరల పత్రములభించిన నీఁడ నీకిచ్చి వైచెదను" అనియెను.

మహేం— అట్లువీలుగాదు! పత్రములేకుండ పైకమిచ్చు టపాయకరము.

సురే — నాయెడఁగూడ నీవట్లు తలంతువా?

మహేం — మీ కేయేమి? ఎవ్వరైనను నంతియే. పైకమును జూచిన నెవరికాశజనింపదు? పత్రములేకున్న నదివచ్చినప్పుడే యిచ్చెదను లెండు.

సురే — అట్టులేకానిమ్ము. నాయెడ నమ్మకమున్న నిమ్మంటిని గాని నిన్ను బలవంతపఱచితినా?

మహేం — బలవంతపఱచిన నిచ్చువాఁడెవఁడు?

అనుచు నొక్కనవ్వునవ్వి యటనుండి వెడలిపోఁబోవుచు గది ద్వారము డాయగనే ద్వారముఁదెఱచుకొని యెదుట జగచ్చంద్రుఁడు ప్రత్యక్షమయ్యెను. మహేంద్రుఁడు రెండడుగులు లోనికివైచి నిలువఁబడెను. జగచ్చంద్రుఁడు ద్వారముకడనే నిలిచి, నిశ్చలముగ మహేంద్రునిఁ జూడఁదొడఁగెను. మహేంద్రున కేమియుఁదోఁచలేదు, కాని యంతలోనే ధైర్యముచిక్కఁబట్టి యిట్లనియెను.

"మార్గమున లెమ్ము; నేను బోవలయును."

జగ — ఎచ్చటికి?

మహేం — నే నెచ్చటికిఁ బోవునదియు నీకుఁ దెలుపవలసిన యవసరమేమియు లేదు. మార్గము వదలుము.

జగ — మహేంద్రా! ఇంకను నాయనా! పలాయనము సేయుంటివా? ముందు నేఁ జెప్పినవిధమునఁజేసి యావల నిటనుండి కదలుము.

జగచ్చంద్రుఁ డిట్లనుచు గదితలుపు పదిలముగ మూసి, [illegible]ముతో జోబీనుండి పిస్తోలు వెలికిఁదీసి, మహేంద్రునిపై గురిపెట్టి తీక్ష్ణస్వరముతో "ఆకుర్చీపైఁ గూర్చుండుము" అనియెను.

సురేశుఁడు నిద్రనుండి మేల్కాంచినవాఁడై జగచ్చంద్రమహేంద్రులమధ్య జరుగుచున్న సంభాషణము విని లేచి జగచ్చంద్రునితోడ "జగచ్చంద్రా! నాయింట నింకొకహత్య జరుగుచున్నదియా యేమి? అందులకు నే నంగీకరింపను. మహేంద్రుని తప్పేమియును లేదు. నా వద్దఁ బత్రములేనందున నీతఁడు పైక మిప్పింపఁజాలఁడయ్యెను. అంతియే కదా! పత్రముదొరికిన పైకమిచ్చుటకిపోవునా? ఆపిస్తోలును దీయుము" అనియెను.

జగచ్చంద్రుఁడు మహేంద్రునిపైనుండి చూపునుమరల్పకయే "బాబుగారు! మీకు విషయమంతయుఁ బూర్ణముగఁ దెలియదు. ప్రస్తుత మూరకుండుఁడు" అని మహేంద్రునితో — సురేశుని వాక్యముపైఁ దప్పించుకొని పోఁబ్రయత్నించుచున్న మహేంద్రునితో "హుష్! ఆకుర్చీపైఁ గూర్చుండుము" అనియెను.

మహేంద్రునికి గత్యంతరమేమియుఁ గనఁబడలేదు. నిదానముగ నాతఁడరిగి కుర్చీపైఁగూర్చుండెను. జగచ్చంద్రుఁడు తలుపు లోనికి గడియవైచి, సురేశబాబు నచటనుండఁగోరి మహేంద్రునిడాసెను. ఆతని చేతియందింకను బిస్తోలున్నది.

"మహేంద్రా! నన్ను మోసగించి, నేనూరలేని కాలమున ఆస్తి నంతయు నీస్వాధీనమగునట్లు చేసికొనసంకల్పించినను నేనింత చింతింపలేదు. మనవంశమున కాదినుండియుఁ జాలసహాయము చేసిన సురేశబాబుగారికా నీవు ద్రోహము దలంచుట! ఇప్పుడు నాకుఁదెలిసి

యున్న విషయములఁబట్టి నిన్నేమిచేయఁగూడదు? దామోదరుఁడను నీచునిచేత సురేశబాబుగారియింట దొంగతనము చేయింప సాహసించితి వని వినియున్నాఁడు, సురేశబాబుగారి కందువలనఁ గలిగిన నష్టమును గూర్చి వినియున్నాను, నేనొకటి నిశ్చయించితిని! నిన్ను విడువఁగూడదని; నీయకార్యములన్నియు బట్టబయలు చేయవలయునని; నిన్నుఁ దగురీతి శిక్షితుని జేయవలయునని. తెలిసికొంటివా? ఎచ్చటనున్నవి సురేశ బాబుగారికి నీవీయవలసిన యారువేలరూప్యములు? తీసి బల్లపై నుంచుము. శీఘ్రముగ-ఇంకను జాలపనులున్నవి. ”

మహేంద్రుఁడు కంపితహస్తములతో జోబీనుండి యొకసంచితీసి బల్లపైనుంచెను. అంతటితోఁ దనగండము తప్పినదని యచటనుండి లేచి పోఁబోయెను. కాని జగచ్చంద్రుని సూక్ష్మవీక్షణముగాని, యాతని చేతనున్న భయంకరాగ్నికృపాణముఖముగాని మహేంద్రుని అట నుండి యంతసులభముగఁ బోవనిచ్చునట్లు లేదు. సగములేచిజగచ్చం ద్రునివైపుఁ జూచెను. జగచ్చంద్రుని వాలకమేమియు మాఱలేదు. లేచుటకు ధైర్యముచాలక మరలఁ గూలఁబడెను.

జగ — సురేశబాబుగారు! ఆసంచిలోని ధనము మీకీతనివలన రావలసిన మొత్తమునకు సరిగనున్నదో లేదో చూడుఁడు.

సురేశుఁడాసంచిఁదీసికొని అందలినోట్లను రొక్కమును లెక్కించి సరిగానున్నట్లుచెప్పెను.

జగ — (మందహాసముతో) మహేంద్రా! సురేశబాబింటఁ జోరీ పోయిన పత్రము లెచ్చటదాఁచి యున్నావు? బహుశః అవి యిపుడు నీవద్దనేయున్నవని యెంచుచున్నాను. పైకమిచ్చు నెపమున వాని నిచ్చట జారవిడిచి పోవలెనని గదా? నీవు వచ్చితివి?... వెలికిఁదీయుమా కాగితములను. నీవు వ్రాసియిచ్చిన ధానితో నింక సురేశున కేయుపయోగమును లేదు. అదియునుగాక నీవు దాని నిచ్చటికిఁ దెచ్చి

యుండవు. తక్కినవానికొఁడ నీకు నేయుపయోగమును లేదు. వాని నిచ్చట వదలిపోయిన మంచిది. తీయు మాకాగితముల కట్టను.

మహేంద్రుఁ డీమాటల వినినంతనే భయముఁ జెందినవానివలె నొక్కించుక వివర్ణుఁడయ్యెనుగాని, యంతలో నాత్మైకల్యము సవరించుకొని, ధైర్యము చిక్కఁబట్టి "పత్రములు నావద్ద నెచ్చటనున్నవి? పత్రములను నేను హరించితినని చెప్పుటకును, తప్పించు వానిని వెదకుటకును నీ వెవ్వఁడవు?" అనియెను.

జగ — మహేంద్రా! పత్రములు నీయొద్దనున్నవని దామోదరుఁడు చెప్పినాఁడు. వానిని నీ వపహరించితివని నేను నొక్కి చెప్పుచున్నాను. అట్లు చెప్పుటకు జగచ్చంద్రనామమునఁ బాత్రుఁడను జగత్సింహనామమున నాకు అధికారముగలదు. — మహేంద్రుఁడు దామోదర జగత్సింహుల పేరుల వినినంతటనే మాఱింతభయము జెందెను. ఆ భయమున నాతనికిఁ దెలియకయే వాని కుడిచేయి లోనిచొక్కాజేబులోనికిఁ బోయినది. మెల్లఁగ నొకకట్టకాగితములఁదీసి బల్లపై నుంచినాఁడు.

జగ — మహేంద్రా! ఇఁక నీవు పోవచ్చును.

మహేంద్రుఁ డంతియే చాలునని గండము గడచినట్లుగా ముట బడినాఁడు.

మహేంద్రుని నిర్గమనానంతరమున సురేశుఁ డొక్కయుదుటున వచ్చి జగచ్చంద్రుని కౌఁగిలించుకొనినాఁడు. అతని యానందమున కపుడు మేరయే లేదు. కౌఁగిటయందున్న బిడ్డనువలె జగచ్చంద్రుని దట్టుచు నతఁడు — "బాబు! జగచ్చంద్రా! రక్షింపబడితిని. ఆహా! ఎంతటివాఁడీ మహేంద్రుఁడు! హత్యకును, చౌర్యమునకును ఈతఁడే కారకుఁడుగా! — సెబాస్! నాఁడు నీపూర్ణసామర్థ్యము నెఱుఁగజాలక నాగపర్వతములకుఁ బోవలదంటిని. ఇపుడు నీసామర్థ్యమే సన్నద్ధరించినది. నిన్నేమని కొనియాడఁగలను?..." అనుచుండ, జగచ్చంద్రుఁ

డాతని యభినందనముల కడ్డుదగిలి యిట్లనెను.

"కాబుగారు! ఆమాటలిప్పు డవసరములేదు. నేను మంచిమిత్రుఁడు హా_ర్తమునకు బయలుదేరుటవలననే నాసంకల్పము వాకిట నడుగుపెట్టియు పెట్టకముందే నెఱవేఱినది — ప్రస్తుతము నావెంట ఆనందుని తనయయగు లలితను తీసికొనివచ్చితిని. నేనువెంటనే మరల నాగపురమునకు కేగవలసి యున్నది. నేను మరిగివచ్చునంతకు మీ రామెను గాపాడుచుండ వలెను" అనియెను.

సురే — అట్టులే కానిమ్ము. మరల నీ వెప్పుడు వచ్చెదవు?

జగ — సరిగా చెప్పలేను — కాని నాగేంద్రుని నొకపరి నేనుజూడ వలసియున్నది. ఎట్లు? — బదరిపురమున కతఁడేగిన కార్యమెంతవఱకు సఫలమైనదియు మీ రెఱుఁగుదురా?

సురే — విశదముగ నెఱుఁగను గాని, యిటీవలనే తాను పోయిన పనియయినదని మాత్రము వాఁడుచెప్పి పిచ్చివానిని గూర్చి యడిగి నాఁడు. పిచ్చివాఁడొక వారమునుండి మణిపురమునఁ గన్పించుటలేదు. పిచ్చివాని యవసరము చాలగలదని నాగేంద్రుఁడు చెప్పినాఁడు. బహుశః వాఁడి యన్వేషణమునకై యే గ్రామాంతరము పోయియుండు ననుకొందును.

జగ — పిచ్చివానిని గూర్చి వాఁడడిగెనా? సరియే నాయూహ కన్యథాకాదు.

అనుచు నతఁ డాలోచనాధీనమనస్కుఁడయ్యెను.

30

సురేశబాబునింటనుండి మహేంద్రుఁడు చావుదప్పి కన్నులొట్టవోయిన దనువిధమున బయటఁబడి పలువిధములైన కలంతలతో ప్రబలమగు గాలికూగాడు నెండుటాకువలెఁ జలించుచున్న మనస్సును మిపుల ప్రయ

త్నముతో నాపుకొనుచు నింటికిఁబోయిచేరెను. అతనితల వేయి వ్రక్కలగుచున్నట్లుండెను. అన్నివైపులనుండియు నతనిదెసకే గండశిలలు గుఱిచూచి కొట్టఁబడుచున్నట్లు, అతనితాకి తల సహస్రచ్ఛిన్నముగా నున్నట్లు నాతనికిఁ దోఁచెను.

వేగముగా నాతఁడు తనగదికిఁబోయి యొకకుర్చీలోఁ గూలఁబడియెను. రెండుచేతులతోఁ దలనుబట్టుకొనియెను.

"అక్కటా! చేతనున్న యాఱువేలుపైకమునుబోయినది. చేఁ జిక్కియుండిన సురేశుని పత్రములునుబోయినవి, ఈజగచ్చంద్రునకివి యన్నియు నెట్లు తెలిసెను? పైకము నావద్దనుండుటాతఁడూహించి నన్లు పత్రములను గూడ నెట్లూహించియుండును?...ఓరీ! దామోదరా! ద్రోహీ! నాయన్నముదిని నాకు ద్రోహముఁదలంతువా? ఈవిషయములన్నియు జగచ్చంద్రునకుఁ దెలుపుదువా?...... ఈతఁడేనా జగత్సింహుఁడు! ఆతఁడు నన్ను గుర్తించియుండునా! ఏమో! అబ్బా! అన్నియు నింతవఱకు నాకు సౌఖ్యముగూర్చఁదగిన వన్నియు నాకు విరోధముగఁ బరిణమించుచున్నవే!...

"ఇప్పుడీవిపత్తునుండి యెట్లు తప్పించుకొనుట? దామోదరుఁ డన్నివిషయములు బహిరంగముచేసివైచియుండునా? ఆరహస్యమును గూడనా? ఏమో!......ఏమియును దోఁపకున్నది! ఆరహస్యమే తెలిసిన నింక నేను జీవించుట యెక్కడిది?......ఆరహస్యము జగచ్చంద్రుఁ డెఱుంగఁడు! ఎఱింగియేయున్న సురేశునింటనే నాకుఁ గాలమాసన్న మయియుండదా? అదియొకమేలే!......ఈచిచ్చు రేగుటకుముందే పనిప్రారంభించవలయును."

మహేంద్రుని యాలోచనయింకను బూర్తికాలేదు. ఇంతలో నాతని గదితలుపు తెరువఁబడినది. ద్వారమువద్ద నాపాదమస్తకమును వినీలాంబరమును ధరించిన యొకఁడు నిలువఁబడియుండెను. ఆద్వారము

నకు సరిపోవునంతపొడగరి యాతఁడు. ఆతని వైఖరి భయంకరముగ నుండెను. అంతకన్న నాతనిఁగూర్చి యెక్కువఁగ వర్ణింపవీలుగానట్లు వేషమునం దాతని యంగికములు మగ్నములయియుండెను. కాని మహేంద్రుఁడాతనిని గుర్తించినాఁడు. ఆతఁడు వచ్చియుండు కార్యము నూహించి వాఁడు భయవిహ్వలుఁడైనాఁడు.

ఆశ్యామలాంబరవ్యక్తి యొకజాబును మహేంద్రునిముందుబడవైచి యచ్చటనుండి వెడలిపోయినాఁడు. మహేంద్రుఁడు మెల్లగ లేచి యాచీటిని దీసికొని చదివినాఁడు.

"మహేంద్రా!

పదిదినములక్రింద దామోదరుఁడు మాపద్దకువచ్చి నిన్నుగూర్చి యనేకవిషయములు తెలిపియున్నాఁడు. అవన్నియు నిజములనియే మేమును దెలిసికొనినాము. ప్రాణములకంటె నెక్కువగా నీవెంచుచున్న రహస్యమును వెలువఱచి నీకుఁజెట్టఁజేయుట నీకసమ్మతమైనచో నీజాబు నీకందిన నైదుదినములలో శిథిలమందిరమున నీవు మమ్ముఁ గలిసికొనవలయును. తప్పఁగూడదు! నీరాకపైననే నీప్రాణము, మానము, ధనము, నాధారపడియున్నవి. ఈయాజ్ఞ నుల్లంఘింపకుము. ఈజాబు నీకిచ్చువాఁడు మరల నొకగంటకు నీవద్దకువచ్చును. నీయభిప్రాయము నొకచీటి వ్రాసి యాతనిచేతి కంపుము. నీకు లభించిన యాస్తిలో సగపాలు మాస్వాధీనముచేయవలసియున్నది. అందులకుఁ దగిన పరికరములతో రమ్ము.

సంఘస్థులు యజమానియాజ్ఞకు వ్యతిరేకించినచో నందఁగల కష్టములు నీకుఁ దెలిసియేయున్నవి కాన వివరింపఁబనిలేదు.

ఇట్లు

గగూలియా"

'గగూలియా! — ఓరీ, దామోదరా! అనర్థానిలయ నన్నిట్లుఁ జేసితివిరా!'

ఇంతకన్న నధికముగ నేమియు నాతని నోటినుండి వెల్వడలేదు. అకస్మికముగఁ దలపైఁ బిడుగు తాకినట్లయ్యెను. "ఇంత కష్టమనుభవించి సుఖపడనున్న నన్నింకను కష్టపిశాచము వెన్నాడుచునేయున్నదా? అక్కటా! ఈ దామోదరుని చేతిలోఁ జిక్కుటేల? వాని సహాయమున నీ భయంకరకార్యమేల చేయించితిని? ఇప్పుడా కృతఘ్నుని మూలమున గగూలియా చేతిలోఁ బడితినే! ఆ ఘోరరాక్షసుఁడు నన్నేమి చేయునో! ఆ స్త్రీయందు నగ మాయవలయునా జన్మమునకు? ఎన్నటికో సంబంధము విడిచిపోయిన యూసంఘులాభమునకు నే నేలపాటుపడవలయును?......గగూలియా! — గగూలియా భయంకరదానవుఁడు!"

గగూలియా నిజముగ భయంకరుఁడే! ఇంతవఱకు నాతనిఁ జూచుట తటస్థించినవా రెవ్వరునులేరు. అట్లు చూచుట తటస్థించినవా రొకరిద్దరుండినను మరల వారు జీవించి వచ్చినఁగదా యాతని స్థితిగతుల నితరులకుఁ దెలుపుటకు? అట్లు లాతఁ డెవ్వరికిఁ దెలియకున్నను నాతని విషయమే యెవ్వరు నెఱుగకున్నను నాతని పేరు ఆప్రాంతమం దెల్ల నెంత భయము నించుచున్నది?

ఆకస్మికముగ నొకనితలపైఁ బెనుశిల యొకటిపడఁ గ్రిందఁ గూలునప్పు డాతని మానస మెట్లుండునో — నిర్జనారణ్యమధ్యమునఁ బ్రయాణము చేయుచుఁ గాలసర్పముచేఁ గఱువఁబడి పాపమనువారు లేక ప్రాణముల వాయనుండు నా నిర్భాగ్యపాంథుని మనంబెట్టులుండునో — ఎట్టి యావేదనకు లోనగునో మహేంద్రునిబుద్ధి యిప్పు డట్లుండెను. అట్టి యావేదనకు లోనయియుండెను. గగూలియా! నీపేరునం దెంతప్రభావము, ఎంతదారుణశక్తి, ఎంతభయము మిళితమయి యున్నది?

మహేంద్రుఁడట్లు వేదనబడుటలోనే ప్రత్యుత్తరమునకు గడువు

మారిపోవుచున్నది. అప్పుడే నలుబదియైదు నిముసములు గడచినవి. ఇంక బదునైదు నిమేషములే యుండును వ్యవధి. ఇంతవరకు మహేంద్రుడు గగూలియా నావిఃర్ఘుర్ఘూవాతమునం దొకదళమాత్రమయి యల్లాడుచున్న మనముతో మాటలాడుటకు సైతము శక్తిలేనంత భీతితో నట్టులే కూర్చుండియుండెను. కాని ఆతని చూపు అగదియం దున్న పెద్దగడియారముమీదనే యుండెను. గంటగుర్తించినాడు. వ్యవధి గనుగొనినాడు. ఇకనేదో నొకప్రత్యుత్తర మీయకతప్పదు.

“ఇప్పుడు ప్రత్యుత్తరమేమని వ్రాయుదును? వచ్చుచున్నాననియా, రాననియా? రాననియో వ్రాసియిచ్చిన నీరాత్రివఱకైన నేను జీవించి యుందునా? ఆతడు నన్నేమిచేయగలడో చూచెదను... చూచునది యేమున్నది: ఆతడు ప్రతిజ్ఞ నెఱవేర్చుకొనితీరును...... పిమ్మట నెట్లయినను వచ్చెదననియే వ్రాసి పంపెదను. శిథిలమందిరప్రాంతము నకా? అతిమంచి స్థలమే ...”

అని నిశ్చయించుకొని — మహేంద్రుడు — జాబు వ్రాసెను.

౩౮

కంకణపునరుద్ధరణమునకై తుదకు గగూలియా సహాయమునే యర్థింప నిశ్చయించుకొనిన కేశవుడు చోరనాయకుని యాజ్ఞాపత్రముచేరిన మఱునాడే యతనిదర్శనమునకు బ్రయాణమయ్యెను. కృష్ణపక్షపు కారుచీకటులు భూమినంతయు దట్టముగ వ్యాపించియున్ననాటి నిశీథిని నిర్ణీతసమయమునకే కీచకాటవియందుగల శిథిలమందిర ప్రాంతమునకరుదెంచెను. అతడట నొకఘడియ వేచియుండునంతలో, నొక వినీలాంబరధారి యతనికి బ్రత్యక్షమై “నీవేనా కేశవచందువు?” అనియడిగెను.

కేశవుడొకింత రిచ్చవడి, “అవును, నేనే” యనెను.

అపుడావ్యక్తి, "అయిన నన్ననుసరించుము. నిన్నుఁ దనచెంతకుఁ దోడ్తెమ్మని గగూలియాయాజ్ఞ." అనుచు శిథిలమందిరమునైపు నడవ సాగెను. కేశవుఁడు నాతని వెన్నంటెను. ఇరువురు నామందిరమునుచేరి నంత ఆవ్యక్తి గగూలియాయాజ్ఞప్రకారము కేశవునికన్నులకిచట గంతలు కట్టవలసిన యవసరముఁదెలిపెను. కేశవుఁడందులకంగీకరింపకచేయునది లేదు. అపు డావ్యక్తి యొక వస్త్రముతో వాని కన్నులపైఁ గట్టుగట్టి చేయిపట్టుకొని నడపింపనాగెను. వారిరువురు శిథిలమందిరముఖద్వారము కడకు వచ్చిన పిమ్మట నావ్యక్తి యచట గోడయందొక వో దేనినో నొక్కెను. తోడనే గోడకు దాపున క్రిందుగా నొకద్వారము లోనికిఁ దెఱచికొనియెను. కేశవునికి జాగ్రత్తచెప్పి వానితోఁ గూడ నందతఁడు ప్రవేశించి మెట్లద్వారా క్రిందికిదిగెను. అనంతర మిరువురు సొరంగమువలె నున్న సమమైన మార్గముగుండా నడవఁ బ్రారంభించిరి. కొంతవఱకు పడమరగ, మఱికొంతవరకు దక్షిణముగ నందు సుమారొక పావుగంటకాలము నడచిన పిదప మరల పైకున్న మెట్లు తగిలినవి. వానిని గడచి మఱొక ద్వారముద్వారా బయటకువచ్చిన యనంతర మచట కేశవుని గంతలు విప్పబడెను. కాని యతఁ డుత్కంఠతతో నటుఁజూడగా గోడకు మించి మఱేమియుఁ గాన్పించక పోయినది.

అంత వారిరువురును ముందుకు నడువఁజొచ్చిరి. కేశవుని చూపు ముందునకు నాగినది. దూరమున నపుడు కొన్ని దీపములు దృగ్గోచరము లయినవి. మఱిపదునైదునిముసములు నడచి యాదీపకాంతుల నిచ్చుచున్నట్టి నలువది యేఁబది గుడారములున్న ప్రదేశమును జేరఁ గలిగిరి. వా రనేకగుడారములను గడచి వానిమధ్యగానున్న యొక పెద్ద గుడారమును డాసిరి. అపుడు కేశవుని వెంటనున్న వ్యక్తి కేశవు నాగుడారపు ద్వారముఖముననున్న కావలివాని కప్పగించి యేమియో

నన్నుఁబిలిచెనని చెప్పెను. ద్వారపాలకుఁడు తలపంకించుచు నొకపరి లోపలి కేగి వచ్చి కేశవుని నగారములోఁ బ్రవేశపెట్టెను.

ఆగుడారపునేలపై మెత్తని కంబళములు పరువఁబడియుండెను. లోపలిభాగమంతయు ననేకవిధములగు వస్త్రాలంకారముతో భాసిలుచుండెను. ద్వారమునకునెదురుగ లోపల, గుడారమునకు మధ్యమందున్న యున్నతాసనముపై నొకభీకరాకారి కూర్చుండియుండెను. అతఁడెవరు? — గగూలియాయే! కేశవుని వీక్షణము లాతనిపై రెండుమూఁడుక్షణములకుఁబైన నిలువఁజాలకపోయినవి. అంతట గగూలియా నోరుమెదల్పక తన యాసనమునకుఁ బ్రక్కఁగల వేఱొక యాసనముపైఁ గేశవునిఁ గూర్చుండ సైగచేసెను. కేశవుఁ డొక్కింత గొంకుచున్న నడకతో గుర్చీని డాసెను. మెల్లగ నందుఁగూర్చుండెను.

రెండుసమునసములకాలము గగూలియా కేశవుని జూచి యిట్లు సంభాషణము నుపక్రమించెను.

గగూ — కేశవచందు! నీవిచ్చటికి రావింపఁబడిన కారణము నీకుఁ దెలిసియేయున్నది; మరల నేనడుగుట యనవసరము. నీవద్దనుండిన విచిత్రకంకణ విషయమును నాకుఁ దేట తెల్లముగఁ జెప్పవలయును.”

కేశ — తొలుత మీరు నాకొక వాగ్దానముచేసిన యెడల నాకంకణ విషయము పూర్తిగ మీకుఁదెలుపుటకు సిద్ధముగనున్నాను.”

గగూ — ఆ వాగ్దానము?

కేశ — నావద్దనుండి యపహరింపఁబడిన యాకంకణమును మఱలఁ గైకొనుటకుఁ దగిన సహాయము చేయుదుమను వాగ్దానమే.

గగూ — నీవద్దనుండి కంకణ మపహరింపఁబడినదా?

కేశ — అవును; జగచ్చంద్రుఁడను దుర్మార్గునిచేత. అతఁడు నాగపురియందున్నాఁడు. వానివద్దనుండి యాయమూల్యకంకణమును బలవంతముగఁ దీసుకొనవలయును.

గగూ — అతఁ డొకములకుఁ దీసికొనినాఁడు దానిని ?

కేశ — ఆ కంకణ మూలముచే నొక గొప్ప ధనరాశి లభించును. ఆనిధియంతయు హరించుటకు.

గగూ — నే నేసంబంధనలమీఁద నీకు సహాయము చేయవలయును? నీయిష్టము ?

కేశ — నా కాకంకణ మెవరిసహాయమున మరల లభించినను, వారి కాధనసిధియం దర్ధభాగ మిచ్చెదను.

గగూ — ఆయొప్పందముమీఁద సహాయముచేయుటకు నేను సిద్ధముగ నున్నాఁడను. తొలుత నాకంకణ విషయమైన రహస్య మంతయు నాకుఁ దెలుపవలయును. తెలిపినఁగాని సహాయముచేయుటకు నే నంగీకరింపను.

కేశ — ఆ కంకణ విషయమగు రహస్యమును తెలుపుటయందు మీ కేలాభమును లేదు. దానిమూలమున లక్షలకొలఁది ధనము మీకు లాభింపనుండ, దానికి సంబంధించిన రహస్యము మీకుఁ దెలియకున్న మాత్రమేమి ?

గగూ — అట్లు వీలుగాదు. కంకణరహస్య మంతయు నాకుఁ దెలిపిననే నీప్రాణములు నీకు దక్కుట. నిధియందు సగపాలు లభించుట. లేకున్న రెండును హుళిక్కియే! జగచ్చంద్రునివద్దనుండి కంకణము, నీవద్దనుండి దానిరహస్యమును రెండును రాఁబట్టఁగలను :

కేశ — ఇప్పు డంతదూరము మీరు కోపింప నవసరములేదు. ఆ విషయము మీకుఁ దెలుపుటవలన లాభ మేమియు లేదంటినికాని, తెలుప నవలేదు......సావధానులై వినుఁడు.

అని కేశవుఁడు కంకణరహస్యము నామూలాగ్రముగాఁ జెప్పివైచెను.

జగచ్చంద్ర చూడాఘపులు మణిపురమునకుఁ బోయి నాలుగుదినము లయ్యెను. ఆనాఁడు భాగీరథీదేవికిఁ జాల జబ్బుచేసినది. వార్ధక్యము చేతఁ దొలుతనే బలహీనమైయున్న యామెకు జ్వరమువచ్చి, సాయంతనములోనే మిగులఁ దీక్ష్ణమయినది.

అక్షయుఁ డామెవిషయమై చాల చింతించి సంస్థానవైద్యులఁ బిలిపించెను. వైద్యుఁడువచ్చి రోగిని జూచెను. చాల విషమస్థితిలోనున్న యామె నుద్ధరించుట కష్టమని యతఁడు గ్రహించి యావిషయమును అక్షయునికిఁ దెల్పెను. అయినను భయపడవలసిన యవసరము లేదనుచు నతఁడు తనతోడఁ దెచ్చిన సంచినుండి యొక యౌషధముఁదీసి యక్షయుని కిచ్చి దానినిఁ దేనెయందుఁ జాది యామెచేత భుజింపఁజేయ నియోగించెను. మరల నుదయము వచ్చిచూచెదనని వైద్యుఁడు వెడలిపోయెను.

అక్షయుఁడు మిగుల శ్రద్ధతో నాయౌషధము నొక సానపై దేనెతో నరుగఁదీయుచుండెను. అప్పు డొకభటుఁ డచ్చటికి వచ్చి "ప్రభూ! ఎవరో తమకొఱకు వచ్చియున్నారు" అని తెలిపెను. అక్షయుఁ డాభటుని మందుసిద్ధముచేయ నియోగించి యానూత్నాగతుని జూడఁబోయెను.

ఆ నూత్నాగతుఁడు చావడియందుఁ గూర్చుండియుండెను. అక్షయుఁ డాయెడకు రాగానే లేచి నిలువఁబడి నమస్కరించెను. అక్షయుఁడు ప్రతినమస్కారముచేసి యిట్లనియెను.

"అయ్యా! మీ రెవ్వరు? నాతో మీకుఁగల పనియేమి?"

ఆగం — నావిషయము మీకిప్పుడే బోధపడఁగలదు. జగచ్చంద్ర బాబెక్కడ?

అక్ష — మణిపురమునకుఁ బోయెను.

ఆగంతుఁ డామాటవిని తృప్తిపడినవానివలె నొక నిట్టూర్పు విడిచెను.

అక్ష — లోన మాబంధువునకుఁ జాల జబ్బుగనున్నది. నే నిప్పటికిఁ బోవలయును. తమరాకకుఁ గారణముఁ దెలుపుఁడు.

ఆగం — ఇప్పుడు మీకు నన్నుఁ దెలియఁజేసెదను. నాపేరు కేశవచంద్రుఁడు.

అక్షయుఁ డాపేరు విని రెండడుగులు వెనుకకు వైచెను.

కేశవచంద్రుఁడు మొగమునఁ జిఱునవ్వంకురింప "భయపడకుఁడీ! అక్షయ బాబుగారు! నేను కేశవచంద్రుఁడను. నాకు మీపైఁ గోపమేమియు లేకున్నను, నొకవిషయమునఁ జాల బాధపడుచున్నాను. ఆవిషయమును నేను దెలుపఁబనిలేదు. మనకు సంబంధముగూర్చిన జగచ్చంద్రుఁడు సమయమునకు లేనందునఁ జాల చింతగనున్నది. ఆవిషయము లిప్పుడేల? మీవద్ద నాకుఁ జెందవలసిన యయఃకంకణ మొకటి యున్నది. దానిని జగచ్చంద్రుఁ డొకనాఁడు బలిమినై సంపాదించుకొని వచ్చినాఁడు. ఇప్పుడు నేను దానికొఱకే వచ్చియున్నాను" అనియెను.

అక్షయుఁడు భయమున తనభటులఁ బిలువనెంచి యెలుంగెత్తెను గాని, యింతలోఁ గేశవుఁ డొకపిస్తోలుతో నక్షయుని వక్షమును దాఁకుచు —

"అక్షయబాబు! నోరు తెఱచితివేని, నీప్రాణములు దక్కవు. జాగ్రత్త" అనియెను. అక్షయున కేమియుఁ దోఁచలేదు. కేశవునుండి తప్పించుకొను టెట్లు? కంకణమును రక్షించుకొను టెట్లు? అక్షయుఁ డటునిటుఁజూచి, హఠాత్తుగా నెడమచేతితోఁ బిస్తోలు కేశవునిచేతి నుండి యెగిరి దూరమునఁబడునటులఁ గొట్టి, "దొంగలు! దొంగలు!" అని యెలుంగెత్తియఱచెను.

కేశవుఁ డొక్కదెబ్బతో నక్షయుని గ్రిందఁ బడఁగొట్టెను. కాని యాయఱపు నాపఁజాలకపోయెను. ఆయఱపు విన్న భటులు కొంద

అచ్చటికి వచ్చిరి. వారి రాకఁజూచి కేశవుఁడు మరలఁ బిస్తోలును దీసుకొనఁ జూచెను గాని, యిరువురు సేవకులు అక్షయుఁడు నేలపైఁ బడియుండుటను జూచి, యొక్కుమ్మడి కేశవునిపైఁబడిరి. కేశవుఁ డెంత బలవంతుఁడైనను నిరువురి ధాటి తాళఁగలఁడా? అందుచే నతఁడు వారల పట్టునుండి తప్పించుకొని, చావు తప్పి కన్ను లొట్టపోయినట్లు ఆగృహమునుండి పాఱిపోయెను.

అక్షయబాబు కొంతవడికి మెల్లనఁ గన్నులు తెఱచి నలువైపులఁ జూచెను. తన సేవకులుతప్ప గదియందెవ్వరునులేరు. లేచికూర్చుండి యాతఁడు తనభటులను "ఆదుర్మార్గుఁ డెక్కడ?" అని ప్రశ్నించెను.

"మగ ప్రహారణములతోఁ గాలికి బుద్ధిచెప్పినాఁడు" అని భటులు నవ్వుచుఁ బలికిరి.

భటుల నాకూటమునుండి వెడలిపోవ నాజ్ఞయిచ్చి యక్షయుఁడు తలుపుమూసి ప్రక్కనున్న యింకొకగదిలోనికిఁ బోయెను. అచ్చట నున్న యయఃపేటికనుండి కంకణమును వెలుపలికిఁ దీసెను. అది యపహరింపఁబడలేదు. దానిని జోక్కాయిజేబునందుదాఁచి, యక్షయుఁడు మరలఁ గూటములోనికి వచ్చెను.

అచటఁ గ్రిందఁబడియున్న తెల్లనివస్తువు దృష్టినాకర్షించినది. ఆతఁడు దాని దీసి చూచెను: అది నలిగిపోయిన యొకకాగితపుజుట్టు. దానిని విచ్చిచూడ నందిట్లు వ్రాయఁబడియుండెను.

"అక్షయబాబు! నాయనుజ్ఞపై నీవద్దనున్న విచిత్రకంకణము కొఱకు కేశవబాబు వచ్చును. ఆతనిచేత నాకంకణము నిచ్చివేయుము; నీప్రాణముల కేయపాయమును గలిగింపను. లేనియెడ ధననిధితోఁ గూడ నీప్రాణములుగూడ హరించెదను. జాగ్రత్త! నాయనుజ్ఞ నెఱవేర్పఁ ద్వరపడుము.

గగూలియా."

అక్షయుఁడు భయభ్రాంతుఁడై యాకాగితమును వణకుచున్న చేతులతో నదిమిపట్టెను. కంకణరహస్యము గఘూలియాకుఁ గూడఁ దెలిసినదా! ఇఁక దానిని రక్షించుటెట్లు, దానినెచ్చట దాఁచిన నా ముష్కరుని కంటఁబడకుండును? తన భవనమునందున్న, మందసములను, పయఃపేటికలను, రహస్యస్థానములను, గోడలందు, నిర్మింపఁబడియున్న మందసములను నొక్కొక్కటిగ నక్షయుఁడు స్మరించుకొనెను. ఒక్కటియు రక్షకస్థానముగా దోఁచలేదు. ఒక్కటియు గఘూలియా చేతికడ్డము నిల్చునంత దిట్టముగాఁ గనఁబడలేదు. పదిలపరుపఁదగిన నెలవులనుగదా గఘూలియా చూచును. అట్టిచోటులందుఁగాక యింకెక్కడనైన దాఁచినచో! ఆ... అదియే చేయవలసినపని. ఎచ్చట దాఁచవలెను? కూటమునందలి బల్లమీఁదనున్న పుష్పపాత్ర యక్షయునకుఁ గానఁబడెను. అమూల్యమగునట్టి కంకణమునొకరు గఘూలియా పుష్పపాత్రమున వెదకునా? వెదకఁడని విశ్వసించుకొని యక్షయుఁడుఁ ఆ పాత్రమునందున్న పుష్పములఁదీసి యడుగునఁ గంకణము నుంచి మరలఁ బైనఁ గుసుమముల నుంచెను.

సేవకులఁ బిలిచి యా కుసుమపాత్రము నచ్చటనుండి తీయవలదని యాజ్ఞాపించెను.

*   *   *   *

రాత్రి చాల కాలము మీఱినది. అక్షయుని భవమున బెద్ద గోల వినవచ్చినది. ఒకగంట కంతయు నిశ్శబ్దమయినది. కాని కారణకార్యములు విమర్శగా తెలియలేదు. చోరులు ప్రవేశించిరేమో!

33

సంధ్యాసమయమున మహేంద్రుఁడు కాల్నడకఁ గీచకాటవియందు శిథిలమందిర ప్రాంత సరోవరము ప్రక్కఁగా మందిరమువైపు బోవుచుండెను. ఆతనిచేతఁ గొన్ని కాగితములు గలవు. నేరుగా నతఁడు శిథిల

మందిరముఁ బ్రవేశించి, ప్రధానద్వారముకడఁ గ్రిందనున్న రహస్య ద్వారముఁదెఱచుకొని, భూగర్భమార్గమున గగూలియా నివాసమునకుఁ బోవఁజొచ్చెను.

ఆభూగర్భమార్గమునకు రెండవవైపుననున్న ద్వారముకడ నిరువురు గగూలియా సేవకులు వేచియుండిరి. వా రీతనిఁ గనినతోడనే,

"ఎవరు నీవు?" అని ప్రశ్నించిరి.

"మహేంద్రబాబు"

మహేంద్రుని నామము వినినంతనే వారాతనికిఁ ద్రోవయొసంగిరి. మహేంద్రుఁడు ద్వారముదాఁటి తిన్నగా గగూలియా గుడారమునకుఁ బోయెను. గుడారమునకు వెలుపలనున్న వేత్రాలోకఁడును ఇదివఱకు వారి వలెనే మహేంద్రునిఁ బ్రశ్నించెను. మహేంద్రుఁడు తన నామముఁ దెలిపెను. ఆ నామమును వినినతోడనే యాతఁ డొకటి రెండడుగులు వెనుకకు వైచెను. మొగ మావలకుఁ ద్రిప్పుకొని "పొమ్ము! లోనికిఁ బొమ్ము" అనియెను.

మహేంద్రుఁ డాతని వెఱపుఁ గనియెను. కంఠస్వరమును గుర్తించెను.

"దామోదరా! చాల గొప్పకార్యమును జేసితివి. ఇందులకుఁ దగిన ప్రతిఫలము నీకు దక్కకపోదు. ఇరువురము నొక్కెడనే కలిసికొను చున్నాము. కానిమ్ము; నా యన్నముఁదిని నాకే నీవిట్టి యపకృతి చేయఁ దలపెట్టుటకుఁ దగిన లాభము నచిరకాలముననే యనుభవింపఁగలవు."

అని సత్వరవాక్యములఁ బలికి మహేంద్రుఁడు గుడారములోనికిఁ బోయెను.

లోన గగూలియా మఱి యిరువురును గూర్చుండియుండిరి. ఇతని ప్రవేశముతోడనే యంతవఱకు జరుగుచుండిన వారి సంభాషణ నూగి పోయినది. గగూలియా లేచి మహేంద్రునివద్దకు వచ్చి "మహేంద్రా! నిన్ను శిథిలమందిరముననఁగదా నేను గలిసికొందునని తెలిపితిని?

ఇచ్చటి కేలవచ్చితివి?" అని యడిగెను.

మహేం — ఇప్పుడు మనమచ్చటికే పోవచ్చును.

గగూ — రమ్ము.

ఇరువురు మఠముల శిధిలమందిరము కడకుఁ బోవఁదొడఁగిరి. గుడారమునకు వెలుపల దామోదరుఁడు వినమ్రుఁడై వారికిఁ ద్రోవనొసఁగెను. అచటినుండి భూగర్భమార్గద్వారము కడకువచ్చి సోపానముల నవరోహింపఁ బ్రారంభించిరి. సమతలము చేరినంతనే మార్గమునఁ గొంతదూరము పోయిరి. అచట నొకద్వారముండెను. ఆద్వారమును గగూలియా తనవద్దనున్న యొకతాళముతోడఁ దెఱచెను. వారియెదుట నిప్పు డొకగది కనబడినది. గగూలియా మహేంద్రుని తోడ నాగది బ్రవేశించి, మరల తలుపు మూసి తాళము వైచెను. అచటనుండి వేఱొకగదికి మార్గ ముండెను. ఆగదిలోనికిఁ బోయి దాని తలుపుఁగూడ మూసి, గగూలియా మహేంద్రునితో నిట్టులనియెను.

"మహేంద్రా! ఇయ్యెడ మన మన్ని విషయములు సావధానులమై చర్చించుకొనవచ్చును. నా సంఘస్థులుగూడ నిచటికిఁ బ్రవేశింప వీలు లేదు. ఇచ్చట మన మెంత బిగ్గరగా మాటలాడినను నితరులకు వినఁబడ" దనుచు నచట నొకయలమారయందున్న కిరదీపికను వెలిగించెను.

ఇప్పుడు మహేంద్రుఁ డాగదిని జక్కఁగఁ బరీక్షింపఁగలిగెను. అది పదియడుగుల చదరపుగది. వారు ప్రవేశించిన మార్గముతప్ప అచ్చట నుండి నిర్గమింప వేఱుమార్గము లేదు. ఆగదియందు బల్ల యొకటియు మూఁడుకుర్చీలు నుండెను. అం దొకకుర్చీపై మహేంద్రునిఁ గూర్చుండ నియోగించి, తానునొక యాసనమునఁ గూర్చుండి, దీపికను బల్లపై నుంచి గగూలియా యిట్లు సంభాషింపఁ బ్రారంభించెను.

గగూ — మహేంద్రా! — ప్రస్తుతము నిన్ని పేరుననే పిలిచెదను. ప్రకృతవిషయములను ప్రసంగించుటకుఁ బూర్వము, పూర్వవిషయము

కొంతస్మరించుట లెస్స. అయిదేండ్లకు మున్ను నీవు నా సంఘమునకుఁ జేరియుంటివి. అప్పుడు నీనామము వేఱు, ఒకనాఁడు మణిపురమునం దున్న నీతల్లి చాలనపాయకరమగు స్థితియందుండుటవిని, నావద్ద ననుజ్ఞఁబేసుకొని పోయితివి. మరల నీనాఁడు నాకన్నులకుఁ గనంబడు చుంటివి. ఇందుల కేమైనఁ బ్రత్యుత్తరమీయఁగలవా?

మహేం — ప్రభూ! తొలుతటినుండియు నేను తప్పులనే చేయుచున్నాను. ఆయపరాధములలోనిదియు నొకటియే! ఇప్పుడు మీ రా గతాంశ పునర్విమర్శనచేయు టేల? వలదు. ప్రస్తుతము ననుసరింతము. నాయపరాధము నేనంగీకరించుచున్నాఁడను. మీరావిషయములను నాస్మరణకుఁ దెచ్చుటయందు దుద్దేశముకూడ నదియేకదా?

గగూ — అవును. నీయిష్టానుసారమే గతమును విస్మరింతము. నీయాస్తికి సంబంధించిన పత్రములను దెచ్చితివా?

మహేం — ఇవిగో! చూడుఁడు. నాయాస్తియందు మీరుగోరిన సగపాలు ధనరూపమునఁ జెల్లించుట యుత్తమముగదా?

గగూ — అవును. అందుల కేమైన నేర్పాటుచేసి వచ్చితివా?

మహేం — ఈకాగితములన్నియు నాయాస్తికి సంబంధించినవి. మణిపురమునం దొకనిని నాయాస్తిలో నర్ధభాగము నమ్ముటకు నియోగించితిని. ఇంకఁ బదిదినములలోఁ బూర్తి కాఁగలదు.

గగూలియా యాపత్రములఁ దీసికొని యొక్కటొక్కటిగఁ బరీక్షించుచుండెను.

*   *   *   *

రెండుగంటలు గడచినపిదప నాగదిద్వారమును దెఱచుకొని గగూలియా యొక్కఁడే వెలికివచ్చెను. అతఁడు వెంటనే తిన్నగ తన గుడారమునకుఁ బోయెను.

మహేంద్రునిగతి యేమయినదో

మహేంద్రునితోడి రహస్యప్రసంగానంతరము గగూలీకి – భోజనాగారమును జేరుకొనునప్పటికి రేయి సుమారెనిమిదిగంట లయియుండెను. అతని భోజనమునకై తేఁబడిన భక్ష్యాదులు గుడారమునఁ దొక బల్లమీఁద వెండితట్టలో బెట్టఁబడియుండెను. బల్లవద్ద నొకకుర్చీ సిద్ధముగ నుంచఁబడియుండెను. గగూలియా కాళ్ళు చేతులు గడుగుకొని, బల్లవద్దఁ గూర్చుండి యాభోజనవస్తువుల నారగింపఁ దొడఁగెను.

భోజనానంతరము గుడారద్వారమునకడఁ గుర్చీపై గూరుచుండి, యటునిటు జూచి చేతులను ముమ్మారు చఱచెను. ఆశబ్దము విని యొక సేవకుఁ డయ్యెడకుఁ బరువిడివచ్చెను.

గగూ — ఓరీ! హుక్కా సిద్ధమొనర్పుము.

భటు — దేవా! హుక్కానా?......

గగూ — ఏమి? సంశయించుచుంటి వేల?

భటు — తాము హుక్కా త్రాగుట విడిచి నాలుగేండ్లయినదే! ఇప్పుడేలకోరితిరా యని సంశయించితిని.

గగూ — ఛీ! తుచ్ఛా! నీకావిషయము లెందుకురా? చెప్పినపని చేయుటయే నీయుద్యోగము.

భటు — (వంగి సలా మొనరించుచు) చిత్తము. నా తప్పును క్షమింపుఁడు.

భటుఁడు వెడలిపోయెను. హుక్కా యెచ్చటనున్నది? భటున కేమియుఁ దోఁచలేదు. తీసుకొనిరాకున్న గగూలి బూ శిక్షించును. ఆతనికి దామోదరునిపేరు జ్ఞాపకమునకువచ్చినది. ఆతనివద్ద నొకటి యున్నదికదా, అడిగితెచ్చెద మనుకొని యాప్రక్కననున్న గుడారము లయందొకదానిలోనికిఁ బోయెను. లోన దామోదరుఁడు నింకొకఁడు గూర్చుండి మాటలాడుచుండిరి, వారు భటునిజూచి 'ఏమి విశేష

ములు?' అని ప్రశ్నించిరి.

భటు — గగూలియాకు హుక్కా కావలయునఁట. మీవద్దనున్న దానిని దీసికొనిపోవుమనుచు వచ్చితిని.

దామో — హుక్కా కావలయునా? నిన్ననేగదా హుక్కా మానుమని నన్ను నుపదేశించినాఁడు! ఒకదినములోన నింతమార్పా— గగూలియాకార్యములను విమర్శించువారెవరు! సరియే, అదిగో ఆమూలనున్నది, తీసుకొనిపొమ్ము.

భటుఁడు హుక్కానుదెచ్చి సిద్ధముచేసి గగూలియాప్రక్కననుంచి, గొట్టమాతనిచేతి కందిచ్చి వెడలిపోయెను.

* * * *

రాత్రి యట్టులే గంటపిమ్మటగంట గడచిపోవుచుండెను. దామోదరుఁడు కూడనున్న వానితో నిట్లనియెను.

"మాధవా! కేశవాదులింకను నక్షయునింటినుండి రాలేదేలనో? పోయినకార్య మేమయినదో? కంకణము లభించినదో లేదో!"

మాధ — దామోదరా! అదియే నే నాలోచించునది. ఇప్పటి కెప్పుడో వచ్చియుండవలయునే వారు. ఏల రాలేదో!

దామో — నీవుపోయి గగూలియా గుడారమువద్దఁ జూచిరమ్ము. వారేమయిన వచ్చిరేమో?

మాధవుఁడు లేచి గగూలియాగుడారమునకుఁ బోయెను. దాని నాతఁడు చేరకముందే యొకఁ డాతనికెదురుగఁ బరువెత్తుకొని వచ్చెను. వానినిజూచి మాధవుఁడు,

"బాఖర్! కేశవాదు లెక్కడ? నీవుమాత్రమే వచ్చుచుంటివేల?" అనియెను.

బాఖర్ — మాధవబాబు! సర్వనాశనమయినది. రండు. దామోదరబాబుగారితోడఁ జెప్పవలయును.

ఇరువురు దామోదరుఁ డున్న యెడకు వచ్చిరి. అచ్చట దామో-
దరుఁడును బాఖరును మాధవునివలెనే ప్రశ్నించెను.

బాఖర్ — దామోదరబాబుగారు! అక్షయునింట మేము పదుగురము కేశవునితోఁ బ్రవేశించితిమి. మేము ప్రవేశించినప్పు డాయింట నెవ్వరును మేల్కొనలేదు. జాగ్రత్తగా గదులన్నియుఁ దెరిసి కంకణము కొఱకు వెదకితిమి. తుట్టతుద నొకహాలులోనికి వచ్చితిమి. ఆహాలునకుఁ గుడిప్రక్క నొక పెద్దగదియున్నది. ఆగదిలో నందఱు ప్రవేశించి కంకణము కొఱకు వెదక కేశవుఁ డాజ్ఞయిచ్చెను. నేను మాత్రము హాలు నందు వెదకుచుంటిని. కేశవుఁడుగూడ నందేయుండెను. అతఁ డటు నిటుఁ దిరుగుటలో చేయితగిలి యందేయున్న బల్లమీఁది పుష్పపాత్ర మొకటి క్రిందఁబడి తుత్తునియలైనది. కేశవుఁడు ద్రేలుగఱచుచు వాని దెస తీక్ష్ణముగాఁ జూచినాఁడు. తటాలున లేచి మనవారు వెదకుచున్న గదికి చిటుక్కున వెలుపల తాళము వేసినాఁడు. వెనుదిరిగి క్షణములో పుష్పపాత్రపు ముక్కలలోఁ బడియున్నదిగాబోలు కంకణముఁ దీసి కొని, "దొంగలు దొంగ" లని యఱచుచు గృహమునుండి పరుగిడినాఁడు. ఇదంతయు నాతఁ డొనర్చుట కొకటిరెండు నిముసములకన్న నెక్కువకాలము పట్టలేదు. అప్పటికి నేను గ్రహింపఁగలిగి, వాని యఱపులను విని మేల్కొనివచ్చుచున్న గృహసేవకవర్గమధ్యమునఁ జొరవచేసికొని కేశవుని వెన్నంటి యూరివెలుపలఁ బట్టుకొంటిని. కాని యేనుఁగుబలము గలవానితోఁ బోరలేక పడిపోయితిని. అతఁడు తప్పించుకొని పాఱిపోయెను. కంకణము పోయినది. తొమ్మండుగురు భటులు పోయిరి. ఇప్పుడు మన మేమిచేయవలయును. గఫూరీ యాతోఁ దెల్పుదము. ఆయన యేమనునో! రండు పోవుదము. వారిని రక్షింపవలయును. ఆలస్యమయిన వారేమగుదురో.

దామోదరుఁడు, మాధవుఁడు విస్మితులై బాఖరుతోఁగూడ నట

నుండి గగూలియాగుడారమునకుఁ బోయిరి. గుడారమువెలుపలనే మాధవుఁడు బాఖరును నిలిచిరి. దామోదరుఁడు లోనికరిగెను.

గగూలియా నిద్రించుచుండెను. ఆతని లేపుటెట్లు? లేపకుండు టెట్లు! దామోదరుఁడు కొంతకాల మాలోచించెను. ఎట్లైనను లేప వలసినదే యని నిశ్చయించి, గగూలియాశయనముకడ నిలుచుండి 'ప్రభూ! ప్రభూ!' అని పిలిచెను. గగూలియా లేవలేదు. మరల దామోదరుఁడు 'ప్రభూ!' అని కొంచెము బిగ్గరగాఁ బిలిచెను.

గగూలియా యులికిపడి లేచి కూర్చుండెను. తీక్షణముగ 'ఎవరు వారు?' అనియెను.

దామో — ప్రభూ! మన సంఘస్థులలో నక్షయవసుగృహమునకుఁ గంకణార్థము పంపబడిన పదుగురిలో బాఖరుతప్ప మిగిలినవా రందఱు బంధింపఁబడిరఁట!

గగూలియా — కొంచె మాలోచించి, ఏమి! అక్షయునింట బంధింపఁ బడిరా? బంధించినవా రెవ్వరు?

“బంధించిన దక్షయుని భటులు. దానికిఁ గారకుఁడు కేశవుఁడు. ఆద్రోహి కంకణమునకై మనసహాయమపేక్షించి, తుద కివ్విధముగ మోసగించి కంకణమును హరించుటయేగాక మన సంఘీయులను నిర్బంధితులఁ జేసి పాఱిపోయినాఁడు.”

“ఆవిషయము సవిస్తరముగఁ దెలుపుము.”

దామోదరుఁడు, బాఖరు దెలిపినదంతయు గగూలియాకు నివేదించెను.

గగూ — కేశవుఁ డంత ద్రోహముచేసెనా? నాక్రోధమునకుఁ బ్రతిఘటించి నిలువ సాహసించెనా? సరి, నీవు మాధవాదుల నైదుగురిని దోడ్కొనిపోయి మనవారిని విడిపించుకొనిరమ్ము. నేనుఁ గేశవుని విషయము కనుఁగొందును.

౩౫

క్రిందటి ప్రకరణములోని విషయములు జరిగిన మరుచటి యుదయము అక్షయబాబు భగీరథీదేవి శయ్యాసమీపమున గూర్చుండి మగతగ బడియున్న యామెయు దీనాననముఁజూచుచుండెను. అప్పుడతనికనులు రేయియెల్ల నిద్రలేకపోయియుండుటచేఁ గాబోలు జేవురించిపోయి యున్నవి. తన్ను బాల్యమునుండియు లాలించి పాలించిన యామె ప్రేమనుతలంచుకొనికాఁబోలు నతఁడు జలజలకన్నీరు రాల్చుచున్నాఁడు. ఆసమయమున నాతని వెనుకవైపుననున్న తలుపు హఠాత్తుగఁ దెఱువఁ బడినది. అందువలనఁ గలిగిన చప్పుడునకు అక్షయుఁ డులికిపడి నాఁడు — బహుశః అతఁడు గదూలినూ దర్శనము నపేక్షించినాఁ డేమో! కాని వెనుదిరిగి చూచునప్పటికి జగచ్చంద్ర చూడాధనులు మాత్రమే కాన్పించిరి.

మణిపురమున కేగినవారిరువురు నీనాఁడే నాగపురికిఁ దిరిగివచ్చిరి. అక్షయుఁడు లేచి, చూడాధనుని గాఁగిలించుకొనియెను. జగచ్చంద్రుని చేయిఁబట్టుకొని "జగచ్చంద్రా! చూడాధనా! రండు వెలుపలికి" అనియెను.

జగ — బాబుగారు! భాగీరథీదేవిగారికిఁ జాల జబ్బు చేసిన ట్లున్నదే?

అక్ష — అవును. అన్నియు వెలుపలమాటలాడుకొందము. ఇచట వలదు. మనసంభాషణము రోగికి శాంతిభంగముగ నుండును.

ముగ్గురును వెలుపలికిఁబోయి కేశవుఁడు, అక్షయుఁడు కలిసి మాట లాడినకూటమునకే వచ్చి యందాసీనులయిరి.

అక్ష — నిన్నయుదయముననే భాగీరథీదేవికి జబ్బుచేసినది. ఈ యుదయములోనఁ జాలతీవ్రమయిపోయినది. తొలుత జ్వరమువచ్చి వార్ధక్యమున బలహీనమయియున్న యామెకు మఱింత బలహీనము

గలిగించితిని. వైద్యుఁడుమాత్రము ప్రాణభయము లేదనుచున్నాఁడు.

జగ — మా కేల తెలుపలేదు? మేమిపుడు రాకపోయియుండిన తెలిసియే యుండదుగదా.

అక్ష — గఘాలియా పీక్షణము నాయింటిపైకిఁ బ్రసరించినది. దాని బారినుండి తప్పించుకొను సందడిలో మీకుఁ గబురుచేయు విషయ మిప్పటివఱకు మఱచియే పోయితిని.

జగ — ఏమి? గఘాలియా పీక్షణమా? — జరిగిన దంతయు త్వరగా వివరింపుము.

అక్షయుఁడంత కేశవుఁడొక్కఁడే తొలుత నచటి కేతెంచుటాదిగా మరల రెండవనాఁడు గఘాలియా జట్టువారితో నింటిపైఁబడి కంకణము హరించుకొనిపోవుట, కొందఱు దొంగలుమాత్ర మొకగదిలోఁ జిక్కుపడి తనచేఁ బంధింపఁబడుట చెప్పి, యింకను నిట్లని యనంతరవిశేషములను దెలిపెను.

“అట్లు చిక్కిన దొంగల నప్పటికప్పుడే పట్టుకొని జాగ్రత్తగ బంధించియుంచితిమి. కాని వీరిని విడిపించుటకై జట్టువారి యింకొక ప్రయత్న మీరాత్రియే జరుగునని నేను నిశ్చయించుకొంటిని. అందుచే సేవకులనెల్ల నందుకు సిద్ధపఱచి యొకయుక్తిచేసితిని. ఇంటి తలుపులు కిటికీలు అన్నిటిని జాగ్రత్తగ మూయించి, ఉత్తరపువైపు పైయంతస్తుగదిలోఁ గిటికీ తెఱచుకొని యైదుగురు సేవకులతోఁగూడి పహరా వేసితిని. అట్లు పహరా యిచ్చుచుండగా రెండవఝాము గడచినది. మూఁడవఝాముకూడఁ గడచివచ్చినది. అప్పుడు క్రింద మనుష్యుల యలికిడి పసికట్టితిమి. వారు మా కిటికీ క్రిందికి వచ్చుటఁజూచి వారిజట్టువారివలె సైగలు చేసితిమి. అంత వారు తిరిగి సైగజేసి, యొకచోటనుండియో నిచ్చెన తెచ్చి యెన్నోతంటాలు పడుచు నొక్కొక్కరె పైకెగఁబ్రాకి వచ్చిరి. వచ్చినవారిని వచ్చినట్లుగనే యొక్కొక్క

నని ప్రక్కనున్న చీకటిద్వారమున నక్కియున్న నాభటులు పట్టి కొని బంధించిరి. కాని వారిలోని తుదివాఁడు మాత్రము కొంచెము కెక్కివచ్చి మోసము గ్రహించెఁగాఁబోలు నవలాంతముగ నుఱికి పాఱిపోయినాఁడు. మొత్తమిప్పుడు మనయొద్ద పదునలుగురు బంధితు లున్నారు.”

జగచ్చంద్రచూడాధనులు వాని మాటలు విని. వానికిఁ గల్గిన ప్రాణాప హరణము చాలచింత కలిగించినది. కాని, యక్షయుఁ డేకాంత సూత్రోపాయమున గగూలియా భటులఁ బదునల్గురిని బంధించెనని తెలియఁగఁ గొంత సంతసించిరి.

జగచ్చంద్రుఁడా గగూలియా భటులఁ జూడవలయునని కోరెను. అక్షయుఁడు వారల బంధించియుంచిన గదులకుఁ దోడ్కొనిపోయి చూపెను. సంకెలలో గాండ్రించుచున్న వ్యాఘ్రములవలెనున్న వారిని జగచ్చంద్రుఁడు చూచెను. వారియందొకనిపై నీతని వీక్షణము నిలిచినది. ఆతనికడకుఁ బోయి, మెల్లఁగ నతనిఁ దీసికొనివచ్చి, “మిత్రమా! అక్షయబాబుగారు నిన్నుగూడ బంధించిరా?” అని అక్షయుని కాంచి జూపుచు “బాబుగారు! ఈతఁడు నా కత్యంతస్నేహితుఁడు. లలితను రక్షించిన దితఁడే! మణిపురమునందు జరిగిన ఘోరకార్యములను నాకుఁ దెలిపిన దితఁడే” అనియెను.

అక్ష — ఆనాఁ డిచ్చటికివచ్చి నీతోడ మాటలాడిపోయిన దితఁడేనా? ఈతఁ డెవ్వరు? ఆసంఘమున నేల ప్రవేశించెను?

అక్షయుఁడు చూడాధనుఁడు జగచ్చంద్రుఁడు నాతనివైపు జూచిరి.

ఆతఁడు వారితోడ నిట్లనియెను. “మహాశయులారా! మీరు కోరు విశేషములను దెలుపుకాల మింకను రాలేదు. ఇఁకఁ గొన్ని దినము లోర్చియుండుఁడు.”

అందుల కందఱు నంగీకరించిరి.

వారు నలుగురు వచ్చుటఁ జూచుచుండి జరుగవలసిన విషయములఁ గూర్చి యాలోచింపఁదొడఁగెను.

౩౬

జగ — అక్షయబాబుగారు! నే నిపుడే చందనపుర రక్షకభటాధికారులకు వార్త నంపితిని. వారు సాయంత్రమునకెల్ల వచ్చెదరని యెంచెదను. అంతవఱకు మనము వీరిని గాపాడవలయును. మీరా పనియం దుండుఁడు. నేను కంకణము నన్వేషించెదను.

చూడా — జగచ్చంద్రా! అట్లేపొమ్ము. నేను, చంద్రికగారును మహాభటులతో వీరిని గాపాడఁగలము.

జగచ్చంద్రుఁడు తనతోఁ గలిసియున్న గగూలియా సాంఘికుని గూడఁ దోడ్కొని యక్షయుని గృహమునుండి పోవనెంచెను. కూడ నున్న యాతని శ్యామలవస్త్రములు చూపఱ కాతని గగూలియా సాంఘికునిగా బయల్పఱచునని యనుమానము తోఁచినది. తన యనుమానము వానికిఁ దెల్పి, వేషము మార్చుకొనుమనియెను. ఆతఁడు తొలుత నంగీకరింపలేదు కాని జగచ్చంద్రుని వాదబలమున నొప్పుకొని వేషము మార్చుకొనియెను. ధౌతవస్త్రములలోనున్న యాతఁడు, శ్యామలాంబరములం దున్నప్పటికన్న నెన్నియో మడుంగులు చక్కఁగ నుండెను.

వా రిరువురును బయలుదేరి శాంతబాబు గృహమునకుఁ బోయిరి. జగచ్చంద్రుని కూడ నున్నవాఁడు శాంతుని గృహమునకు వెలుపలనే నిలిచి జగచ్చంద్రుని లోనికిఁబోయి మాటాడి రమ్మనెను. జగచ్చంద్రుఁ డందుల కంగీకరింపక "మిత్రుఁడా! రమ్ము. నీవు వెలుపలనుండు టేల?" అని బలవంతముగ లోనికిఁ దోడ్కొనిపోయెను.

శాంతబాబు కుర్చీపైఁ గూర్చుండి యేమియో వ్రాసికొనుచుండెను.

ఆగంతుల: జూడఁగనే లేచి వారి కాసనమునొసఁగి కూర్చుండ మనెయెను. వారు కూర్చుండిరి.

శాంత — జగచ్చంద్రా! చూచితివా యేమయ్యెను? నీ వెవరో క్రొత్తస్నేహితునిఁ దోడ్కొనివచ్చితివే?

అని జగచ్చంద్రునితోడవచ్చిన వానిని పరికించి చూచి సంభ్రమమున "మాధవా, మాధవా! ఏమి స్వర్గమునుండి యూడిపడితివా? ఇంతకాల మెచ్చటనుంటివి?" అనియెను.

శాంతబాబుయొక్క యాశ్చర్యమున జగచ్చంద్రుఁడుగూడఁ బాల్గొనియెను. మాధవుఁ డెవరు? ఆనందునికడ నుద్యోగియా? నాఁడు లలిత ననుపున శాంతబాబుకడకువచ్చి యట్లే మాయమైనవాఁడా?

జగ — శాంతబాబుగారు! ఈమాధవుఁడేనా యానందునిగూర్చి విచారించుటకు నాఁడు మీకడకు వచ్చినది?

శాంత — అవును. ఇతఁడే! ఏమి మాధవా ప్రత్యుత్తర మీయవు?

మాధ — బాబుగారు! మీ ప్రశ్నములకుఁ బ్రత్యుత్తర మిప్పుడీయఁజాలను. క్షమింపుఁడు. ఒకటిరెండు దినములోర్చియుండుఁడు. అప్పుడు మీకు సర్వము నివేదింపఁగలను.

శాంత — అట్లే కానిమ్ము.

జగ — తాతగారు! నాగేంద్రుఁ డనువాఁడు మీకడ కేమయిన వచ్చెనా?

శాంత — లేదు. నాగేంద్రుఁ డెవరు?

జగ — నా సేవకుఁడు. కొన్ని రహస్యములను శోధించి తెలిసికొనుటకు వానిని సుందరపురమునకుఁ బంపియున్నాను. అచ్చటనుండి యాతఁడు మీకడకు వచ్చును. వచ్చిన నేను వచ్చువఱకు నాతని మీవద్ద నుంచికొనుఁడు.

శాంత — ఎచ్చటికో ప్రయాణసన్నద్ధుఁడవై వచ్చినట్లున్నదే? ఒక

గంటకాలమైన నీ మనుమరాలితోడఁ గడపఁగూడదా?

జగ — తాతగారు! కోపింపకుఁడు. విషయము లన్నియుఁ దెలిసిన మీ రిట్లు నిష్ఠురములు పలుకరు. అక్షయబాబుగారింట గగూలియా భటులు పదునల్గురు బంధింపఁబడియున్నారు. నేను గగూలియా కేశవులకొఱకుఁ బోవుచున్నాను. కేశవుఁడు మరలఁ గంకణము నక్షయబాబుగారివద్దనుండి యపహరించెను. దానినిరక్షించి తేవలయును.

శాంత — ఏమేమి! పదునల్గురు గగూలియా దుష్టులు బంధింపఁ బడిరా! కంకణము మరల నపహరింపబడినదా!

జగ — అవును. మరల సాయంత్రమునకు వచ్చి మీ కన్ని విషయములు దెల్పెదను. ఇప్పటికి సెలవిండు. అని జగచ్చంద్రుఁడు లేచెను. మాధవుఁడును జగచ్చంద్రుఁడును శాంతబాబుకడ సెలవు గైకొని గృహబహిఃప్రదేశమునకు వచ్చిరి.

వారి కెదురుగ దూరమునుండి యొకఁడు వచ్చి జగచ్చంద్రునితోడ నిట్లనియెను.

"జగచ్చంద్రబాబు! శీఘ్రమే నీవు నాతోడ రావలయును."

జగచ్చంద్రుఁ డాశ్చర్యమున నాతని జూచుచు "ఓయీ! నీ వెవ్వఁడవు? నీతోడ నేను రావలసిన కార్య మేమున్నది?" అనియెను.

నూతా్న — నే నెవ్వరయినదియును నీకు మాధవుఁడు తెలుపును. ఆతని మాటయందు నమ్మిక యున్నదిక దా! అడుగు మాతనిని.

జగ — ఏమి మాధవా! ఈతని నీవెఱుంగుదువా?

మాధ — ఎఱుఁగుదును. ఈతఁడును గగూలియా సంఘమునకుఁ జేరినవాఁడే! మన మిత్రుఁడే.

జగ — ఈతని పేరు?

మాధ — భేతాళుఁడు.

జగచ్చంద్రుఁడు నవ్వుచు "చాల మంచి పేరు. పెట్టుకొనుటకు

నిట్టిదానినే ప్రత్యేకించుట చాల గొప్పవిషయము. నివాసము?"

మాధ — మాధవుఁడనే. ఈతఁడును నాకరాతనే ప్రచ్ఛన్నుఁడై యున్నాఁడు. అతని చరిత్రము మాకు శీఘ్రమే తెలియఁగలదు. ఇప్పుడీతఁడు వచ్చిన పని గూర్చి యడుగుదము.

జగ — భేతాళబాబు నీవు నా హితసమూహమునఁ దొరకుడని యంగీకరించితిని. ఇఁక నీ వచ్చిన పని తెలుపుము.

భేతా — జగచ్చంద్రబాబు! నీవు మాధవుఁడు నావెంట నిప్పుడే బయలుదేరవలయును. కార్యవిషయమంతకన్న నెక్కువ తెలుపఁజాలను.

జగ — ఎచ్చటికి?

భేతా — భేతాళగిరియందలి ధనాగారమునకు.

జగ — ఆఁ! గుప్త ధననిధి విషయము నీవు నెఱుంగుదువా? మార్గ మెట్లు? కంకణము లేకుండ మనము గుహఁజొచ్చు టెట్లు?

భేతా — భేతాళునికి మార్గము లేకుండునా? నీకాసంశయ మెందులకు? పిలుచుకొని పోవువాఁడను నేను గదా?

జగ — సరి మాధవా! రమ్ము! పోవుదము.

భేతాళుఁడు, జగచ్చంద్ర మాధవులు కీచకాటవివైపు ప్రయాణము చేయ నారంభించిరి.

భేతాళుఁడు వారలను శిథిలమందిరముకడకుఁ బిలిచికొనివచ్చెను. జగచ్చంద్రుఁడు, భేతాళగిరికందరమున కిచ్చటనుండి మార్గమెక్కడిదా యను నాలోచనలోఁ బడినాఁడు. మాధవుఁడు, భేతాళుఁడును భేతాళ గిరికందరమునకుఁ దోడ్కొనిపోవు వ్యాజమునఁ దన కపాయమేమైనఁ గల్గింపఁ బన్నాగము సేయుచున్నాఁడా? ఆసంశయము తట్టినది మొదలు జగచ్చంద్రుని కుడిచెయ్యి చొక్కాజేబియందే యుండఁజొచ్చెను.

గగూలియా భటుఁడు కేశవుని గగూలియావద్దకుఁ దోడ్కొని పోయిన మార్గముననే ఆభూబిలమార్గముననే వీరునుబోయిరి. కొంత

దూరము చని, తుదకు మహేంద్రుఁడు గఫూలియా రహస్యముగ సంభాషించుటకు వచ్చిన గదికడకుఁ జేరి. ఆగదితలుపు తాళము వేయఁబడియుండెను. భేతాళుఁడు గోడయందున్న యొక గూటిలోఁ జేయిడి దేనినో యదిమెను. తోడనే తాళము వేయఁబడియున్న ద్వారమునకుఁ బ్రక్కనే వేఱొకతలుపు తెఱచుకొనియెను. ఆమార్గము గూడ నాగదిలోనికిఁ బోవునదియె. వారు మువ్వురును గదిలోనికిఁ బ్రవేశించిరి. భేతాళుఁడు తనవద్దనున్న దీపమును వెలిఁగించి ముందు దారిఁజూప, జగచ్చంద్రమాధవు లాతని వెనువెంటనే పోయిరి. ఆగది నుండి వారు వేఱొకగదిలోనికిఁ బోవుచుండఁ బ్రక్కనున్న యింకొక గదినుండి వారికి సన్నని మూల్గు వినఁబడినది. మువ్వురు నాశబ్దము విని వెనుకంజవేసిరి. భేతాళుఁడు ధైర్యము తెచ్చుకొని, యాశబ్దము వినవచ్చు గదిలోనికిఁ బోయెను. జగచ్చంద్ర మాధవులు సయిత మాతని వెంబడించిరి.

భేతాళుని చేతిలోని దీపపుకాంతులు, రక్తముతో సగముతడిసిన గదిమధ్యమున రక్తమయములయిన సర్వాంగములతో భయంకరముగఁ బడియున్న యొకని వారి దృష్టులకుఁ గనఁబడఁజేసెను. వా రప్పుడు చెందిన యాశ్చర్యభయము లూహ్యములే. భేతాళుఁడు వంగి యాతనిఁ బరీక్షించి, "ఏమిది! గఫూలియా! భయదమూర్తియగు గఫూలియా రక్తపుకాల్వలో మునుఁగుచు నిట్టిస్థితియందుండుటకుఁ గారణము? ఈతని నింతఘోరముగ హత్యగావించినవా రెవరు? ఎంత ఘోరము! ఎంత ఘోరము!" అనియెను. జగచ్చంద్ర మాధవుల చెవుల కామాటలు, అగ్నిగోళమువలె తీక్ష్ణములుగఁదోఁచుటలో నాశ్చర్యమేమున్నది. వారిరువురుగూడ వంగి గఫూలియాను జూచిరి.

జగచ్చంద్రుఁడు, ఆచోరనాయకుని - వంగదేశమునంతయు గగ్గోలు పడఁజేసిన యాభయంకరుని జూచెను. ఏస్థితియందు? ప్రాణావశిష్టుఁడై

పడియున్నపుడు! ఆతనిహృదయము నీరై పోయినది. ఇఁకనాతఁ డెంతటిరాక్షసుఁడైననేమి? ఇప్పుడు వాతఁడు చాల కష్టస్థితియం దున్నాఁడు. ఆతనికిఁ బరిచర్యచేసిన, వాని ప్రాణము దక్కఁజేతుమో! ఎట్టిరాక్షసుఁడును, ఎట్టిహంతకుఁడును, ఎట్టిక్రూరాత్ముఁడును మృత్యుభయంకర మగు చావున కనర్హుఁడు.

జగచ్చంద్రుఁ డప్పుడు "భేతాళా! మనము కొంచెము సావకాశ ముగ ధనాగారమునకుఁ బోవచ్చును. ముందీతని రక్షింప వేరైన వీలున్నదేమో చూతుము. పాపము! ఈతఁ డెంతదుఃఖకరమగు స్థితియం దున్నాఁడో!" అనియెను.

భేతా — జగచ్చంద్రా! ఆతఁడుచేసిన క్రౌర్యములకుఁ దగినఫల మును జెందినాఁడు. మనమట్టి దుష్టునికి సహాయము చేయరాదు.

జగ — భేతాళబాబు! ఆతని క్రౌర్యములను దలంచుటకిది సమ యముకాదు. నీవుధనాగారమునకు మార్గముజూపుము. నేనే యాతని కడనుండి, రావలసిన సమయమునకు ధనాగారమునకు వచ్చెదను.

భేతా — నీయిష్టము.

జగచ్చంద్రు నటనుండి పిలుచుకొనిపోయి భేతాళుఁడు తానింతకు ముందుఁ బోయినమార్గమున నెదుటివైపున గోడకడ వేఱొక యంత్ర కవాటముఁ దెఱచి యొకమార్గము జూపుచు — ఈమార్గమున నేరుగ వచ్చితివేని రెండువందల గజములదూరమున వేఱొక ద్వారమును సంధింతువు. దానిని దెఱచుకొని పైకిరమ్ము. మరల మార్గము కనఁ బడును. మరల రెండువందలగజములకుఁబైన నొక కవాటమున్నది. అది తెఱచిన ధనాగారమున నుందువు అని తెలిపెను.

జగ — సరియే.

భేతా — మాధవా! నీవుగూడ జగచ్చంద్రునితోడ నేయుండుము. ఈస్థలము నమ్మరానిది. అపాయకరము అని దీపికను మాధవున

కిచ్చెను.

మాధవ జగచ్చంద్రులు నిలిచిరి. భేతాళుఁడు వెడలిపోయెను. జగచ్చంద్రుఁడు మరల రోగిగదిలోనికివచ్చెను. గగూలియా ప్రక్కనఁ గూరుచుండెను. మాధవుఁడు దీపమును బల్లపై నుంచెను.

జగచ్చంద్రుని వీక్షణములు గగూలియా ముఖముపై నున్నవి. కొంతసేపటికి గగూలియా మెల్లగఁ గనులు విచ్చెను. జగచ్చంద్రుని జూచెను. నీరు గావలయునని సంజ్ఞ యొనర్చెను. జగచ్చంద్రుఁడు మాధవునివంకఁ జూచెను. మాధవుఁడు ప్రక్కనలేఁడు. ఎచ్చటికిఁ బోయెనో!

అయిదునిముసములు గడచినవి. మాధవుఁడు, ఒక మృణ్మయ పాత్రమున నీరు దీసికొని యచ్చటికివచ్చెను. జగచ్చంద్రుఁ డాతని సమయస్ఫూర్తికి సంతసించెను. ఆ మృత్పాత్రమునందలి తీర్థమును గగూలియా నోటఁబోసెను. ఒకటిరెండుగుక్కలుత్రాగి, గగూలియా చాలునన్నట్లు తలయూపెను. మరల గన్నులుతెఱచి చెంతనున్న జగచ్చంద్రుని తేరిపారఁ జూడదొడఁగెను. ఆజూపునం దాతఁడు తా నెవ్వరో తెలిసికొనఁగోరుచున్నట్లు జగచ్చంద్రుఁడు గ్రహించి, "నేను విజయచంద్రుని కుమారుఁడను; జగచ్చంద్రుఁడను" అనియెను.

ఆమాటలను వినినపుడు గగూలియా నేత్రము లేలనో యొక్కమాఱు ప్రకాశించినవి. అనంతర మతఁడు సంతృప్తిఁ జెందినట్లుగ జగచ్చంద్రు నింకను జేరరమ్మని సైగఁజేసి, మెల్లగ నతికష్టముపై నతని చెవిలో నేమోచెప్పెను. తత్ఫలితముగాఁ గాఁబోలు గగూలియా మరల శోషిల్లినట్లు కనులు మూతబడిపోయెను. జగచ్చంద్రుఁడు వానినోట మరల కొంతనీరు పోసెను. కొంతవడికి గగూలియా తేరుకొని యిట్లు చెప్పదొడఁగెను —

"జగచ్చంద్రా! ఈవిషయమునంతయు మనసునఁ బెట్టుకొమ్ము.

ప్రభాకరునిం దగురీతి శిక్షింపుము."

"గఫూలియా! ఇప్పటికైన నాస్త్రాంతికై భగవంతుని స్మరింపుము. ఇంకను బరనిందయందే కాల మేల వ్యర్థముచేయుదువు?"

"జగచ్చంద్రా! నావంటి రాక్షసుని కిట్టి హితబోధనము నీవు చేయుటకుఁ దగినవాఁడవే. కాని లోక మనుకొనునంత క్రూరుఁడనుగాఁడీ గఫూలియా! అనేకులు హంతకులు, చోరులు నాపేరు నీడనుదాఁగి యుండిచేసిన ఘోరకార్యము లన్నియు నేనేచేసినట్లు పరిగణింపఁబడినవి. నా ప్రాణమును, సంఘమును రక్షించుకొనుటకుఁ దప్ప నన్యథా నేనింతవఱ కొక ప్రాణమును దీసియుండలేదు .....ఇప్పుడా విషయ మెందులకు? నేనెట్లును బాపినే, హంతకుఁడనే! అయినను, నా సహాయముచేతనే మీ తండ్రియంతటివానిని మోసగించి, గొప్ప యాస్తి కధికారి కాఁగలిగిన ప్రభాకరుఁడు నాకింతటి ద్రోహము చేయుట తప్పు. ఆతనిని నీవు శిక్షింపుము. నీయన్నను దలంచి శిక్షింపుము. ఇదియే నాతుదికోరిక —

జగచ్చంద్ర మాధవులు చూచుచుండఁగనే గఫూలియా ప్రాణము లెగిరిపోయినవి. జగచ్చంద్రునికంట నీరుతిరిగినది.

౩౨

"ఆహా! గఫూలియా యెట్టి రహస్యమును దెలిపినాఁడు!" అనుచు మ్లానవదనముతో జగచ్చంద్రుఁడు లేచి నిలువఁబడి, కనులు దుడిచికొనినాఁడు. అంతలో నతనికిఁ దానిందుఁ బ్రవేశించిన కార్యము స్మృతికి వచ్చినది. వెంటనే మాధవునిఁజేరి యతనితోఁగూడ ధనాగారమునకు బయలుదేరెను.

భేతాళుఁడు చూపిన మార్గమునుబట్టి పోయి యిరువది నిముసములలో వారు ధనాగారమును బ్రవేశింపఁగలిగిరి. అచట వీరి కెవ్వరును

గనఁబడలేదు. ఇప్పుడు వీరిద్దఱును ప్రవేశించినది, పూర్వము కేశవానందాదులు కంకణ సహాయమునఁ బ్రవేశించిన ధనాగారము. కాని వీరు వచ్చిన మార్గముమాత్ర మానందాదులు వచ్చిన సోపానమార్గము గాదు. గదియందు గోడ నానించఁబడి మూఁడు ధనపేటిక లున్నవి గదా? వానికెదుటనున్న గోడయందుఁగల యంత్రకవాటమూలమున జగచ్చంద్రుఁడు ప్రవేశించెను. ఈమార్గ మానందాదులకుఁ దెలియనే తెలియదు. ఆనందునికొఱకుఁ గేశవుఁడా మందిరమంతయు వెదకినప్పు డాతఁడుగూడ నీద్వారమున్న ట్లనుమానించియుండలేదు.

జగచ్చంద్రుఁడు మాధవునితో నాగదిఁ బ్రవేశించెను. అచట వీరికొఱకు వేచియున్నన్న భేతాళుఁడు లేఁడు. ఎచ్చటికిఁ బోయెను? ఒకవైపున మందిరమునకున్న సోపానములు వీరికిఁ గనఁబడెను. వాని నధిరోహించి పైకిఁబోయియుండునేమో? జగచ్చంద్రుఁడు మెట్ల నెక్కఁదొడఁగెను. వారికి మెట్లకుఁబైన నొక చదరపుద్వారము కనఁబడెను. పైకివచ్చుకొలఁది నేదియో శబ్దము స్ఫుటముగ వారికిఁ వినఁబడఁ బ్రారంభించినది. ఆశబ్దమేమి ఎవరో మాటలాడుచున్న శబ్దము. మాటలాడువా రెవ్వరు?

జగచ్చంద్రుఁడు మాధవునితోఁడఁ బాతాళమందిరమునుండి పైకి వచ్చెను. ఇప్పుడు తాము మఱొక గదియందుండుట వారు గ్రహించిరి. జగచ్చంద్రుని చూపు గది నల్గడలఁ బ్రసరించెను. ఆతని వీక్షణము లచటనున్న యస్థిమాత్ర రూపమును గనిపెట్టినవి. ఒక క్షణకాల మాతఁడు దానిఁజూచి యచటనుండి ప్రక్కనేయున్న గదిలోనికిఁ బరువిడెను. వారికిఁ బ్రక్కగదియందు ఎవరో యిరువురు పోరాడుచున్నట్లు శబ్దము వినఁబడినది. జగచ్చంద్రుని వెంటనే మాధవుఁడుఁ గూడఁబోయెను.

ఇప్పుడు వారు ప్రవేశించిన ప్రదేశ మంధకారమునఁ గ్రమ్మఁబడి

యుండెను. నాకా చీకటియందు దగిపులాడుచున్నవా రెవరో తెలియలేదు.

"కేశవా! ఈసారి యెందుఁ దప్పించుకొందువు? అబ్బా! కంకణముతోడనే చిక్కితివి."

ఆకంఠస్వరము భేతాళునిదే! జగచ్చంద్రుఁడు మాధవుఁడుగూడ నాధ్వని గుర్తించిరి. ఆశబ్దము వినఁబడినచోటు గుర్తుగా ముందుకుఁ బరుగిడిరి. కాని వీరాప్రయత్నము చేయుటకుముందే బరువుగల పదార్థముక్రిందఁ బడినవిధముగఁ జప్పుడయ్యెను. తోడనే యాచీఁకటి యంతయు వెలుతురులో నిండిపోయెను. విచిత్రముగా నొకప్రక్కకుఁ దెఱవఁబడిన శిలాకవాటము వారికిఁ గనబడెను. అదియే భేతాళగిరి గుహాద్వారము. ఆనంద కేశవులు కంకణసహాయమున నాఁడు ప్రవేశించిన ద్వారము. ఆద్వారముద్వారావచ్చు వెలుతురులో గుహాముఖము కడఁబడియున్న భేతాళుని, ద్వారముగుండఁ బాఱిపోవుచున్న యొక్క వ్యక్తిని వారు గనిపెట్టిరి. పారిపోవుచున్నవానిని జూపి మాధవుఁడు జగచ్చంద్రునితో "ఆతఁడే కేశవుఁడు! ఆతఁడే" అనియెను.

జగచ్చంద్రుఁ డొక్కలంఘనమున ద్వారమున కడ్డముగఁ బడియున్న భేతాళునిదాఁటి వెలుపలికిఁ జేరెను. అచ్చట గుహాకుఁ గుడిప్రక్కనున్న రంధ్రముకడ శిలావిగ్రహనాసికకుఁ గంకణము జొప్పించి గుహాద్వారమును మూయఁబ్రయత్నించు కేశవుఁగాంచెను. జేబిలోని నాళీకాయుధమును దీసెను. "కేశవా! ఆగుమచ్చటనే! కదలితివా నీతల వేయి ప్రక్కలుచేసెదను!"

కేశవుఁడు తిరిగిచూచెను. ఆహా! ఏమిచూపది! అప్పుడే యడవినుండి పట్టుకొనిరాఁబడిన పులినైనఁ జూచునాయట్లు? కాని మానవమాత్రులు మాత్రమట్లు చూచియుండరు.

కేశవునిచేయి రంధ్రమునుండి తెప్పపాటుకాలమున వెలుపలికివచ్చి

నది చేతిలోనికి రాని పదార్థము జగచ్చంద్రుని చేతియందలి పిస్తోలును దప్పించినది. కేశవుఁడచటనుండి మాయమయ్యెను. జగచ్చంద్రుఁడు పిస్తోలు గాల్చెను, గాని గురితప్పి యెక్కడనో తగిలినదా యగ్ని గోళము. జగచ్చంద్రుఁడు కేశవునిఁ దరుముకొనఁ దొడఁగెను. లోపలినుండి మాధవుఁడు భేతాళుఁడును వెలుపలి కప్పుడే వచ్చిరి. జగచ్చంద్రుని పరుగెత్తుటఁ జూచిరి. అతనితోడ వారును బోయిరి.

ముందు కేశవుఁడు పరుగెత్తుచుండెను. అతనికిప్పుడు కంకణము ధనవిధి యేమియు నవసరములేదు. ప్రాణమే — అమూల్యమయిన ప్రాణమే — అమూల్యమగు ప్రాణమే కావలసినది. జగచ్చంద్రాదులు తన్నుఁ జంపుటకే వచ్చినారని యాతఁడెంచెను. అసువుఁ దక్కించుకొన వాయువేగమునఁ బరుగెత్తుచుండెను. ఆతని కన్నులయెదుట లోకమంతయు దిరిగి పోవుచుండెను. ఎచ్చటను శాంతియున్నట్లు తోఁచుటలేదు. ఎచ్చటనున్నను, జగచ్చంద్రుని కరము తన్ను దుద ముట్టింపనే యున్నదని యాతనికి దృఢమగుచుండెను.

జగచ్చంద్రుఁడు వెనుక వచ్చుచుండెను. భేతాళబాబు మాధవుఁడు నాతనివెనుకవచ్చుచుండిరి. కొంతవడికి భేతాళుఁ డెలుగెత్తి "జగచ్చంద్రా! కేశవు నాగు మనుము. ఈమార్గ మొకకొండమీఁదికిఁ బోవును. అచట నావల నగాధ మొకటి యున్నది. శిఖరమునుండి పడెనా మఱిలేదు —" అని యఱచెను.

జగచ్చంద్రుఁడు కేశవునిముందుకుఁ బోవలదని వారించుచు మఱింత వేగముగఁ బరువిడెను. కేశవున కామాటలు మిథ్యలుగఁ దోఁచెను. జగచ్చంద్రుని మాటలే యసంభావ్యములు ఆతఁడు మోసగాఁడు. ఎప్పటివలెఁ గేశవుఁడు ముందునకు బరువిడుచునే యుండెను.

మరల మరల జగచ్చంద్రుఁడు కంఠమెత్తి వారించుచునే యుండెను. గాని యతనిమాటలు వ్యర్థములయ్యెను. అయిదు నిముసములకు జగ

చ్చంద్రుని దృష్టినుండి కేశవుఁడు మాయమయ్యెను. తోడనే హృదయ విదారకమగు నొకయార్తధ్వని వినఁబడినది!

జగచ్చంద్రుఁడు కొండయంచునకు వచ్చి చూచెను. అతనికిఁ గ్రింద నేమియుఁ గనఁబడలేదు. అంతయు నంధకారమే. పట్టపగలే యంధకారబంధురమై యున్న యాప్రపాత మెంతలోతుగనున్నదో యెవరికెఱుక!

జగచ్చంద్రుని భేతాళ మాధవులుగూడఁ గలిసికొనిరి. భేతాళుఁ డిట్లూహించెను. "జగచ్చంద్రా! ఇచ్చటనుండి పడెనా కేశవుఁడు?"

జగ — పడిపోయెను. నేనెంత చెప్పినను నాగలేదు.

భేతా — మూర్ఖుఁడు! తొలుతటినుండియు మూర్ఖుఁడే. ఆతని మూర్ఖత్వమే యిట్టి భయంకరమరణము దెచ్చి పెట్టినది.

జగ — ఇచ్చటనుండి క్రిందికిఁ బోవ మార్గమేదియును లేదా?

భేతా — మార్గమే లేదు. ఈప్రదేశము పాతాళముపలెఁ జూచు వారిగుండె జల్లుమనిపించుచుండఁ గ్రిందికి మార్గమును గనిపెట్టుటకు సాహసించువాఁ డెవఁడు? ఇఁక కేశవుఁ డీలోకమునకే లేఁడు.

జగ — అయిన కంకణము?

భేతా — నీవు తీసికొనలేదా?

జగ — అతఁడు నాకుఁ జిక్కనఁగదా?

భేతా — ఇఁక కంకణముతోన వదలుకొనవలసినదే.

మాధ — గుహాద్వారము దెఱచియున్నది. శీఘ్రముగాపోదమురండు. గగూలియా పరివారముచూచిన, ధననిధి మనకు దక్కునా? రండు.

భేతా — పోవలసినదే.

ముగ్గురును నెనుదిరిగిరి. భేతాళుఁడు "జగచ్చంద్రా! కేశవునితోడ గగూలియాను గూడఁ జూచితిని. ఆగగూలియా యెవఁడు? పాతాళ గృహమున మరణావస్థయందున్న వాఁడెవఁడు?" అనెను.

జగచ్చంద్రుఁడాశ్చర్యమున "భేతాళబాబు! నాతోడఁ బరిహాసము

లాడుచుంటివా?" అనెను.

భేతా — పరిహాసములాడుటకిది కాలముగాదు.

జగ — నీవు వేతాళగిరిగాలియాను జూచితివా! ఇది నిజమ్మేనా?

భేతా — చూచితిని. అబద్ధములంబలుక నాకవసర మేమున్నది?

జగ — ఇప్పుడాతం డేమయ్యెను?

భేతా — భేతాళగిరి గుహయందు భూతములచే బంధింపబడియున్నాడు.

జగ — బంధించిన దెవరు?

భేతా — కేశవుండు.

జగ — సరియే, మనమాబంధితుని జూచినపుడు అన్ని సంశయములు దీరంగలవు. పదుండు పోవుదము. మనము పోవునప్పటికాతం డుండునో యచ్చటనుండి పాఱిపోవునో!

భేతా — శీఘ్రముగా రండు. ఇంతకును కంకణము పోయినది.

జగ — నీవు చూపిన మార్గమున్నదిగాదా ధననిధిని దెచ్చుటకు? అదియుంగాక గుహాద్వారమును కేశవుండు మూసియుండలేదే. ఇంక మనకుం గంకణముతోడం బనియేమున్నది?

భేతా — మనకుం గంకణముతోడం బనియే లేదా? ఈ దినమే యానిధియంతయుం స్థానాంతరమునకుం గొంపోవుదురా?

జగ — అట్లే చేయవలయును. మాధవా! మనము గుహదగ్గరకుం జేరంగనే నీవు నాగపురికింబోయి చూడాధనుని దోడ్కొనిరమ్ము.

మాధ — అట్లే తోడ్కొని వచ్చెదను.

ఇట్లు ప్రసంగించుచు వారు గుహసమీపించిరి. దానిని జూచినపుడు వారికిం గలిగినది యాశ్చర్యమా! భయమా! భ్రాంతియా! తత్తరపాటా! ఏమననగును?

ఇంతకుమున్ను తెఱువంబడియున్న గుహ మూయంబడి యుండెను.

వెలుపల నొక్కపుడుగైన లేను. ఎన్నఁగు దేనిసహాయమున మంత్ర సిద్ధములును విచిత్రకంకణమాత్ర సాధ్యములును నగు నా కవాటములను మూసియుంచును ? మువ్వురు నచ్చట నిర్గమించి వెలువడి పోయిరి.

3౭

భేతా — జగచ్చంద్రా ? ఈ పని గగూలియా వేషధారి చేసినదే ! కేశవుఁడు కంకణమెత్తుకొని పోలేదు. ఇచ్చటనే పారవైచి పోయి నాఁడు. అది యీ కృతకసాహసికిఁ జిక్కినది. దానితో నీతఁడు గుహను మూసివైచి పోయినాఁడు.

జగ — కేశవుఁడు కంకణముతోఁబనే కాఁబోలు నా చేతిలోని పిస్తోలు గుఱి చెదరఁగొట్టినది ! అయి యుండును... . ఆ గగూలియా వేషధారి యిచ్చటనుండి వెడలిపోయెనో, ఇంకను నిచ్చటనే యుండెనో! మనము తెలిసికొనవలదా ? ఇచ్చటనే యుండి నిధిలోని ధనము నపహరించిన ?

భేతా — అట్లెన్నఁటికిని జేయఁడు. మనము మరల వత్తుమని యాతఁడెఱుంగఁడా ? ఇదిచూచి యిచ్చటనే తనకొఱకుఁ గాచియుందుమని తెలియఁడా ? ఆతఁడెప్పుడో పాఱిపోయియుండును.

జగ — అయిన నిప్పుడు కర్తవ్యమేమి ?

భేతా — నాగపురమునకుఁ బోవుటయే.

మువ్వురును నాగపురమునకుఁ బయలుదేరిరి. ఊరివెలుపలికివచ్చు నప్పటి కాయూరినుండి మణిపుర మార్గమునఁ బోవుచున్న యొక జనసమూహము వారికిఁ గనఁబడెను. జగచ్చంద్రుఁడు వారిని జూచి భేతాళునితో "భేతాళబాబు ! వారే మణిపుర రక్షకభటులు. గగూలియా జట్టువారిని దోడ్కొని మణిపురమునకుఁ బోవుచున్న ట్లున్నది" అనుచు, నొక్కపరుగున వారిఁ గలిసికొనియెను. వారిలో

నొకఁ డతనిఁ జూడఁగనే తక్కినవారిని సెలవ నొసంగించి యాతని కుశలప్రశ్నము లడిగెను.

జగ — ఇన్స్పెక్టరుగారు ! వీరి నేమార్గమునఁ గొనిపోవ నిశ్చయించితిరి?

ఇన్స్పె — కీచకాటవి నుండియే.

జగ — ఆమార్గము విపత్కరము కాదని యనుకొన్నారేమో —

ఇన్స్పె — అనుకొనినను, మీ యాలోచనము గ్రహించి యామార్గముననే పోవ నిశ్చయించితిని. వీని రక్షించుటకు గగూలియా సాంఘికులు వత్తురనియేకదా మీ యనుమానము ?

జగ — అవును.

ఇన్స్పె — వచ్చిన నీ దెబ్బతో సాధ్యమయినంతవఱకు గుంపు నంతనుఁ బట్టుకొనవచ్చును. పరిపూర్ణాయుధులగు భటు లిప్పుడు నాతోడ నిరువదిమందియున్నారు. కీచకాటవిలో శిథిలమందిరము వద్ద నేబదిమందియున్నారు. ఈ సైన్యము చాలునా గగూలియాతోఁ బోరుటకు ?

జగ — (నవ్వుచు) మంచిది. ఆమార్గముననే పొండు. మిమ్మింక నడ్డగించువారు లేరు.

ఇన్స్పె — మీ రెప్పుడు వచ్చెదరు మణిపురమునకు?

జగ — రేపువచ్చెదను.

ఇన్స్పె — అయిన రేపే యపరాధనిందారోపణపత్రమును సిద్ధము చేయుదును. నేను సెలవు తీసికొందును.

పిమ్మట వారందఱు వెడలిపోయిరి. ఈసంభాషణము ముగియు నప్పటికే భేతాళుఁడు మాధవుఁడు జగచ్చంద్రుని గలిసికొనిరి. మువ్వురును నాగపురముఁ బ్రవేశించిరి. జగచ్చంద్రుఁడు భేతాళుని; మాధవుని నక్షయునివద్దకుఁ బొమ్మని తాను శాంతబాబు గృహమున కేగెను.

శాంతబాబు ఎదుట కుర్చీలమీఁదఁ గూర్చుండియున్న యిరువురి

తోడ నేమియో లోకాభిరామాయణము మాటలాడుచుండెను. జగచ్చంద్రుఁడు ప్రవేశించెను లోనికి. ఆతనిఁ జూచి శాంతబాబు తక్క తక్కిన యిరువురు లేచి నిలువఁబడిరి. జగచ్చంద్రుఁ డాయిరువురియందొక్కనిఁజూచి "నాగేంద్రా! ఎప్పుడు వచ్చితివి?"

నాగేం — నేను వచ్చి మూఁడు గంటల కాల మయియుండును. ఉదయముననే రక్షకభటులతో వచ్చితిని.

జగ — ఈతఁ డెవరు? — ఈతఁడు మనయింటియం దుండిన గోపాలుఁడు గదు?

గోపాలుఁడు, "అవును? ప్రభు! తమకరుణచేత, ఇహలోకనరకబాధనుండి తప్పించుకొంటిని." అనుచు జగచ్చంద్రుని కాళ్ళఁబడియెను. జగచ్చంద్రుఁడు..."గోపాలా! లెమ్ము. లెమ్ము. నిన్ను నావద్దనేయుంచుకొందును లెమ్ము." అనియెను. గోపాలుఁడు లేచెను. అందఱు గూర్చుండిరి. జగచ్చంద్రుఁడు శాంతబాబుతో "తాతగారు! కార్యవశమున మీతోడ మాటలాడలేదని కోపింపకుఁడు" అనియెను.

శాంత — కుమారా! ఏమియు నష్టములేదు లెమ్ము. నాతో మాటలాడకున్న నేమి, ప్రస్తుతమును జూడుము.

జగ — నాగేంద్రా! బదరపురమున కరిగినప్పటినుండి నీవు చేసిన కార్యములను కనుఁగొన్న యంశములను దెలుపుము.

నాగేంద్రుఁడు వట్లెయని తెలుపఁదొడగెను.

"బాబుగారు! మీరు నన్ను బదరపురమున దేవీదాసుఁ గూర్చి విచారింపఁబొమ్మనినంత, నేనును నాయూరికిఁబోయితిని. ఊరుచేరునప్పటికి నాకొక సంశయము కలిగినది. ఈరూపముతోడను, ఈపేరుతోడనబోయి యాతనితో మాటలాడుట సంశయకారణమగునేమో! మహేంద్రబాబుగారిచేత రహస్యముగనుంప ననుజ్ఞాపితుఁడైన యాతఁడు హృదయము విచ్చి నాతోడ మాటాడునా? ఇట్లు చింతించి వేష

మును వేసుకుపూర్చుకొని యాతనింటికిఁబోయితిని. ఇంట నాతఁడు లేఁడు. వాచాలకుఁడగు నాతని సేవకుఁడుండెను. ఆసేవకునితోడ నావిషయమంతయు నొకకల్పితకథమూలముగాఁ దెలిపితిని. నేను నాగేంద్రుని తమ్ముఁడనియు, నాయన్న భార్యకు నాకుఁ దగవువచ్చి యామె నన్నొక మందుమూలమున బిచ్చివానిఁ జేసెననియు, నా పిచ్చి నెలకొకసారి వచ్చుననియుఁ జెప్పితిని. అతఁడు నాకథనునమ్మెను. తనయజమాని వైద్యప్రాముఖ్యమును దెల్పుటకు జరిగిపోయిన చరిత్ర నొకదాని నాతఁడు జెప్పెను. ఆచరిత్రము మణిపురమునఁ దిరుగు చుండు పిచ్చివానికి సంబంధించినదిగా గ్రహించితిని. వారి నెట్లైనను మోసగించి పిచ్చితనము బోఁగొట్టుటకుఁ దగిన మందు సంపాదింప నిశ్చయించితిని —

జగ — నాగేంద్రా! ఆ సేవకుఁడు నీకుఁ జెప్పిన కథఁ జెప్పి నావు కావు.

నాగేం — అదియుఁ జెప్పెదను. ఒకనాఁడు, దేవిదాసును వాణీనాథుఁడను వర్తకుఁడు బిలపించి తనకు మార్గమధ్యమందుఁ గనఁబడిన యొకరోగికి వైద్యముచేయుమనెనఁట. దేవిదాసారోగినిజూచి యాతఁడు తనవిరోధియని యెఱింగి, యాతని నప్పు డేమిచేసినను వాణీనాథునకుఁ దెలియునని యెంచి యున్మాదియగునట్లు మందీయనిశ్చయించెనఁట. ఇంటికివచ్చి యామందును సిద్ధముచేసి యొకని చేతికిచ్చి పంపెనఁట. ఆమందును సేవించి యారోగి యున్మాదియయ్యెనఁట. మందును రోగికిఁ దీసికొనిపోయి యిచ్చినవాఁడు గూడ దానిని భుజించి పిచ్చి వాఁడుకాఁగా దేవిదాసు వానికి నయమొనర్చెనఁట. ఇది యాతఁడు నాకుఁ జెప్పిన కథ. పిమ్మట దేవిదాసును సంధించితిని. ఆతఁడు నాకు మంచి మందిచ్చునట్లు వాగ్దానముచేసెను. వారి యెదుట నాపిచ్చిని బహువిచిత్రాకారముగాఁ బ్రదర్శించితిని. ఒకనాఁడు నేను వెడలిపో

వలయుననియు, మందు నివ్వమనియుఁ గోరితిని. దేవీదాసు మఱునాఁడనెను. మఱునాఁడు నేనరుగునప్పటికి దేవీదాసుఁడును, నాతని సేవకుఁడును నేనూ సంభాషించుచుండిరి. ఆసంభాషణము నన్నాశ్చర్యమున ముంచివైచినది. ప్రభాకరుఁడఁట. వానిని వెదకుటకు దామోదరుఁడనువాఁడును, దేవీదాసును మణిపురమునకేగిరఁట. దామోదరుఁడు దేవీదాసును మోసగించి మాయమయ్యెనఁట. ఇదంతయు విని నేను దామోదరుఁడెవ్వఁడోయని యాలోచించితినిగాని నాకు బోధపడలేదు. సంభాషణలో దేవీదాసు గోపాలుని పేరు రెండుమూఁడుసారులుచ్చరించెను. 'గోపాలుని పిచ్చిఁ గొట్టినఁ బ్రభాకరదామోదరుల గతియేమగు' నని యాతఁడు పలికెను. ఈ గోపాలుఁడెవ్వఁడు! మన యింటనుండిన సేవకుఁడా వాఁడే యొకవేళ నాపిచ్చివాఁడా? యనుకొంటిని. అప్పుడు పిచ్చిమాన్పుమందుఁ దీసికొని, యేమైనను ఆపిచ్చివాని బాగుపఱుప దృఢనిశ్చయముచేసికొంటిని. దేవీదాసున కేఁబది రూప్యములిచ్చి మందుఁ దీసికొంటిని. మణిపురమునకు వచ్చితిని. మణిపురమునఁ బిచ్చివాఁడు లేఁడు. ఆతనికొఱకు వెదకఁదొడఁగితిని. ఆతఁడు మరల బదరపురమునకుఁ బోయెనని తెలిసినది. అచ్చటికి మరల పోయి తుద కనేక కష్టములమీఁద బట్టుకొంటిని. ఎట్లో వాని చేత మందు సేవింపఁజేసితిని. నాయనుమానమంతయు యథార్థమయ్యెను. వాఁడు గోపాలుఁడే! ఆతఁడు తనపిచ్చితనము పోవఁగనే నాతోడ భయంకరవృత్తాంత మొకటి చెప్పినాఁడు......"

అని నాగేంద్రుఁ డటునిటుఁ జూడఁదొడఁగెను. ఆతనికన్నుల నీరు చిప్పిలుచుండఁ దనదుఃఖమును వారు చూడకుండవలయునని యాతఁడెంతో ప్రయత్నము చేయఁజొచ్చెను.

జగచ్చంద్రుఁడు నాగేంద్రుఁడు సంశయించుటఁగని "నాగేంద్రా! ఈశాంతబాబు మన కత్యంతమిత్రుఁడు. ఈయనకుఁ దెలియరాని రహ

స్యము తెలిసికొనుచున్నావు. నీవు చెప్పినన్నియు చెప్పుము” అనెను.

నాగేంద్రుడు దుఃఖము నడచుకొనలేకపోయెను. పొంగివచ్చుచున్న శోకవేగమున కాతడు చలించిపోయెను.

జగ — ఏల యీ దుఃఖము? నాగేంద్రా? ఏమిటావిషయము అంత దుఃఖకరమైనదయిన నిప్పుడు చెప్పవలెను.

గోపా — ప్రభూ! ఆతడు చెప్పక నిలిపినది నేను చెప్పెదను ప్రభాకరుడు, దామోదరదేవీదాసుల సహాయమున మహేంద్రబాబు గారిని జంపెను. నాకండ్లయెదుటనే చంపెను. ఆయన ప్రాణములు రక్షింపలేక, యీ నీచుడు బ్రతికియుండియుం జచ్చినవానివలె నయ్యెను అంతటితోం బోక తాను మహేంద్రుడనని మారువేషముతో ఆహంతకుం డింతకాల మందఱిని మోసగించెను.

జగ — ఆఁ! ఏమి! ఇదంతయు నిజమా! గంగాలియా చెప్పినదంతయు నిజమే! ఇక నీప్రభాకరుం డెందుబోవునో చూచెదను హా! ఎంతద్రోహము! ఎంతక్రౌర్యము! మాతండ్రిగారికి విషమిచ్చి చంపినదిగూడ నీప్రభాకరుడేనా? మహేంద్రుడు కాడా? — అన్నా మహేంద్రా!! ఈనీచుని క్షమింపుము! ఈద్రోహిని క్షమింపుము ఇంతవఱకు నాకహంతకుని నీవని భ్రమించి, యాడరానిమాట లాడితిని! క్షమింపుము! ...... నాగేంద్రా! రమ్ము పోవుదము. ఆ హంతకుం డెచ్చటనున్నాడో! వానిని నాయన్న నాతం డెట్లుచంపెనో యావిధముననే చంపెద. తునకలుగా తరిగెద.

శాంతబాబు లేచెను. జగచ్చంద్రుని చేయిం బట్టుకొనెను. “జగచ్చంద్రా! ఆగుము. ఆగుము - ఎట్టికార్యమును సంత యుద్రేకముతో సానుకూలము చేయజాలవు. నీమనమును సంక్షుభితము చేయుచున్న విషయములన్నియు నంతయుద్రేకము గల్గించునవియే అయినను, నీవంటి దృఢచిత్తుడుగూడ వాని పోడిమి నాగలేకున్న

నేమున్నది? కొంచెము శాంతింపుము" అనియెను.

జగచ్చంద్రుఁ డెంతో ప్రయత్నముపై శాంతించెను. వారలుఁ గూర్చుండెను. వారందఱు జరిగినవిషయములఁగూర్చి సంభాషింపఁదలంచిరి. కాని జగచ్చంద్రుఁడు సర్పోపాఘాతమువలె నా భయంకరరహస్యకారణాఘాతము తాకున పక్షవాతరోగియై పోయిన జగచ్చంద్రుఁడు ఇంతవఱకు నిరపరాధియగు నాగేంద్రుని పవిత్రనామమును హంతకులతోఁ జేర్చి తాను తూలనాడినందులకు లోలోనఁ గుమిలిపోవుచున్న జగచ్చంద్రుఁడు వారిసంభాషణములఁ బాల్గొనఁజాలునా?

౩౯

జగచ్చంద్రుఁడు నాగేంద్ర గోపాలుర మరల నెటకో పంపించి యొంటరిగనే అక్షయుని సౌధమునకు వచ్చెను. అక్షయ చూడాధనులు శేతాళ మాధవులతోడ నొక గదియందుఁ గూర్చుండి జగచ్చంద్రుని కొఱకు వేచియుండిరి. జగచ్చంద్రుఁ డాగదిఁ బ్రవేశించెను. అచ్చట నున్నవారందఱు దాతనియందుఁ జూపట్టు మార్పున కత్యాశ్చర్యమందిరి.

గుహలో గగూలిమాతోడి సంభాషణ ముగియుడే జగచ్చంద్రుని మోమున కొకింత రిచ్చపాటుతోచి యనమంతవైవర్ణ్య మారంభమైనది. ఇంతకుముందు నాగేంద్రుని కథాశ్రవణముతో నయ్యది పరిపూర్ణతఁ జెందినది. నిజసోదరుని గుఱించిన సమస్తమును వినిన తోడనే యతని విచారసంతాపము లావేశించి వేగించివేయ సాగినవి. నిన్నటి జగచ్చంద్రుఁడుగ లేడతఁ డిపుడు. బాహ్యాకృతి యందు గూడ పూర్తిగ మాఱిపోయి యున్నాఁడు. జగచ్చంద్రుఁ డాసనము స్వీకరించిన వెనుక చూడాధనుఁ డాతని వాలక మంతయుఁ జూచుచునే "పుత్రకా! నీకొఱకే ఎదురుచూచుచున్నాము. కాని, ఇదేమి? — నీవిట్లుంటివేమి? ఇంతమార్పు కలుగుటకుఁ గారణమేమి?"

అక్షయుఁడు — అవును, జగచ్చంద్రా! అదియే నేనను అనుకొనుచుంటిని. ఇంతటి యాకస్మికవిచారమునకుఁ గారణమేమి? మహేశ్వరమునుండి యేమయిన దుఃఖవార్త తెలిసినదా? మహేంద్రబాబున కేమయిన విపత్తు సంభవించినదా?

జగచ్చంద్రుఁడు — బాబు! ఆపేరింక జీవన్మానవులలో నెవరికిని నుపయోగింపకుము. ఆ పేరు గలిగియుండిన పవిత్రమూర్తి, మహానుభావుఁడు — మా యంటివారికిఁ జంద్రుఁ డట్టివాఁడు గతించెను. మరి నాదుఃఖకారణము గూడ మీకు తెలియఁగోరునది? ఇంతవఱకు మహేంద్రుఁడని పిలువఁబడుచు, నాకును మాతండ్రిగారికినిఁ దీరని కళంకముగూర్చి, తుదకు మాతండ్రిని జంపి పవిత్రమూర్తియగు సరోజినీదేవిని హత్య గావించి, భూపేంద్రుని జంపి, యిప్పటికిని మహేంద్రనామమునే తాను ధరించి, యానామమును గళంకము చేయుచున్నవాఁడు నిజముగ నాయన్నయగు మహేంద్రుఁడు గాఁడు. తక్కినవారివలెనే నా యన్నయు నీ హంతకుని చేతులయందే ప్రాణమువాసెను. ఆహంతకుని, ఆపాతకి నింతకాలము మహేంద్రుఁడని భావించి యా పేరునకుఁ గళంక మాపాదించితిని! దైవము నా మెడఁ గరుణఁ జూపునుగాక! ఇప్పుడే యీక్షణమే బయలుదేరి వానిని నిర్మూల మొనరింపవలసియున్నది.

అక్షయుఁడు ఆవిషయములను, ఈభయంకర రహస్యములను విని యప్పు డెంత యాశ్చర్యపడి యుందురో యూహ్యమే!

అక్ష — జగచ్చంద్రా! శాంతింపుము! నీ యిష్టానుసారమే చేయుదువు, కాని చాలప్రొద్దుపోవచ్చినది. ఉదయమునుండియుఁ జాలప్రయాసపడి యలసియున్నావు. స్నానముచేసి భోజనము చేయుదము లెమ్ము.

అందఱును భోజనమునకు లేచిరి. భోజనానంతరము వసారాలో నందఱుఁగూడి నాఁటి విశేషములనుగూర్చి ముచ్చటించుకొను

చుండిరి. నాఁడు తన కండ్లఁ బడిన రెండుసంహారణములలో రెండవది యగు కేశవుని భయంకరమరణము జగచ్చంద్రుని భేతాళాభార వహమైన హృదయములో లలితాస్మృతి కలిగించినది. కొంతవడి యేమేమియో యాలోచించుకొని యతఁ డిట్లనెను.

"మాధవా! నీపూర్వ యజమానులలో నొకఁడగు కేశవుని జీవి తము నేఁడిట్లు తుదముట్టినది. కాని యానందుఁ డేమయ్యెనో! ఆనాఁ డతనిని వెదకుటకై పోయిన నీవుగూడ నదృశ్యుఁడ వయితివిగదా. నాఁటికి నేఁటికిఁగూడ నతని విషయమై నీ వేమియుఁ జెప్పనేలేదు. నీ వేమైనఁ జెప్పునది యున్న నిప్పటికైనఁ జెప్పుము. ఇఁక నానం దుని విషయమై నేను సత్వరప్రయత్నములు చేయవలసియున్న" దనెను.

మాధ — బాబుగారు! మీరాయనను గుఱించి యేమియుఁ బ్రయత్నింప నవసరము లేదు.

జగ — ఏమి? అతఁడు నిర్జీవియా?

భేతాళుఁడందుకొని —"కాదు, జీవించియే యున్నాఁడు" అనియెను.

జగ — మీ రెఱుఁగుదురా?

భేతా — అవును. కాని గగూలియా జట్టంతయు మీవశము కానున్నది గనుక మీరతనికై వేఱుగ బ్రయత్నింప నవసరములేదు.

జగ — ఏమి? ఆనందబాబు గగూలియా సంఘమున జేరియుండెనా?

భేతా — అవును. తెలుపవలెనా యతని వృత్తాంతము? — ఆనాఁడు కేశవుని యధీనమందున్న కంకణము నుద్ధరించి మీకీయఁ బ్రయత్నించినదియు, లలితను గగూలియానుండి రక్షించి నీస్వాధీన మొనరించినదియు, దామోదరుని యుదంతము, భూపేంద్రుని హత్య నీ కెఱిఁగించినదియు, పాతాళమందిర రహస్యమార్గమును గనిపెట్టి కంకణోద్ధరణమునకు నిన్ను గొనిపోయినదియు, భేతాళనామముతో మీయెదుట నున్నదియు నెవరు? — ఆనందుఁడే!

ఎల్లరాశ్చర్యాన్వితులయిరి. జగచ్చంద్రుఁడు లేచి కౌఁగిలించుకొనెను. ఆనందము కల్పించిన సుభోజనాదనముల సానందముములో నందరు నారాత్రి సుఖనిద్ర జెందిరి.

తెలతెలవాఱుచుండగనే నందఱును లేచి మణిపుర ప్రయాణోన్ముఖులయి యున్న జగచ్చంద్రుని సాగనంపుటకు చావడియందుఁ జేరిరి. జగచ్చంద్రుఁడును సిద్ధముగ నుండెను. ఇంతలో వెలుపల గుఱ్ఱపు డెక్కలశబ్దము వినిపించినది. జగచ్చంద్రుఁడు గవాక్షమునుండి తొంగిచూచి, "ఏమిది! నిన్నను బోయిన నాగేంద్రుఁ డప్పుడే తిరిగి వచ్చె నెందులకో" అనుచు వెలుపలికిఁ బోఁ బోవుచుండ నాగేంద్రుఁడే లోని కేతెంచి నమస్కరించెను. జగచ్చంద్రుఁడు "నాగేంద్రా! ఏమి ఇంత తొందరగా వచ్చితివి?" అనెను.

నాగేం — బాబు! మహేంద్రవేషధారి మరల మణిపురికి వచ్చినాఁడు. అతనిఁబట్టుటకుఁ దగిన యదనిదియే యని సురేశబాబు సలహాతో నిశ్చయించుకొని మిమ్ముఁదోడ్కొని పోవ వచ్చితిని.

జగ — అతనితోడ నింకెవరైన నున్నారా?

నాగేం — ఉన్నాఁ డొకఁడు. కలకత్తా వర్తకుఁడఁట. అతనిపేరు మాణిక్యలాలు.

జగ — అక్షయబాబుగారు! మాకు సెలవిచ్చెదరా? మణిపురమున కిప్పుడే బయలుదేరవలయును. నేటి సాయంత్రమునకు ప్రభాకరుఁడు చెఱసాలయందుండవలయును.

చూడా — తండ్రీ! నాకుఁగూడ ననుజ్ఞ యీవలయు.

అక్ష — సరిరో, పొండు. మీరందఱుఁ బోయెదరా?

జగ — లేదు లేదు. మాధవుఁ డిచ్చటనే యుండును. ఏమైన సమాచారము బంపవలసిన నాతనిచేతఁ బంపుఁడు.

నాలుగు గుఱ్ఱములు సిద్ధము చేయఁబడినవి. వెంటనే జగచ్చంద్ర

జూదాఘనులు, నాగేంద్రానందులు మణిపురమునకు ప్రయాణమయిపోయిరి.

సాయంసమయము: మహేంద్రుఁడు తన ఆఫీసుగదియందుఁ గూర్చుండి, యెదుటనున్న మాణిక్యాలాలుతో సంభాషించుచుండెను. వారి సంభాషణ మెంతసేపటినుండి జరుగుచున్నదో తెలియదు.

ఆకస్మికముగా నాగది తలుపు గుభాలునఁ దెఱవఁబడినది. జగచ్చంద్రుఁడు గదిలోనఁ బ్రత్యక్షమయినాఁడు. క్రోధము మూర్తీభవించినదోయన హఠాత్తుగాఁ దనగదిఁ బ్రవేశించిన జగచ్చంద్రునిఁ జూచి, యచటనున్న యిరువురు నివ్వెరపడిరి. భయమున వడవడ వణఁకిరి. తీక్ష్ణేక్షణములతో వారి నిరువురఁ జురచురఁ జూచుచు జగచ్చంద్రుఁడు ద్వారమునకు సరిగ నిలిచెను.

మహేంద్రుఁడు కొంతవడికి ధైర్యము వహించి "జగచ్చంద్రా! మరల నాయింటి కేలవచ్చితివి? ఎవరి యాజ్ఞఁగొని వచ్చితివి?" అనియెను.

జగచ్చంద్రుఁడు వెనుకదాఁచియుంచిన కుడిచేతిని ముందరికిఁ దీసి, యందున్న పిస్తోలును వారిపై గురిపెట్టి "ప్రభాకరా! ఇంకెన్నినాళ్ళీ బూటకనాటకము? నీమహేంద్రత్వమును స్థిరపఱచుకొన్న పిదపఁగదా యీయిల్లు నీదగును!" అనియెను.

పిడుగు తాకునవలె మహేంద్రుఁడు వెనుకకుఁ బడియు, వెంటనే యమానుషమగు ధైర్యముతో నొక్కవెడగునవ్వునవ్వి "ప్రభాకరుఁడా! ప్రభాకరుఁ డెవ్వఁడు? ఇచ్చట నీపిచ్చిమాటలు నమ్మువా రెవ్వరును లేరు. పొమ్ము, ఇచ్చటనుండి. లేకున్నఁ మెడబట్టి గెంటించెదను" అనియెను.

జగచ్చంద్రుఁడు భయదమగు కంఠస్వరమున — "ఓరీ! హంతకా! చండాలా! ఇంకను నవ్వుచుంటివా? నీయెదుట నున్నవాఁడు జగచ్చంద్రుఁడు గాఁడుసుమా! జగత్సింహుఁడు. ప్రభుత్వము పేర మీ యిరువురును నా ఖైదీలు. అచ్చటనుండి కదలితిరా మీ ప్రాణ

ములు మీవి కావు."

మహేం — ఏయపరాధముసకై నీవు నన్ను నిర్బంధించుట?

జగ — ప్రభాకరా? నీవు దేవీదాసుని తోడను, దామోదరుఁడను మఱియొక హంతకునితోడను గలిసి మహేంద్రుని జంపినందులకు, గోపాలుఁడను నాతనిఁ జంపఁ బ్రయత్నించినందులకు, విజయచంద్రబాబు గారికి విషము పెట్టి చంపినందులకు, భూపేంద్రబాబును జంపించినందులకు, గగూలియాను శిథిలమందిరపాతాళగృహమున జంపినందులకు నిర్బంధింపఁబడుచున్నావు. మాణిక్యలాలు! విశ్వేశ్వరంబాబు! దామోదరా! నీవు భూపేంద్రుని జంపినందులకు, సురేశు నింటఁ జౌర్యము సలిపినందులకు, మహేంద్రుని జంపుటలో నీహంతకునికి సహాయము చేసినందులకు నిర్బంధింపఁబడుచున్నావు. హంతకులారా! తెలిసికొంటిరా మీయపరాధములను? నావంశమునకు, నాకును మీరు గావించిన యపరాధమునకు మిమ్ము తునకలు చేయఁగలిగియున్నాను, కాని నేఁ జేయనున్న పని ధర్మాధికారి చేయనుండ నవసరమేల యనియు, మీవంటి పాతకుల రక్తమున నాచేతిని గళంకితము గావించుకొనుటేల ననియు యూరకున్నాను.

అని జగచ్చంద్రుడు యెడమచేతనున్న బిగులు గట్టిగా నూదెను - మరునిముషముననే యాగదిలోనికిఁ బదుగురు పోలీసుభటులు ప్రవేశించిరి. జగచ్చంద్రుని మాటలు పాముకాటువలె నాటి నిర్విణ్ణులైన ప్రభాకర దామోదరుల నావేశించిన భయము, భ్రాంతి తొలంగక మున్నే వారిచేతులకు సంకెలలు దగిలింపఁబడినవి. హంతకు లిరువురచటినుండి వారిచే లాగుకొని పోఁబడిరి.

ప్రభాకరుఁడు లేచినపుఁ డాతని యొడినుండి యొక విచిత్రవస్తువు క్రింద బడినది. జగచ్చంద్రుఁడు దానిని నేలపైనుండి తీసెను. ఏమి టది? భేతాళగిరి గుహాద్వారమునం దుంపఁబడిన ధననిధికిఁ బ్రాణభూత

మగు కంకణము.

జగచ్చంద్రుఁడు — ఓరీ ప్రభాకరా! నీవేనా గఫూరియా వేష మును ధరించినవాఁడవు! భళి! జగన్నాటకమున నెన్నిపాత్రములు ధరించితివి! లోకములోనియు దమ మధ్యమందున్న నీవంటివానినిఁ గనుఁగొనజాలక నీకన్న వేయిమడుఁగులు తక్కువయగు ప్రజ్ఞఁ గల వానిని గఫూరియాను స్మరించి భయపడుచుండిరిగదా? నీ దారుణ ప్రవర్తనము నెంత విచిత్రముగ నాచ్ఛాదించితివి! నీతోడ గఫూరియా గాదుకదా - పదివేవురు గఫూరియాలైన సమానులు కాఁగలరా?

౪౦

క్రిందటి ప్రకరణాంశములు జరిగిన నాలుగవనాఁడు మణిపుర న్యాయ స్థానమున ప్రభాకరాదులపై మోపఁబడిన హత్యాభియోగము విచా రణకు వచ్చినది. ప్రభుత్వసాక్ష్య మంతయుఁ బూర్తి యయినది. అప రాధుల తుది వాఙ్మూలాదులఁ దీసికొనుకాలము వచ్చినది.

న్యాయాధిపతి — నిందితులారా! మీపై , నారోపితము లయి యున్న ఘోరాపరాధములఁగూర్చి యేమయినఁ జెప్పఁదలంచుకొన్నఁ జెప్పుకొనవచ్చును.

ప్రభాకరుఁ డపుడు ఇంతవఱకును వంచియున్న తల యెత్తి నల్గడల దృష్టి సారించెను. కిక్కిఱిసియున్న యా మందిర మంతయు వేయి కన్నులతో నాతనినే చూచుచుండుటఁ గనియెను. ఆతని యాపాద మస్తకము నొకపరి వడఁకెను. కొంతు సవరించుకొని యాతఁ డిట్లు చెప్పఁదొడంగెను.

"న్యాయప్రభూ! మీవంటి యుత్తములతో మాటలాడుటకేని నావంటి ఘోరపాతకి కర్హతయుండదు. అనేక హత్యలు చేసి, నావంటి జీవములను జీమలను నలిపినట్లు నలిపివైచిన నే నెక్కడ!

ధర్మమూర్తులరై యధర్మము నడిపి ధర్మప్రతిష్ఠాపనము చేయు మీ రెక్కడ? అయినను - పాపప్రవాహమునఁ బడి కొట్టుకొని పోవుచున్న నావంటి తుచ్ఛుని వ్యర్థజీవితమునకుఁ దుదిఁ గల్గింపఁబోవు మీరు నాకు మిత్రు లగుదురు కావున తమకు నా చరిత్రము జెప్పు కొందును. సావధానులరై వినఁ బ్రార్థించెద.”

అచ్చటనే యున్న జగచ్చంద్రాదులు ప్రభాకరునియందీమూఁడు దినములలోఁ గలిగిన పరివర్తనమున కాశ్చర్యపడిరి. ఎన్నియో హత్యలుచేసి రక్తమునఁ మునిఁగి తేలుచుండిన క్రూరుఁడా తమయెదుట నుండునది! కాదు! కాదు! తనయపరాధములకై పరితపించి భగవంతుని క్షమాపణము కోరుకొని, తనవంటి నీచులకు నీతిఁగఱపనున్న యుత్తముఁడు! ఆహా! ఎంత యాశ్చర్యకరమగు మార్పు!!

ప్రభా — మహేంద్రుఁడు జగచ్చంద్రుఁడు నెట్లో యట్లే నేనును విజయచంద్రుని కుమారుఁడను.

న్యాయస్థానమున హాహాకారములు బయలువెడలినవి. భటుల “నిశ్శబ్దము, నిశ్శబ్ద” మను నదలింపులతో మరలఁ బ్రశాంత మయి పోయినది.

ప్రభా — మణిపురమునందు విజయచంద్రుఁడు తన తండ్రి జీవించి యుండఁగ నాయనకుఁ దెలియకుండఁ దక్కువజాతి యువతితోడఁ జెలిమిఁ గావించుకొనియెను. గుణ మెట్లున్నను జాతితక్కువయైన నెవ్వరును నంగీకరింపరుగదా వివాహాదికార్యములకు? అందుచేత విజయచంద్రబాబు నాతల్లిని మిగుల ప్రేమించినను, వివాహము చేసికొన వీలులేక పోయినది. తండ్రి యాజ్ఞానుసార మింకొక కన్యను వివాహమయ్యెను.

“నాతల్లి విజయచంద్రుని ప్రేమకన్న నన్యము తనకువలదని, యవమానమునకు, యధర్మమునకు యాతనినే నమ్ముకొని వివాహములేక భోగస్త్రీ మాత్రయయి యుండెను. ఎంత నీచత్వమున కయిన నోడ్చు

బడెనునాసి యాతని నిరువనిచ్ఛగించినది కాదు !

"ఇట్లు చాలకాలము జరిగినది. ఇంటభార్యయు నిచ్చట నాతల్లియు నొకేమారు గర్భము ధరించిరి. అది మొదలు మాకుఁ గష్టములు ప్రారంభములయ్యెను. అంతవఱకుఁ బరిపూర్ణత్వము నందియున్న విజయచంద్రుని ప్రేమ తగ్గఁజొచ్చినది. నా తల్లియన్న నాతనికిఁ గడ కసహ్యముగూడఁ గలుగజొచ్చెను. ఎట్లో బోధించి యామెను విజయచంద్రుఁడు నగరపురమునకుఁ బంపెను. అచటి కాతఁడు నెలకేఁబది రూప్యములు పంపుచుండెను. అప్పటినుండియు మేమచ్చటనే యుండుచుంటిమి.

"నాకు బదునెనిమిఁదేడులు వచ్చినప్పటి కాయన పంపుచుండిన మాసాశనమును నిలిచిపోయినది. నే నుద్యోగమునకుఁ బ్రయత్నించి, యిపుడిచ్చట నాకు విరోధముగ సాక్ష్యము చెప్పిన దేవీదాసువద్ద సేవకుఁడ నయితిని. ఆతఁడు నాచేత ననేకపనులు చేయించుచుండెను. అవన్నియు నిప్పుడు తెలిపి యుపయోగములేదు. నా సేవకత్వము ప్రారంభమయిన నొకవత్సరమునకు, ఈదామోదరునికి నాకును మైత్రికుదిరినది. ఈతఁడు గగూలియా సంఘవిషయము, దానియందు జేరినఁ గలలాభమును నాకువర్ణించి వర్ణించి దానిలోఁ జేరునట్లు నన్నుఁ బురికొల్పెను.

"అప్పుడు నేను గగూలియాసంఘమందుఁ జేరితిని. ఎనిమిదివత్సరములు సంఘస్థుఁడనుగానుంటిని. పిమ్మట నొకనాఁడు నాతల్లికి జబ్బుగ నున్నదని తెలిసి గగూలియా యనుజ్ఞమీఁద నామెకడకుఁ బోయితిని. ఆమె మరణశయ్యయందుండెను. నేను గగూలియాసంఘము నందుఁ జేరితినని యామె యెఱుంగదు. ఉద్యోగవశమున నాగపురమునందుంటినని యామెకుఁ దెలిసినది. ఆమె యప్పుడు విజయచంద్రుని వృత్తాంతమంతయుఁ జెప్పి, నాకెప్పుడైన సహాయమువలసి

యున్న నాతనిఁ బ్రార్థింపుమని చెప్పెను. అంతవఱకుఁ దండ్రిలేని వాఁడనని తలంచుచుండిన నా కామాటలు ఆశ్చర్యకోపములను గల్గించినవి. ఇంతవఱకును నావిషయమును రహస్యముగనుంచితివేలయని యామె నడిగితిని ! ఏమిలాభము ! ఆనాఁడే యామె మరణించినది.

"ఎట్లు జన్మించినను నేనును విజయచంద్రుని కుమారుఁడనే కదా ? తనకుమారుఁ డన్నమాటలేక చోరవృత్తిని జీవించుట కాతఁ డంగీకరించునా ?" అనుకొనుచు మణిపురమునకుఁ బదిదినములావలఁ బోయితిని. విజయచంద్రుని జూచితిని. నాతల్లి మరణవార్తఁ దెలిపితిని. నన్ను జోరవృత్తినుండి యుద్ధరింప వేఁడితిని. విజయచంద్రుఁడు నామాటల కత్యంతాగ్రహములనంది నన్ను నాతల్లినిదిట్టి భటులచేత నన్నిల్లువెడల నడిపించెను. అవమానమునను, గ్రోధమునను నుడికి పోవుచున్న చిత్తముతోడ నొకఘోరమగు ప్రతిజ్ఞచేసితిని. విజయచంద్రుని వంశము నిర్మూలముచేయుదునని శపథమొనర్చితిని.

"పిమ్మట నాలుగునెలలయినది. ఒకనాఁడు మణిపురమునందుఁ బోవుచున్న నన్ననేకులు 'మహేంద్రా! మహేంద్రా!' అని పిలిచిరి. ఏమేమోమాటలాడిరి. అవి నాకేమియు నర్థముకాలేదు. కాని నాకొకవిషయము దృఢముగఁదట్టినది. మహేంద్రునకును నాకును నేదియో పోలికయున్నది. అందుచేతనే వీరు నన్ను మహేంద్రుఁడ నని భ్రమించుటయని యెంచుకొంటిని. అప్పుడే విజయచంద్రునిపైఁ బగదీర్చుకొనుట కుపాయముతోఁచినది. ఇది జరిగిన యయిదుదినములకు మహేంద్రుఁడు కార్యార్థము బదరపురమునకుఁ బోవునని తెలిసికొంటిని. ఆతని బదరపురములోఁ దుదముట్టింపనిశ్చయించి యచ్చటికిఁ బోయితిని. అదృష్టవశమున దామోదరుఁ డక్కడ నాతోఁ గలిసికొనెను. దేవిదాసునకుఁ గొంతధనమిత్తునని యాతని సహాయమును గొని యానాఁటిసాయంకాలమందే మహేంద్రునిఁ జంపివైచితిని.

గోపాలుని గూడఁ జంపవలయునని యెంచితినిగాని యింతలో నెవ్వరో వచ్చుచున్నట్లుశబ్దమువిని మహేంద్రుని వస్త్రపేటికఁ దీసికొని పాఱి పోయితిని.

"ఆపేటికనుండి మహేంద్రుని వస్త్రములతో నాతనివలె వేషము ధరించితిని. విజయచంద్రునింటఁ బ్రవేశించితిని. నన్నెవ్వరు ననుమానింపలేదు. అదిమొదలు విజయచంద్రునకు నాయందభిమాన మెక్కువగునట్లు ప్రవర్తించితిని. కాని నాహృదయమునందొక భయము మాత్రము వేధించుచునే యుండెను. మహేంద్రునిభార్య సరోజిని నన్ను గుర్తించునేమో యను భయమేయది; ఆతని ప్రవర్తన మామెకన్న నితరుల కెట్లధికముగ తెలియఁగలదు? ఇతరవిషయములందు మహేంద్రుని సహజసౌమ్యగుణము నేను బూనియున్నను, సరోజను యెడల మాత్రము క్రౌర్యముగఁ బ్రవర్తించి యామె నెంతదూరమున నుంచవలయునో యంతదూరమున నుండునట్లు చేయుచుంటిని. కాని మానవప్రకృతి బలహీనమయినదిగదా? కొంతకాలమిట్లు జరుగుచుండెను. ఆమె రూపమును దినదినమును జూచుకొలఁది యంతవఱకు నెన్నఁడును నెఱుంగని వేదనయొకటి హృదయమున నారంభించి నన్ను యుడికించుటకుఁ బ్రారంభించినది. ఆమోహాభరమున కాగఁజాలక నా పాపము నత్యంత ఘోరతరముగుటకు, మహాపతివ్రతయనదగు సరోజినీదేవి మానము నాహుతిగఁ గొంటిని! ప్రభాకరుని వదనము సిగ్గునఁ బశ్చాత్తాపమున జేవురించెను. న్యాయస్థానమున నన్నిదిక్కులనుండి "ఘోరము! ఘోరము!" "ఓరిపాపి! ఎంత క్రూరుఁడవురా!" ఈమొదలగు ధ్వనులు చెలరేగినవి. వానిని శాంతింపజేయుటకు భటులకు జాల కష్టమయ్యెను. మరల ప్రభాకరుఁ డిట్లు చెప్పఁదొడఁగెను.

"ఆమెయు పాపము నన్ను మహేంద్రుఁ డనియే భావించి, యనుమడంచిన ప్రేమతోఁ దిలకింపఁజొచ్చినది. ప్రభూ! ఈవిధమున

నాఱునెలలు జరిగినది. ఆయాఱునెలలు సరోజనీదేవి యకృత్రిమప్రేమయందు అనేక భయములతో గగ్గోలుపడుచున్న యీ నీచుఁడత్యంతసౌఖ్యముగఁ గడపఁగలిగెను. నాజీవితమునం దాదినముల సౌఖ్యమే స్వర్గసౌఖ్యము. ఆకాలమునందు నే నేపాపకార్యమును జేయలేదు. జగచ్చంద్రుఁ డప్పుడు గొప్పయుద్యోగమునం దుండెను. ఆతఁడుమాత్రము నన్ననుమానించుచున్నట్లు నాకుఁ దోఁచినది. ఆతని నెట్లయిన సమ్మాలనము చేసినగాని నాకు శాంతి యుండదని యెంచితిని. చాల దినములు నాప్రయత్నము నెఱవేఱినది కాదు. ఏలయన, నింటనున్నప్పుడు నేనాతని నేమయినఁ జేసిన విజయచంద్రబాబుగారికిని సరోజనికిని దెలియునని భయము. విజయచంద్రునికిఁ దెలిసినను గణింపనుగాని శాంతి యనుమాట యెఱుఁగని నాకు సౌఖ్యము, శాంతిఁ గూర్చిన యాతరుణీరత్నమునకుఁ దెలిసిన భరింపఁజాలను. మీరందఱు నన్నెంత గర్హించినను సరియే, నేనెంత పాతకినని యెంచినను సరియే, సరోజనిని నేను హృదయపూర్వకముగ నిర్మలముగ అపరిమితముగఁ బ్రేమించితిని.

"ఒకనాఁడు జగచ్చంద్రుఁడు కంపెనీ ధనము 14000 రూప్యములఁ దెచ్చి యింట నుంచెను. అదియే సమయమని దానిని నేనపహరించితిని. నేర మాతనిపై నారోపితమగునట్లు గావించితిని. తండ్రితోడ నాతఁడే తీసినాఁడంటిని. బోసుగారికిని నట్లే బోధించి, యభియోగము దెచ్చునట్లు చేసితిని. ఇవ్విధమున జగచ్చంద్రుఁడు ఇంటను వెలుపలను గూడ గర్హింపఁబడి కలకత్తాకుఁ బోయెను.

ఒక విరోధి తప్పినాఁడుగదా యని సంతసించితిని. జగచ్చంద్రుఁడు పోవువఱకు నాబోధనల నమ్మి యాతనిఁ గ్రూరముగఁ జూచుచుండిన విజయచంద్రుఁడు, ఆతఁడు కలకత్తాకుఁ బోయినది మొదలు తన ప్రవర్తనకు బరితపించి నన్నుఁ దిట్టి, యాతని మరలఁ

బిలిపింప నుద్యోగింపఁ దొడఁగెను. మరల నామార్గమునకు రెండవ శత్రువు వచ్చినాఁడని యెంచితిని. ఎందఱు వచ్చినను వరివారి నిర్మూల నోపాయమే నాకప్పు డనుష్ఠేయమయినది. అందుచేత విషప్రయోగమునఁ దండ్రినిఁ జంప నిశ్చయించితిని. దేవీదాసువద్ద నేను బని చేయుకాలమునఁ గొన్ని విషయములఁ గూర్చి నేర్చుకొనియుంటిని. అజ్ఞానము నా కిప్పుడు సహాయము చేసినది. నాకు దెలిసిన విషయములందుఁ బ్రతిదినము నిచ్చుచుండిన నొక సంవత్సరమునకు ప్రాణములఁ బాయునట్లు చేయునది యొకటి యున్నది. దానిని బ్రయోగింప మొదలిడితిని.

విజయచంద్రుఁడు తీరని వ్యాధికి లోనయ్యెను. వైద్య రామనాథుఁడు రావింపఁబడెను. అతఁ డెన్నియో మందుల నుపయోగించెను. ఉపయోగము లేదు. దినదినము రోగము వృద్ధి యగుచుండెను. ఒకనాఁడు రామనాథుఁడు మాకుఁ దెలియకుండ రోగి గదికి రోగిని బరీక్షింపవచ్చెను. అచ్చటనే రాత్రి రోగి కిచ్చుచుండు పాలు కొంచెము లోటాయందుండుటఁ గాంచి రోగకారణమును దెలిసికొనియెను. నన్నుఁ బిలిపించి యడిగెను. అయిదువేల రూప్యము లిచ్చినగాని యీ రహస్యమును దాఁచనని బెదరించెను. కొంత వాదముమీఁద నంగీకరించితిని. ఆనాఁడు మధ్యాహ్నము రామనాథుఁడు మరలవచ్చి యెవ్వరును లేని సమయమున తండ్రిగారితో మాటలాడెను. విషప్రయోగవిషయముఁ జెప్పివైచెను. విజయచంద్రుఁడీ విషయము విని తాను వ్రాసియున్న మరణశాసనమును రామనాథుని కిచ్చి, కలకత్తాకుఁ బోయి జగచ్చంద్రుని దోడ్కొని రమ్మనియెను. రామనాథుఁ డానాఁడే కలకత్తాకుఁ బ్రయాణమయ్యెను. కాని నేనాతని మణిపురమునకు మూఁడు మైళ్ళ దూరమున నే చంపి, యాతనివద్దనున్న మరణశాసనము సంగ్రహించితిని.

"ఇంటకి వచ్చితిని. ఇంటఁ బాచకుఁడు నా మనుష్యుఁడు. ఆతనిని విజయచంద్రుని గదిని వీడి యీవలకు రావద్దని యాజ్ఞాపించితిని.

బదరపురమునుండి దేవీదాసుని రావించితిని. ఆతఁడు నన్ను గుర్తింపలేదు. అటుపిమ్మట నాతఁడు మందిచ్చుచుండెను. రామనాథుఁ డరిగిన పదునేఁడవనాఁడే విజయచంద్రుఁడు మరణించెను. దేవీదాసుకు వేయి రూప్యము లిచ్చి యాతనిచేత నొక మరణ శాసనము వ్రాయించితిని. ఆమరణశాసనమూలముగా జగచ్చంద్రునకు భేతాళగిరిప్రాంతభూముల యేర్పాట్లు చేసి యచట నాతని గేశవచంద్రు చేతఁ జంపింపనెంచితిని. ఏలయందురేమో, మణిపురమునం దాతఁడు లేకున్నను నాతఁడు జీవించియుండువఱకు నాకు గష్టములనియే. కాని జగచ్చంద్రుఁడు నే ననుకొనినట్లుగాక, యన్ని విపత్తులను బ్రతిఘటించి సురక్షితముగ ననేక రహస్యములను వెలికిఁ దీసి తన ప్రభావ మందఱికి దెలిపినాఁడు.

ఇఁక జెప్పవలసినది సంగ్రహముగఁ జెప్పివైచెదను. భూపేంద్రబాబు మణిపురమున కెన్నఁడైన వచ్చి నన్నుఁ గనుగొనునేమోయను భయమున వంశమునకుఁ గళంకము దెచ్చిన జగచ్చంద్రున కాశ్రయ మిచ్చినాఁడను మిషపై నాతనితో విరోధము బెట్టుకొంటిని. అది సరోజనికిఁ గష్టముగ నుండెను. ఆమె నెట్లో సమాధానపఱచితిని. కాని తుద కాత డొకనాఁడు మణిపురమునకు వచ్చెను. అంతకు ముందే దామోదరుఁడు నన్నుఁ బ్రభాకరునిగా గుర్తించి నాకడ మాసమునకు నూటయేఁబది రూప్యములనంతునఁ దీసుకొనుచు, నావద్దనే విశ్వేశ్వరనామమున నుండుచుండెను. ఆతని సహాయమున సురేశబాబు నింట నుండిన భూపేంద్రుని జంపించితిని. నేను సురేశబాబున కీయవలసిన ఋణపత్రము నపహరింపించితిని.

ఒకనాఁడు విశ్వేశ్వరుఁడు, నేను రహస్యముగ సంభాషించు

చుండ, మామాటల నన్నిటిని విని నేను మహేంద్రవేషధారియగు హంసకుండననియుఁ భూపేంద్రునిఁ జంపించితిననియుఁ దెలిసికొని సరో జని యాత్మహత్య గావించుకొనియెను. నాకారణమునఁ బ్రాణములు వాసినవారిలో నామె మరణమే నాకత్యంత సంతాపముఁ గూర్చినది. కాని నేనేమి చేయుదును? నిజస్థితి యెవరితోడఁ జెప్పుకొందును! నా దుఃఖము హృదయములో నడంచుకొనవలసినదే! దానితో లోలోనఁ గుములిపోవలసినదే!

దామోదరునకును నాకును వివాదము వచ్చినది. భూపేంద్రుని జంపినందుల కాతఁడు పదివేలిమ్మనియెను. సురేశునింట నపహరించిన నాలుగువేలు చాలునని నేనంటిని. ఆతఁడు కోపమున వెడలిపోయి నావిషయ మంతయు గగూలియా కెఱింగించెను. గగూలియాచేత నాజ్ఞాపితుఁడనై పోయి నాయాస్తియందు సగము గోరుచున్న యాతని మోసమునఁ జంపి, నేనే గగూలియావేషమునఁ గొంత కాలము చరించితిని. అయిదాఱుదినములే నా గగూలియా వేషము. జగచ్చంద్రుఁడు గగూలియా సాంఘికులలోఁ గొందఱి సహాయమున జట్టులో కొందఱిని బట్టుకొని తక్కినవారిని జెదఱఁ గొట్టెను.

“అందుచే మరల మహేంద్రుఁడనై యిచ్చటికివచ్చి పట్టువడితిని. . . . న్యాయాధిపా! ఇదియే యీపాపాత్ముని భయంకరచరిత్రము!”

ఆచరిత్రమును వినినప్పుడు న్యాయస్థానము నందున్న వారెంత యాశ్చర్య మందియుందురో యూహింపఁదగినదే!

విచారణయంతయు నాఁడే పూర్తియైనది.

* * * *

మఱునాఁడు తీర్పు చెప్పబడెను: ప్రభాకర దామోదరుల కురిశిక్ష. ప్రభుత్వతరఫుసాక్షిగాఁ దిరిగిపోయిన దేవీదాసునకు క్షమాపణ. అనంతరము విచారింపఁబడిన గగూలియా జట్టువారికి ద్వీపాంతరవాసశిక్ష.

తీర్పు లయిపోయెను. పిదప జగచ్చంద్రుఁడు మణిపురమందలి కార్యముల నెల్లఁ జక్కఁబెట్టుకొని, వానిపై తాత్కాలికముగ యాజమాన్యము వహించి చూడవలసినదిగా సురేశబాబును గోరి, నాగపురమున కేగఁ బ్రయాణము కట్టెను. పోవుటకు ముందుగా సురేశు ననుజ్ఞనుబడసి యాతఁడు లలితను దర్శించుట కామెగది కేగెను.

లలిత జగచ్చంద్రునిఁజూచి, యంతవఱకుఁ గూర్చుండియుండినది లేచి నిలువఁబడెను, జగచ్చంద్రు డామెవద్దకుఁబోయి 'లలితా! లలితా!' అనియెను.

ఒక్కమా ఱామె తలయెత్తి యాతని నాలోకించి మరల తలవంచుకొనియెను.

జగ — లలితా ! నీతో నొకవిషయముఁ దెలుపవలయునని చాల కాలమునుండి యభిలషించుచుంటిని. తగిన సమయము దొరకినది కాదు. ఇప్పుడు తగుకాలముగా భావించివచ్చితిని. ఆవిషయమై యానందచందు నడిగితిని. ఆతఁడుగూడ నంగీకరించి నీకుఁ దెలుపుమని యెను. నీయనుజ్ఞయేమి ? చెప్పుమందువా ! వలదందువా ?

లలి — (మొగ మంతయుఁ జేవురింప మఱింత తలవంచుకొని) "మీ కాజ్ఞ యిడుదాననా నేను ?"

జగ — కావు! నీవాజ్ఞ యిడకున్న నింకెవ్వరున్నారు! ఇప్పుడు నాహృదయమున నుప్పొంగిపోవుచున్న భావమును నీవు గ్రహించియే యున్నావు. మన యొండొరుల సౌఖ్యమును గూర్చినదని తెలిసియే యున్నావు. నాహృదయాలయమున బ్రణయదేవతవుగా నెలకొని యున్నావు. నాప్రాణమా ! నీవుగాక నన్నాజ్ఞాపించువా రింకెవ్వరు!"

లలిత మాఱుపలుక కుండెను. జగచ్చంద్రుఁ డెదుటనున్న యా కుసుమ కోమలిని బిగియారఁ గౌఁగలించు కొనియెను. పంజరములోఁ

జిక్కిన పికివలె, లలిత యాతని హృదయమునఁ దలఁదాఁచుకొనియెను. కాని జగచ్చంద్రుఁడా ముఖపద్మమును మెల్లగనెత్తి, యొక్కపరి మనసుదీర ముద్దిడి "లలితా! నేను నాగపురమునకుఁ బోవుచున్నాను. అచ్చట సఖియాదులతోఁ గొన్ని కార్యము లున్నవి. ఆకార్యములు సానుకూలములయిన పిమ్మట నిన్నువిడచి యెచ్చటికిఁ బోవను. అనుజ్ఞ యిమ్ము" అనియెను.

లలిత మొదట నొకింత యసంతుష్టి సూచించినను గార్యావసరమును గ్రహించిన దగుటచేఁ దలవాంచియే మెల్లగఁ దలనూపి సెలవిచ్చినది.

* * * *

జగచ్చంద్ర చూడాధనులు, ఆనందచందు నాగపురమునకుఁ జనుదెంచిరి. అక్షయవసువు మణిపురమున జరిగిన విషయము లన్నియు విచారించి ప్రభాకరుని చరిత్రము నంతయు జగచ్చంద్రునివలన విని మిగుల నబ్బురపడియెను.

* * * *

ఏర్పఱచుకొనిన ప్రకారము మఱునాఁడు జగచ్చంద్రుఁడు, అక్షయుఁడు, చూడాధనుఁడు, ఆనంద్ధుఁడు భేతాళగిరికి బయనమయిరి. ఒకబండినిగూడఁ దీసికొనిపోయిరి. బండిని గుహవెలుపల నుంచి గుహ ప్రవేశించి వారు ధనాగారమునకు దిగిరి.

అచట జూడాధనుఁడు ధనపేటికలకు వెనుక గోడలోని గూటి యందున్న బిరడానుద్రిప్పెను. తోడనే యెదుటి గోడయందు ద్వారమొకటి తెఱచుకొనియెను. వారికి వేఱొకగది కాన్పించెను. ఆగది యందు ద్వారమునకు నేరుగా గోడకానింపఁబడి రెండడుగులయెత్తు గల రాగివిగ్రహముండెను. అదియే శైలభైరవవిగ్రహమని వారు గ్రహించిరి.

మూడాఘనుడు మహాభ్రాంతిచెంది కిరాతకరణములతో గిడనాను సిద్ధము చేసి వెలిగించెను. వానితో నాప్పి ముఖమునకు దగిలెను. అంతట నచటనుండి మూడునిప్పురాలు పైకి గనిపోయెను. ఆదెబ్బనున్న యస్థి పంజరమునకు పుష్పములు సమర్పించె.

అక్షయబాబు మూడాఘనుడు నాయస్థిపంజరము నెదుట మోక రించి చూసినవి కనుకీము దానిని ప్రార్థించిరి. సగోపనే యాభయం కరమూర్తి వారిని దీవించుచున్నట్లు గుడిచేయి పైకెత్తెను. అయిదు నిముసము లక్ష్మయుండి వారులేచి ఆపేటికల నచ్చటనుండి తీసిరి. మూడాఘనుడు మొదలు శాతాళాకారముగను నిగ్గి శైలభైరవీ విగ్రహము పైకి మోసితెచ్చెను. ఆ పేటికలను, భైరవీ విగ్రహమును వెలుపలికి దీసికొనిపోన మొదలిడిరి. అప్పుడే యా యస్థిమాత్ర దేహము మొదలుపట్టికిన నృతుమునలె గ్రింపబడెను. దానియం దొకతీగైన మంట యావిర్భవించినది. జగచ్చంద్రుడు డచ్చటనుండి యావిచిత్రమును జూచుచుండెను. కొన్ని నిముసముల కాకంకాళ మంతయు భస్మమయిపోయెను.

ఘననిధిని, భైరవీవిగ్రహమును దీసికొని వారు నాగపురమునకు వచ్చిరి. అనంతరము సఫలమయినమగు కాగితములలో జెప్పబడి నట్లు శేతాళగిరిపైనున్న యాలయములో శైలభైరవీవిగ్రహప్రతిష్ఠ, సమారాధనలు మున్నగునవి మహావైభవముతో జరుపబడెను. మఱునాడు ఆనందుడు, జగచ్చంద్రుడు, జూడాధనుడు దనతో నుండ నక్షయబాబు ధనపేటికల నొక్కటొక్కటిగా దీసి యందలి వస్తువుల బరీక్షించెను. వాని విలువ అక్షయుండే యెనుబదిలక్షలకు నిర్ణయించెను. అనంతర మతడు జగచ్చంద్రునితో నిట్లనియెను.

"జగచ్చంద్రా! మనయొడంబడిక ప్రకారము నీకిందు సగముచేర వలసియున్నది. ఇందొకపెట్టె ఖాళీచేసి యందు నీ యర్థభాగమును

బదిల పఱచెను — మహారాజా! ఆభరణముల నాంపసమును కొన్ని చేయుము.""

చూడాధనుఁ డాపనికిఁ గడంగెను. అతఁడు మూఁడవపెట్టె యందుఁగల పాతరాగిరేకులను దీసి పరీక్షించి, యందు వ్రాయఁబడిన విషయమునందఱికి వినఁబడునట్లు చదివి వినిపించెను.

"శ్రీమహాదేవునను నాగపురమునకుఁ బ్రభువుగానున్న కాలమున, నాతని భూమిపై నాగవర్మక్షత్రప్రాంతములందున వసించు కొండజాతి వారు దండెత్తివచ్చిరి. అతఁడు వారితోఁ బోరి యోడింపఁజాలక పోయెను. వారలకు వత్సరమునకింత ధనమిత్తునని యొడంబడిక యొనర్చుకొనవలసెను. వత్సరమునకు కేంబదివేల సువర్ణములను వారు కోరిరి. అప్పటికి కామొత్తము నిచ్చి భీమదేవుఁడు వారిబారినుండి తప్పించుకొనియెను. రాఁబోయిన తరువాత, వారిపయిఁ బగదీర్చుకొన నిశ్చయించి, జమీనుదారీవ్యవహారములు కుమారునిచేతనుంచి యెచటికో పోయెను. ఒక వత్సరమున కతఁడు తిరిగివచ్చెను.

"రెండవవత్సరమునకు భీమదేవుఁడు విరోధులకు నిర్ణయమైన సొమ్ముకట్టలేదు. అతఁడు తనయింటనున్న ధనమును, ఆభరణాదులన్నిఁటిని రెండుపందసములందుఁబెట్టి వానిని భేతాళగిరి పాతాళ మందిరమునందుఁ బదిలపఱచెను. ఇతనివద్దకు విరోధులు ధనము కొఱకై మనుష్యుల నంపిరి. వారి నాతఁ డవమానించి పంపెను. అందుచే మరల నాయడవిజాతివారు దండెత్తి వచ్చిరి. కాని వారి నందఱిని భీమదేవుఁడు తనమంత్రశక్తితో నిర్మూలము గావించెను. అప్పు డాయడవిజాతివారలలోని యొక గొప్ప మాంత్రికునికిని, భీమదేవునకును మంత్రయుద్ధ మారంభ మయ్యెను. అన్నిఁటను నడవిజాతి మాంత్రికుఁ డోడెను. కాని భీమదేవునకు భేతాళగిరియందు దాఁచిన ధనము నూఱ్ఱేసు నూరువత్సరములకు నెవ్వరుఁ దాకకుండను,

దదనంతరమైనఁ గొన్ని నిబంధనములకు లోబడియే తీయునట్లును శపించి ప్రాణమునదలెను. భీమదేవుఁడామాంత్రికుని శవమును ధననిధిరక్షణార్థము భేతాళగిరిగుహాయందుంచెను.

"ఆమాంత్రికునిశక్తి యింకొక పనిగూడ జేసినది. భీమదేవ వసువు పూర్వికులలో నొకరు భేతాళగిరిపై శైలభైరవ్యాలయమును గట్టించి, యందు భైరవీవిగ్రహము నెలకొల్పెను. ఆమాంత్రికుఁడా విగ్రహము గూడ భూపతితమగునట్లును నూఱేండ్లచ్చట నేయర్చకులు నుండకుండునట్లు జేసెను. పిమ్మట నొకపాతవిగ్రహమును భీమదేవుఁడాలయమందు నెలకొల్పి అర్చకులను నియోగించెను, గాని అర్చకుఁడాయాలయమునఁ జేరినంతటనే వానివంశము ముదుసలి మొదలు పసికందువఱకును నాశనమయ్యెను. పిమ్మట నర్చకులెవ్వరును వచ్చిరికారు. అంతటితో నాదేవ్యాలయము అర్చనలేక నిలిచిపోయినది.

"ఇదియే ధనము నచ్చట దాఁచుటకును, శైలభైరవ్యాలయము పాడుపడుటకును గారణములు — "

అనంతర మక్షయవసువు న్యాయముగ ధనవిభాగముచేసి, యొక భాగమును జగచ్చంద్రుని కప్పగించెను.

సంపూర్ణము